సీ. ఋషివంటి నన్నయ్య రెండవ వాల్మీకి
తిక్కన శిల్పపుఁ దెనుఁగుతోట
యెఱ్ఱన్న సర్వమార్గేచ్ఛా విధాతృండు
పోతన్న తెలుఁగుల పుణ్యపేటి
శ్రీనాథుఁడు రసప్రసిద్ధ ధారాధుని
కృష్ణరాయఁడనన్య కృతి ప్రబంధ
పెద్దన్న వడపోత పెట్టి నిక్షురసంబు
రామకృష్ణుఁడు సురారామ గజము

తే.గి. ఒకఁడు నాచనసోమన్న, యుక్కివుండు
చెఱిపి పదిసార్లు తిరుగ వ్రాసినను మొక్క
వోని యీ యాంధ్రకవిలోక మూర్ధమణుల
మద్గురు స్థానములుగ నమస్కరించి

– విశ్వనాథ సత్యనారాయణ



రాష్ట్ర విద్యాపరిశోధన మరియు శిక్షణ సంస్థ,
ఆంధ్రప్రదేశ్
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

తెలుగు పరిమళం తెలుగు వాచకం తరగతి - 10

# తెలుగు పరిమళం

## తెలుగు వాచకం

# 10

సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ



सत्यमेव जयते

# CONSTITUTION OF INDIA

## Preamble

WE, THE PEOPLE OF INDIA, having
solemnly resolved to constitute India into a
SOVEREIGN SOCIALIST SECULAR DEMOCRATIC REPUBLIC
and to secure to all its citizens:
JUSTICE
Social, economic and political;
LIBERTY
of thought, expression, belief, faith and worship;
EQUALITY
of status and of opportunity; and to
promote among them all
FRATERNITY
assuring the dignity of the individual and the unity and
integrity of the Nation;
IN OUR CONSTITUENT ASSEMBLY
this twenty-sixth day of November, 1949, do
HEREBY ADOPT, ENACT AND GIVE TO
OURSELVES THIS CONSTITUTION

## భారత రాజ్యాంగం - పౌర విధులు

1. రాజ్యాంగమునకు బద్ధుడై వుండుట, దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకమును,జాతీయ గీతమును గౌరవించుట;
2. జాతీయ స్వాతంత్ర్య పోరాటమునకు స్ఫూర్తినిచ్చిన ఉన్నతాదర్శములను మనస్సుయందు ఉంచుకొని వాటిని అనుసరించుట;
3. భారత సార్వభౌమత్వం, ఐక్యత, అఖండతను సమర్థించుట మరియు సంరక్షించుట.
4. దేశమును రక్షించుట మరియు కోరినపుడు జాతికి సేవ చేయుట;
5. భారత ప్రజల మధ్య మత, భాష, ప్రాంతీయ, వర్గ వైవిధ్యములను అధిగమించి, సామరస్యమును, సోదర భావమును పెంపొందించుట, స్త్రీల గౌరవం తగ్గించు ఆచారములను విడనాడుట;
6. మన ఉమ్మడి సంస్కృతినీ, సుసంపన్న సంప్రదాయాలను గౌరవించి రక్షించుట;
7. అడవులు, సరస్సులు, నదులు, అడవి జంతువులతో సహా ప్రాకృతిక పరిసరాలను కాపాడి అభివృద్ధి చేయుట మరియు సమస్త జీవుల యెడల కరుణార్ద్రత కలిగి వుండుట.
8. శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, జిజ్ఞాసను, సంస్కరణ తత్వాన్ని పెంపొందించుకొనటం;
9. ప్రజల ఆస్తిని సంరక్షించుట, హింసను విడనాడుట;
10. ప్రయత్నాలు, సాధనల ఉన్నతస్థాయిలను నిరంతరం అందుకొనునట్లుగా వైయక్తిక, సమిష్టి కార్య రంగాలన్నింటిలో శ్రేష్ఠత కోసం, కృషి చేయుట ప్రాథమిక కర్తవ్యమై వుండవలెను.
11. ఆరు నుండి పద్నాలుగు సంవత్సరముల వయస్సు కలిగిన బాలునికి లేదా బాలికకు తల్లి తండ్రి లేదా సంరక్షకునిగావున్న వ్యక్తి తనబిడ్డ లేదా సందర్భానుసారము తన సంరక్షితునికి విద్యార్జనకు అవకాశములు కల్పించవలెను.

(అధికరణం 51 A)

## విద్యాహక్కు చట్టం

6 నుండి 14 సంవత్సరముల పిల్లలందరికి ఉచిత నిర్భంద ఎలిమెంటరీ విద్యనందించడానికి ఉద్దేశించబడినవి. ఇది ఏప్రిల్ 1, 2010 నుండి అమల్లోకి వచ్చింది.

**చట్టంలోని ముఖ్యాంశాలు:**

- పిల్లలందరికి అందుబాటులో పాఠశాలలను ఏర్పాటుచేయాలి.
- పాఠశాలలకు మౌలిక వసతులను కల్పించాలి.
- పిల్లలందరిని వయస్సుకు తగిన తరగతిలో చేర్పించాలి.
- వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చిన తర్వాత తోటి వారితో సమానంగా ఉండటానికి ప్రత్యేకశిక్షణ ఇప్పించాలి.
- ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు సాధారణ పిల్లలతోపాటు విద్యకొనసాగించడానికి తగువసతులు ఏర్పాట్లు చేయాలి.
- బడిలో చేర్చుకోడానికి ఎలాంటి పరీక్షలు నిర్వహించరాదు. ఎటువంటి రుసుము, చార్జీలు వసూలు చేయరాదు.
- బడిలో చేరిన పిల్లల పేరు తీసివేయడం, అదే తరగతిలో కొనసాగించడం చేయరాదు.
- పిల్లల్ని శారీరకంగా, మానసికంగా హింసించరాదు.
- వయస్సు నిర్ధారణ పత్రం, ఇతర ధృవీకరణ పత్రాలు లేవనే కారణం చేత పిల్లలకు బడిలో ప్రవేశాన్ని నిరాకరించరాదు.
- తగిన అర్హతలున్న వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించాలి.
- పిల్లలు నిర్దేశించిన సామర్థ్యాలు సాధించేలా బోధనాభ్యసనం, మూల్యాంకనం ఉండాలి.
- ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పిల్లలకు ఎలాంటి బోర్డు పరీక్షలు నిర్వహించరాదు.
- పద్నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికినీ, ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పాఠశాలలో పిల్లలు కొనసాగవచ్చును.
- బలహీన వర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏ విధమైన వివక్షతకు గురికాకుండా చూడాలి.
- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా, విద్యార్థులను భయం, ఆందోళనకు గురిచేయని రీతిలో వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే పాఠ్యప్రణాళిక రూపొందించాలి.

# తెలుగు పరిమళం

## తెలుగు వాచకం

## పదో తరగతి (ప్రథమ భాష)

### పాఠ్యపుస్తక అభివృద్ధి, ప్రచురణ సమితి

**శ్రీ ప్రవీణ్ ప్రకాష్** I.A.S

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్య, ఆంధ్రప్రదేశ్

**శ్రీ ఎస్. సురేష్ కుమార్** I.A.S

కమీషనర్, పాఠశాల విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్

**శ్రీ బి. శ్రీనివాస రావు** I.A.S

రాష్ట్ర పథక సంచాలకులు, సమగ్రశిక్ష, ఆంధ్రప్రదేశ్

**డా॥ బి. ప్రతాప్ రెడ్డి** M.A., B.Ed., Ph.D

సంచాలకులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

**శ్రీ కె. రవీంద్రనాథ్ రెడ్డి,** M.A., B.Ed.,

సంచాలకులు, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం, ఆంధ్రప్రదేశ్

### ప్రధాన సంపాదకులు

**రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

విశ్రాంత ఆచార్యులు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం

### సంపాదకులు

**డా॥ పాలపర్తి శ్యామలానంద ప్రసాదు**
విశ్రాంత తెలుగు అధ్యాపకులు,
సయ్యద్ అప్పలస్వామి కళాశాల,
విజయవాడ

**డా॥ సుంకర గోపాలయ్య**
అసిస్టెంట్ ప్రొఫెసర్,
డి.ఆర్.జి డిగ్రీ కళాశాల,
తాడేపల్లి గూడెం, పశ్చిమగోదావరి

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్**
సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట
అధ్యయన కేంద్రం, నెల్లూరు

### పరిష్కర్తలు

**శ్రీమతి ఎమ్. హైమావతి**
విశ్రాంత తెలుగు పండితులు, విజయవాడ

**డా॥ కడిమిళ్ళ వరప్రసాద్**
విశ్రాంత తెలుగు పండితులు, నరసాపురం

**సి.హెచ్. వెంకట సూర్యనారాయణ శర్మ**
విశ్రాంత తెలుగు పండితులు, పెదపట్నం

**జోస్యుల లక్ష్మీకాంత్**
విశ్రాంత తెలుగు పండితులు, విజయవాడ

**ప్రోగ్రాం కోఆర్డినేటర్**
**డా॥ జి. కేశవరెడ్డి**
ఆచార్యులు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ,
ఆంధ్రప్రదేశ్

**టెక్నికల్ కోఆర్డినేటర్**
**డా॥ సి.హెచ్.వి రమేష్ కుమార్**
ఆచార్యులు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ,
ఆంధ్రప్రదేశ్

కవర్ పేజీ & లేఅవుట్ డిజైనింగ్ దుర్గాగ్రాఫిక్స్ బాపట్ల

© Government of Andhra Pradesh, Amaravati

*First Published 2024*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copyright holder of this book is the Commissioner of School Education, Amaravati, Andhra Pradesh.

This book has been printed on 70 G.S.M. SS Maplitho

Title Page 220 G.S.M. White Art Card

**సమగ్ర శిక్షా, పాఠశాల విద్యాశాఖ,**

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ**

Printed in India
at the A.P. Govt. Text Book Press
Amaravati
Andhra Pradesh

# వందే మాతరం

– బంకించంద్ర ఛటర్జీ

వందే మాతరం వందే మాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం వందే మాతరం
శుభ్రజ్యోత్స్నాపులకిత యామినీం
ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందే మాతరం.

# మా తెలుగు తల్లి

*- శంకరంబాడి సుందరాచారి*

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి
అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండే దాక
రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం – నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

# జాతీయ గీతం

*- రవీంద్రనాథ్ టాగూర్*

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగా!
వింధ్య, హిమాచల, యమునా, గంగా!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాఁగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

# ప్రతిజ్ఞ

*- పైడిమర్రి వెంకటసుబ్బారావు*

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికై సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## విషయ సమన్వయకర్త

**డా॥ షేక్ బాబూజి** MA, MLISc, M.Phil, Ph.D (తెలుగు), M.Sc, Ph.D (సంస్కృతం)
**ఆచార్యులు,** రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

## సహాయ సమన్వయ కర్తలు

**అడపా సురేష్ రెడ్డి**
స్టేట్ అసెస్మెంట్ సెల్, ఎస్.సి.ఇ.ఆర్.టి, ఆంధ్రప్రదేశ్

**ఎమ్ నిర్మల కుమారి**
స్టేట్ అసెస్మెంట్ సెల్, ఎస్.సి.ఇ.ఆర్.టి, ఆంధ్రప్రదేశ్

సర్వశ్రీ / శ్రీమతి

## పాఠ్యపుస్తక రూపకర్తలు, సహాయకులు

**యేలేశ్వరపు సురేష్ కుమార్,** పి.జి.టి (తెలుగు), ఎస్.బి.ఎమ్.ఆర్, జి.జి.హెచ్.పాఠశాల, పిఠాపురం, కాకినాడ.
**తలారి రామాంజినేయులు,** పాఠశాల సహాయకులు(తెలుగు) జి.ప.ఉ. పాఠశాల, ఆత్మకూరు, అనంతపురం
**మొరుమూరి శేషాచారి,** పాఠశాల సహాయకులు(తెలుగు) జి.ప.ఉ. పాఠశాల, నిడుబ్రోలు-పొన్నూరు, గుంటూరు.
**ఉన్నవ జ్యోతి వాసు,** పాఠశాల సహాయకులు(తెలుగు) జి.ప.ఉ. పాఠశాల, రుద్రవరం, ప్రకాశం
**జి.ఎస్.చలం,** పాఠశాల సహాయకులు(తెలుగు) జి.ప.ఉ. పాఠశాల, ధర్మవరం ,విజయనగరం.
**పెద్దింటి శారంగపాణి,** పాఠశాల సహాయకులు(తెలుగు) జి.ప.ఉ. పాఠశాల,ఉన్నవ, పల్నాడు.
**డా॥దోనెపూడి నరేష్ బాబు,** పాఠశాల సహాయకులు(తెలుగు) జి.ప.ఉ. పాఠశాల, సంగపట్నం, నంద్యాల.
**చిందాడ చిన్నోడు,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ఎమ్.ప్ర.ఉ పాఠశాల, మల్లాం, పిఠాపురం, కాకినాడ.
**డా॥ గూటం స్వామి,** పాఠశాల సహాయకులు(తెలుగు) జి.ప.ఉ. పాఠశాల పాఠశాల బొమ్మూరు.
**జి.గంగాధర్,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, హావళిగి, విడపనకల్లు, అనంతపురం.
**డా॥ విప్పర్తి ఎన్.వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి,** పి.జి.టి (తెలుగు) జి.ప.ఉ. పాఠశాల, గుందుగొలను, ఏలూరు.
**డా॥ ఎస్.బి.టి.ఎస్.దేవి,** పాఠశాల సహాయకులు (తెలుగు), కె.జి.బి.వి, దేవరాపల్లి, అనకాపల్లి.
**సి.హెచ్. వి.ఆర్.ఎస్.బ్రహ్మయ్య,** పాఠశాల సహాయకులు(తెలుగు) జి.ప.ఉ. పాఠశాల, చిర్రావూరు, గుంటూరు.
**జి.ఉషారాణి,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, మనుబోలు, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు.
**జి.సుబ్బలక్ష్మి,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, దుగ్గరాజపట్నం, తిరుపతి
**వి.జానకి,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, నందిగామ, ఎన్.టి.ఆర్.
**డా.వేంపల్లి గంగాధర్,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, వెల్లటూరు, కడప.
**దాసరి మునెయ్య,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, నారాయణ వనం, చిత్తూరు.
**డా. ఎమ్.పురుషోత్తమాచారి,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, నగరి, చిత్తూరు.
**డా. ఊటుకూరు వరప్రసాద్,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, బోడి గూడెం, ఏలూరు.
**ఎన్.వీర రాఘవ రావు,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, కుతుకులూరు, తూర్పుగోదావరి.
**కె.శంకర్ రావు,** పి.జి.టి. తెలుగు, ఎ.పి.ఎమ్ ఎస్, దాచేపల్లి, పల్నాడు.
**యువశ్రీ మురళి,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, కల్లివెట్టు, తిరుపతి.
**డి.సంజీవ కుమార్,** పాఠశాల సహాయకులు(తెలుగు), జి.ప.ఉ. పాఠశాల, సోమలింగ పాలెం, అనకాపల్లి.
**పైడి నాగ సుబ్బయ్య,** పి.జి.టి, జి.ప.ఉ. పాఠశాల, గోపవరం, వై.యస్.ఆర్.జిల్లా.

**సాంకేతిక సహకారం:**

**గన్నమనేని గంగాధర్ నాయుడు,** వై.వి.ఎస్ పురపాలక పాఠశాల, ప్రొద్దుటూరు, కడప.

**చిత్రకారులు**

**తాడి కాళిదాసు,** డ్రాయింగ్ టీచర్, జి.ప.ఉ.పా, వేపగుంట, విశాఖపట్నం.
**కట్టెబోయిన శ్రీనివాస్,** డ్రాయింగ్ టీచర్, జి.ప.ఉ.పా పాఠశాల, కోపల్లె, పశ్చిమగోదావరి.
**మూకల రాంబాబు,** డ్రాయింగ్ టీచర్, ప్ర.ఉ.పాఠశాల, గోపన్నపాలెం, ఏలూరు.

# ఉపాధ్యాయులకు సూచనలు

ప్రియమైన ఉపాధ్యాయ మిత్రులారా!

- 10వ తరగతి నూతన పాఠ్యపుస్తకం తెలుగు భాషను అత్యంత సమర్థవంతంగా నేర్పడానికి ఉపకరించేలా రూపొందించడం జరిగింది. కింది సూచనలు పాటిస్తూ పాఠ్యబోధన జరపాలి. మన బోధన పిల్లల సమగ్రాభివృద్ధికి తోడ్పడాలి.
- పాఠ్యపుస్తకం సమర్థంగా వినియోగించడానికి "ముందుమాట, తప్పని సరిగా చదవాలి. "విద్యార్థులకు సూచన"లను ముందుగా మీరు చదవండి. వాటిని మీ పిల్లలతో చదివించండి.
- ఈ వాచకం180 కాలాంశాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించబడింది. వీటిలో 156 కాలాంశాలు(పీరియడ్స్) పాఠ్యాంశాల బోధనకు, మిగతా 24 కాలాంశాలను(పీరియడ్స్) ఉపవాచకంలోని అంశాలను చర్చించడానికి వినియోగించాలి.
- ఉపవాచకాన్ని కేటాయించిన నిర్ణీత కాలంలోనే పూర్తిచేయాలి. ఉపవాచకాన్ని పిల్లలచేత తప్పక చదివించాలి. ముఖ్యాంశాలపైన మాట్లాడించాలి. పఠనావగాహనకు సంబంధించిన అభ్యాసాలను రూపొందించి నిర్వహించాలి.
- సగటున ఒక్కొక్క పాఠానికి 12 కాలాంశాలు అవసరమవుతాయి. వీటిలో "చదవండి – ఆలోచించి చెప్పండి/ ఉద్దేశం, కవిపరిచయం, నేపథ్యం మొదలైన కృత్యాలకు కాలాంశాలను విభజించుకొని వినియోగించుకోవాలి. పాఠ్యాంశ విషయంపై చర్చించి అవగాహన కల్పించడానికి పాఠంలోని విషయం నిడివినిబట్టి కాలాంశాలను కేటాయించుకోవాలి.
- "ఇవి చేయండి" లో ఇచ్చిన అభ్యాసాలకు మిగతా కాలాంశాలను వినియోగించాలి. "అవగాహన–ప్రతిస్పందన" అభ్యాసాలకు, "వ్యక్తీకరణ–సృజనాత్మకతకు, భాషాంశాలలో ఇచ్చిన "పదజాలం, వ్యాకరణాంశాలకు, "ప్రాజెక్టుపని"ని ప్రదర్శింపజేసి చర్చించడానికి తగిన కాలాంశాలను కేటాయించుకోవాలి. ఆ కాలపరిధిలోనే పిల్లలచేత అభ్యాసాలు చేయించాలి.
- పాఠం ప్రారంభంలో ఇచ్చిన "చదవండి – ఆలోచించండి చెప్పండి" అనే అంశాలు ఉన్ముఖీకరణకు సంబంధించినవి. వీటిని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.పాఠ్యాంశం ఉద్దేశం / నేపథ్యం, ప్రక్రియ, కవిపరిచయంలోని అంశాలను పిల్లలచేత చదివించి చర్చించాలి. అర్థసంగ్రహణ కృత్యాలను వ్యక్తిగత కృత్యాలుగా నిర్వహించాలి. ఇందుకోసం తరగతి గదిలో తప్పనిసరిగా నిఘంటువులను అందుబాటులో ఉంచుకోవాలి.
- పాఠంలోని విషయంపట్ల పిల్లలకు అవగాహన కల్పించడానికి చర్చాపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, కథాకథనం, ప్రదర్శన పద్ధతి, నాటకీకరణ వంటి పద్ధతులను ఆయా పాఠాల స్వభావాన్ని బట్టి ఉపయోగించాలి. పాఠం మధ్యలో 'ఆలోచించండి– 'చెప్పండి' అనే పేరుతో ప్రశ్నలున్నాయి. వీటిని పాఠం బోధించే సమయంలో అడగాలి. ఆలోచించి జవాబులు చెప్పమనాలి.
- పాఠం బోధించడమంటే విషయాన్ని వివరించడం మాత్రమే కాదు, అందులోని విలువలను, కవి హృదయాన్ని, అంతరార్థాన్ని పిల్లలు అర్థంచేసుకునేలా చూడాలి. ఇందుకోసం ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి.

- "ఇవి చేయండి" లోని అభ్యాసాలు పిల్లల భాషా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉద్దేశించినవి. వీటిని పిల్లలే సొంతంగా రాసేలా చూడాలి. కాబట్టి ఆయా కాలాంశాలలో పిల్లలు వాటిని రాయగలిగేలా అవగాహన కల్పించాలి. పిల్లలు రాసిన అంశాలను పరిశీలించి సరిదిద్దాలి. పదో తరగతి వార్షిక పరీక్షలు బోర్డు పరీక్ష కాబట్టి పిల్లలు సొంతంగా రాయడాన్ని ప్రోత్సహించాలి.
- "అవగాహన - ప్రతిస్పందన" అభ్యాసంలో పాఠం ఆధారంగా ఇచ్చిన కృత్యాలతో పాటు అపరిచిత పద్య, గద్య కృత్యాలను వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి. ఏక వాక్య సమాధాన ప్రశ్నలకు, సందర్భ సహిత వాక్యాలకు జవాబులు రాయించాలి.
- వ్యక్తీకరణ - సృజనాత్మకత" అభ్యాసంలోని ప్రశ్నలు స్వీయరచన, సృజనాత్మకత, సామర్థ్యాలకు సంబంధించినవి. వీటిలో లఘుసమాధాన ప్రశ్నలను పాఠం బోధించేటప్పుడే ఇంటిపనిగా ఇవ్వవచ్చు. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు జవాబులు రాయడానికి పూర్తి తరగతి గదిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత వ్యక్తిగతంగా రాయించాలి. వాటిని చదివించాలి. పిల్లలు రాసిన అంశాలను భావాత్మకంగా వాక్యాలు, పదాలు, అక్షరదోషాల పరంగా సరిచేయాలి.
- సృజనాత్మకతకు సంబంధించిన ప్రశ్నలకు పిల్లలు సమాధానాలు రాయడానికి తగిన ఉదాహరణలిచ్చి అవగాహన కల్పించాలి. పిల్లలను జట్లుగా విడదీసి వాటిని రాయమనాలి. వీటిని ప్రదర్శింపజేసి చర్చద్వారా సరిదిద్దాలి.
- ప్రతి పాఠం చివర ఉన్న ప్రాజెక్టు పనులను నిర్మాణాత్మక మూల్యాంకనాలకు అనుగుణంగా నిర్వహించాలి. వీటిని ఎలా చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించి జట్టు లేదా వ్యక్తిగతంగా చేయించాలి.
- పాఠాన్ని పలుకరింపు, ఉన్ముఖీకరణ, శీర్షికా ప్రకటన, ఉద్దేశం, కవిపరిచయం, పునశ్చరణ, తరువాత పాఠ్యాంశబోధన చర్చ - అవగాహనలో విద్యార్థుల ఉపాధ్యాయుల ప్రకాశ పఠనం, ఆదర్శపఠనం, మౌనపఠనం, అర్థసంగ్రహణం, పాఠ్యాంశ విషయంపై చర్చ అవగాహన, సామర్థ్యాల సాధన. పిల్లల అవగాహన - పరిశీలన, ఇంటిపనితో ముగించాలి.
- భాషాబోధనను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయగూడదు. పాఠశాల గ్రంథాలయాన్ని, అంతర్జాలాన్ని (ఇంటర్నెట్), మేగజైన్లు, వార్తాపత్రికలు, బాలసాహిత్యం వంటివి ఉపయోగించుకొనేలా చూడాలి.
- తరగతి గదిలో భాషావాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన నిఘంటువులు, కవుల జీవిత చరిత్రలు, దృశ్యశ్రవణ సామగ్రి వంటివి వినియోగించాలి.పాఠశాలలో భాషాభివృద్ధికి దోహదపడే కార్యకలాపాలు, భాషామేళాలు, భాషోత్సవాలు, బాలకవిసమ్మేళనాలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, వార్షికోత్సవాలు వంటివి నిర్వహించాలి.
- ఏ పరిస్థితుల్లోనూ గైడ్లు, స్టడీ మెటీరియళ్ళు, ప్రశ్నల బ్యాంకులు వంటివి చూసి రాయడానికి అనుమతించకూడదు. పాఠంలోని అభ్యాసాలకు విద్యార్థులు సమాధానాలు సొంతంగా వ్రాసే విధంగా ప్రొత్సహించాలి.

# విద్యార్థులకు సూచనలు

**ప్రియమైన విద్యార్థినీ, విద్యార్థులారా!**

- మీరు పాఠశాల విద్యలో పదవతరగతికి చేరుకున్నారు. ఈ తరగతిలో తెలుగు భాషలో మరింత పరిపూర్ణత సాధించాలి. ఇందుకోసం ఈ నూతన తెలుగు పాఠ్యపుస్తకం వివిధ ప్రక్రియలతో, వివిధ ఇతివృత్తాలతో ఆకర్షణీయమైన పాఠ్యాంశ చిత్రాలతో మీకు అందించడం జరిగింది. భాషను సమర్థవంతంగా నేర్చుకోవడానికి, ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తీకరించడానికి ఈ పాఠ్యపుస్తకం దోహదపడుతుంది. అందుకు మీరు చేయవలసింది పాఠ్యపుస్తకాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడమే అదెలాగో చూద్దాం.
- ప్రతి పాఠం 'చదవండి-ఆలోచించి చెప్పండి' అనే శీర్షికతో ప్రారంభమవుతుంది. దీనిలో వివిధ అంశాలుంటాయి. వాటిని చదవడం, చర్చించడం, ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం చేయాలి.
- పాఠ్యాంశాల ఉద్దేశాలను, నేపథ్యాలను, ప్రక్రియలను ఉపాధ్యాయులు వివరించేటప్పుడు వాటి గురించి చర్చించి మరిన్ని విషయాలు తెలుసుకోండి.
- కవిపరిచయం గురించి ఉపాధ్యాయులు చెప్పినపుడు ఆ కవి గురించి మరిన్ని విషయాలు తెలుసుకోండి. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలను గుర్తించి, వాటికి అర్థాలను 'అ' కారాది పట్టిక ద్వారా, నిఘంటువుల ద్వారా తెలుసుకోండి. పాఠ్య చిత్రాల గురించి మాట్లాడండి. మీ ఆలోచనలతో పాఠ్యభాగ సారాంశాన్ని ఊహించి చెప్పండి. మీ ఉపాధ్యాయులు పాఠం బోధించేటప్పుడు శ్రద్ధగా వినండి. అర్థంగాని విషయాలపై చర్చించి, సందేహాలను నివృత్తి చేసుకోండి.
- పాఠం చివర 'ఇవి చేయండి' అనే పేరుతో సామర్థ్యాల వారీగా అభ్యాసాలు ఉన్నాయి. వాటిని ఉపాధ్యాయులతో, జట్లలో చర్చించి, వ్యక్తిగతంగా సమాధానాలు రాయాలి. దీని వలన భాషలో నిర్దేశించిన సామర్థ్యాలను, వాటి లక్ష్యాలను సాధించ గలుగుతారు.
- చదివిన విషయాన్ని మరింత అర్థం చేసుకొని, వ్యక్తీకరించడానికి 'అవగాహన-ప్రతిస్పందన' కింద అపరిచిత గద్యాలు, పద్యాలు, కవితలు, గేయాలు, వాటి కింద వివిధ ప్రశ్నలు ఇవ్వడం జరిగింది. వాటిని బాగా చదివి, సమాధానాలు వ్యక్తిగతంగా రాయాలి, దీనివల్ల చదవడం, వ్యక్తీకరించే నైపుణ్యం సాధించగలుగుతారు. వ్యక్తీకరణ – సృజనాత్మకత లోని అభ్యాసాలను సొంతంగా రాయాలి. తరగతిగదిలో చర్చించాలి. తరువాత మీ నోటు పుస్తకాలలో రాయాలి.
- భాషాంశాల్లోని పదజాలం, వ్యాకరణాంశాల అవగాహన కోసం ఇచ్చిన అభ్యాసాల్లో చాలా ఉదాహరణలు ఇవ్వడం జరిగింది. వాటి ద్వారా ఆయా అంశాలను అర్థం చేసుకొని, వాటికి సొంత వాక్యాలు రాయండి. సూత్రాలు నిర్మించండి. అవసరమైన చోట వాటిని వినియోగించండి.
- ప్రాజెక్టు పనులను ఎలా చేయాలో ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకొని, వాటిని మీ మిత్రులతో కలిసి చేయండి. తరగతి గదిలో ప్రదర్శించండి. సాహిత్య ప్రక్రియలైన లేఖలు, వ్యాసాలు, కరపత్రాలు, రాయగలగాలి. పాఠ్యాంశాల్లోని సన్నివేశాలకు సంభాషణలు, రాయాలి. నాటకీకరణ, ఏకపాత్రాభినయం వంటివి చేయాలి.
- ఉపవాచకం రామాయణాన్ని స్వీయ పఠనం, చర్చ ద్వారా అవగాహన చేసుకోవాలి. ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలి.

## ఈ పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన అభ్యసన ఫలితాలు

**1. ప్రత్యక్ష దైవాలు:**

- తల్లిదండ్రుల పట్ల సేవాభావం కలిగి ఉండాలని తెలుసుకుంటారు.
- పిల్లలపై తల్లిదండ్రులకు గల ప్రేమాభిమానాలు గుర్తిస్తారు.
- పద్యాలను రాగయుక్తంగా పాడగలరు. భావాలను సొంతమాటల్లో చెప్పగలరు.
- పాఠం ఆధారంగా పాత్రల మధ్య సంభాషణలు సృజనాత్మకంగా రాయగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని వినియోగించగలరు.

**2. బతుకుగంప :**

- కుటుంబం కోసం తల్లి పడే శ్రమను, స్త్రీ ఆత్మస్థైర్యాన్ని గుర్తించగలరు.
- కథ లోని పాత్రలను అవగాహన చేసుకొని విశ్లేషించగలరు.
- కథా సాహిత్యం పట్ల ఆసక్తితో వివిధ కథలు చదవగలరు.
- పాఠం ఆధారంగా పాత్రల మధ్య సంభాషణలు రాయగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని వినియోగించగలరు.

**3. శతక మాధుర్యం :**

- శతక పద్యాల్లోని నైతికవిలువలను గ్రహించగలరు.
- పద్యాలను రాగయుక్తంగా పాడగలరు. భావాలను సొంతమాటల్లో చెప్పగలరు.
- శతకసాహిత్యం చదవాలనే కుతూహలాన్ని పెంపొందించుకొని శతకాలను చదవగలరు.
- పాఠం ఆధారంగా వివిధ అంశాలను వివరిస్తూ రాయగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని వినియోగించగలరు.

**4. ఉపన్యాసకళ :**

- పాఠ్య విషయాన్ని అర్థం చేసుకుని వక్తృత్వ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటారు.
- ప్రముఖ వ్యక్తుల ఉపన్యాసాలను విని ప్రేరణ పొందుతారు.
- పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొని ప్రసంగిస్తారు.
- పాఠంలో చెప్పిన విధంగా శ్రోతలను ఆకట్టుకొనేలా ప్రసంగించగలిగే నైపుణ్యాన్ని పొందుతారు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని వినియోగించగలరు.

**5. జలియన్‌వాలా బాగ్:**

- స్వాతంత్ర్య సంగ్రామంలోని వివిధ ఘట్టాలను గురించి తెలుసుకుంటారు.
- ఉద్యమ వీరుల త్యాగనిరతిని తెలుసుకొని దేశభక్తి పెంపొందించుకుంటారు.
- పద్యాలను రాగయుక్తంగా పాడగలరు. భావాలను సొంతమాటల్లో చెప్పగలరు.
- స్వాతంత్ర్య సమరయోధుల పోరాటపటిమను గుర్తించగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని వినియోగించగలరు.

**6. ప్రకృతి సందేశం:**

- ప్రకృతి, మానవాళికి ఇస్తున్న సందేశమును గ్రహిస్తారు.
- ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడుకోవలసిన ఆవశ్యకతను గురించి తెలుసుకోగలరు.
- సాహిత్యంలోని వర్ణనను గురించి అవగాహన చేసుకోగలరు.
- గేయాన్ని రాగయుక్తంగా పాడగలరు. సారాంశాన్ని సొంత మాటల్లో చెప్పగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకుని వినియోగించగలరు.

**7. చేజారిన బాల్యం:**

- బాల్య స్మృతులను గుర్తుచేసుకోగలరు. వాటి గురించి చెప్పగలరు. రాయగలరు.
- విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మకత అంశాలను గుర్తించి వాటిని పెంపొందించుకోగలరు.
- ప్రముఖుల బాల్యాన్ని చదివి ప్రేరణ పొందుతారు.
- జీవితంలోని ముఖ్య సంఘటనలను వ్యాస రూపంలో రాయగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని వినియోగించగలరు.

**8. జీవని:**

- ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల సహానుభూతి కలిగి, వారికి చేయూతనివ్వాలని తెలుసుకోగలరు.
- సమ్మిళిత విద్యలో భాగంగా కథ చదివి, సామాజిక బాధ్యతను గుర్తించగలరు.
- జీవితంలో ఎదగడానికి అంగవైకల్యం అడ్డంకి కాదని గ్రహించగలరు.
- కథలోని పాత్రలను విశ్లేషించి వివరించగలరు. సృజనాత్మకంగా రాయగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని, నిత్యజీవితంలో వినియోగించగలరు.

**9. రాజధర్మం:**

- మంచి పాలకుని లక్షణాలను తెలుసుకుంటారు.
- నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటారు.
- పద్యాలను రాగయుక్తంగా పాడగలరు. భావాలను వివరించగలరు.
- గొప్ప పరిపాలకుల గురించి తెలుసుకుంటారు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని నిత్యజీవితంలో వినియోగించగలరు.

**10. కన్యాశుల్కం:**

- ఆధునిక విద్య ఆవశ్యకతను గుర్తించగలరు.
- అనాటి సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకుంటారు.
- నాటకంలోని పాత్రల స్వభావాలను విశ్లేషించుకొని వ్యక్తీకరించగలరు.
- నాటక ప్రక్రియను అర్థం చేసుకొని నాటకీకరణ పట్ల ఆసక్తి చూపించగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని నిత్యజీవితంలో వినియోగించగలరు.

**11. యుద్ధ విజేత:**

- యుద్ధం చేయడం కంటే యుద్ధం రాకుండా చూడడం గొప్పదని గ్రహిస్తారు.
- యుద్ధం వల్ల కలిగే అనర్థాలు తెలుసుకొని, శాంతి ఆవశ్యకతను గుర్తించగలరు.
- శాంతి స్థాపన కోసం కృషిచేసిన మహనీయులను గురించి తెలుసుకొని, వారిమార్గంలో నడవగలరు.
- వచనకవితా సాహిత్యాన్ని చదివి, విషయాన్ని వ్యక్తీకరించగలరు సృజనాత్మకంగా పొడిగించగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని, నిత్యజీవితంలో వినియోగించగలరు.

**12. సూక్తి సుధ:**

- అన్నమాచార్యుని సంకీర్తనల గొప్పదనాన్ని గుర్తించి గ్రహించగలరు.
- మానవ జీవన విలువలు గురించి తెలుసుకుంటారు.
- పదకవితలోని పలుకుబడులను అర్థం చేసుకొని నిత్యవ్యవహారంలో వినియోగించగలరు.
- సంకీర్తనలను నేర్చుకొని పాడగలరు.
- పాఠంలోని భాషాంశాలను అర్థం చేసుకొని నిత్యజీవితంలో వినియోగించగలరు.

# విషయసూచిక


| క్ర. | పాఠం పేరు | ప్రక్రియ | ఇతివృత్తం | కవి/రచయిత | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| 1 | **ప్రత్యక్ష దైవాలు** | ఇతిహాసం | తల్లిదండ్రుల సేవ | ఎఱ్ఱన | జూన్ | 01 |
| 2 | **బతుకు గంప** | కథానిక | కుటుంబ విలువలు | మూలింటి చంద్రకళ | జూలై | 15 |
| 3 | **శతక మాధుర్యం** | శతకం | నైతిక విలువలు | వివిధ శతక కవులు | జూలై | 27 |
| 4 | **ఉపన్యాస కళ** | వ్యాసం | జీవననైపుణ్యం | వాసిరెడ్డి సీతాదేవి | ఆగష్టు | 38 |
| 5 | **జలియన్‌వాలా బాగ్** | ఖండ కావ్యం | దేశభక్తి | ఉమర్ ఆలీషా | ఆగష్టు | 52 |
| 6 | **ప్రకృతి సందేశం** | గేయం | ప్రకృతి వర్ణన | వై.సి.వి. రెడ్డి | సెప్టెంబర్. | 65 |
| 7 | **చేజారిన బాల్యం ∗** | వ్యాసం | వ్యక్తిత్వ వికాసం | శీలా వీర్రాజు | సెప్టెంబర్ | 76 |
| 8 | **జీవని** | కథ | ప్రత్యేక అవసరాల పిల్లలు-చేయూత | వి. చంద్రశేఖరరావు | అక్టోబర్ | 86 |
| 9 | **రాజధర్మం** | ప్రబంధం | నాయకత్వ లక్షణాలు | శ్రీకృష్ణదేవరాయలు | నవంబర్ | 100 |
| 10 | **కన్యాశుల్కం** | నాటకం | ఆధునిక విద్య ఆవశ్యకత | గురజాడ. అప్పారావు | డిసెంబర్ | 112 |
| 11 | **యుద్ధ విజేత ∗** | వచన కవిత | శాంతి ఆవశ్యకత | నేతల ప్రతాప్ కుమార్ | డిసెంబర్ | 128 |
| 12 | **సూక్తి సుధ** | సాహిత్యవ్యాసం | ఉత్తమమానవ గుణాలు | ఎస్.గంగప్ప | జనవరి | 138 |
| | **పునశ్చరణ** | - | - | - | ఫిబ్రవరి | |


## ఉపవాచకం


| | | | | | |
|---|---|---|---|---|---|
| **రామాయణం** | ఇతిహాస కథ | సంస్కృతి విలువలు | వాల్మీకి రామాయణం సంక్షిప్త వచనరూపం | జూలై<br>ఫిబ్రవరి | 151<br>193 |
| జూలై- సెప్టెంబర్<br>బాలకాండ, అయోధ్య కాండ | | అక్టోబర్ - డిసెంబర్<br>అరణ్యకాండ, కిష్కింధకాండ | | జనవరి-ఫిబ్రవరి<br>సుందర కాండ, యుద్ధ కాండ | |
| పదవిజ్ఞానం | | | | | 194 |


సంస్కృతం కాంపొజిట్ కోర్సుగా చదివేవారు పువ్వు గుర్తుగల పాఠ్యాంశాలు మినహా మిగిలినవి చదవాలి.
పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయాలి.

T4I2C5
Teacher Corner

W3N9I4
Student Corner

# 1 ప్రత్యక్ష దైవాలు

G7W7M9

– ఎఱ్ఱన

## చదవండి – ఆలోచించి చెప్పండి

ఆ.వె. తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి? వాఁడు గిట్టనేమి?
పుట్టలోన చెదలు పుట్టదా! గిట్టదా!
విశ్వదాభిరామ వినురవేమ.

– వేమన శతకం



**ప్రశ్నలు:**

1. పుత్రులు ఎవరి మీద దయకలిగి ఉండాలి?
2. కవి చెదపురుగులతో ఎవరిని పోల్చాడు? ఎందుకు?
3. తల్లిదండ్రుల సేవలో తరించిన మహనీయుల పేర్లు చెప్పండి?

**ఉద్దేశం**

లోకంలో కంటికి కనిపించే దేవతలు అమ్మానాన్నలు. వారిని ఎల్లప్పుడూ సేవించడమే ధర్మాలన్నింటిలో ఉత్తమ ధర్మం. ఆ ధర్మాన్ని అనుసరించాలని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

**కవిపరిచయం**



మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవిత్రయంలో ఎఱ్ఱన మూడవ కవి. ఈయన క్రీ.శ 14 వ శతాబ్దపు కవి. వీరి తల్లిదండ్రులు పోతమ్మ, సూరనలు. పాకనాడు సీమ (నెల్లూరు జిల్లా కందుకూరు సమీపంలో గుడ్లూరు గ్రామం) లో జన్మించారు. అద్దంకిని రాజధానిగా చేసుకొని పరిపాలించిన ప్రోలయవేమారెడ్డి ఆస్థానకవిగా ఉన్నారు. 'రామాయణం', 'హరివంశం', 'అరణ్య పర్వశేషం', 'నృసింహపురాణం' వీరి రచనలు. 'శంభుదాసుడు', 'ప్రబంధ పరమేశ్వరుడు' అనే బిరుదులతో ప్రసిద్ధి పొందారు. వీరి రచనాశైలిలో 'సూక్తివైచిత్రి' పేరెన్నికగన్నది. **ఈ పాఠం 'మహాభారతం' 'అరణ్యపర్వం'లోని 'ఐదవ ఆశ్వాసం' నుంచి స్వీకరించబడింది.**

## ప్రక్రియ-ఇతిహాసం

ఇతిహాసం అంటే 'ఇలా జరిగింది' అని అర్థం. ఇది ఒక కాలంలో ఒక రాజవంశానికో, ఒక జాతికో సంబంధించిన చారిత్రకాంశం గల బృహద్రచన. ఇవి తొల్లిటి కథలు. ఇవి గ్రంథ రూపంలోకి రాకముందు ఆశు రూపంలో ఉండేవి. ఇతిహాసాలు చతుర్విధ పురుషార్థాలు, ఉపదేశాలు, పూర్వ వృత్తాంత కథలతో కూడి ఉంటాయి. ఇతిహాసాలలో కథాకథనానికి ప్రాధాన్యం ఉంటుంది. రామాయణ, మహాభారతాలు ఇతిహాసాలు.

## నేపథ్యం

అరణ్యవాసంలో ఉన్న ధర్మరాజుతో మార్కండేయ మహర్షి కౌశికుని గాథను చెబుతాడు. కౌశికుని విద్యాభ్యాసం ముగిసినట్లు గురువు ప్రకటిస్తాడు. గృహస్థాశ్రమం స్వీకరించి తల్లిదండ్రులను సేవించమని చెబుతాడు. కానీ కౌశికుడు మరింత జ్ఞానార్జన చేసి సకలధర్మాలను తెలుసుకోవాలని బయలుదేరతాడు. ఒకనాడు మర్రిచెట్టు నీడలో కూర్చుని వేదాధ్యయనం చేస్తుంటాడు. చెట్టుపైన ఉన్న పక్షి ఆయనపై రెట్ట వేస్తుంది. కోపంతో దాని వంక చూడగా అది కాలి బూడిదవుతుంది. ఆ తర్వాత మధ్యాహ్న సమయంలో ఒక ఇంటి ముందు నిలబడి భిక్ష కోరతాడు. ఆ ఇంటి ఇల్లాలు అదే సమయంలో ఇంటికి వచ్చిన భర్తను సేవిస్తూ ఉండడం వల్ల భిక్ష వేయడం ఆలస్యమవుతుంది. నిర్లక్ష్యం చేసిందనే కోపంతో కౌశికుడు ఇల్లాలి వంక చూడగా "మహాత్మా! నేను చెట్టుపైన ఉన్న పక్షిని కాను, సన్యాసికి ఇంత కోపం తగదు" అని మంచిమాటలు చెప్పి, ఇంకా ధర్మసూక్ష్మాలను తెలుసుకోవాలని కోరిక ఉంటే మిథిలానగరంలో నివసించే ధర్మవ్యాధుని కలవమని చెబుతుంది. కౌశికుడు ధర్మవ్యాధుడి దగ్గరకు వెళ్తాడు. ఆ నేపథ్యంలోనిదే ఈ పాఠ్యాంశం.

1. క. ఏ నిమ్మెయి నుత్తమ వి
జ్ఞానోన్నతి వడయుటకు నిజం బగు మూలం
బైనది గలదొక ధర్మము
భూనుత! యది నీకు దృష్టముగ నెఱిఁగింతున్.

2. వ. అభ్యంతరగృహంబునకు రమ్మని యతనిం దోడ్కొని చని మనోహరంబై చతుశ్శాలంబై వివిధసౌరభసంవాసితం బైన హర్మ్యంబునందు మహితాసనాసీనులైన వారిం దన జననీజనకుల నభిమతాహారపరితోషితులఁ బరమాంబరాభరణ గంధమాల్యాలంకృతమూర్తుల నతనికిం జూపి, తాను దత్పాదప్రణామంబు సేసి, వారలఁ గుశలం బడిగిన, నయ్యిరువురుం బుత్త్రునకిట్లనిరి.

3. సీ. అన్న! కుమార! నీ యట్టి సత్పుత్త్రుండు
గలుగ మా కేమిటఁ గడమ సెపుమ!
నీ చేయు ధర్మంబ నీకుఁ దోడయ్యెడుఁ
బరమాయు ర ర్థ సంపదలుఁ గనుము;
నీ చరిత్రంబున నిఖిలవంశముఁ బవి
త్రితమయ్యె మానుషదేహమేల
ధరియించితో కాని తత్త్వమారయఁ బర
దేవత వీవు; సందియము వలదు;
తే. వాఙ్మనఃకర్మములఁ బితృవత్సలత్వ
మొక్కరూపుగఁ జలుపుచు నున్నయట్టి

**ఆలోచించండి - చెప్పండి**

1. కుమారుని 'అన్న' అని సంబోధించడంలో ఔచిత్యం ఏమిటి?
2. ధర్మవ్యాధుని తల్లిదండ్రులు ఉన్న పరిస్థితిని బట్టి నీవేం గ్రహించావు?

సద్గుణాకరు నిన్నెన్ని జామదగ్న్య
నొకని నెన్నంగఁ దగుఁ గాక యొరులు గలరె!

4\. వ అని పలికి; రప్పుడు ధర్మవ్యాధుండు వారికిం గౌశికుం జూపి, 'యిమ్మహాత్ముండు మనలఁ జూచువేడ్కనిటవచ్చె' నని చెప్పిన నా వృద్ధులతనికి సర్వసత్కారంబులు గావించినం, గైకొని, యతండు వారలఁ గుశలంబడిగె; నంత నవ్విప్రునకు లుబ్ధకుండిట్లనియె.

5\. సీ. జననుత! వీరు నా జననియు జనకుండుఁ
జూవె! వీరలకు శుశ్రూష సేసి
యిట్టి పరిజ్ఞాన మేనుఁ బ్రాపించితి
నమరులఁ బూజింతు రర్థి నెల్ల
వారును; నొండు దైవంబుల నెఱుఁగ: నీ
వృద్ధుల నాపాలి వేల్పు లనఘ!
కమనీయ ఫలపుష్పగంధభూషణవస్త్ర
ములు మనోహరభక్ష్యభోజ్యములును
తే. వీరి కెపుడు నివేదింతు, వేడ్కఁ బుత్ర
దారసహితుండనై నియతముగ సేవ
యాచరింతును; వేదముల్ యజ్ఞములు వ్ర
తంబులును వీర నాకను తలఁపు దృఢము.

6\. తే. జనని జనకుఁడు సద్గురుఁ డ నలుఁ డాత్ముఁ
డనఁగ నియ్యేవురును నే గృహస్థుచేత
సుగతివాంఛఁ బ్రసాదితు లగుదు రట్టి
వాఁడ సూవె ధర్మాత్ముండు వసుధమీఁద..



7. వ. అని చెప్పి యిట్లనియెః 'బతివ్రత పనుపునం జేసి నీవు ధర్మజ్ఞానార్థంబు నాయున్నయెడకుం జనుదెంచిన నప్పతివ్రతవలని యనుగ్రహంబున నీకు నెల్లవియు నెఱింగించితిఁ గాని, నీదెస నాదు చిత్తంబు ప్రియంపడియుండదు; నీచేసిన యకార్యంబొక్కటి గల దది యెయ్యది యనిన;

❉8. ఉ. ఎంతయు వృద్ధు లై తమకు నీ వొకరుండవ తెప్ప గాఁగ న
త్యంతముదంబునన్ బ్రదుకు తల్లిని దండ్రిని నుజ్జగించి ని
శ్చింతుఁడవై సదాధ్యయనశీలత వారి యనుజ్ఞ లేక యే
కాంతమ యెమ్మెయిన్ వెడలితక్కట! నీవు గరంబు క్రూరతన్.

9. ఆ. నీక వగచి వగచి నిర్భిన్నహృదయులై
విగతచక్షులైరి వినవె? వార:
లరిగి యింక నైన నమ్ముదుసళ్ల యు
దగ్రశోకవహ్ని నార్పవయ్య!

10. క. నీయధ్యయనమ్మును సుకృ
తాయాసము నిష్ఫలంబులై చను గురుసే
వాయుక్తి లేక తక్కినఁ
జేయుము నాపలుకు, మేలు సేకుఱు నీకున్.

11. వ. అనినఁ గౌశికుం డతని కిట్లనియె.

12. క. ఇది యట్టిద నీ చెప్పిన
సదమలహితవాక్యభంగి సకలము వింటిన్;
వదలక యిమ్మెయిన చరిం
చెద గురుజనములకుఁ బ్రీతిఁ జేసెద ననఘా!



13.క. నాదైన భాగ్యవశమునఁ
గాదే నీతోడి చెలిమి గలిగెం, బరమా
హ్లాదమనస్కుఁడ నైతి, శు
భోదయముల కెల్ల నింక యుక్తుఁడ నైతిన్

❊14.చ.అనుపమ మెట్టివారలకు నందదు ధర్మపథంబు ధాత్రిలో;
విను, పది వేపురందొకఁడు విశ్రుతధర్మపరాయణుండు గ
ల్గనొ కలుగండొ సందియము; గోరి సనాతనధర్మమూఁది యె
వ్వనికిని నీకుఁ బోలె బుధ వత్సల! యిట్లు చరింపవచ్చునే.

**ఆలోచించండి - చెప్పండి**

1. తల్లిదండ్రులను సేవించడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?
2. తల్లిదండ్రులను తప్పక సేవించి తరిస్తాను అని ఎవరు అన్నారు?
3. ధర్మవ్యాధునికి కౌశికునిలో నచ్చని అంశం ఏమిటి?

**భావాలు:**

1. ఓ కౌశిక మహర్షీ! నీవు నన్ను సర్వజ్ఞుడనంటూ అభినందించావు. నేను ఇంతటి విజ్ఞానాన్ని పొందడానికి మూలమైన ధర్మం ఒకటి ఉంది. ఆ ధర్మాన్ని నీ కంటికి కనిపించే విధంగా తెలియజేస్తాను.
2. అంటూ ధర్మవ్యాధుడు కౌశికమహర్షిని సగౌరవంగా తన ఇంటిలోకి తీసుకువెళ్ళాడు. నాలుగువైపుల నుండి సుగంధాలు వెదజల్లుతున్న ఆ భవనంలో ఉన్న ఉన్నత ఆసనాలపై ధర్మవ్యాధుని తల్లిదండ్రులు కూర్చొని ఉన్నారు. వారు తమకు ఇష్టమైన ఆహారాన్ని స్వీకరిస్తూ, నచ్చిన వస్త్రాలు, ఆభరణాలు మొదలైనవి ధరించి ఆనందంగా ఉన్నారు. అలాంటి తన తల్లిదండ్రులను కౌశికునికి చూపించి వారి పాదాలకు నమస్కరించాడు. వారి యోగ-క్షేమాలను అడిగి తెలుసుకొన్నాడు. అప్పుడు వారు కుమారునితో ఇలా అన్నారు.
3. ప్రియమైన కుమారా! నీ వంటి ఉత్తముడు కుమారుడై ఉండగా మాకేమి లోటు ఉంటుంది. నీవు పాటించే ధర్మం నిన్ను రక్షిస్తోంది. చక్కని సంపదలతో చిరకాలం జీవించగలవు. నీ ప్రవర్తన చేత మన వంశం పవిత్రమైంది. మానవుడిగా జన్మించావే గాని దేవతలలో గొప్ప దేవతవు. అనుమానం లేదు. మనస్సు, మాట, ఆచరణలచేత తల్లిదండ్రులను ప్రేమిస్తున్నావు. ఉత్తమ గుణవంతుడవైన నీ గురించి చెప్పి, తర్వాత పరశురాముని గురించి చెప్పాలి. మరెవ్వరు నీకు సాటిరారు.
4. అని పలికిన తల్లిదండ్రులకు ధర్మవ్యాధుడు కౌశికుని చూపించాడు. వారితో ఈ మహానుభావుడు మనల్ని చూడాలనే కోరికతో ఇక్కడికి వచ్చాడని చెప్పాడు. ఆ వృద్ధులు కౌశికుడికి స్వాగతమర్యాదలు చేశారు. కౌశికుడు వారి యోగక్షేమాలను అడిగాడు. తర్వాత ధర్మవ్యాధుడు కౌశికునితో ఇలా అన్నాడు.
5. ప్రజల చేత గౌరవింపబడేవాడా! వీరు నా తల్లిదండ్రులు. వీరికి సేవ చేయడం వల్ల మాత్రమే నాకు ఉత్తమ జ్ఞానం లభించింది. సాధారణంగా లోకంలో అందరూ కోరికతో దేవతల్ని పూజిస్తారు. నా తల్లిదండ్రులే నాపాలిటి దేవతలు. ఇతర దేవతల గురించి నాకు తెలియదు. వీరికి రుచికరమైన పండ్లు, పూలు, గంధం, అందమైన నగలు, వస్త్రాలు, ఇష్టమైన ఆహారపదార్థాలను అందిస్తాను. నా ఆలుబిడ్డలతో కలసి సేవ చేస్తుంటాను. అలా సేవించడం వల్ల వేదాధ్యయనం, యజ్ఞాలు, వ్రతాలను చేసిన ఫలితం వస్తుంది.
6. ఈ భూమిపై పుణ్యాన్ని కోరే గృహస్థుడు-తల్లి, తండ్రి, గురువు, అగ్ని, ఆత్మ అనే అయిదుగురిని పూజించి సంతోషపరచాలి. అలాంటి గృహస్థుడే ధర్మాత్ముడు.
7. అని చెప్పి ధర్మవ్యాధుడు ఇలా అన్నాడు. ఓ కౌశిక మహర్షీ! నీవు నా వద్దకు పతివ్రత పంపగా వచ్చావు. ధర్మాన్ని గురించిన జ్ఞానాన్ని పొందాలని భావిస్తున్నావు. ఆమెపై ఉన్న గౌరవం కారణంగా ధర్మమార్గాన్ని వివరిస్తాను. నీపై ఉన్న ఇష్టం కాదు. నువ్వొక చేయకూడని పని చేశావు కనుక నువ్వంటే నాకిష్టం లేదు. అదేమిటంటే....

8. కౌశిక మహర్షీ! నీ తల్లిదండ్రులు వృద్ధులు. వారు నీపై ఎంతో ప్రేమతో జీవిస్తున్నారు. వారికి నీవే ఆధారం. కాని నీవు వేదాధ్యయనం చేసి జ్ఞానాన్ని పొందాలని భావించావు. తల్లిదండ్రుల అనుమతి లేకుండా వారిని వదిలిపెట్టావు. వారి స్థితిగతులను గురించి ఎలాంటి విచారణ చేయలేదు. ఈ కఠినమైన నీ ప్రవర్తన నాకు నచ్చలేదు.

9. నీవు విడిచి వెళ్ళిన మరుక్షణం నీ కోసం నీ తల్లిదండ్రులు గుండెలు పగిలిపోయేటట్లుగా ఏడ్చి ఏడ్చి అంధులయ్యారు. ఇప్పటికైనా నీవు వెళ్ళి వారి దుఃఖాగ్నిని చల్లార్చు.

10. నువ్వు సంపాదించిన విద్య గానీ, పుణ్యం కోసం నువ్వు పడే శ్రమ గానీ, తల్లిదండ్రుల సేవ చేయకపోతే వ్యర్థమవుతాయి. కాబట్టి నేను చెప్పిన విధంగా ఆచరించు. నీకు మేలు కలుగుతుంది.

11. అది విన్న కౌశికుడు ధర్మవ్యాధునితో ఇలా అన్నాడు.

12. ఓ పుణ్యాత్ముడా! నీవు చెప్పిన మాటలు సరైనవి శ్రేష్ఠమైనవి మేలు కలిగించేవి. వాటిని శ్రద్ధగా విన్నాను. తప్పక ఆచరిస్తాను. తల్లిదండ్రులను సేవించి తరిస్తాను.

13. నీతో స్నేహం కలగటం నా అదృష్టం. నా మనస్సు అమితమైన సంతోషంతో నిండింది. నాకు కలగబోయే శుభాలకన్నిటికి ఇది సూచకం.

14. జ్ఞానుల చేత ఆరాధింపబడే ఓ ధర్మవ్యాధుడా! ధర్మమార్గం సాటి లేనిది. భూమిపై నివసించే పదివేల మందిలో ఏ ఒక్కడైనా ధర్మాచరణకు పూనుకొంటడాడో లేదో సందేహమే. నీలాగా ప్రయత్నపూర్వకంగా ధర్మాన్ని ప్రమాణంగా స్వీకరించి ఆచరించేవాడు ఉండడు.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.**

1. కౌశికుని తల్లిదండ్రులు చూపును కోల్పోవడానికి గల కారణాలు ఏమిటో చెప్పండి?
2. ధర్మవ్యాధుని తల్లిదండ్రులు సంతోషంగా ఉండటానికి కారణమేమిటి?
3. గృహస్థుడు ఎవరెవరిని పూజించాలి?
4. ❊ గుర్తు గల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి.

ఉదా ॥ చ. అనుపమ మెట్టివారలకు నందదు ధర్మపథంబు ధాత్రిలోఁ;
విను, పది వేపురం దొకడు విశ్రుతధర్మపరాయణుండు గ
ల్గునొ కలుగండొ సందియము; గోరి సనాతనధర్మ మూఁది యె
వ్వనికిని నీకుఁ బోలె బుధ వత్సల! యిట్లు చరింపవచ్చునే.

**ప్రతిపదార్థాలు:**

| | |
|---|---|
| బుధ వత్సల | = పండితులచే ఆదరింపబడే ఓ ధర్మవ్యాధుడా ! |
| విను | = ఆలకింపుము |
| ధాత్రిలో | = ఈ భూమి యందు |
| ధర్మపథంబు | = ధర్మమార్గం |
| అనుపమము | = సాటిలేనిది |
| ఎట్టి వారలకు | = ఎటువంటి వారికైనా |
| అందదు | = గ్రహించడం సాధ్యం కాదు. |

| | |
|---|---|
| విను | = ఈ విషయం తెలుసుకో |
| పదివేవురందు | = పదివేలమందిలో |
| ఒకఁడు | = ఒకడైన |
| విశ్రుత ధర్మ పరాయణుండు | = గొప్ప ధర్మ మార్గాన్ని అనుసరించేవాడు |
| కల్గును+ఓ | = కలుగునా? (ఉంటాడో) |
| కలుగండు+ఓ | = కలుగడో? (ఉండడో) |
| సందియము | = సందేహమే ? |
| కోరి | = ప్రయత్నించి |
| సనాతనధర్మం | = ప్రాచీనధర్మాన్ని |
| ఊఁది | = తెలిసి, గ్రహించి |
| ఇట్లు | = ఈ విధంగా |
| ఎవ్వనికిని | = ఎవరికి అయినా (ఏ మనిషికైనా) |
| నీకున్+పోలెన్ | = నీవు ఆచరిస్తున్న విధంగా |
| చరింప వచ్చునే | = ప్రవర్తించడం సాధ్యమా (సాధ్యం కాదు ) |

**ఆ) కింది పద్యాన్ని చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.**

సీ. జతనంబు మిగుల మాసములు దొమ్మిది యుద
రంబునం గరము భరంబుతోడ
భరియించి పదపడి ప్రాణసంశయ దశ
నొంది పుత్రునిఁ గాంచు నెందుఁ దల్లి;
తపములు యజ్ఞముల్ దానముల్ వ్రతములు
దేవతా సజ్జన సేవనములుఁ
గావించుఁ బుత్రుని గామించి జనకుఁడి
ట్లిరువుర పాటును సరియె తలఁపఁ;
దనయుఁ గని తల్లిదండ్రులు దమకు నతఁడు
భక్తుఁడగుటకు ధర్మానురక్తుఁ డగుట
కాసపడుదురు; విను మట్టియాస సిద్ధిఁ
బొందఁ జేయు నతఁడ చువ్వె నందనుండు

– ఎఱ్ఱన

**ప్రశ్నలు :**

1. తమ పిల్లలనుండి తల్లిదండ్రులు ఏమి కోరుకుంటారు?
2. సంతానం కోసం తల్లి ఏ విధంగా కష్టపడుతుంది ?
3. తపములు, యజ్ఞములు ఎవరు? ఎందుకు చేస్తారు?
4. పై పద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

**ఇ) కింది అపరిచిత గద్యాన్ని చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

కేరళకు చెందిన 17 ఏళ్ల బాలిక తన తండ్రి కోసం గొప్ప త్యాగం చేసింది. అమల్లో ఉన్న చట్టాలవల్ల ఎదురవుతున్న అడ్డంకులను న్యాయస్థానం ద్వారా తొలగించుకుని మరీ ఆమె తన తండ్రికి ప్రాణదానం చేసింది. ఆమె త్యాగనిరతిని అందరు ప్రశంసిస్తున్నారు. కేరళలోని త్రిసూర్‌లో ప్రతీష్ ఒక కేఫ్‌ను నడుపుతున్నారు. ఆయన తీవ్రమైన కాలేయవ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయడం తప్పనిసరి అని వైద్యులు తెలిపారు.

ఆయనకు కాలేయాన్ని ఇవ్వగలిగే తగిన అవయవదాత దొరకలేదు. దీంతో ఆయన కుమార్తె దేవనంద చాలా ఆవేదనకు గురైంది. తన తండ్రి కోసం తాను ఏదైనా చేయాలనుకుంది. తన కాలేయంలో కొంతభాగం ఆయనకు ఇవ్వాలని నిర్ణయించుకుంది. అయితే ఓ మైనర్ తన అవయవాలను దానం చేయడానికి మనదేశంలో అమలులో ఉన్న చట్టాలు అనుమతించవని తెలుసుకుంది. ఇటువంటి సందర్భం గతంలో వచ్చిందని, మైనర్ అవయవదానం చేయడానికి కోర్టు అనుమతి ఇచ్చిందని తెలుసుకుని, కేరళ హైకోర్టును ఆశ్రయించింది. తన తండ్రికి తన కాలేయంలో కొంత భాగాన్ని ఇచ్చేందుకు అనుమతించాలని కోరింది. హైకోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు చెబుతూ అనేక సమస్యలను ఎదుర్కొంటూ ఇంతటి త్యాగానికి సిద్ధమైనందుకు ఆమెను ప్రశంసించింది.

తన కాలేయాన్ని ఇచ్చేందుకు హైకోర్టు అనుమతించడంతో దేవనంద తన కాలేయం దానం చేయడానికి తగిన స్థాయిలో ఆరోగ్యవంతంగా ఉండటం కోసం ఆహారపుటలవాట్లు పూర్తిగా మార్చుకుంది. స్థానిక జిమ్‌లో క్రమం తప్పకుండా వ్యాయామం చేసింది. అలువలోని ఓ ఆసుపత్రిలో తన కాలేయాన్ని దానం చేసింది. ఆమె సాహసానికి మెచ్చుకొని శస్త్ర చికిత్సకు అయ్యే ఖర్చులను ఆసుపత్రి యాజమాన్యం ఉపసంహరించింది. ఓ వారం రోజుల తర్వాత ఆమెను ఆసుపత్రి నుంచి ఇంటికి పంపించారు. తన తండ్రికి తన కాలేయంలో కొంత భాగం ఇవ్వడం తనకు గర్వకారణమని, సంతోషంగా ఉందని దేవనంద తెలిపారు.

– పత్రికావార్త

ప్రశ్నలు :

1. దేవనంద తన తండ్రి కోసం ఏం చేయాలనుకుంది?
2. హైకోర్టు దేవనందను ఎందుకు ప్రశంసించింది?
3. దేవనందకు హాస్పిటల్ యాజమాన్యం ఏ విధంగా సహకరించింది?
4. పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

**ఈ) కింది వానికి అర్థసందర్భాలు రాయండి.**

1. వాఁడ సూవె ధర్మాత్ముండు వసుధ మీఁద.
2. గురు జనములకుఁ బ్రీతిఁజేసెద ననఘా!

**ఉ) కింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. ఎఱ్ఱన ఎవరి ఆస్థాన కవి?
2. ధర్మవ్యాధుని కథను ఎవరు ఎవరికి చెప్పారు?
3. ఎవరికి సేవ చేయడం తన ధర్మం అని కౌశికుడు గ్రహించాడు?
4. ధర్మవ్యాధుని కథ ఏ గ్రంథం నుండి స్వీకరించబడింది?

## వ్యక్తీకరణ–సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. ధర్మవ్యాధుడు కౌశికునితో 'తల్లిదండ్రుల సేవా విశిష్టతను' గురించి ఏమని చెప్పాడు?
2. ధర్మవ్యాధుని తల్లిదండ్రులు తమ పుత్రప్రేమను ఎలా వ్యక్తీకరించారు?
3. గృహస్థధర్మాన్ని గురించి ధర్మవ్యాధుడు ఏం చెప్పాడు?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. ప్రత్యక్ష దైవాలు పాఠం సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.
2. ఈ పాఠం ఆధారంగా ధర్మవ్యాధుని వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.
3. వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్న నేటిరోజుల్లో తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు. అనే ధర్మవ్యాధుని అభిప్రాయ ప్రాధాన్యతను పాఠం ఆధారంగా వివరించండి.

**ఇ) కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.**

1. కౌశికుడు – ధర్మవ్యాధుల వృత్తాంతాన్ని సంభాషణ రూపంలో రాయండి.
2. విద్య / ఉద్యోగాల నిమిత్తం తమకు దూరంగా ఉంటున్న పిల్లల గురించి తల్లి/తండ్రి అభిప్రాయాన్ని ఆత్మకథగా రాయండి.

## భాషాంశాలు పదజాలం

**అ) కింది వాక్యాలలో ఎరుపురంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి, సొంత వాక్యాలు రాయండి.**

1. జనకుడు తమ పిల్లలను చక్కగా తీర్చిదిద్దాలి.

______________________________

2. దేవతలు అమృతం సేవించడం వల్ల అమరులు అయ్యారు.

______________________________

3. చక్కని వాక్కే మనిషికి భూషణం.

______________________________

4. ఐ.ఏ.యస్ కావాలనే అతని చిరకాల వాంఛ నేరవేరింది.

______________________________

5. ఆ నగరంలో హర్మ్యాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

______________________________

6. మనం ఎప్పుడూ పరుల హితమునే కోరాలి.

______________________________

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలు రాయండి.**

పుత్రుడు, వస్త్రం, జనని, చక్షువు, వహ్ని

**ఇ) కింది పదాలకు నానార్థాలు రాయండి.**

1. గురువు : ______________________________
2. అర్థం : ______________________________
3. ఫలం : ______________________________
4. బుధుడు : ______________________________
5. వంశం : ______________________________

**ఈ) కింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు రాయండి.**

1. ధర్మం : ______________________
2. బుధుడు : ______________________
3. జనని : ______________________
4. కౌశికుడు : ______________________
5. వసుధ : ______________________

**ఉ) కింది పట్టికలో ప్రకృతి, వికృతి పదాలు ఉన్నాయి. వీటిని గుర్తించి రాయండి.**

| | | | |
|---|---|---|---|
| జన్నం | కార్యం | దిటవు | పుత్రుడు |
| బొట్టె | యజ్ఞం | విన్నాణం | దృఢం |
| విజ్ఞానం | ఎద | కర్జం | హృదయం |

| ప్రకృతి | వికృతి |
|---|---|
| __________ | __________ |
| __________ | __________ |
| __________ | __________ |
| __________ | __________ |
| __________ | __________ |
| __________ | __________ |

## వ్యాకరణాంశాలు

### సంధులు

**అ) కింది పదాలను విడదీసి. సంధి పేరు రాయండి.**

1. నిజంబగు : __________ + __________
2. మూలంబైనది : __________ + __________
3. కలదొక : __________ + __________
4. వేల్పులనఘ : __________ + __________
5. నీవొకరుండవు : __________ + __________

**ఆ) కింది పదాలను కలిపి సంధి పేరు రాయండి.**

1. జ్ఞాన + అర్థంబు : ______________ ______________
2. విజ్ఞాన + ఉన్నతి : ______________ ______________
3. అతి + అంత : ______________ ______________
4. ధర్మ + ఆత్ముడు : ______________ ______________

**త్రికసంధి**

**ఇ) కింది పదాలను కలిపి రాయండి. సంధి జరిగిన క్రమాన్ని సూత్రాన్ని అనుసరించి గ్రహించండి.**

ఉదా: ఈ + మెయి – ఇమ్మెయి

1. ఈ + మహాత్ముడు : ______________
2. ఆ + విప్రుడు : ______________
3. ఆ + పతివ్రత : ______________
4. ఏ + మెయిన్ : ______________
5. ఈ + కన్య : ______________

**సూత్రములు:**

1. ఆ,ఈ,ఏ లు త్రికంబు లనబడు. ఈ + మెయి
2. త్రికము మీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు. ఈ + మ్మెయి
3. ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడు ఆచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు. ఇమ్మెయి

**ఈ) కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసం పేరు రాయండి.**

1. జననీజనకులు : ______________ (        )
2. ఫలపుష్పములు : ______________ (        )
3. వస్త్రభూషణములు : ______________ (        )
4. భక్ష్యభోజ్యములు : ______________ (        )

**ఉ) కింది విగ్రహవాక్యాలకు సమాసపదం రాసి సమాసం పేరు రాయండి.**

1. ధర్మమైన పథం : ______________
2. సనాతనమైన ధర్మం : ______________
3. మానుషుని యొక్క దేహం : ______________
4. శోకమనెడి వహ్ని : ______________

**ఊ) అలంకారం-రూపకాలంకారం**

**కింది పద్యాన్ని పరిశీలించండి.**

ఆ॥వె. నీక వగచి వగచి నిర్భిన్న హృదయులై
విగత చక్షులైరి వినవె? వార
లరిగి యింకనైన నమ్ముదుసళ్ల యు
దగ్ర శోకవహ్ని నార్పవయ్య

పై పద్యంలో 'శోకవహ్ని' అని ఉంది కదా! అంటే శోకమనెడు వహ్ని. శోకం అనే ఉపమేయానికి వహ్ని అనే ఉపమానానికి అభేదం చెప్పారు. వహ్ని లక్షణాన్ని శోకంపై ఆరోపించారు. కనుక ఇది రూపకాలంకారం.

లక్షణం: ఉపమానధర్మాన్ని ఉపమేయంపై ఆరోపిస్తూ ఉపమేయానికి ఉపమానానికి అభేదం చెప్పినట్లయితే, అంటే భేదం లేనట్లు చెప్పినట్లయితే అది రూపకాలంకారం.

**ఋ) కింది వాక్యాలలో ఉన్న అలంకారాన్ని గుర్తించి, లక్షణం రాయండి.**

1. సంసార సాగరాన్ని ఈదటం కష్టం.
2. ప్రభుత్వం రైతులపై దయావర్షం కురిపించింది.

**ఛందస్సు**

**ౠ) కింది పద్యపాదాలకు గురు-లఘువులు గుర్తించి, గణవిభజన చేసి ఏపద్యపాదమో రాయండి.**

1. ఎంతయు వృద్ధులై తమకు నీవొకరుండవ తెప్పగాగ న (త్యంత)
2. అనుపమ మెట్టి వారలకు నందదు ధర్మపథంబు ధాత్రిలో

**ఎ) కింది తరగతిలో నేర్చుకున్న ఆటవెలది పద్య లక్షణాలను గుర్తుచేసుకుందాం.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| | గల | న | న | త | నగ |
| ఉదా: | U I | I I I | I I I | U U I | I I I U |
| | నీక | వగచి | వగచి | నిర్భిన్న | హృదయులై |

| | | | | |
|---|---|---|---|---|
| న | గల | గల | న | గల |
| I I I | U I | U I | I I I | U I |
| విగత | చక్షు | లై రి | వినవె? | వార |

**పద్య లక్షణాలు:**

1. ఆటవెలది పద్యం ఉపజాతికి చెందినది.
2. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
3. 1వ 3వ పాదాలు ఒక విధంగాను, 2వ 4వ పాదాలు ఒక విధంగాను ఉంటాయి.
4. 1, 3 పాదాల్లో వరుసగా మూడు సూర్యగణాలు. రెండు ఇంద్రగణాలు ఉంటాయి.
5. 2,4 పాదాల్లో ఐదు సూర్యగణాలు ఉంటాయి.
6. ప్రతిపాదంలో నాల్గవ గణంలోని మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది.
7. యతిలేని చోట ప్రాస యతి చెల్లుతుంది.
8. ప్రాసనియమం లేదు.

**కింది పద్య భాగాన్ని గణ విభజన చేసి, లక్షణ సమన్వయం చేయండి.**

భూమిలోన బుట్టు భూసారమెల్లను
తనువులోన బుట్టు తత్త్వమెల్ల

**ఏ) కింది వాక్యాలను ఆధునిక వచనంలోకి మార్చి రాయండి.**

1. ధర్మవ్యాధుండు కౌశికునితో యిట్లనియె.

_______________________________

2. గృహంబునకు రమ్మని యతనిం దోడ్కొని చనియె.

_______________________________

3. ఇమ్మహాత్ముండు మనలన్ జూచువేడ్క నిటవచ్చె నని చెప్పిన.

_______________________________

4. బతివ్రతపనుపునంజేసి నీవు ధర్మజ్ఞానార్థంబు నా యున్న యెడకుం జనుదెంచితివి.

_______________________________

## ప్రాజెక్టుపని

తల్లిదండ్రుల సేవకు ప్రాధాన్యమును ఇచ్చిన శ్రవణ కుమారుడు - శ్రీరాముడు - భీష్ముడు - గరుత్మంతుడు - శివాజి వంటి మహనీయులలో మీకు నచ్చిన ఇద్దరి వివరాలు సేకరించి రాయండి.

| పాఠాంత పద్యాలు | భావాలు |
|---|---|
| తే.గి. పసిడి పాపల మురిపించు పాఠశాల<br>భావి నరులకు జ్ఞానంబు భద్రపరచి<br>అంది యిచ్చెడి నిజమైన మందిరమ్ము<br>అక్షరంబుల నేర్పు దేవాలయమ్ము | స్వచ్ఛమైన మనసులు గల బాలలకు పాఠశాల ప్రేమగా అక్షరాలు నేర్పుతుంది. అది జ్ఞానాన్ని అందించి, మంచి పౌరులుగా తీర్చిదిద్దే దేవాలయం. |
| తే.గి. తల్లి వలె బిడ్డలందరి తలను నిమిరి<br>వారి తలలకు ప్రేమ సాంబ్రాణి వేసి<br>దివ్య సౌగంధముల నింపి తేజమొసగి<br>ఐదు తరగతుల్ నేర్పు నధ్యాపకుండు | ఉపాధ్యాయుడు తల్లిలాగ బాలల తలలను వాత్సల్యంతో నిమిరి, చదువు నేర్పి, హృదయాలను వికసింప చేస్తాడు. నైతిక విలువల పరిమళాల తేజస్సు నందిస్తాడు. |
| తే.గి. తల్లియొడి నుండి కాలిడి ధరణి పైన<br>అడుగు వేసెడి బుజ్జాయి బడికి రాగ<br>అయ్యవారల చేత అ,ఆ లు గఱపి<br>బ్రతుకు గృహసీమకు నంపు పాఠశాల | తల్లి ఒడి దిగి బుడిబుడి అడుగులు వేస్తూ పసివాడు బడికి వస్తాడు. అది అతనికి ఉపాధ్యాయుల చేత చదువు, సంస్కారం నేర్పి కొత్త జీవితాన్నిస్తుంది.<br>కీ.శే మల్లవరపు విశ్వేశ్వరరావు |

**సూక్తి :** మనిషి వ్యక్తిత్వానికి అతని నీతి, నిజాయితీలే గీటురాయి **- ఠాగూర్**

**మీకు తెలుసా?**

జూన్ 1వ తేదీని ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2012 లో ప్రకటించింది. ప్రతి సంవత్సరం జూలై నెల చివరి ఆదివారం నాడు జాతీయ తల్లిదండ్రుల దినోత్సవంగా జరుపుకుంటాము.

## యక్షగానం



మన కళారూపాలలో అతి ప్రాచీనమైనది యక్షగానం. ఆంధ్రదేశంలో శతాబ్దాల నుండి యక్షగాన కళారూపం ప్రదర్శితమైంది. బౌద్ధ, జైన, బ్రాహ్మణ సారస్వతాలలో యక్షులను దేవతాగణంగా పేర్కొన్నారు. యక్షులచే పాడబడే సంగీత విశేషం. యక్షశబ్దానికి ప్రాకృతంలో ఎక్కులు అని, తెలుగులో జక్కులు అని అంటారు. యక్షగానం ఎక్కువ మక్కువగా జక్కులవారు ప్రదర్శించేవారు. ఈ జక్కులవారు విద్యావివేకాల్లో గొప్పవారు. సంగీత సాహిత్యాల్లోనూ చిత్ర, శిల్పకళా ప్రతిభలలోనూ అద్వితీయ ప్రతిభావంతులుగా పేరు గడించారు. తాళపత్ర, సాధారణ గ్రంధాలు పరిశీలిస్తే 400 వరకు యక్షగానరచనలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నో గ్రంథాలలో కూడా యక్షగానాల ప్రసక్తి ఉంది. ఒక విధంగా చెప్పాలంటే యక్షగానం నృత్య, నాటక, సంగీత, వేష, భాష అలంకారాల సమాహారంగా చెప్పవచ్చు. సాయంత్రం వేళల్లో ప్రదర్శితమయ్యే ప్రదర్శన ఇది. ఈ యక్షగానం డప్పువాయిద్యంతో కార్యక్రమ ప్రారంభం గూర్చి ముందుగా ఊరి వారికి తెలియజేయడం జరుగుతుంది. నటులందరూ మెరిసే దుస్తులు, రంగులు పూసిన ముఖాలతో ఉంటారు. ఈ యక్షగానాలు ముఖ్యంగా పురాణ గాథలకు సంబంధించి వివరిస్తూ ఉంటాయి. కథకుడు కథ చెపుతూండగా నటులు వర్ణనకు అనుగుణంగా నృత్య ప్రదర్శనలు చేస్తుంటారు. వెనకాల సంగీతము వినిపిస్తూ ఉంటుంది. మరునాటి ఉదయం వరకు ప్రదర్శన సాగుతుంది.

## మోదకొండమ్మ జాతర

ప్రకృతి అందాలకు ఆలవాలం పాడేరు మన్యం ప్రాంతం. ఇక్కడ గిరిజనుల దేవతగా మోదకొండమ్మ పూజలు అందుకుంటుంది. మోదం అంటే సంతోషం. కొండలలో వెలసిన దేవత కనుక కొండమ్మ అని పిలిచారు. అన్ని కోరికలకు మూలమైన సంతోషాన్ని ప్రసాదించడం అమ్మవారి ప్రత్యేకత. ప్రతి ఏటా మే నెలలో అమ్మవారికి మూడు రోజులపాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఇది రాష్ట్రంలోనే అతిపెద్ద వేడుకగా పేరొందిన గిరిజన జాతర. ఈ జాతరలో గిరిజన సంప్రదాయ నృత్యం థింసా ఒక ప్రత్యేక ఆకర్షణ. ఈ జాతరకు విశాఖ గోదావరి జిల్లాల నుండే కాక ఒడిస్సా, ఛత్తీస్ఘడ్ రాష్ట్రాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. రాష్ట్రప్రభుత్వం 2014లో దీనిని రాష్ట్ర జాతరగా గుర్తించింది.



# 2 బతుకు గంప

Z3L4U1

– మూలింటి చంద్రకళ

## చదవండి – ఆలోచించి చెప్పండి

1884వ సంవత్సరంలో మా నాయన గారి ఆకస్మిక మరణంతో నా జీవితంలో ఒక పెద్ద అగాధం ఏర్పడింది. ఆ స్థితిలో కుటుంబ భారం అంతా మా తల్లిగారి మీద పడింది. ఈ సంసారం పోషించడానికి ఆమెకు ఉన్న సాధనాలు కూడా కొరత పడిపోయాయి. మా అమ్మగారికి కుటుంబ భవిష్యత్తు విషయమై ఆత్రుత హెచ్చయింది. మా మేనమామలపై ఆధారపడటం ఇష్టం లేదు. ఇంగ్లీషు చదువు చదివించాలన్న మా నాన్నగారి కోరికను సఫలం చేయాలని సంకల్పించుకుంది. ఒంగోలులో హోటల్ పెట్టి వచ్చే ఆదాయంతో మా చదువు సాగించడానికి ఆమె నిర్ణయించుకుంది. ఆ రోజుల్లో పూటకూళ్ళ ఇల్లు పెట్టుకున్న వారిని సంఘంలో చులకనగా చూసేవారు. కానీ ఒకరి కుటుంబం మీద ఆధారపడటం కన్నా నలుగురికి అన్నం పెట్టి జీవించడమే గౌరవప్రదం అని మా అమ్మగారు నిర్ణయించుకుంది. ఎలాగైనా నాలుగు కాలాలపాటు శ్రమపడి ఈ పిల్లల్ని ప్రయోజకుల్ని చేస్తే తన కష్టాలు గట్టెక్కుతాయని ఆమె నమ్మకం.

– టంగుటూరి ప్రకాశం





**ప్రశ్నలు:**

1. ప్రకాశం తల్లి గారికి ఎటువంటి పరిస్థితులు ఎదురయ్యాయి?
2. ప్రకాశం తల్లి గారు ఏం నిర్ణయించుకున్నారు??
3. పిల్లల అభివృద్ధి కోసం తల్లిదండ్రులు పడే శ్రమను గురించి చెప్పండి?

### ఉద్దేశం

మానవ జీవితంలో కష్టసుఖాలు ఉంటాయి. కష్టాలు వచ్చినప్పుడు వాటిని ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలి. మనకు ఉన్నంతలో తృప్తిగా జీవించాలి. తోటి వారికి చేయూతనందించాలి. మనిషికి మనిషే తోడు, మానవత్వమే జీవిత పరమార్థం అని చెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

## రచయిత్రి పరిచయం



జననం: 06.09.1969
మరణం: 05.12.2004

నిరుపేదల జీవితవాస్తవాలను కథావస్తువుగా తీసుకొని, రచనలు చేసిన కథారచయిత్రి మూలింటి చంద్రకళ గారు. వీరు చిత్తూరు జిల్లా 'అరగొండ'లో జన్మించారు. రాజగోపాల్, విమలమ్మ వీరి తల్లిదండ్రులు. భర్త రామకృష్ణ గారి సహకారంతో కథలు, కథానికలు రాశారు. అందులో ఒక ప్రయాణం, బతుకు గంప, ఒక రైతుకథ ముఖ్యమైనవి. వీటితో పాటు భానుమతి రామకృష్ణ గారి 'అత్తగారి కథలకు', మునిమాణిక్యం నరసింహారావు గారి 'కాంతం కథలకు' రేడియోలో ప్రసంగ వ్యాసాలు చేశారు. **ప్రస్తుత పాఠ్యభాగం ఆమె కథల నుండి స్వీకరించబడింది.**

## ప్రక్రియ–కథానిక

తెలుగు సాహిత్యంలో నేడు 'కథ, కథానిక' అనేవి పర్యాయ పదాలుగా మారిపోయాయి. కథానిక వచన ప్రక్రియ. వ్యక్తిజీవితంలో ఒక ముఖ్య సన్నివేశాన్ని లేదా సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రిస్తుంది. క్లుప్తత దీని ప్రధాన లక్షణం. పాత్రలు, నేపథ్యము, కథనము, జీవిత వాస్తవచిత్రణ, కంఠస్వరం కథానికలో ముఖ్యమైన అంశాలు

## I



ఎందుకో ఉదయం లేచినప్పటి నుంచీ ఏ పనీ చెయ్యాలనిపించడం లేదు. పిల్లలు వాళ్లంత వాళ్లు స్నానాలు చేసి ఉన్నదేదో తిని స్కూలుకెళ్లారు. వంట ఏం చేశానో ఏమో... వండిందే కాసంత క్యారియర్లో పెట్టి ఇచ్చాను. మా ఆయన కూడా ఆఫీసుకు వెళ్లిపోయాడు. ఎక్కడ వస్తువులు అక్కడే పడున్నాయి. పిల్లలు ఎక్కడ తీసేసిన బట్టలు అక్కడే ఉన్నాయి. ఏ పనీ చెయ్యాలనిపించడం లేదు. ఎంత వద్దనుకున్నా ఎల్లమ్మే గుర్తుకు వస్తోంది. ఆలోచనలన్నీ ఎల్లమ్మ చుట్టే తిరుగుతున్నాయి. కారణం తెలీడంలేదు. ఎప్పుడో నాలుగేళ్ల క్రితం అనుకుంటా......

ఈతపుల్లల గంపలో ఎంతో అందంగా పండ్లు అమర్చుకొని తనదైన యాసతో "పండ్లమ్మో..." అంటూ అరుస్తూ మా వీధిలోకి వచ్చింది. ఆ రోజు ఎల్లమ్మను నేనే పిలిచానో, తనే వచ్చిందో గుర్తుకు రావడం లేదు. అప్పట్నుంచి ప్రతిరోజూ తను రావడం అవసరం ఉన్నా లేకున్నా ఎల్లమ్మ దగ్గర పండ్లు కొనుక్కోవడం జరుగుతూ ఉంది. పండ్లు కొనుక్కోవడంతో మొదలైన ఎల్లమ్మతో పరిచయం ఎలా బలపడిందో ఇప్పుడు స్పష్టంగా చెప్పలేను.

ఒకరోజు ఎల్లమ్మ రాకపోతే ఏదో వెలితనిపించేది. అలాంటిది పది రోజులు కనిపించక పోయేసరికి ఏవేవో ఆలోచనలు మనసులో మెదిలాయి. ఏ పనీ చెయ్యాలని అనిపించలేదు. ఎల్లమ్మని గురించే ఆలోచిస్తూ కూర్చున్నాను. అంతలో ఎవరో తలుపు తట్టిన శబ్దం వినిపించింది. వెళ్లి తలుపు తీశాను. ఎదురుగా ఎల్లమ్మే వుంది. ఎప్పటిలా కనిపించడంలేదు. ఏడ్చి ఏడ్చి కళ్లు ఉబ్బినట్లున్నాయి. జుట్టంతా చిందరవందరగా ఉంది. ఎప్పుడు తినిందో! ఏమో! నిలబడ్డానికి కూడా ఓపిక లేనట్లుంది.

'అదేంటే అలా వున్నావు' అన్నాను మామూలుగానే. 'ఇంకేముందమ్మా... అంతా అయిపోయిందమ్మా... అంటూ బోరున ఏడ్వడం మొదలెట్టింది. నాకేమీ అర్థం కాలేదు. రెండు మూడు నిమిషాలు తెల్లముఖం వేశాను. ఎల్లమ్మని ఎట్లా ఓదార్చాలో అర్థంగాకుంది. ఒక గ్లాసు మంచి నీళ్లు ఇచ్చి తాగమని చెప్పి నెమ్మదిగా 'ఏం జరిగిందో చెప్పవే' అన్నాను. ఎల్లమ్మ ఏడుస్తూనే ఉంది. వంటింట్లోకెళ్లి కాఫీ కలిపి తెచ్చి ఇచ్చాను. కాఫీ తాగింది. కొంచెం స్తిమితపడిందనిపించింది. 'ఇప్పుడు చెప్పవే ' అన్నాను..



'ఏమీ లేదమ్మా! మా ఆయనకు యాక్సిడెంట్ అయ్యింది. 'ఎప్పుడయింది. ఏం జరిగింది' నెమ్మదిగా అడిగాను. 'ఏమోనమ్మా నాక్కూడా సరిగ్గా తెల్వదు. లారీ డ్రైవర్ గా పని చేస్తా వుండె. నాలుగు రోజులకు ముందు ఏదో లోడుతో పోయాడంట. హైదరాబాద్ దగ్గర ఎదురుగా వస్తోన్న టిప్పర్ గుద్దిందంట. మా ఆయనకు కాలిరిగిపోయిందంట. క్లీనర్ అక్కడికక్కడే సచ్చిపోయినాడంట. మా.. ఆయన తెలివితప్పి పడుంటే ఎవ్వరో ఆసుపత్రిలో చేర్పించినారంట. అదేమో కేసవుతుందంటున్నరు. కాళ్లకు చేతులకు తలకు పెద్దదెబ్బలే తగిల్నాయంట. ఆసుపత్రిలో కట్లు కట్టి, కుట్లేసి పండ పెట్టింద్రు. పానానికి భయం లేదంట... మాటల మధ్యలో ఏడుస్తూనే చెప్పింది. 'అయితే నువ్విట్లా వచ్చావేమే' అడిగాను. "రాక సేసేదేముందమ్మా... లెక్కకావద్దూ. శానా అయితుందట కదమ్మా!.... పిల్లల పేర్ల మీద నెలనెలా తిని తినకా వందొంద రూపాయలు చాన్నాల్లుగా కడతా వుంటి. అదో పదివేలున్నాయి. అవి తీసుకెళ్లాలని ఇట్లా ఊర్లోకొస్తి, అట్టే చానారోజులు అయింది కదా! నేనెక్కడ సచ్చానో అనుకుంటారని ఇట్టా తెలిసినోళ్ల ఇల్లు చూసి పోదామని వస్తినమ్మా" అని తను చెప్పదల్చుకున్నదంతా అయిపోయిందని గట్టిగా వూపిరి పీల్చుకొంది.

ఎల్లమ్మతో ఏం మాట్లాడాలో అర్థంకాక అలాగే కాస్సేపు మౌనంగా ఉండిపోయాను. "ఏం సేతు... అంతా నా .. కర్మ... కర్మ' అంటూ ఎల్లమ్మ మళ్ళీ చెప్పడం మొదలు పెట్టింది. "నాకు ఆరేళ్లుంటాయనుకుంటానమ్మా... మా యాదిలో పిల్లల్తో ఆడుకుంటాంటి. ఎవరో మా యింటికాడ నలుగురు కూస్తోంద్రి. చేపల కోసం మా అయ్యికాడికి వచ్చింద్రను కుంటి. మల్లీ వారం - తాలాక తెలిసె పెత్తనానికి వచ్చింద్రని...

ఎవరికీ....... 'ఇంకెవరికి... నాకేనమ్మా!' 'నీకా.... అవునమ్మా. మా అయ్యకేమో మేము పద్నాలుగు మందిమి, నాపై ఉన్న అక్కలకు, అన్నలకు పెళ్లిలయ్య, నలుగురు ఎలాగూ పోయారట. మిగిలిన నలుగురిలో నేను రెండోదాన్ని. నా కన్నా పెద్దదానికి అప్పటికే పెళ్లి కుదిరిందట. మా అక్కను చూడ్డానికి వచ్చిన వాళ్లలో మా ఆయనా ఉన్నాడట. ఆయనకు నేను నచ్చానట. పెళ్లిలో పెళ్లి చేసేద్దాం అనుకున్నారట. జానెడు తాడు, యాభై రూపాయల చీరతో నా పెళ్లి అయిపోయింది. మా అయ్యికి సదువు లేదు. పెద్ద వ్యాపారమూ లేదు. పిల్లలేమో ఇంటి నిండావుంటిమి..

**ఆలోచించండి - చెప్పండి**

1. ఎల్లమ్మ తన భర్త గురించి ఏం చెప్పింది?
2. ఎల్లమ్మ దు:ఖానికి కారణమేమిటి?

## II

మొదట్నుంచీ చేపలు పట్టే బతుకుతుంద్రి. అప్పుడు 'తినడానికి బాగా జరిగేదేమో, మా అక్కలకు అన్నలకు కొద్దో గొప్పో వున్నోళ్ళ సంబంధాలే తెచ్చి చేసిరి.మాకాడ కొచ్చేసరికి పూట గడవడం కష్టమాయ, అక్క పెళ్లికెలాగూ అవీ ఇవీ కొని బంతిబువ్వ పెట్టాల కదా? పనిలో పని అయిపోతుందని నా మెల్లోనూ పసుపు తాడేసేసిరి. కళ్లు తుడుచుకుంటూ" ఎల్లమ్మంది.

"ఎందుకు ఎల్లమ్మా ఏడుస్తావన్నా' ఇంకేమనాలో తోచక. 'ఎందుకేందమ్మా?..., వాడికేం బుద్ధి పుట్టేనో ఇంటికి రావడమే సాలుకొనే, ఏం తినాలో తెలీకపోయె. మా అమ్మ కాడికి పోదామనుకుంటే వాళ్లకి జరిగేదే కష్టంగా ఉండె. మా అత్తని కూడా నేనే సాకాల్సి వచ్చె. ఏ పని చెయ్యాలో తెలవకపోయె, కూలికి పోదామంటే కడుపులో బిడ్డ వుండె. వంగి లేవడం కష్టంగా వుండె. అప్పుడు మాగేర్లో చానామంది పండ్లమ్ముకునే బతుకుతుండ్రి. వాళ్లలో పడి ఇట్లా చిన్నగా పండ్లమ్మబట్టి. అట్లే పెద్దోడు పుట్టె. మళ్లీ పక్కూర్లో వున్నాడంటే బతిమిలాడి పిలసకొస్తి, కొద్దికాలం వుండె.మళ్లీ ఏమొచ్చనో ఏమో మళ్లీ పాయ. ఇట్లేనమ్మా సంకలో బిడ్డ, కడుపులో బిడ్డ. నెత్తిన గంప పెట్టుకోని ఈదీదీ తిరిగి పిల్లల్ని సాకితి. ఇట్లె ఇన్నేళ్లూ యీ బతుకీడిస్తి, పిల్లకాయలకి పనిచేసే వయసొచ్చె. ఏదో పనికిపోయి బతుకుతార్లే అనుకుంటి. ఇద్దో ఇట్లా వచ్చి పడే ఆపద. ఏం చేయాలో అర్థంకాలేదమ్మా!.

కనీసం అమ్మవాళ్లు కూడా అయ్యోమన్లా. వూర్లోవాళ్లూ ఏమీ అని అనకపోయిరి. పోతే పోయినాడు లేమ్మే... వాడు బాగుండి నువ్వు సుఖపడింది లేదు అనబట్టిరి. అయినా పాడు పానం వూరుకోలేదమ్మా. ఎంతైనా పుస్తెకట్టినోడు. సంపాయించి పెట్టకపోతే పాయ, మగ దిక్కుగానైనా... ఇంట్లో పడుంటాడు. ఆయనకీ ఇంకొక బిడ్డ అని అంత ముద్దేస్తే సరి. నలుగురిలో అంత బొట్టెట్టుకొని తిరగచ్చు. పిల్లలపై ప్రేమ లేకుంటే పాయ. కన్నోడున్నాడనుకుంటారు కదా! అని పండ్లమ్మి కూడబెట్టిన పైసలు ఎత్తుకోని పోతుండానమ్మా' అంటూ కళ్ళు తుడుచుకుని ఇంట్లో.. చిందరవందరగా పడున్న సామాన్లు సర్ది, ఉన్న నాలుగ్గిన్నెలు కడిగి "ఇంగ వస్తానమ్మా... నాలుగు దినాల తర్వాత మళ్లీ కనబడతానమ్మా" అంటూ చెప్పి చాలా సాధారణంగా వెళ్లిపోయింది.

ఎల్లమ్మ వెళ్లిపోయినా ఆలోచనలు ఎల్లమ్మ చుట్టే తిరుగుతున్నాయి. ఇన్నేళ్ల తన పరిచయంలో ఏనాడూ తను బాధ పడుతున్నట్లుగాని, తనేదో కోల్పోయినట్లుగాని కనపడలేదు. ఎప్పుడూ ఎండలో గంప మోసి మోసి అలిసిపోయినట్లు కనిపించేది. మూడేళ్ల క్రితం అనుకుంటా, ఒకరోజు జ్వరంతో పడుకోనున్న నన్ను చూసి 'ఏమైందమ్మా'ని ఆప్యాయంగా పలకరించి, ఇంట్లో పనంతా ఎవరు చేస్తారమ్మా' అని అడిగింది. 'జ్వరం తగ్గాక నేనే చేసుకోవాలి" అన్నాను. 'బలేవారమ్మా! ఒళ్లు అట్లా పెట్టుకుని ఎట్లా చేసుకుంటారు? నేను చేస్తాలే అని ఇల్లంతా కసువు కొట్టి, బండలు తుడిచి, అంట్లు తోమి, పిల్లలు వారం రోజులుగా విడిచిన బట్టలన్నీ శుభ్రంగా ఉతికి ఆరేసింది. 'ఏమివ్వమంటావే' అన్నాను. కళ్లనిండా నీళ్లు పెట్టుకుంది. 'ఏమైందే?' అన్నాను కంగారుగా.

"ఏమీ లేదమ్మా... డబ్బుదేముంది ? ఒక గంటసేపు గంప నెత్తిన పెట్టుకొని రెండు వీధులు తిరిగితే నా కూలి వచ్చేస్తాది. రోజుకో ఇరవై రూపాయలు మిగిలితే ఆ రోజు పండగే. " అంత పప్పు అన్నం తింటాం. కానీ నీలాగ వచ్చినపుడల్లా 'ఎల్లమ్మా' అని ఇంత ఆప్యాయంగా ఎవరు పిలుస్తారు.అట్లా పిలిస్తే నాకెంతో ఆనందంగా ఉంటుందమ్మా... ఎన్ని రోజులు నువ్వు తినే కూడు పెట్టింటావు. ఒక పూట నేనింట్లో పనిజేస్తే దానికి నువ్వు డబ్బులివ్వాలా? ఏదో అవసరం గనక చేస్తిని...' అంది. ఎల్లమ్మ మాటలకి బిత్తరపోయాను. ఆ రోజు నుంచి ఎల్లమ్మ మా ఇంట్లో ఒక మనిషిగా కలిసిపోయింది. ఎప్పుడూ తనెనుక ఇంత గతముందని చెప్పింది కాదు.

**ఆలోచించండి - చెప్పండి**

1. ఎల్లమ్మకు పండ్లు అమ్మవలసిన అవసరం ఎందుకు వచ్చింది?
2. ఎల్లమ్మ పనిచేసి డబ్బు తీసుకోకపోవడానికి కారణమేమిటి?

## III

ఒక రోజు మాటల మధ్యలో 'పానమేమి బాగాలేదమ్మా' అంది. ఎందుకు అన్నాను, ఏమీ లేదమ్మా మా వొదిన ఇంటి మీదకొచ్చింది నాకొడుకును అనరాని మాటలు అనింది. నా కొడుకు ఆయమ్మ కూతురుని పెళ్ళిచేసుకుంటానన్నాడంట. దాంతో 'నీకంత వయసొచ్చిన కొడుకున్నాడా ఎల్లమ్మా' అన్నాను. కొడుకంటే.... కొడుకేనమ్మా.. పదైదేండ్ల కిందట సంగతమ్మ ఇది. మా వూరు ఏటిపక్కన వుంది గదా!... ఆ ఏటి వరదలో ఎవరో బిడ్డ కొట్టుకొచ్చాడు. చేపల వేటకు పోయిన



మావూరోళ్ళు ఆ బిడ్డను కాపాడి గట్టు మీద కూర్చో బెట్టారు. అప్పుడు నేను కడుపుతో వున్నా! చూస్తా చూస్తా బిడ్డను ఎట్లా దిక్కులేని బిడ్డలా వదిలేసేదని ఇంటికెత్తికొస్తి. నా బిడ్డలతో సమానంగా పెంచితి. వానికి నేను పెట్టిన పేరు సాయిలు. నా బిడ్డలతో పాటు వాడిని కూడా పది వరకు సదివిస్తి చూస్తా, చూస్తా వుండగానే వాడు పెరిగి పెద్దోడయ్యె. ఇప్పుడు మా వూరిలో బస్సు కండక్టరు ఉద్యోగం చేస్తున్నాడమ్మా! ఒగరి మాటకి పోడు. ఒగరింటికి పోడు. వాడేందో వాని పనేందో. అట్టాంటి బిడ్డని అనరాని మాటలంటే కోపం రాదా.. అందుకే మా వొదిన నేమనలేక చేతికి దొరికిన కట్టెత్తుకొచ్చి చావగొట్టాను. వాడు సద్దికూడా తినకుండా ఏడుస్తా పోయినాడు. అంటూ ఏడుస్తూ తన్ను తాను తిట్టుకుంటూ ఇంటిదోవ పట్టింది.

ఎల్లమ్మ వెళ్లిన దోవ తట్టే చూస్తూ నిలబడ్డాను. ఇంచుమించు ఎల్లమ్మతోపాటు ఎంతోమంది పండ్లమ్ముకునే బతుకుతున్నారు. వాళ్ల బతుకులూ ఇట్లే వుంటాయేమో.... ఎంత కష్టపడుతూ ఉంటారో... జానెడు పొట్ట కోసం కడుపున పుట్టిన బిడ్డల కోసం రెక్కలు ముక్కలు చేసుకొని పొద్దస్తమానం కష్టం చేస్తూనే ఉంటారు. ఇంట్లో ఎప్పుడన్నా "అంత లడ్డొ అంత మైసూరుపాకో, అంత కారబ్బూందినో చేతిలో పెడితే కొంగున కట్టుకుంటుంది. 'ఎందుకు తినవే' అంటే 'సిన్నబిడ్డలకి ఎవరు పెడతారమ్మా' అంటుంది.'ఇంత పని చేస్తావ్, నీకు శ్రమ అనిపించదా?' అని ఎప్పుడైనా అడిగితే 'బలేవారమ్మా!... మనిషి పుట్టక పుట్టి కష్టం అనుకుంటే ఎలా? కష్టంతోనే మనం తింటున్నాం. మన పిల్లలకి పెడుతున్నాం. మనల్ని ఆశ్రయించినోళ్లకి ఇంత పెడుతున్నాం. ఇంతకంటే తృప్తి ఎక్కడుంది?' అంటుంది.

ఎల్లమ్మ వెళ్ళిపోయినా ఎల్లమ్మని గురించిన ఆలోచనలు నన్ను గందరగోళపరుస్తూనే ఉన్నాయి. నా చుట్టూ ఎందరో ఉన్నారు. లెక్చరర్ నీరజ, బ్యాంక్ క్లర్క్ వసుంధర, టీచర్ సునీత, పార్వతి... పద్మ... హరిత... ఇంకా ఎందరో ఉన్నారు. ఆర్థికంగా వాళ్ళకి ఏ ఇబ్బందులూ లేవు. ఖరీదైన చీరలే కడతారు. ఖరీదైన మనుషుల్లానే కనపడతారు. విందులు, వినోదాలు అంటూ ఎక్కడెక్కడికో వెళ్లి వస్తుంటారు. ఎప్పుడు కలిసినా ఏదో వెలితిగానే మాట్లాడతారు. ఏవేవో వాళ్లు వూహించుకున్నవి వాళ్ల సొంతం కాలేదని వాళ్ల జీవితమంతా అశాంతే అలుముకుందని బాధపడిపోతారు. ఏనాడూ సుఖమన్న మాట, ఆనందమన్న

మాట తన దరిదాపులకు రానివ్వని ఎల్లమ్మ ఎప్పుడూ బాధపడినట్లు గాని, వాటి గురించి ఆలోచించినట్లుగాని కనిపించలేదు. ఆ క్షణం ఎల్లమ్మ వాళ్ళందరికంటే ఎంతో ఎత్తులో వున్నట్లు కనిపించింది.

**ఆలోచించండి - చెప్పండి**

1. పిల్లల కోసం పడే శ్రమ గురించి ఎల్లమ్మ ఏం చెప్పింది?
2. ఎల్లమ్మ గురించిన ఆలోచనలు రచయిత్రిని ఎందుకు గందరగోళ పరిచాయి?

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.**

1. పాఠంలో మీకు నచ్చిన సన్నివేశాన్ని గురించి మాట్లాడండి.
2. పాఠానికి 'బతుకుగంప' శీర్షిక సరిపోతుందా? ఎందుకు?

**ఆ) కింది అపరిచిత పద్యాన్ని చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**



చం. గనిమల తుంగకున్ గరిక కాడలకల్లిన సాలెగూళ్ళస
న్నని పటికంపుమంచుపడి నాణెపు ముత్తెసరాల పోలికం
గనుగొన రమ్యమయ్యె రవికాంతులఁ దేలుచు నిట్టి భావమో
హనపు నిసర్గ శిల్పముల హాలిక! త్రొక్కక దాటి పొమ్మికన్

**- దువ్వూరి రామిరెడ్డి**

**ప్రశ్నలు :**

1. ముత్యాల సరంలా ఏం కనబడింది?
2. కవి రైతుకి ఏమని చెప్పాడు?
3. సాలెగూడు వేటికి అల్లింది?
4. పద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

**ఇ) కింది అపరిచిత గద్యాన్ని చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**



ఎక్కడో పరాయి దేశం నుంచి వచ్చిన ఆంగ్లేయులు మనపై అధికారం చెలాయిస్తూ మన దేశసంపదను ఎందుకు కొల్లగొట్టాలి? సమాజంలో కొంతమంది పెద్ద భవంతుల్లో, మరికొందరు మురికి కూపాల్లాంటి గుడిసెల్లోనే ఎందుకుండాలి? అని అతిచిన్న వయసులోనే ఒకవైపు దేశ స్థితిని, మరోవైపు పేదల బ్రతుకుల్ని, ప్రజల మధ్య వున్న అంతరాల గురించి ఆలోచించేవాడు. తాను స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, ఉపన్యాసాలు ఇవ్వడం వల్ల ఆనాడు విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిలిపేసింది. తన చదువుకు, జీవనానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధైర్యపడలేదు. ఖాళీ సమయాల్లో బట్టల షాపుల్లో, పండ్లతోటల్లో, హొటల్లో, పనిచేసి డబ్బు సంపాదించేవారు. ఆ డబ్బుతో తన చదువు కొనసాగిస్తూనే కుటుంబానికి సహాయపడేవారు. ఆనాటి పరిస్థితుల్లో భారతదేశంలో ఉండి ఉన్నతవిద్యను అభ్యసించడం సాధ్యం కాదని భావించాడు. అందుకోసం అమెరికా వెళ్ళి ఆర్థికశాస్త్రంలో యం.ఎ పూర్తిచేశాడు. ఈ ఉన్నత విద్యకు మన దేశీయులు ఎందరో ఆర్థిక సహాయం చేశారు. తరువాతి కాలంలో ఆర్థికశాస్త్రంలో ఎనలేని కీర్తి గడించారు. భారతదేశంలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. అతడే సర్వోదయ ఉద్యమనాయకుడిగా, భారతమాత ముద్దుబిడ్డగా, లోక్‌నాయక్‌గా పేరుగాంచిన **జయప్రకాష్ నారాయణ** గారు.

**- ఆదర్శ బాల్యం**

ప్రశ్నలు:

1. జయప్రకాష్ నారాయణ చిన్నతనంలో ఏయే విషయాలు గురించి ఆలోచించేవారు?
2. తన ఉపకార వేతనం ఆగిపోవడానికి కారణమేంటి?
3. నారాయణగారు తన ఆర్థిక ఇబ్బందులను ఎలా దాటగలిగారు?
4. పేరా ఆధారంగా అర్థవంతమైన ప్రశ్న తయారు చేయండి.

**ఈ) కింది వాటికి అర్థసందర్భాలు రాయండి.**

1. అయితే నీవిట్లా వచ్చావేమే?
2. వారితో ఎప్పుడు కలిసినా! వెలితిగానే మాట్లాడుతారు.

**ఉ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. 'సాయిలు' ఎవరు?
2. ఎల్లమ్మ లాంటి వ్యక్తుల గురించి రచయిత్రి ఏమన్నది?
3. రచయిత్రికి ఎల్లమ్మతో పరిచయం ఎలా ఏర్పడింది?

## వ్యక్తీకరణ-సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. ఎల్లమ్మ జీవనం కోసం ఏ వృత్తిని అనుసరించింది?
2. రచయిత్రి ఎల్లమ్మలో గుర్తించిన గొప్పలక్షణాలు ఏవి?
3. బాల్యవివాహాల వలన నష్టాలు తెలపండి?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. 'బతుకుగంప' పాఠ్యభాగ సారాంశాన్ని సంక్షిప్తంగా సొంతమాటల్లో రాయండి.
2. పాఠం ఆధారంగా ఎల్లమ్మ వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి?
3. ఎల్లమ్మకు రచయిత్రికి గల అనుబంధం గురించి రాయండి.

**ఇ) కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.**

1. పాఠం ఆధారంగా ఎల్లమ్మ, రచయిత్రిల మధ్య చర్చను సంభాషణ రూపంలో రాయండి.
2. కష్టాలకు కుంగిపోకుండా ధైర్యంగా మెలగాలని తెలియజేస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.

## భాషాంశాలు పదజాలం

**అ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి సొంతవాక్యాలు రాయండి**

1. అతిథికి ఏ వెలితి లేకుండా చూసుకోవాలి.

____________________________________________

2. నిరాశ్రయులకు ఆశ్రయం ఇచ్చి కాపాడడం మన ధర్మం.

____________________________________________

3. రవి పొద్దస్తమానం క్రికెట్ ఆడుతున్నాడు.

____________________________________________

4. తుఫాను బీభత్సం నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే స్తిమితపడుతున్నారు.

______________________________

5. మదర్ థెరిస్సా దిక్కులేని వారెందరికో సేవలు చేసారు.

______________________________

**ఆ) కింది వాక్యాలు చదివి, పర్యాయపదాలను గుర్తించి రాయండి.**

1. సంపాదించిన సొమ్మును కొంత దాచి పెట్టడం మంచిది. ధనం అవసరానికి ఉపయోగపడుతుంది. వృద్ధి చేసిన డబ్బుతో ఎన్ని మంచి పనులైనా చేయవచ్చు.

______________________________

2. ఝషం నీటిలో జీవిస్తుంది. చేప మొప్పలతో గాలి పీల్చుకుంటుంది. మత్స్యం తోకాడించి దిశను మార్చుకుంటుంది.

______________________________

3. దేహం అలసిపోయేలా కష్టిస్తే, ఒళ్ళంతా చెమట పట్టి, శరీర మలినం పోతుంది.

______________________________

4. ప్రభాతవేళ పల్లె మేల్కొంటోంది. ఉదయాన్నే రైతులు పనులకు సిద్ధమయ్యారు. పొద్దుటపూట పొలాలకు వెళ్ళి, పనులు చేయసాగారు.

______________________________

**ఇ) కింది పదాలు చదివి వాటికి సరిపోయే నానార్థాలతో జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. బతుకు | (      ) | అ) కాపురం, కుటుంబం, పుట్టుక |
| 2. సంతానం | (      ) | ఆ) జీవనం, స్థితి, జరుగుబాటు |
| 3. సంసారం | (      ) | ఇ) బిడ్డ, ఒక కల్పవృక్షం, కులం |

**ఈ) కింది ప్రకృతి పదాలకు సరైన వికృతి పదాలను వెతికి రాయండి.**

(బంతి, కస్తి, మొరకు, సుగము, మోము, రాతిరి)

| | | | |
|---|---|---|---|
| 1. ముఖం | : ______________ | 4. మూర్ఖుడు | : ______________ |
| 2. పంక్తి | : ______________ | 5. సుఖము | : ______________ |
| 3. కష్టం | : ______________ | 6. రాత్రి | : ______________ |

**ఉ) కింది జాతీయాలను వివరించి రాయండి**

1. వీధిపాలుచేయు : ______________________________

2. ఊపిరి పీల్చుకొను : ______________________________

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

1. పుణ్యాత్ముడు : ________________ + ________________ (                    )
2. విషయమంతా : ________________ + ________________ (                    )
3. ఇంకెవరికి : ________________ + ________________ (                    )
4. ఉన్నదేదో : ________________ + ________________ (                    )

**ఆ) కింది పదాలు కలిపి, సంధి పేరు రాయండి.**

1. పోదాము + అనుకుంటే = ________________________ (                    )
2. స్నానము + లు = ________________________ (                    )
3. ఏమి + ఐనది = ________________________ (                    )
4. అక్కడ + అక్కడ = ________________________ (                    )
5. జీవితము + అంత = ________________________ (                    )

**ఇ) కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసం పేర్లు రాయండి.**

1. పదిరోజులు = ________________________ (                    )
2. కాళ్ళుసేతులు = ________________________ (                    )
3. తెల్లముఖం = ________________________ (                    )
4. అసాధారణం = ________________________ (                    )
5. చిన్నబిడ్డ = ________________________ (                    )

**అవ్యయీభావ సమాసం**

**కింది సమాసపదాలను, వాటి విగ్రహవాక్యాలను పరిశీలించండి.**

అ) యథావిధి — విధి యెట్లో అట్లు

ఆ) ఆబాలగోపాలం — బాలుర నుండి గోపాలుర వరకు

ఇ) అనువర్షం — వర్షముననుసరించి

వీటి అన్నిటి లోను పూర్వపదాలు గమనిస్తే అవి అవ్యయాలు అని గ్రహించవచ్చు.

ఇవి సాధారణంగా.

అను, యథా, ఆ, ప్రతి, స, పరి, అప, సహ, ఉప మొదలైనవి...ఇక్కడ పూర్వపద ప్రాధాన్యం ఉంటుంది. లింగ, వచన, విభక్తులు లేని అవ్యయం పూర్వపదంగా ఉంటుంది. ఈ సమాసంను అవ్యయీభావ సమాసం అంటారు.

**ఈ) కింది పదాలకు విగ్రహవాక్యాలను రాయండి.**

**అనుకూలం, యథాశక్తి, ప్రతిమాసం, ప్రతిదినం, ఉపవనం, సకుటుంబం**

**అలంకారం–ఛేకానుప్రాసాలంకారం.**

1. నేడు ధర ధర బాగా పెరిగిపోతుంది.
2. ఈ ఏడు ఏడు రోజులపాటు వ్రతం చేయాలి.

పై వాక్యాలను పరిశీలిస్తే ధర, ధర, ఏడు, ఏడు అనే సమాన అక్షరాలు ఉన్న పదాలు పక్కపక్కనే అర్థభేదంతో ఉన్నాయి కనుక ఇది ఛేకానుప్రాసాలంకారం.

లక్షణం: సమాన వర్ణాలు గల పదాలు అర్థభేదం కలిగి వెంటవెంటనే (అవ్యవధానంగా) ప్రయోగించబడితే దానిని ఛేకానుప్రాసాలంకారం అంటారు.

**ఉ) కింది వాక్యాల్లో ఉన్న అలంకారాన్ని గుర్తించి, లక్షణం రాయండి.**

1. గోరువంక వంక చూసెను.
2. సమస్యల సాధనకు నారి నారి బిగించింది.
3. సుందర దరహాస రుచులు.
4. రాజా! నీది శుభంకర కరం.
5. ఆ కొమ్మ కొమ్మవంచి పూలు కోసెను.

**ఊ) కింది కర్తరి వాక్యాలను, కర్మణి వాక్యాలుగా మార్చి రాయండి.**

1. ఎల్లమ్మ పండ్లను అమ్మింది. ________________
2. ఆమె బిడ్డను చదివించింది. ________________
3. వైద్యుడు వైద్యం చేశాడు. ________________
4. అతడు కండక్టర్ ఉద్యోగం చేశాడు. ________________
5. వారు పిల్లవాడిని కాపాడారు. ________________

**ఋ) కింది వాక్యాలు చదివి, అవి ఏరకమైన వాక్యాలో రాయండి.**

1. అతడికి మంచి జరుగుగాక! ________________
2. ఇటువైపు నీవు రావద్దు. ________________
3. ఎల్లమ్మ ఆ పని చేయగలదు. ________________
4. మీరు మా ఇంటికి రావచ్చు. ________________
5. పది రోజులుగా నీవు ఎక్కడికి వెళ్ళావు? ________________
6. అందరూ బడికి వెళ్ళండి. ________________

## ప్రాజెక్టుపని

తమ కుటుంబ ఆర్థికస్థితులను అధిగమించి, జీవిత లక్ష్యాన్ని సాధించిన వారి విషయాలను సేకరించి తరగతిగదిలో ప్రదర్శించండి. ఉదా: చిలకమర్తి లక్ష్మీనరసింహం, డా.బి.ఆర్.అంబేద్కర్, అబ్దుల్ కలాం.

**పాఠ్యాంత పద్యం:**

ఉ. "ఆఁకలి బాధచేఁ జెమట లాఱని గాసికి నోర్చి ప్రాణముల్
పోకడపెట్టు వారి శ్రమమున్ రుధిరమ్ము గడించి యాయఁగా
చేకుఱినట్టి యర్థము లివీ యని రోయకటుల్ భుజింతు వ
న్నా! కృపమాలి ఘోరకలుషాక్తతఁ దుచ్ఛములైన భోగముల్" – **పింగళి కాటూరి కవులు**

భావం: అన్నా! ఆకలితో ఒళ్ళంతా చెమటలు పడుతూ నీరసంగా ఉన్న పేదవాడు తన రక్తాన్ని, చెమటను చిందించి ప్రాణాలను పణంగా పెట్టి సృష్టించిన సంపదలివి. శ్రమదోపిడితో మలిన పడిన ఆ సంపదలను అసహ్యించుకోకుండా విలాసంగా అనుభవిస్తున్నావు. ఇది నీ వంటి వాడికి తగదు. స్వార్థం విడిచిపెట్టి సమాజం పట్ల బాధ్యతగా ప్రవర్తించు అని నందుడుకి బుద్ధుడు చెప్పాడు.

సూక్తి: **'కింద పడ్డానని ఆగిపోకు తిరిగి ప్రయత్నం చేస్తే విజయం నీదే'.** – **అబ్దుల్ కలాం**

**విశేషాంశాలు–తెలుగు మాండలికాలు:**

నేటి తెలుగులో భాషామండలాలు వృత్తిపద పరిశోధన ఆధారంగా తెలుగునాడును నాలుగు భాషా మండలాలుగా విభజించవచ్చని తేలింది. అవి: (1) పూర్వమండలం (కళింగదేశం: శ్రీకాకుళం విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలు), (2) దక్షిణమండలం (రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు), (3) ఉత్తరమండలం (తెలంగాణా మహబూబ్‌నగర్, ఖమ్మం, జిల్లాల్లో కోస్తా రాయలసీమలను ఆనుకొన్న ఆయా భాషామండలాల్లో కలుస్తాయి.), (4) మధ్యమండలం (ఉభయ గోదావరులు, గుంటూరు, కృష్ణాజిల్లాలు). ఈకింది వృత్తిపదాల్లో ఆయా మండలాలకే పరిమితమైన విలక్షణ శబ్దాలు సూచించబడ్డాయి.

| 1. పూర్వమండలం (కళింగ) | 2. దక్షిణమండలం (రాయలసీమ) | 3. ఉత్తరమండలం (తెలంగాణా) | 4. మధ్యమండలం (ఇతర కోస్తాలు) |
|---|---|---|---|
| నాగలి | నాగేలి/మడక | నాగలి | నాగలి |
| పేడ | పేడ | పెండ | పేడ |
| ఉండ | గాను/గాలు | గారె/గిర్ర/పయ్యా | చక్రం |
| ఆనపకాయ | సొరకాయ | అనిగెంకాయ | సొరకాయ |
| గోంగూర | గోగాకు | పుండికూర/పుంటికూర | గోంగూర |
| గాబు | కలుపు | కలుపు | కలుపు |
| రాట్నం | రాటం/రాట్లం | రాట్నం | రాట్నం/రాటం |
| పునాది | బునాది/గునాది/గునాదరం | బునాది/పునాది | పునాది |
| చూరు | చూరు/చుంచు | చూరు | చూరు |
| గొలుసు | చిలుకు | గొండ్లెం | గొండ్లెం |
| గునపం | గడ్డిపార/గడారు | గడ్డపార | గడ్డపలుగు/గడ్డపార |

**సూచన:** మీ ప్రాంతంలో పలికే కొన్ని పదాలను ఇతర ప్రాంతాలలో ఎలా పిలుస్తారో తెలుసుకొని రాయండి.

**మీకు తెలుసా?**

ప్రతి ఏటా నవంబర్ 16వ తేదీని 'అంతర్జాతీయ సహనదినోత్సవం'గా జరుపుకుంటాం.

## ఫకీరు వేషాలు

ఫకీర్లు ముస్లింలలో ఒక తెగ. ముస్లిములు, ముస్లిమేతరులు వీరిని ఆదరిస్తారు. అల్లాను సంస్మరిస్తూ, అల్లాకెనాం జపిస్తూ ఇంటింటికీ తిరుగుతూ, శుభం జరగాలని అందరిని ఆశీర్వదిస్తారు. కళారూపాలన్నీ ప్రథమంలో ఒకందుకు ఏర్పడినా తరువాత అవి వివిధ రీతులుగా ఎలా పరిణామం చెందాయో ఈ ఫకీరు వేషాలు కూడా అంతే. వీరు ఒక పెద్ద కంజీరాను చేతిలో ధరించి, తలకు పెద్ద తలపాగా చుట్టి, మెడలో ఫకీరు పూసలు ధరించి, పొడుగాటి లాల్చీలను ధరించి, మొలకు గళ్ళ లుంగీని ధరిస్తారు. ప్రతి జట్టుకూ ఇద్దరు ముగ్గురు వుంటారు. మధ్యలో నటుడు పాట పాడుతూ వుంటే మిగిలిన ఇద్దరూ అల్లాకేనాం అంటూ వంత పలుకుతారు.



ఉదాహరణకు: అల్లా కేనాం
పాడిపంటల్ సల్లగుండాలి
తల్లిపిల్లల్ సల్లగుండాలి
తల్లీకొడుకుల్ సల్లగుండాలి

అంటూ పాడుతూ, మధ్య మధ్య రక్తి కొరకు కర్రతో చేయబడ్డ ఒక రకమైన కిర్రు శబ్దంవచ్చే దానిని చేతిలో ధరించి శబ్దం చేస్తారు. హైస్కూలు కాలేజీ విద్యార్థులు వారివారి వార్షికోత్సవాలలో ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తూ వుంటారు. ఈ కళా రూపాన్ని ఆంధ్రప్రజా నాట్యమండలి వారు విశేషంగా ప్రచారం చేశారు.

## దేవరగట్టు 'బన్ని' ఉత్సవం

కర్నూలు జిల్లా, హొళగుంద మండలం, దేవరగట్టు 'బన్నీ' ఉత్సవానికి ప్రసిద్ధి. త్రేతాయుగంలో మణ్యాద్రి (ఇప్పుడు దేవరగట్టు) అను పేరు గల పవిత్రప్రాంతంలో మునులు నివాసం ఉండేవారు. మణ్యాసురుడు, మల్లాసురుడు అనే రాక్షసులు కూడా అక్కడే ఉంటూ వారి జీవనానికి భంగం కలిగించేవారు. రాక్షసుల బాధలు భరించలేక మునులు పరమేశ్వరుని ఆశ్రయించారు. శివుడు అనుగ్రహించి రాక్షస సంహారానికి పూనుకున్నాడు. అసురులు అహంకారాన్ని తొలగించుకొని పరమేశ్వరుని శివకేశవ బేదం లేకుండా మణి చూడాద్రిపై వెలసి భక్తులను అనుగ్రహించమని కోరగా పార్వతీపరమేశ్వరులు మాతమాళమ్మ, మల్లేశ్వరులుగా కూర్మావతారంలో కొండపై వెలిశారు.

ప్రతి ఏటా దసరా రోజు అక్కడ జరిగే ఉత్సవానికి 'బన్నీ' ఉత్సవమనిపేరు. స్వామివారి కళ్యాణం అనంతరం జరిగే ఉత్సవ విగ్రహ ఊరేగింపు సమయంలో వచ్చే పరిసర గ్రామ ప్రజలు చేతిలో దివిటీలు, కర్రలు పట్టుకొని కొండల్లో డోలు వాయిస్తూ 'డిర్..... గోపరాక్..... బహుపరాక్ ' అనే శబ్దాలు చేస్తూ కొండకు చేరుకొని ఊరేగింపులోని దేవుని విగ్రహాలను చేతిలోని కర్రలతో తాకాలని ప్రయత్నిస్తారు. కాలక్రమేణా అది ఒక సంప్రదాయంగా తరువాత కర్రల సమరంగా మారింది. విగ్రహాలు రక్షాస్థలికి చేరాక ఆ సమయంలో బసవన్న గుడివద్ద ప్రధాన అర్చకులు భవిష్యవాణి వినిపిస్తారు. వసంతోత్సవము నాడు గొరవయ్యలు ఇనుప గొలుసును తెంచడం విశేషం. దసరా వచ్చిందంటే తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు నుండి కూడా లక్షలాదిమంది భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

# 3 శతక మాధుర్యం

– వివిధ శతక కవులు

J7U2Y6

## చదవండి – ఆలోచించి చెప్పండి



ఆ.వె. జ్ఞానుల చరితము వీనుల
నానుచు సత్పురుష గోష్ఠి ననఘంబనుచున్
బూనుము; ధర్మపథంబును
దానెరిగినయంత; మరువదగదు కుమారా!

– పక్కి అప్పల నరసయ్య

ప్రశ్నలు:

**1. మంచి వారితో స్నేహం వలన ఫలితం ఏమిటి?**

**2. దేనిని మరువకూడదు?**

**3. ఇలాంటి పద్యాలు మనకు వేటిని బోధిస్తాయి?**

### ఉద్దేశం

శతక పద్యాలు జీవన నైపుణ్యాలను ప్రబోధిస్తాయి. ఈ పద్యాల ద్వారా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, లోకజ్ఞానం కలవారిగా తీర్చిదిద్ది, వారిలో నైతిక విలువలు పెంపొందింపజేయడమే ఈ పాఠం ఉద్దేశం

### కవుల పరిచయాలు

1. మారద వెంకయ్య క్రీ.శ.1550–1600 మధ్య కాలానికి చెందిన కవి. వీరు భాస్కరశతకం రచించారు. ఈ శతకం ఉదాహరణ పూర్వకమైన నీతిబోధలతో కొనసాగుతుంది. ఇది తెలుగులో వచ్చిన మొదటి దృష్టాంత శతకం.
2. ధూర్జటి 16వ శతాబ్దానికి చెందినవారు. శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజకవులలో ధూర్జటి ఒకరు. శ్రీకాళహస్తీశ్వర శతకం, శ్రీకాళహస్తి మాహాత్మ్యం రచించారు.
3. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 17వ శతాబ్దానికి చెందిన కవి. కడప జిల్లావాసి. కాలజ్ఞానం, కాళికాంబసప్తశతి, సిద్ధగురుబోధ, వీరకాళికాంబ శతకం వంటి రచనలు చేశారు.
4. వేమన క్రీ.శ 1652–1730 మధ్యకాలానికి చెందిన కవి అని పరిశోధకుల అభిప్రాయం. ఈయన శ్రీ సత్యసాయి జిల్లా కటారుపల్లిలో సిద్ధి పొందారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటంతో ఆటవెలది ఛందంలో పద్యాలను రచించారు.
5. 6 ఏనుగు లక్ష్మణకవి క్రీ.శ.1720–1780. కాకినాడ జిల్లా పెద్దాడ గ్రామవాసి. భర్తృహరి సంస్కృతంలో రాసిన 'సుభాషిత త్రిశతి'ని సుభాషిత రత్నావళి పేరుతో తెలుగులోకి అనువదించారు. వీరు రామేశ్వరమాహాత్మ్యం, విశ్వామిత్ర చరిత్ర, గంగామాహాత్మ్యం, రామవిలాసం వంటి రచనలు చేశారు.

7. శ్రీమతి దార్ల సుందరీమణి : 19వ శతాబ్ది కవయిత్రి. పల్నాడు జిల్లాలోని చర్లగుడిపాడులో జన్మించారు. 1833లో భావలింగ శతకం రచించారు.
8. త్రిపురనేని రామస్వామి చౌదరి : క్రీ.శ 1887–1943. కృష్ణాజిల్లా అంగలూరులో ఒక రైతు కుటుంబంలో జన్మించారు. కుప్పుస్వామి శతకం, సూతపురాణం, ఖూని, రాణా ప్రతాప్ వంటి రచనలు చేశారు.
9. షేక్ మహమ్మద్ హుస్సేన్ : 20వ శతాబ్దానికి చెందిన కవి. ఏలూరు జిల్లా దొరసానిపాడు గ్రామంలో జన్మించారు. హరిహరనాథ శతకం వంటి రచనలు చేశారు.
10. గాదేపల్లి సీతారామ మూర్తి : క్రీ.శ 1935–2018. బాపట్ల జిల్లా అద్దంకి నివాసి. ఈయన 20వ శతాబ్దానికి చెందినవారు. వేంకటాద్రీశ్వర శతకం, అశ్వత్థామ, సుందరోత్పల రామాయణం వంటి రచనలు చేశారు.
11. తాళ్లపాక పెద్ద తిరుమలాచార్యులు క్రీస్తుశకం 1460–1548 మధ్య కాలానికి చెందిన కవి. పదకవితా పితామహుడైన తాళ్లపాక అన్నమాచార్యుని రెండవ కుమారుడు. సుదర్శన రగడ, వేంకటేశ శతకము, వేంకటేశ్వర వచనాలు, ఆధ్యాత్మ సంకీర్తనలు వంటి రచనలు చేశారు.

## ప్రక్రియ–శతకం

నూరు పద్యాల రచనను శతకం అంటారు. శతకాలలో నూరు నుండి నూట ఎనిమిది పద్యాలు ఉంటాయి. శతకానికి మకుటం ప్రధానంగా ఉంటుంది. మకుటం అంటే కిరీటం. ఇది శతకపద్యాలలో ప్రతిపద్యం చివర ఉంటుంది. ఇది పదంగా గాని, అర్ధపాదంగా గాని, పాదంగా గాని, పాదద్వయంగా గాని ఉండవచ్చు. శతకపద్యాలు ముక్తకాలు. అంటే ఏ పద్యానికదే స్వతంత్ర భావంతో ఉంటుంది.

1. చ. పలుచని నీచమానవుఁడు పాటిఁ దలంపక నిష్ఠురోక్తులం
❉ బలుకుచునుండుఁగాని మతిభాసురుఁడైన గుణ ప్రపూర్ణుఁ డ
ప్పలుకులఁ బల్కఁబోవఁడు నిబద్ధిగ నెట్లన వెల్తికుండ దాఁ
దొలఁకుచు నుండుఁగాని మఱి దొల్కునె నిండుఘటంబు భాస్కరా!

– మారద వెంకయ్య



2. శా. లేవో గానలఁ గందమూల ఫలముల్, లేవో గుహల్తోయముల్
❉ లేవో యేఱులఁ బల్లవాస్తరణముల్ లేవో సదాయాత్మలో
లేవో నీవు విరక్తుల న్మనుప జాలింబొంది భూపాలురన్
సేవల్సేయఁగఁబోదు రేలొకో జనుల్ శ్రీకాళహస్తీశ్వరా!

– ధూర్జటి



3. ఆ.వె. సత్య శీల ధర్మ సంస్థాపనార్థమై
యుగయుగాల పుట్టువొందు చంద్రు
సహజ శక్తి గలుగు సంస్కారు లిలలోన
కాళికాంబ! హంస! కాళికాంబ

– పోతులూరి వీరబ్రహ్మం



4.ఆ.వె. భూమిలోనబుట్టు భూసారమెల్లను.
తనువులోన బుట్టు తత్త్వమెల్ల.
శ్రమములోన బుట్టు సర్వంబు తానేను.
విశ్వదాభిరామ వినురవేమ! **– వేమన**



5. శా. నీతి ప్రౌఢ విహారులైన నిపుణుల్ నిందింపనీ మెచ్చనీ,
❊ ఖ్యాతిం జెందిన సంపదల్ నిలువనీ గాఢంబుగా సాగనీ
ఘాతం బప్పుడ పొందనీ నియతమైఁ గానీ యుగాంతంబునన్
నీతి శ్లాఘ్యపదంబు దప్పరు గదా నిత్యంబు ధీరోత్తముల్.
**– ఏనుగు లక్ష్మణకవి**



6. చ. తెలివి యొకింత లేనియెడఁ దృప్తుఁడనై కరిభంగి సర్వమున్
❊ దెలిసితి నంచు గర్వితమతిన్ విహరించితిఁ దొల్లియిప్పు డు
జ్జ్వలమతు లైన పండితుల సన్నిధి నించుక బోధశాలినై
తెలియనివాఁడనై మెలఁగితిం గతమయ్యె నితాంత గర్వమున్
**– ఏనుగు లక్ష్మణకవి**

7. ఆ వె.భావమెట్టులుండె బలుకట్టిదై యుండు
పలుకు లెట్టి వైనఁబనులు నట్లు
పనులననుసరించి ఫలములు చేకూరు
పాపభయ విభంగ భావలింగ!
**– దార్ల సుందరీమణి**




8.ఆ వె. మాతృభాషయందు మాతృదేశమునందు
మమత లేనివాఁడు మనుజుఁడగునె?
తగని మమతయుండు మృగ పక్షిజాతికిఁ
గూడఁ దెలియలేవె కుప్పుసామి!
**– త్రిపురనేని రామస్వామి చౌదరి**

9.కం. ఇది కాదదియను, నదికా
దిది యను, నిది యదియు వదలి యెదియో పదరున్
వదలని ముదములఁ బొదలగ
నదవదపడి చెదరి యెదఁద హరిహరనాథా!
**– షేక్ మహమ్మద్ హుస్సేన్**

10.మ. ధరలో నెంతటి దుర్జనుండయిన సత్సంగప్రభావంబుచే
❊ బరసేవా పరతంత్ర చిత్తుడగు భాస్వంతుండు తోడై నిరం
తర మిత్రత్వ మొసంగుటంగద సముద్రం బిచ్చునవ్వారిగా
పరమ స్వాదుజలంబులన్ భుజగ తల్పా! వేంకటాద్రీశ్వరా!
**– గాదేపల్లి సీతారామమూర్తి**



11.సీ. శౌర్యంబు గలుగుట జన్మసాఫల్యంబు,
శాంత మాత్మవివేక సాధనంబు
మానంబు దనకును మహనీయ సంపద,
సిగ్గుతో బ్రతుకు సంజీవనంబు
సవినయవచనంబు సర్వవశ్యకరంబు,
వెలయునాచారంబు పెనుబలంబు
దానంబు సేయుట తన కది దాఁచుట,
సజ్జనసంగతి సౌఖ్యమొసఁగు

తే.గీ గాన బుధులీ గుణంబులు మానకెపుడు,
తగిలి మిమ్ముభజింతురు తలఁచితలఁచి
కలితలక్ష్మీశ! సర్వజగన్నివేశ!
విమల రవికోటిసంకాశ! వేంకటేశ!

– తాళ్ళపాక పెద్దతిరుమలాచార్యులు

**భావాలు :**

1. భాస్కరా! వెలితికుండ తొణుకుతుంది, గాని నీరు నిండుగా ఉన్న కుండ తొణకదు. ఆలాగే మంచి గుణం లేని నీచుడు న్యాయాన్ని గురించి ఆలోచించకుండా కఠినమైన మాటలు మాట్లాడుతాడు. సద్గుణాలతో ఉండే మంచివాడు అలాంటి పరుషమైన మాటలను మాట్లాడడు.
2. శ్రీకాళహస్తీశ్వరా! ఈ అడవులలో తినుటకు కందమూల ఫలములు (పండ్లు) లేవా అన్నచో ఉన్నాయి. నివసించడానికి గుహలు ఉన్నాయి. త్రాగడానికి నదులలో నీరు ఉంది. మనసులో నీవున్నావు అనే ధైర్యం కలవారందరిని నీవు రక్షించి మోక్షాన్ని ఇస్తున్నావు. కానీ మానవులు దాసులై రాజులను సేవించడానికి ఎందుకు తరలిపోతున్నారు?
3. ఓ కాళికాంబా! సత్యం(నిజం), శీలం(స్వభావం), ధర్మం అనే వాటిని తిరిగి స్థాపించటానికి ప్రతియుగంలోనూ వివేకం, విచక్షణ, సహజశక్తులు కలిగిన సంస్కారులు భూమిపై పుడుతూనే ఉంటారు.
4. ఓ వేమా! భూమి యొక్క శక్తి అంతా భూమి నుంచే పుడుతుంది. అలాగే జ్ఞానం శరీరం(ఆత్మ)నుండే జనిస్తుంది. కష్టపడితేనే అన్నీ సాధ్యం అవుతాయి. ప్రపంచం నుంచే చరాచర జీవకోటి అంతా జన్మిస్తుంది. శ్రమ నుంచే సర్వసంపదలు వస్తాయి. శ్రమయే అన్నిటికీ మూలం.
5. నీతివేత్తలు పొగిడినా, నిందించినా, సంపదలు నిలిచినా, పోయినా మరణం అప్పుడే వచ్చినా లేదా ఎప్పుడో ప్రళయ కాలంలో కలిగినా ధీరులు న్యాయ మార్గాన్ని దాటి ఒక్క అడుగైనా ముందుకు వేయరు.
6. ఇంతకు పూర్వం నాకు తెలివి కొద్దిగా కూడా లేనప్పుడు. అన్నీ తెలిసిన వాడిలా గర్వంతో మదించిన ఏనుగులా ప్రవర్తించాను. కానీ ఇపుడు పండితుల వల్ల కొన్ని విషయాలు తెలుసు కొనడంతో నాకు తెలిసినది తక్కువే అని అసలు ఏమి తెలియదు అని గ్రహించి ఇపుడు గర్వం వదిలి వినయంతో ప్రవర్తిస్తున్నాను.
7. పాపాలను, భయాన్ని తొలగించేవాడా! ఓ భావలింగా! మనసులో ఆలోచనలను బట్టి మాట్లాడే మాటలు వుంటాయి. మాటలెలా ఉంటాయో చేసే పనులు అలాగే ఉంటాయి. పనులను బట్టి ఫలితం ఉంటుంది.

8. ఓ కుప్పుసామీ! తన భాషపై, తన దేశంపై ప్రేమలేనివాడు మనిషేనా?జంతువులకు, పక్షులకు కూడా తమ జాతిపై అభిమానం ఉంటుంది కదా! (మనిషి తన భాషపైనా, దేశముపైనా ఖచ్చితంగా మమకారం కలిగి ఉండాలని భావం)

9. ప్రభో! మనసుకు ఏకాగ్రత కుదరడం లేదు. ఇది కాదు అది కావాలి అనిపిస్తుంది. కానీ అంతలోనే అది వద్దు ఇది కావాలి అనిపిస్తుంది. మరలా ఇది కాదు, అది కాదు ఇంకేదో కావాలనిపిస్తుంది. ఎన్నో అనుమానాలతో ఏదీ నిర్ణయించుకోలేక మనసు కలతపడుతుంది నాకు ఉన్నదానితో తృప్తి పడే వివేకం కలిగించు.

10. ఓ వేంకటాద్రీశ్వరా !ఈ లోకంలో ఎంత చెడ్డవాడైనా సజ్జనుల సాంగత్యంతో ఇతరులకు సేవ చేయాలని ఆలోచిస్తాడు. అది ఎలాగంటే సూర్యుని యొక్క నిరంతర స్నేహం వల్ల సముద్రం మనకు మబ్బుల ద్వారా తీయని జలాలను అందిస్తుంది కదా!

11. అంతట వ్యాపించినవాడా! లక్ష్మీదేవిని కలిగినవాడా! శ్రేష్ఠమైన కాంతితో ప్రకాశించేవాడా! ఓ వేంకటేశా! పరాక్రమం, శక్తి కలిగి ఉండటం వల్ల జన్మకు ప్రయోజనం చేకూరినట్లే. శాంతమును కలిగి ఉంటే తనలో తాను మంచి చెడులను విచారించుకోవచ్చు. తనపై తాను గౌరవాన్ని కలిగి ఉండడం జీవితంలో గొప్ప సంపద వంటిది. లజ్జను కలిగి జీవించడం సంజీవనం వంటిది. వినయంతో కూడినమాట అందరిని ఆప్తులను చేస్తుంది. ఆచారాన్ని పాటించడం గొప్ప బలాన్ని ఇస్తుంది. తనకున్నదాన్ని త్యాగం చేయడం దాచుకున్న సంపదతో సమానమైనది. మంచి వారితో కలిసి మాట్లాడడం నిజమైన సుఖం. విద్యావంతులు ఈ గుణాలను వదిలి పెట్టరు. ఎల్లప్పుడూ భగవంతుని భక్తితో సేవిస్తూ ఉంటారు.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి, రాయండి.**

1. పాఠంలోని పద్యాలను రాగ, భావయుక్తంగా పాడండి.
2. పాఠంలో మీకు నచ్చిన పద్యాలు ఏవి? అవి ఎందుకు నచ్చాయో చెప్పండి?
3. మంచి గుణాలు కలవాడు ఎలా మాట్లాడుతాడు?
4. వేటిపై మమతను కలిగి ఉండాలి?

**ఆ) కింది పద్యాన్ని చదవండి. పద్య భావం రాయండి.**

తే.గీ సద్గురువు చేయునుపదేశ సారములను
యెంత యజ్ఞానమైనను నిట్టె పోవు
మంచి వైద్యుడిచ్చెడి చిన్ని మాత్ర చేత
దారుణం బగు రోగంబు తలఁగునట్లు — **చిలకమర్తి లక్ష్మీనరసింహం**

భావం:- ______________________________

______________________________

**ఇ) కింది గద్యం చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.**



మగధ దేశమునం దరిదుర్గ మనుపట్టణము కలదు. అందు మహావిభవసంపన్నుఁడయి శుభదత్తుఁ డనువైశ్యుఁడు గలఁడు. ఆతఁడు సంతానము లేనివాఁడు కాఁబట్టి తనధన మారామ తటాకాది ప్రతిష్ఠల వెచ్చించుచు నాపట్టణములో నొక దేవళము జీర్ణమై యుండఁగా జూచి కారువులను రావించి తగిన వేతనములు నియమించి దానిఁ గట్ట నియోగించెను. వారు దానిఁ గట్టుచుండఁగా నొకనాఁడు చేవదూలము ఱంపముచేఁ గోయించుచు నది సుకరముగా వ్రీల్చుటకు. సూత్రధారుఁడక్కడక్కడ మ్రాని మేకులు దిగఁగొట్టి మధ్యాహ్న భోజనార్థము కూలి వాండ్రును దానును బోయెను. అప్పు డాపరిసరతరువులందుఁ దిరుగుచున్న కోఁతులు దేవాలయము దాపునకు వచ్చి ప్రాకారములు ప్రాఁకుచుఁ బ్రాఁతమహీరుహములమీఁదికిఁ గుప్పించి దాఁటుచు బండ్లిగిలించుచు వెక్కిరించుచు గిలకిలా రావములు గావించుచు నొండొంటితోఁ బోరుచు ఫలములు భక్షించుచు, మధువు లానుచు స్వాభావిక చపల భావముతోఁదిరుగుచుండెను. ఒక ముసలిమల్లు కాలచోదితమై చేవదూలము దాసి యెక్కి దానినెఱియలోఁ దనముష్కము వ్రేలం గూర్చుండి యందు బిగియఁ గొట్టిన కొయ్య మేకు రెండు చేతులతోఁ జిక్కఁబట్టి బలిమితో నూడఁబెఱికి యానెఱియలో వ్రేలుముష్కము చదియుటఁ జేసి ఱోలుచుఁ గాలధర్మము నొందెను. కాఁబట్టి జోలిమాలినపనికిఁ బోరాదు.

– చిన్నయసూరి (మిత్ర భేదము)

ప్రశ్నలు:

1. శుభదత్తుడికి ఉన్న కొరత ఏమిటి?
2. ముసలి కోతి ఏం చేసింది?
3. ఈ పేరాలోని నీతి ఏమిటి?
4. పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

**ఈ) కింది వాటికి అర్థసందర్భాలు రాయండి.**

1. పనుల ననుసరించి ఫలములు చేకూరు.
2. మాతృభాష యందు మాతృదేశమునందు మమత లేనివాడు మనుజుఁడగునే.

**ఉ) కింది ప్రశ్నలకు ఏక వాక్య సమాధానాలు రాయండి.**

1. ముక్తకం అంటే ఏమిటి?
2. కవి హరిహరనాథుని ఏమి ఇమ్మని కోరాడు?
3. సజ్జనసాంగత్యం ఏం చేస్తుంది?

## వ్యక్తీకరణ–సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సంస్కారుల గొప్పదనం ఏమిటి?

2. సత్ఫలితాలు పొందాలంటే ఏం చేయాలి?

3. ధీరోత్తముల లక్షణాలు ఏవి?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాలలో జవాబులు రాయండి.**

1. విద్యావంతులు ఎటువంటి గుణాలను కలిగి ఉంటారు?
2. వ్యక్తుల నిత్యజీవితంలో నైతికవిలువల అవసరాన్ని తెలపండి.
3. పాఠం ఆధారంగా పది నీతివాక్యాలు రాయండి.

**ఇ) కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా జవాబులు రాయండి.**

1. మీ పాఠశాలలో నిర్వహించే పద్యాల పోటీలో విద్యార్థులందరూ పాల్గొనాలని కోరుతూ ఒక ప్రకటన రాయండి.
2. పాఠంలో మీకు నచ్చిన ఏదైనా పద్య భావానికి తగిన నీతికథ / గేయం / కవిత రాయండి.

## భాషాంశాలు పదజాలం

**అ) కింది వాక్యాలలో ఎరుపు రంగు ఉన్న పదాలకు అర్థాలు రాయండి.**

1. మంచి చెప్పినా దృప్తుడు వినడు. __________________
2. పండితుని ఖ్యాతి ప్రపంచమంతటా విస్తరిస్తుంది. __________________
3. విష్ణువు తల్పం ఆదిశేషుడు. __________________
4. కానలలో క్రూరమృగాలు ఉంటాయి. __________________
5. పగటికి రాజు భాస్వంతుడు. __________________

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలు రాయండి.**

1. పండితుడు = __________________, __________________
2. భుజగం = __________________, __________________
3. కరి = __________________, __________________
4. పక్షి = __________________, __________________
5. హరి = __________________, __________________

**ఇ) కింది పదాలకు నానార్థాలు రాయండి.**

1. ధర = __________________, __________________
2. శ్రీ = __________________, __________________
3. వారి = __________________, __________________
4. పదము = __________________, __________________

5. మిత్రుడు = ______________________, __________________

**ఈ) కింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు రాయండి.**

1. భాస్కరుడు : ______________________
2. భుజగము : ______________________
3. ఈశ్వరుడు : ______________________
4. హస్తి : ______________________

**ఉ) కింది ప్రకృతి వికృతులను జతపరచండి.**

| ప్రకృతి | | వికృతి |
|---|---|---|
| 1. చంద్రుడు | (   ) | అ. సామి |
| 2. నిత్యము | (   ) | ఆ. చందురుడు |
| 3. స్వామి | (   ) | ఇ. అంచ |
| 4. హంస | (   ) | ఈ. దమ్మము |
| 5. ధర్మము | (   ) | ఉ. నిచ్చలు |

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

1. నిష్ఠురోక్తులు : ____________ + ____________ (          )
2. వేంకటేశ : ____________ + ____________ (          )
3. అవ్వారి : ____________ + ____________ (          )
4. మనుజుడగునే : ____________ + ____________ (          )
5. ధీరోత్తముడు : ____________ + ____________ (          )

**ఆ) కింది పదాలను కలిపి, సంధి పేరు రాయండి.**

1. కాళికా + అంబ : ______________________
2. ఆ + పలుకులు : ______________________
3. దానంబు + చేయుట : ______________________
4. ఏల + ఒకో : ______________________

**అనునాసిక సంధి:**

**కింది పదాలను గమనించండి.**

వాక్ + మయము = వాఙ్మయము
రాట్ + మహేంద్రవరం = రాణ్మహేంద్రవరం
జగత్ + నాథుడు = జగన్నాథుడు
అప్ + మయము = అమ్మయము

పై వాటిలో మొదటి పదాల చివర క,చ,ట,త,ప లు (వర్గప్రథమాక్షరాలు) ఉన్నాయి. రెండవ పదం మొదట 'న' గాని 'మ' గాని ఉన్నాయి. అలా ఉన్నపుడు సంధి జరిగి ఆయా వర్గ అనునాసికాక్షరాలు ఆదేశంగా వస్తాయి. దానిని అనునాసిక సంధి అంటారు.

**ఇ) కింది పదాలను కలిపి రాయండి.**

జగత్ + నివేశ ______________
దిక్ + మండలము ______________
రాట్ + మణి ______________

**ఈ) కింది సమాస పదాలకు విగ్రహవాక్యం రాసి, సమాసం పేరు రాయండి.**

1. శౌర్యలక్ష్మి : ______________________________ (                    )
2. ప్రతిదినము : ______________________________ (                    )
3. బ్రతుకుదెరువు : ______________________________ (                    )
4. సజ్జనసంగతి : ______________________________ (                    )
5. గురుతరబాధ్యత: ______________________________ (                    )

**అలంకారములు**

**వృత్త్యనుప్రాసాలంకారం**

వివరణ: ఒకటి గానీ అంతకంటే ఎక్కువ గానీ హల్లులు పలుమార్లు వాక్యంలో గానీ పద్యపాదాలలో గానీ వచ్చి శబ్ద చమత్కారం కలిగిస్తే దానిని వృత్త్యనుప్రాసాలంకారం అంటారు.
ఉదా: భేరికా దాండదడాండదాండ నినదంబులజాండము నిండ
పై పద్యాన్ని గమనించినపుడు 'డ' అనే హల్లు పలుమార్లు ఆవృత్తి కావటం వలన ఇది వృత్త్యనుప్రాసాలంకారం అవుతుంది.

**ఉ) కింది పద్యపాదం/వాక్యాలలోని అలంకారాలను గుర్తించండి.**

1. అక్షరజ్ఞానం లేని నిరక్షరకుక్షి ఈక్షితిలో ప్రత్యక్షముగా కష్టముల పాలగును.
2. ఇదికాదదియనునదికా
   దిదియను నిది నదియు వదిలి యెదియో వదరన్
   వదలని ముదములఁ బొదలగ
   నదవదపడి చెదరి యెడఁద హరిహరనాథా
3. లక్ష భక్ష్యములు భక్షించే లక్ష్మయ్యకు ఒక భక్ష్యము లక్ష్యమా?

**దృష్టాంతాలంకారము:**

**కింది వాక్యమును పరిశీలించండి.**

పెరుగును యెంత చిలికినా వెన్ననే ఇస్తుంది. అలాగే మంచివారిని యెంత బాధించినా మంచే చేస్తారు.

ఇందులో మంచివారిని పెరుగుతో పోల్చారు. ఇక్కడ రెండు వాక్యముల యందు వేరువేరు ధర్మాలు చెప్పబడ్డాయి. ఇలా ఉపమాన ఉపమేయాల యొక్క వేరువేరు ధర్మాలను బింబప్రతిబింబ భావంతో చెప్తే అది దృష్టాంతాలంకారము.

**కొన్ని దృష్టాంతాలంకార ఉదాహరణలను గుర్తించి రాయండి.**

## ఛందస్సు

**కింది ఉదాహరణ ద్వారా తేటగీతి పద్య లక్షణాలను తెలుసుకుందాం.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| | సూర్య | ఇంద్ర | ఇంద్ర | సూర్య | సూర్య |
| | గల | సల | సల | గల | న |
| | UI | IIUI | IIUI | UI | I I I |
| ఉదా: | సద్గు | రువుచేయు | నుపదేశ | సార | ములను |

**ఋ) తేటగీతి పద్య లక్షణాలు**

1. తేటగీతి ఉపజాతికి చెందిన పద్యం.
2. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
3. ప్రతిపాదంలో వరుసగా ఒక సూర్య గణం, రెండు ఇంద్రగణాలు, రెండు సూర్య గణాలు ఉంటాయి.
4. ప్రతి పాదంలో నాలుగవ గణంలోని మొదటి అక్షరానికి యతి చెల్లుతుంది.
5. యతిలేని చోట ప్రాసయతి చెల్లుతుంది.
6. ప్రాసనియమము లేదు.

ౠ) పాఠంలో ఐదు, ఆరు, పది పద్యాల పాదాలకు గురులఘువులు గుర్తించి గణవిభజన చేసి లక్షణాలు రాయండి.

## ప్రాజెక్టుపని

ఈ పాఠంలోని శతకకవుల కవి కాలాదుల పట్టికను తయారుచేసి ప్రదర్శించండి.

పాఠాంత పద్యం :

చ. అరిగెడు కాల మెవ్వరికి నాపగ శక్యముగాదు ముందుగా
నరిగిన కాలమున్ మరల నందుట సాధ్యముగాదు దైవమే
కరణి విధించునో యటులె కర్మము సాగు నటంచు పెద్దలం
దురు పురుష ప్రయత్నమున దోడ్పడు దైవమటంద్రు కొందరున్. – గెడ్డాపు సత్యం

భావం: "కదిలిపోతున్న కాలాన్ని ఆపడం ఎవరి తరం కాదు. అలాగే ముందు వెళ్లిపోయిన కాలాన్ని మళ్లీ అందుకోవడం ఎప్పటికీ సాధ్యం కాదు. దేవుడు ఎలా జరగాలని నిర్ణయిస్తే అలాగే జరుగుతుందని పెద్దలంటారు. మానవ ప్రయత్నం ద్వారా తోడ్పాటు అందించడమే దైవత్వమని అంటారు" అని కవి కాలం విలువను తెలియజెప్పారు. కాలాన్ని అనుసరించి జరిగే పరిణామాలను, వాటిని మనుషులు స్వీకరించే విధానాల్లో ఉండే వైవిధ్యాన్ని వెల్లడించారు.

సూక్తి : సత్యానికి, సన్మార్గానికి మించిన మతం లేదు. – గాంధీ

మీకు తెలుసా?

## జముకుల కథ



జముకుల కథ ఉత్తరాంధ్రకు చెందిన అతి ప్రాచీనమైన జానపద కళారూపం. జముక బుడబుడక్కమని మ్రోగే మనోహరమైన వాయిద్యం. స్థూపాకారంగా ఉండే ఒక పాత్రకు ఒకవైపు చర్మంతో మూసి లోపల తీగను అమరుస్తారు. తీగ కదలికల నుంచి వెలువడే ధ్వని గమ్మత్తుగా ఉంటుంది. శ్రీకాకుళం జిల్లా సోంపేట, పలాస, మందస మండలాలలో దీనిని బోనెల పాట, బుడబుక్కల పాట అని కూడా అంటారు. ఈ జముకుల కథలో వీర, కరుణ, శృంగార రసాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఈనాటికీ ఈ కళ ఉత్తరాంధ్రలో సజీవంగానే ఉంది. ప్రధానంగా వీరు ఎల్లమ్మ కథ ఆధారంగా గల కథలను ప్రచారం చేస్తూ ఉంటారు. కేవలం జానపదులే గాక సుబ్బారావు పాణిగ్రాహి వంటి ఆధునికులు కూడా జముకుల పాట ద్వారా ప్రజలలో చైతన్యాన్ని నింపడానికి ప్రయత్నించారు.

## గంగమ్మ జాతర



రాయలసీమలో ప్రతిగ్రామంలో కనిపించే గ్రామ దేవత గంగమ్మ. తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. తిరుపతిలో వారం రోజుల పాటు ఈ గంగ జాతరను ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. "కూతురు పెళ్లి, కుప్పనూర్పుడు, గంగ జాతర అన్నీ ఒక్కసారి వచ్చినట్టుంది" అనే సామెత తిరుపతి నెల్లూరు ప్రాంతాలలో ఎక్కువగా వినిపిస్తుంటుంది. అంటే ఈ మూడు కార్యాల్లో ఒక్క క్షణం కూడా తీరిక ఉండదు అని అర్థం. ఆడపిల్లలను వేధించే ఒక దుర్మార్గుణ్ణి సంహరించి గంగమ్మ దేవతగా వెలిసిందని ఇక్కడి వారి నమ్మకం. అందుకే ఇక్కడి ప్రజలు గంగమ్మను తమ ఇంటి ఆడపడుచుగా గౌరవించుకుంటారు. వారం రోజుల పాటు భక్తులు వివిధ రకాల వేషధారణలను ధరించడం ఈ జాతర ప్రత్యేకత. తలపై వేయికళ్ల దుత్తలు (అనేక కన్నాలు పెట్టిన చిన్న కుండ) పెట్టుకుని, శరీరానికి వేపాకును వస్త్రాలుగా ధరించి అడుగడుగునా పొర్లు దండాలు పెడుతూ, చిత్ర విచిత్ర వేషధారణలతో, డప్పుల దరువులతో, పంబజోళ్ల వాయిద్యాలతో, పరవశంతో ఊగిపోయే నాటు నృత్యాల నడుమ తిరుపతి గంగమ్మ వారిని దర్శించుకుంటారు. కులమత ప్రాంతాలకు అతీతంగా తిరుపతిలో జరిగే గంగమ్మ జాతర తెలుగు జానపద సంస్కృతికి నిలువుటద్దం.

# 4 ఉపన్యాస కళ

– వాసిరెడ్డి సీతాదేవి

## చదవండి – ఆలోచించి చెప్పండి

మనసులోని భావాన్ని ఎదుటి వారికి తెలియజేసే మాధ్యమం మాట. మాటకున్న శక్తి గొప్పది. అది అవతలివారిని మెప్పించగలదు, నొప్పించగలదు, ఆపదలనుండి తప్పించగలదు. మాట మరీ మితంగా ఉండకూడదు. అలా అని అమితంగా కూడా ఉండకూడదు. ఆచితూచి మాట్లాడటం అంత సులభమేమీ కాదు. అందుకే మాట్లాడబోయే ముందర మాటలను మనసుతో జల్లించి బయటకు ప్రకటించమని చెప్తోంది ఋగ్వేదం. మధురమైన మాటతో ఎవరినైనా ఆకట్టుకోవచ్చు అంటాడు ప్రఖ్యాత కవి తులసీదాసు. భౌతికమైన అలంకరణలు ముఖ్యం కాదని వాగ్భూషణమే అసలైన అలంకారం అంటాడు భర్తృహరి. చక్కగా మాట్లాడటం ఒక సద్గుణం. ఇది హనుమంతుడి దగ్గర పుష్కలంగా ఉందని రాముడే స్వయంగా చెప్పాడు. చక్కగా మాట్లాడటం వల్ల స్నేహితులు పెరుగుతారు. బంధువులు ఆనందిస్తారు. అనుబంధాలు పెరుగుతాయి. అనురాగం పెంపొందుతుంది. కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. మాట్లాడటం ఒక కళ. శబ్దశక్తి తెలిసినవానికే ఈ కళ కరతలామలకమవుతుంది. మాటకారి అందరికీ ఆప్తుడు అవుతాడు.

– పత్రిక వార్త



### ప్రశ్నలు

1. మాట మహిమ ఎటువంటిది?
2. ఆచితూచి మాట్లాడటం అంటే ఏమిటి?
3. చక్కగా మాట్లాడటం వల్ల కలిగే లాభాలు ఏమిటి?

## ఉద్దేశం

విద్యార్థి వ్యక్తిత్వనిర్మాణంలో మాట చాలా ముఖ్యమైనది. ఉపన్యాసం అందులో ఒక భాగం. సభాకంపం నుండి బయటపడి మాటతీరు మెరుగుపరచుకోవటం అవసరం. విద్యార్థులలో సంభాషణానైపుణ్యం పెంచడం ద్వారా నలుగురిలో చక్కగా మాట్లాడేలా చేయడం ఈ పాఠం ఉద్దేశం.

## రచయిత్రి పరిచయం



జననం: 15.12.1933
మరణం: 13.04.2007

వాసిరెడ్డి సీతాదేవి గుంటూరు జిల్లా చేబ్రోలులో జన్మించారు. నాగపూర్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ చేశారు. 39 నవలలు, 100 కి పైగా కథలు రాశారు. ఈమె రాసిన మట్టి మనిషి 14 భాషలలోకి అనువాదం చేశారు. ఈమె నవలలు దూరదర్శన్ లో సీరియల్ గా, సినిమాలుగా వచ్చాయి. జవహర్ బాలభవన్ డైరక్టర్‌గా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం ఐదుసార్లు అందుకున్నారు. ఈమెను ఆంధ్ర పెర్ల్‌బక్ అని పిలుస్తారు. ప్రస్తుత పాఠ్యభాగం సీతాదేవి గారి సాహిత్య, సామాజిక వ్యాస సంపుటి నుండి గ్రహించబడింది.

## ప్రక్రియ–వ్యాసం

ఏదైనా ఒక విషయాన్ని తీసుకొని దాని పూర్వాపరాలను చర్చిస్తూ, విశ్లేషణాత్మకంగా విస్తరించి రాయడమే వ్యాసం. దీనిలో ఉపోద్ఘాతం, విషయ విస్తరణ, ముగింపు వంటివి ప్రధానాంగాలుగా ఉంటాయి. వ్యాసంలోని విషయాన్ని బట్టి చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక, శాస్త్ర, వైజ్ఞానిక, సాహిత్య, తాత్విక, ఆధ్యాత్మిక మొదలైన విభాగాలుగా విభజించవచ్చు.

"మాట్లాడే శక్తిని మాత్రం వదిలేసి, నా సర్వస్వం దోచుకున్నా నేను విచారించను. నా వాక్కుతో నేను పోగొట్టుకున్నవన్నీ తిరిగి సంపాదించుకోగలను" ఆక్స్‌ఫర్డ్ శబ్దకోశకారుడు 'డేనియల్ వెబ్‌స్టర్ అన్నాడు.

"నువ్వు నాకో బలమైన శబ్దం ఇవ్వు. నేను ఈ ప్రపంచాన్నే ఊపేస్తాను" ప్రపంచ ప్రఖ్యాత రచయిత జోసఫ్ కాన్‌రాడే' అన్నాడు..

పై వాక్యాలు, శబ్ద శక్తి, అంటే మానవుడి వాక్కు ఎంత మహత్తరమైనదో తెలియజేస్తున్నాయి. ఈ వాక్కే మానవుడ్ని ఇతర ప్రాణులనుండి వేరుజేసి, సృష్టిలో మహోత్కృష్ట స్థానాన్ని ప్రసాదించింది. ఈ వాక్కు సూత్రాన్ని పట్టుకొని మనిషి, మనీషి అయి, రాతియుగం నుంచి ఈనాటి అణుయుగంలోకి ప్రవేశించాడు.

వ్రాయడం నేర్చిన ప్రతివ్యక్తి, రచయిత కాలేనట్టుగానే మాట్లాడడం నేర్చిన ప్రతివ్యక్తి వక్త కాలేడు అంటారు.

వక్తృత్వ ప్రావీణ్యత ఒక వరమా?.. అది కొందరికే పుట్టుకతో లభ్యమయ్యే కళా? ప్రయత్నిస్తే వచ్చేది కాదా?

ఇది పుట్టుకతో వచ్చే కళ ఎలా అవుతుంది? కృషి, సాధన, పట్టుదల వుంటే ఎవరైనా వక్తలు కాగలరు. అయితే వాళ్లందరూ మహావక్తలు కాలేరు. ఏ రంగంలోనైనా జగత్ప్రసిద్ధులు కొందరు వుంటారు. వారిలో ఆ ప్రతిభ అమోఘం. అయితే కృషిచేసి ప్రశంసలను అందుకొన్న అబ్రహాం లింకన్, రూజ్వెల్ట్, చర్చిల్ మొదలైన వారు ఎంతో కృషిచేసి, ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంటూ మహావక్తలుగా తమను తామే తీర్చిదిద్దుకున్నారు. వీరంతా కూడా వేదికలు ఎక్కిన మొదటి రోజుల్లో మాట్లాడటానికి ఇబ్బందిపడిన వారే. ప్రేక్షకుల అపహాస్యానికి గురి అయిన వాళ్లే. అందువల్ల కొందరే వక్తలు కాగలరు అనే భావంతో అసలు ప్రయత్నమే చెయ్యనివారు, ఒకటి రెండు ప్రయత్నాలలో మనసు బాధచెంది.. ఆ ప్రయత్నం విరమించుకున్నవారు పొరపాటు చేశారనే భావించాలి..

"ఆ నిజం చెప్పనా?....ఎలాగోలా జనం ముందు మాట్లాడడం అలవాటు చేసుకున్నాను. ఎన్నోసార్లు జనం ముందు ఇబ్బంది కలిగించే పరిస్థితులకు గురి అయ్యాను. దాంతో పట్టుదల పెరిగింది. గొప్ప వక్తను కావాలని నిర్ణయించుకున్నాను. చాలాశ్రమించాను. మాట్లాడగల శక్తి ప్రతిమానవుడికీ వుంది. ఆ వాక్కును నేను సానబట్టాను. చివరకు అనుకున్నది సాధించాను.

ఈనాడు గొప్పవక్తగా నాకు గుర్తింపు వచ్చింది" అన్నది ఎవరో కాదు- ఉత్తమ వక్తగా ప్రపంచం గుర్తించిన చర్చిల్ అన్న మాటలివి.



చర్చిల్ వక్తగా గుర్తింపు పొందాక కూడా చాలా కాలం వరకు, మాట్లాడవలసిన విషయాన్ని మననం చేసుకునేవాడు. అద్దం ముందు నిలబడి మహాసభలో జనం ముందు నిలబడి మాట్లాడినట్లే తన గదిలో ప్రాక్టీస్ చేసేవాడు. కనుక ఏ పుట్టలో ఏముందో? ఏ బుర్రలో ఏ ప్రతిభ మరుగున పడి వుందో? అందుకే ప్రజాహిత కార్యక్షేత్రంలో పాల్గొనే ప్రతివారూ ఉత్తమ వక్త కావడానికి కృషిచెయ్యాలి. కొందరికి కొద్ది శ్రమతోనే విలక్షణమైన వాగ్విధానం అబ్బుతుంది. వారే మహావక్తలు అవుతారు. కృషి చేసిన ప్రతివక్త ఉపన్యాసం ఇచ్చే ధోరణిని సాధించవచ్చును. ప్రజాహిత రంగంలో విజయం సాధించాలన్నా, ఆ రంగంలో ఉన్నతోన్నతశిఖరాలను అందుకోవాలన్నా వక్త అయివుండాలి.

**అనుకరణ :**

కొందరు మంచి వక్త కావాలనే ఉబలాటంతో గొప్ప వక్తల్ని అనుకరిస్తారు. అందువల్ల ప్రయోజనం? అతడు గొంతెత్తగానే ఎవర్ని అనుకరిస్తున్నాడో ప్రేక్షకులకు తెలిసిపోతుంది. అంతే సభలో కలకలం ప్రారంభం అవుతుంది. చౌకబారు అనుకరణలని నవ్వుకుంటారు. అసలు అసలే నకిలీ నకిలేయే గదా? మనం మనంగా ఉన్నప్పుడే మనకు ప్రత్యేక స్థానం వుంటుంది. అత్యంత నైపుణ్యంతో చేయబడి అచ్చంగా గులాబిపువ్వే అనే భ్రమకలిగించే కాగితం పువ్వులో, గులాబీలో వుండే సుగంధాన్ని నింపగలమా? అందుకే అనుకరణ మంచిది కాదు.

**ఆలోచించండి - చెప్పండి**

1. మనిషికి మనీషికి తేడా ఏమిటి?
2. వాక్కును సానపెట్టడం అంటే ఏమిటి?
3. చర్చిల్‌కు గొప్ప వక్తగా గుర్తింపు ఎలా వచ్చింది?

**సభాకంపం :**

సభలో మాట్లాడడానికి భయపడేవాళ్లు పిరికివాళ్లా? కాదా. ఎందరో గొప్ప వక్తలు మొదటి వేదికను ఎక్కినపుడు సభాకంపానికి గురి అయిన వాళ్లే. అబ్రహాం లింకన్, రూజ్వెల్ట్, చర్చిల్, పిరికివాళ్లా? కాదని వాళ్లు జీవితంలో సాధించిన విజయాలే చెప్తాయి. వేదిక మీద కొత్తగా ప్రసంగించవలసి వచ్చినపుడు నూటికి తొంభయితొమ్మిది మంది ఈ సభాకంపం భరించకతప్పదు. ఇది అతి సామాన్యమైన విషయం.

**వేదిక - కొన్ని పాటించవలసిన రీతులు :**

వేదిక మీద హుందాగా ప్రవర్తించాలి. అనేక వేల కళ్లు అతణ్ని గమనిస్తుంటాయనే విషయం విస్మరించరాదు. వేదిక మీద ఎబ్బెట్టుగా ప్రవర్తించే వక్త శ్రోతల దృష్టిలో ముందుగానే చులకనైపోతాడు. అతడి వంతు వచ్చినప్పుడు అధ్యక్షుడు అతడి పేరు చెప్పగానే సభాసదుల్లో గుసగుసలు, చిరునవ్వులు కన్పిస్తాయి. అది చూసి వక్త కొంచెం తికమక పడక తప్పదు.

అది అంతటితో ఆగుతుందని చెప్పలేము. వక్త అపహాస్యం పాలయి, ఉపన్యాసం ముగించకుండానే కూర్చోవలసిన పరిస్థితి ఏర్పడవచ్చును. అందుకే వేదిక మీద ఆశీనులైన వక్తలు సమయ సందర్భాలకు అనుకూలంగా దుస్తులు ధరించాలి. శ్రోతలు చూడగానే వక్త వ్యక్తిత్వాన్ని అంచనా కట్టడానికి ప్రయత్నిస్తారు. శ్రోతల గౌరవాన్ని ముందుగానే పోగొట్టుకున్న వక్త చెప్పేది ఎవరూ వినరు. సాదా దుస్తుల్లో హుందాగా తయారు కావచ్చు.

**వేదిక మీద వక్త ప్రవర్తన - కొన్ని సలహాలు- పరిహరించదగిన కొన్ని లోపాలు :**

కుర్చీలో కూర్చుని వెనక్కు, ముందుకు వూగడం, కుర్చీలో కదలడం, గురి పెట్టినట్లు ఒక వైపు ప్రేక్షకుల్నే చూస్తూ కూర్చోవడం లేక నేలచూపులు చూడడం లేదా పైకప్పుకేసి చూడడం, దిక్కులు చూడడం. నోరంతా తెరిచేసి ఆవలించడం (ఆవలింత వస్తే ఏం చెయ్యాలి అంటారా? చేతిరుమాలో, చెయ్యో అడ్డుపెట్టుకుని, ప్రేక్షకుల దృష్టిలో పడకుండా ఆవలింతను దాచవచ్చును) వక్త ప్రేక్షకుల్లో కూర్చుని వున్న తన సన్నిహితులను చూసి చెయ్యి ఊపడం (అలాచేస్తే ముందువరసలో కూర్చున్న ప్రేక్షకులు గిర్రున తలలు వెనక్కు తిప్పిచూస్తారు. ఆసక్తి మరోవైపుకు తిరుగుతుంది). కుర్చీలో తల వెనక్కు వాల్చి, కాళ్లు ముందుకు చాచి పడక కుర్చీ భంగిమను పెట్టడం. కుర్చీలో నిటారుగా ఊపిరి బిగపట్టినట్లు బిర్రబిగుసుకొని కూర్చోవడం కాలు మీద కాలు వేసుకొని కూర్చోవడం ఇవి సభామర్యాదకు భంగం కలిగించే అంశాలు.

**మైకు, కొన్ని సూచనలు :**

1. మైకు ముందు నిల్చున్నపుడు తిన్నగా, రెండు పాదాలను కొంచెం దూరంగా పెట్టి నిల్చోవాలి. అంటే జండా లేని కర్రలా నిల్చోమని కాదు. లేక కుస్తీపట్టడానికి సిద్ధంగా వున్న వస్తాదులా నిల్చోమని కాదు. రిలాక్సయి నిల్చోవాలి. మైకు ముందు స్టాండును పెట్టడం ప్రధానంగా వక్తకూ, మైకుకూ వుండాల్సిన దూరాన్ని చివరివరకూ మానేజ్ చెయ్యడానికే. రెఫరెన్సు పేపర్సు పెట్టుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది. వక్త ఆ స్టాండును రెండు వైపులా రెండు చేతులతో గట్టిగా పట్టుకొని తన బరువును పూర్తిగా దాని మీద పారేయడానికి కాదు. కొందరు స్టాండును మాట్లాడినంత సేపూ గట్టిగా పట్టుకొని వదలక పోగా దాన్ని కదుపుతూ వుంటారు. అది కదిలినప్పుడల్లా మైకూ కదిలి వింత చప్పుళ్లు చేస్తుంది.




**ప్రసంగ భాగాలు : 1. ప్రారంభం, 2. విషయ ప్రతిపాదన, 3. ఉపసంహారం,**

**1. ప్రారంభం :** తన ఉపన్యాసం ప్రారంభించడానికి లేచివచ్చి మైకు దగ్గర నిలబడే లోపల శ్రోతలలో కలకలం వున్నట్టయితే వెంటనే ఉపన్యాసం ప్రారంభించకూడదు. కొన్ని క్షణాలు మౌనంగా నిల్చొని ప్రేక్షకులను చూడాలి. వెంటనే కలకలం ఆగిపోతుంది. ప్రేక్షకుల దృష్టి వక్త మీద పడుతుంది. అప్పుడు ప్రసన్న వదనంతో ఓ చిరునవ్వు ప్రేక్షకుల మీదకు విసిరి తన ఉపన్యాసం ప్రారంభించాలి.

అధ్యక్షుడిని సంబోధించేటప్పుడు తలతిప్పి అతడి వైపుచూడాలి. వేదిక మీద వున్న అందర్నీ పేరుపేరునా సంబోధించడం అనవసరం. సంబోధించినా ప్రతివ్యక్తినీ తలతిప్పి చూడక్కర్లేదు. ప్రేక్షకుల్ని సంబోధించే ముందు ఓ క్షణం మౌనం వహించాలి. ప్రేక్షకుల్ని ఆకట్టుకునే చిట్కాల్లో ఇది అన్నిటికంటే మంచి చిట్కా. ఒక ప్రధానమైన అంశం నుంచి మరో అంశంలోకి వెళ్లబోయే ముందు ఓ క్షణం ఆగడం మంచిది. వేదిక మీది నుంచి ఎవర్నీ అతిగా పొగడకూడదు. అతిశయోక్తులు అపహాస్యానికి, దారితీస్తాయి.



ప్రారంభంలో చాలా మంది ఇంతమంది పెద్దల ముందు మాట్లాడే అర్హత నాకు వున్నదని నేను భావించడం లేదు. అయినా కార్యకర్తల మాట కాదనలేకపోయాను. నాకు ఉపన్యాసం ఇవ్వడం చేతకాదు. నేను కవినికాను. (ఆ సంగతి మాకు తెలుసు) కళాకారుడిని అంతకంటే కాదు (అది కూడా తెలుసు) ఈ వేదిక మీద ఇంత మంది పెద్దల మధ్య మాట్లాడే అర్హత వుందని నేను అనుకోవడం లేదు. (ఇప్పుడు వున్నదని ఎవరన్నారు? అంటూ ప్రారంభిస్తారు. శ్రోతలు కూడా కొన్ని మాటలు వక్త మీదకు విసురుతారు. ఆరంభంలోనే హంసపాదు.....

**2. విషయ ప్రతిపాదన :** విషయ ప్రతిపాదన సూటిగా వుండాలి. వాచకం స్పష్టంగా వుండాలి. స్వరంలో ఆరోహణ, అవరోహణలుండాలి. గీతగీచినట్టు ఒక మాటను ఒరుసుకొని మరొకమాట దొర్లుతూ వుంటే ప్రేక్షకులు వీనులకు ఇంపుగా వుండదు. స్వరస్థాయిని కూడా సభనుబట్టి నిర్ణయించుకొనాలి. మధ్యమస్థాయి ఉత్తమమైనది. విషయం క్లిష్టమైనది అయి ప్రేక్షకుల కుతూహలాన్ని ఆకర్షించలేకపోతే మధ్యలో చమత్కారాలు వదలాలి. పెద్దల సూక్తుల్ని చెప్పాలి. ఉదహరించిన సూక్తి లేక కవితా చరణం ఎవరిదో వక్తకు తెలిసివుండాలి. ఒక పేరుకు మరొక పేరు చెబితే రసాభాస అయే ప్రమాదం వుంది. కొందరి ఉపన్యాసంలో నేను – నా అంటూ స్వోత్కర్ష ఎక్కువ ఉంటుంది. తనగురించి తనే చెప్పుకుంటూ వుంటే ప్రేక్షకుల్లో చాలా మంది ముసిముసిగా నవ్వుకుంటారు. అలాగే వేదిక మీద నున్న ఏ వ్యక్తి గురించైనా అనవసరంగా మాట్లాడడం వల్ల, అతిగా పొగడడం వల్ల కూడా ఇలాంటి ప్రమాదమే ఉంటుంది. మాట్లాడ వలసిన విషయాన్ని సేకరించిన తర్వాత ముఖ్యాంశాలను క్రమబద్ధంగా చెప్పాలి. ఒక అంశం నుంచి మరో అంశాన్ని ఎత్తుకునేముందు రెండు మూడు క్షణాలు ఆగి ప్రేక్షకుల్ని చూడాలి. ఇలా చెయ్యడంవల్ల ప్రేక్షకుల ఆసక్తి తగ్గకుండా వుండడమే కాక పెరుగుతుంది కూడా! వక్త మాట్లాడుతున్నపుడు ప్రశంసాపూర్వకంగా చప్పట్లు వస్తే, ఆ ప్రశంసతో తనకు సంబంధం లేనట్లుగా ఆపకుండా మాట్లాడడం మంచిది కాదు. ఆగి – చప్పట్లు ఆగాకే, ప్రేక్షకుల ప్రశంసను, కృతజ్ఞతా పూర్వకంగా చిరునవ్వుతో కొద్దిగా తలపంకించి హుందాగా స్వీకరించాలి. ఆ తర్వాత మళ్లీ వెంటనే ప్రసంగం ప్రారంభించాలి. తనకు ముందు మాట్లాడిన వారి ఉపన్యాసంలోని కొన్ని అభిప్రాయాలను ఖండించవలసి వచ్చినపుడు జాగ్రత్తగా ఖండించాలి. అది చాలా అవసరం అనుకుంటేనే! అంతేగాని ఆ వక్తమీద ఈ వక్తకు ఏదో అక్కసు వుందనీ, ఇది ఇలా వెళ్లగక్కుతున్నాడని శ్రోతలు భావించేలా చెయ్యకూడదు. ఎందుకంటే ముందు మాట్లాడిన వక్త అభిమానులు శ్రోతల్లో వుండవచ్చును. అందువల్ల సభ రసాభాస అయే అవకాశం వుంది.

**3. ఉపసంహారం :** వక్త మాట్లాడుతున్నపుడు శ్రోతలు చప్పట్లు కొడ్తారు. అవి ప్రశంసా పూర్వకంగా వస్తున్న చప్పట్లో లేక 'ఇక చాల్లే కూర్చో' అని హెచ్చరించే చప్పట్లో తెలుసుకోవాలి. అలా కాకుండా శ్రోతల ప్రతిస్పందనతో సంబంధం లేకుండా మైకు వదలని వారిని శ్రోతలే చివరకు మొరటుగా ప్రవర్తించి కూర్చునేలా చేస్తారు. అప్పుడు మనసు చిన్నబుచ్చుకొని, ముఖం చింతాక్రాంతం చేసుకొని, నీరసంగా కుర్చీలో కూలబడే కంటే ముందుగానే శ్రోతల ప్రతిస్పందనకు అనుకూలంగా, ఉపన్యాసం ముగించడం. మంచిదని తెలుసుకుంటాడు అనుభవం గల వక్త. కొందరు వక్తలు మాట్లాడుతూ ఉంటే అనేకసార్లు వారి ఉపన్యాసం ముగిసిందనే అపోహ శ్రోతలకు కలుగుతుంది. మళ్లీ వెంటనే మరో అంశాన్ని అందుకొనడమో లేక అదే అంశాన్ని సాగదీయడమో చేస్తుంటారు. శ్రోతలు అసహనంగా కూర్చొంటారు. కొందరు మైకు దొరికితే చాలు వదలలేరు. వారిని మైకాసురులనీ, మైకోమానియా గాళ్లనీ, వారు ఉపన్యాసం యివ్వడానికి లేస్తున్నపుడే ప్రేక్షకుల్లో నుంచి మాటలు విన్పిస్తాయి. తెలివైన వక్త శ్రోతల ఆసక్తిస్థాయి పడిపోకముందే తన ఉపన్యాసం ముగిస్తాడు. ఉదాహరణలు క్లుప్తంగా ఉండాలి. అతిశయోక్తులు వీలయినంతవరకు లేకుండా.. చూసుకోవడమే తెలివైనపని.

**ఊతపదాలు :** కొందరికి కొన్ని ఊతపదాలు తరచుగా పడుతుంటాయి. ఆ విషయంలో వక్త జాగ్రత్తపడాలి. ఉదాహరణకు 'అన్నమాట' అనే పదాన్ని చాలామంది ముఖ్యంగా స్త్రీలు తమ ఉపన్యాసాల్లో ఊతపదంగా వాడతారు. "నన్నేమో ఈ సభకు కార్యదర్శి, పిలవడానికి వచ్చాడన్నమాట. అప్పుడు నేను వేరే పనుల వత్తిడివలన వెంటనే ఒప్పుకోలేదన్నమాట" అంటూ ప్రారంభిస్తారు. రెండు నిమిషాలు శ్రోతలు భరిస్తారు. ఆ తరువాత వాక్యం ముగియబోయేటపుడు 'అన్నమాట' అంటూ శ్రోతలు కూడా ఊతం ఇస్తారు. దాంతో నవ్వులు – ఏకాగ్రత చెదిరిపోవడం – మధ్యలోనే ఉపన్యాసం ముగించడం జరుగుతుంది. మరికొన్ని ఊతపదాలు 'ఇన్నింటికీ నేను చెప్పదల్చుకునేదేమంటే' 'అంచేత' – 'అసలు విషయం' లాంటి ఊతపదాల అలవాటును అదుపులో పెట్టుకోవాలి.

**భాష :** ప్రసంగం సరళ వ్యావహారిక భాషలో ఉండాలి. తమ పాండిత్య ప్రకర్ష చూపించడానికి పెద్దపెద్ద పదాలు వేసి శ్రోతల మెప్పును పొందాలనుకుంటారు కొందరు. కొన్ని సభల్లో అలాంటి భాషకు విలువ ఉండవచ్చును. కాని బహిరంగ సభల్లో మాట్లాడేప్పుడు ఎంతటి పండితుడైనా సరళ వ్యావహారిక భాషనే ఉపయోగించాలి. శ్రోతలు మనం చెప్పేవి వినాలని వస్తారు కాని మన నుంచి భాష నేర్చుకోవడానికి సభలకు రారు.

కొన్ని మాటల్ని కొత్తగా వేదికను ఎక్కిన వారు జాగ్రత్తగా పలకాలి. ఉదా : ప్రసంగించడం' అనబోయి 'ప్రసవించడం' అనే ప్రమాదం వుంది. అలాగే 'పరిణామం'– 'పరిమాణం', ఆవిష్కరించడానికి బదులుగా బహిష్కరించడం." మొదలైనవి.

**సమయం:** కొందరు మైకు దొరికితే వదలరు. తనతర్వాత మాట్లాడే వారెందరున్నారనే ఆలోచన కూడా వుండదు. అనర్గళంగా మాట్లాడే శక్తి వుంది కదా అని మొత్తం కేటాయించిన సమయంలో సగం సమయాన్ని తానే వినియోగించుకోకూడదు. గొప్పవక్తలు ఎప్పుడూ 'షార్ట్ అండ్ స్వీట్' గానే మాట్లాడతారు. శ్రోతల ప్రశంసలను పొందుతారు. ఉపసంహారం ప్రతిభావంతంగా చేసిన వక్త శ్రోతల అభిమానాన్ని ఎక్కువగా చూరగొంటాడు. ప్రసంగం ముగించి గిర్రున తిరిగి, గబగబ కుర్చీ దగ్గరకు నడిచి అమ్మయ్య గట్టెక్కాను.అన్నట్లుగా కుర్చీలో కూలబడకూడదు. చిరునవ్వుతో కృతజ్ఞతలు చెప్పి శ్రోతల నుండి "సెలవు తీసుకుంటున్నట్లు వారికేసి ఓ క్షణం చూసి, తన సీటుకు వెళ్లాలి.

**ఇంటికి వెళ్లాక:** ......కొత్తగా వేదిక మీదకు వచ్చిన వక్త మంచి ఉపన్యాసకుడిగా రాణించాలనుకుంటే, ఇంటికి వచ్చిన తర్వాత తనను తాను ప్రశ్నించుకోవాలి.

**1.** నేను వేదిక మీద ఎలా ప్రవర్తించాను?

**2.** బిగిసిపోయి కూర్చున్నానా లేక హాయిగా మామూలుగానే వున్నానా?

**3.** నా గొంతును మైకుకు సరిగా ఎడ్జెస్టు అయేలా చూసుకున్నానా?

**4.** శ్రోతల మధ్య – వక్త మధ్య ఏర్పడవలసిన స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించగలిగానా?

**5.** టైముకు నా ఉపన్యాసాన్ని ముగించగలిగానా? లేక ఇచ్చిన సమయానికి ముందే ముగించానా?

**6.** ఉపన్యాసం ఇవ్వడానికి ఆలోచించుకొన్న అంశాలన్నింటిని నా ఉపన్యాసంలో చెప్పగలిగానా?

**7.** చెప్పాలనుకున్న ముఖ్యమైన విషయాలను చెప్పడం మర్చిపోయాను– ఎందువల్ల?

**8.** శ్రోతలు నేను మాట్లాడుతున్న సమయంలో పక్కన కూర్చున్న వారితో మాట్లాడుతున్నారా?

**9.** నా ఉపన్యాసం ఇచ్చిన సమయానికి ముందే ముగించి 'బ్రతుకుజీవుడా' అన్నట్లు కుర్చీలో కూలబడ్డానా ?

**10.** శ్రోతల అసహనానికి గుర్తై నేను మధ్యలోనే ఉపన్యాసం ముగించానా?

పై ప్రశ్నలకు సమాధానాలు వెదుక్కుంటే వక్తకు తన లోపాలు తెలుస్తాయి. రెండోసారి వేదిక మీద ఆ లోపాలు పునరుక్తి కాకుండా సాధ్యమైనంత వరకు ప్రయత్నించవచ్చును.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) పాఠం ఆధారంగా కింది అంశాలపై మాట్లాడండి.**

1. సాధన చేయడం ద్వారా మంచి వక్తగా మారవచ్చా? చర్చించండి
2. ఊత పదాలు కేవలం వ్యర్థ పదలేనా? వాటి వల్ల వచ్చే లాభనష్టాలను చర్చించండి

**ఆ) కింది ఉపన్యాసాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**



ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ తన పరిశోధనను గురించి వివరించేందుకు ఒక నగరానికి ప్రయాణమయ్యాడు. ఆ రోజున ఆయనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో నీరసంగా ఉన్నాడు. ఈ విషయాన్ని గ్రహించిన డ్రైవర్ చాలా శ్రద్ధాభక్తులతో "అయ్యా! ఇవాళ సభను రద్దు చేయవచ్చు కదా!" అని అడిగాడు.

అందుకు ఐన్‌స్టీన్, "ఎప్పుడో ఒప్పుకున్న కార్యక్రమం ఇది. ఎక్కువమంది ఎదురు చూస్తుంటారు. వాళ్ళను నిరాశపరచడానికి మనసొప్పడం లేదు" అని జవాబిచ్చారు. అయినప్పటికీ వాహనచోదకునికి మనసొప్పలేదు. ఒక ఉపాయాన్ని చెప్పాడు. "అయ్యా! ఒక విషయం చెప్పాలని ఉంది, కోపగించుకోరు కదా! చాలా సంవత్సరాలుగా మీతోపాటువస్తూ, మీ ఉపన్యాసాల నెన్నింటినో విన్నాను. మనం వెళ్తున్నది కొత్త ఊరు. అక్కడున్నవాళ్ళకు మీరెలా వుంటారనే విషయం తెలియదు కదా! మీరు విశ్రాంతి తీసుకోండి. మీకు బదులుగా నేను, మీవలెనే నటిస్తూ ఉపన్యసిస్తాను. ఏమంటారయ్యా?"

ఐన్‌స్టీన్‌కు ఈ ఉపాయం నచ్చింది. ఆయన వాహనచోదకుని టోపీని తలకు పెట్టుకుని ప్రేక్షకుల మధ్య విశ్రాంతిగా కూర్చోగా, వాహనచోదకుడు అత్యంత ఆత్మవిశ్వాసంతో ఉపన్యసించాడు. అతని ఉపన్యాసాన్ని వింటున్న ఐన్‌స్టీన్ అబ్బురపడ్డాడు. సభకు వచ్చిన వారెవ్వరికీ సందేహం తలెత్తలేదు. అయినప్పటికీ, అకస్మాత్తుగా, ఎదురుచూడని విధంగా ఒక ఆచార్యుని

రూపంలో సమస్య ఎదురైంది. ఆ ఆచార్యుడు ఒక క్లిష్టమైన వైజ్ఞానిక విషయాన్ని గురించిన సందేహాన్ని, సుదీర్ఘమైన ప్రశ్నరూపంలో అడిగి, అందుకు తగిన వివరణ ఇవ్వమంటూ అభ్యర్థించాడు. కాసేపు స్తబ్దంగా ఉండిపోయిన వాహనచోదకుడు, కాస్తంత సర్దుకొని "ఇదేమంత పెద్ద విషయం కాదు ఆచార్యా. ఇందుకు సంబంధించిన వివరణను చివరి వరుసలో కూర్చున్న మా వాహనచోదకుడు కూడ చెప్పగలడు"అని అన్నాడు. తన వాహనచోదకుని యొక్క సమయస్ఫూర్తి సామర్థ్యాన్ని చూసి అచ్చెరువొందిన ఐన్‌స్టీన్, మెల్లగా వేదికపైకి చేరుకుని ఆ ప్రశ్నకు తగిన వివరణను ఇచ్చాడు. **– మాసపత్రిక సౌజన్యంతో**

**ప్రశ్నలు**

1. ఐన్‌స్టీన్ ఉపన్యాసం రద్దు చేయకపోవడానికి కారణం ఏమిటి?
2. సమయస్ఫూర్తి అంటే ఏమిటి?
3. ఐన్‌స్టీన్ ఎందుకు ఆశ్చర్యపడ్డాడు?
4. ఉపన్యాసకుడికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి?

**ఇ) కింది గద్యం చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**



మీలో ప్రతివాడున్ను మహోన్నతిని పొంది తీరవలెను. విధేయత, సంసిద్ధత, కార్యదీక్ష – అను ఈ మూడును మీరు కలిగియున్నచో ఇక మీ యభివృద్ధికి ప్రపంచమున ఎవరును అడ్డుపడజాలరు. ఆవేశముచే, తొందరపాటుచే ఏ కార్యమున్ను సాధింపబడదు. పవిత్రత, సహనము, పట్టుదల అను ఈ మూడును కార్యసిద్ధికి, విజయమునకు అత్యావశ్యకములు. అయితే ప్రేమ వానియన్నింటికంటెను ముఖ్యమైనది. అనంతకాలము మీదే, ఇక లేనిపోని తొందర యేల? బలహీనతయే సమస్త ఆపదలకును ఏకైక కారణము. బలహీనులము గనుకనే అసత్యమాడుట, దొంగిలించుట, ఇతరాపరాధములు చేయుట సంభవించుచున్నది. మనకు బలహీనతను కల్పించునదేదియు లేనిచో, ఇక మనకు మరణము లేదు, దుఃఖము లేదు. సత్యము, పవిత్రత, నిస్స్వార్థత – అను ఈ సుగుణములు కలవానిని అణగద్రొక్కగల సామర్థ్యము ముల్లోకములందెవనికిని లేదు. జగత్తంతయు ఎదురు తిరిగి నిలిచినను ఈ సుగుణములు కలవాడు ఒంటరిగా వారినందరిని ఎదిర్చి నిలువగలుగును. లెమ్ము! ధైర్యవంతుడవై, బలవంతుడవై నిలువుము! బాధ్యతనంతను నీ మీదనే పెట్టుకొనుము. మరియు నీ విధికి నీవే కారణభూతుడవని యెరుగుము. నీకు కావలసిన బలమంతయు, సహాయమంతయు నీయందే కలదు. కాబట్టి నీ భవిష్యత్తును నీవే నిర్మించుకొనుము. బలమే జీవనము. బలహీనతయే మరణము. బలమే సుఖము. బలహీనతయే దుఃఖము. అభివృద్ధికరములై లోకోపకారకములైనట్టి గొప్ప భావములనే బాల్య కాలము నుండియు మీ మనంబున ప్రవేశింపజేయండి. **– వివేకానంద సింహనాదము**

**ప్రశ్నలు :**

1. మనం అభివృద్ధి చెందాలంటే ఏం కలిగి ఉండాలి?
2. కార్యసిద్ధికి అవసరమైనవి ఏవి?
3. బాల్యదశ నుండి ఎటువంటి భావములను మనసులో ప్రవేశింపచేయాలి?
4. పై పేరా ఆధారంగా ప్రశ్నను తయారు చేయండి?

**ఈ) కింది వానికి సందర్భసహిత వాక్యాలు రాయండి.**

1. నా వాక్కుతో నేను పోగొట్టుకున్నవన్నీ తిరిగి సంపాదించుకోగలను
2. మాట్లాడగల శక్తి ప్రతిమానవుడికి ఉంది. ఆ వాక్కుకు నేను సాన పట్టాను
3. తెలివైన వక్త శ్రోతల ఆసక్తి స్థాయి పడిపోక ముందే తన ఉపన్యాసం ముగిస్తాడు.

**ఉ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. వక్త వేదికపై ఎలా ప్రవర్తించాలి?
2. తెలివైన వక్త తన ఉపన్యాసాన్ని ఎప్పుడు ముగిస్తాడు?
3. ఉపన్యాసంలో ప్రేక్షకులను ఆకట్టుకునే చిట్కా ఏది?

## వ్యక్తీకరణ-సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో సమాధానాలు రాయండి**

1. సభాకంపం అంటే ఏమిటి? దాన్ని ఎలా పోగొట్టుకోవాలి?
2. వక్త ఎప్పుడు అపహాస్యం పాలవుతాడు?
3. ఉపన్యాసం ఎప్పుడు రసాభాస అవుతుంది?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాలలో జవాబులు రాయండి**

1. ఉపన్యాసంలో భాష ఎలా ఉంటే బాగుంటుంది?
2. మంచి వక్తగా ఎదగాలంటే ఏం చేయాలో పాఠం ఆధారంగా రాయండి.
3. కొత్తగా ఉపన్యాసం చేసిన వ్యక్తి ఇంటికి వచ్చాక తనను తాను ప్రశ్నించుకోవాల్సిన అంశాలేమిటి?

**ఇ) కింది అంశాల గురించి సృజనాత్మకంగా/ ప్రశంసిస్తూ రాయండి**

1. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మిమ్మల్ని ఉపన్యాసం ఇవ్వమని అడిగారు. ఆ ఉపన్యాస ప్రతిని ఎలా సిద్ధం చేస్తారో తెల్పండి.
2. మీ పాఠశాల విద్యార్థికి వక్తృత్వ పోటీలో జిల్లాస్థాయి బహుమతి వచ్చింది. అతనిని అభినందిస్తూ అభినందన పత్రం రాయండి.

## భాషాంశాలు పదజాలం

**అ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి వాటితో వాక్యాలు రాయండి.**

1. కఠిన పదాలకు శబ్దకోశంలో అర్థాలు ఉంటాయి.

______________________________

2. ఎవ్వరినీ అపహాస్యం చేయకూడదు.

______________________________

3. తెలివికి సానపట్టు సాధనాలు పుస్తకాలు.

______________________________

4. సభలో ఆశీనులగువారు సభామర్యాద పాటించాలి.

______________________________

**ఆ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు పర్యాయపదాలు రాయండి**

1. మనీష ఉన్నవాడిని మనీషి అంటారు ______________________________
2. శత్రువుల కుత్తుకలను ఖండించారు ______________________________
3. వక్త మాట్లాడుతున్నప్పుడు శ్రోతలు చప్పట్లు కొడతారు. ______________________________

4. పెద్దలు వేదికపై ఆశీనులైనారు. ______________________________

**ఇ) పాఠం ఆధారంగా కింది జాతీయాలు ఏ సందర్భాల్లో వాడతారో వివరించండి.**

1. సానబట్టు ______________________________
2. ఏ పుట్టలో ఏముందో ______________________________
3. నేల చూపులు చూడటం ______________________________

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

1. ఏడేళ్ళు = __________ + __________ (            )
2. మహోత్కృష్ట = __________ + __________ (            )
3. ఎవరన్నారు = __________ + __________ (            )
4. పొందాలనుకుంటారు = __________ + __________ (            )
5. కదిలినప్పుడు = __________ + __________ (            )

**ఆ) కింది పదాలను కలిపి సంధి పేరు రాయండి.**

1. ఉన్నత + ఉన్నత = ______________ (            )
2. అతి + అంత = ______________ (            )
3. ఉత్తమము + ఐనది = ______________ (            )
4. స్వ + ఉత్కర్ష = ______________ (            )

**ప్రాతాదిసంధి :**

**కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలను పరిశీలించండి.**

1. వసంత కాలంలో క్రొమ్మావి చిగురు తిని కోయిల చక్కగా పాడుతుంది.
2. విద్యార్థుల ముంజేతికి విద్యాదీక్ష కంకణాలు కట్టుకున్నారు.
3. పుస్తకంలో మున్నుడి ఎన్నో విషయాలు తెలియజేసింది.
4. పిల్లలు చెట్లకున్న లేమొగ్గలు కోసుకున్నారు.
5. పనిచేసే వాళ్లు క్రొంజెమటలు చిందిస్తున్నారు.
6. కృష్ణకు మీఁగడ అంటే ఇష్టం.
7. వేసవి ప్రారంభంలో క్రొత్తకుండలు కొన్నాం.

| | |
|---|---|
| క్రొత్త | + మావి |
| ముందు | + చేయి |
| ముందు | + నుడి |
| లేత | + మొగ్గ |
| క్రొత్త | + చెమట |
| మీదు | + కడ |
| క్రొత్త | + కుండలు |

ప్రక్కన ఉన్న ఉదాహరణలలో మొదటి పదంలో మొదటి అచ్చు మీద ఉన్నటువంటి అక్షరాలన్నీ లోపించాయి. మిగిలిన ఆ మొదటి అక్షరం తరువాత పదంతో కలవడం గమనించారు కదూ! దీనికి సూత్రాన్ని చూద్దాం.

సూత్రం: సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చుమీఁదివర్ణంబుల కెల్లలోపంబు బహుళంబుగా నగు.

ప్రాతాదులు: ప్రాత, లేత, క్రొత్త, క్రిందు, పువ్వు, మీదు, కెంపు, చెన్ను మొదలగునవి.

ఈ సూత్రం వల్ల లోపించిన పదాలకు 'నుగాగమ', 'సరళాదేశ' మొదలగు ప్రక్రియలు జరగడం ద్వారా తుదిరూపాలు వస్తాయి.

**ఇ) కింది సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాయండి.**

1. శబ్దశక్తి : ________________
2. కార్యక్షేత్రం : ________________
3. సమయసందర్భాలు : ________________
4. వింతచప్పుడు : ________________
5. సభాకంపం : ________________

**ఈ) కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి**

1. గులాబీపువ్వు : ________________ (            )
2. ప్రజాహితం : ________________ (            )
3. ప్రసన్నవదనం : ________________ (            )
4. కవితాచరణం : ________________ (            )
5. రెండునిమిషాలు : ________________ (            )

**ఉ) కింది వాక్యాలు ఏ రకమైన వాక్యాలో గుర్తించి రాయండి**

1. నేను వేదిక మీద ఎలా ప్రవర్తించాను?
2. అలవాటును అదుపులో పెట్టుకోవాలి.
3. ముందు మాట్లాడిన వక్త అభిమానులు శ్రోతల్లో ఉండవచ్చునేమో.
4. అది ప్రయత్నిస్తే వచ్చేది కాదా?

**ఊ) ఈ పాఠంలో ప్రశ్నార్థక వాక్యాలను గుర్తించి రాయండి**

1. ________________________

2. ________________________

3. ____________________

4. ____________________

## ప్రాజెక్టుపని

**తమ ఉపన్యాసాలతో జాతి ప్రజలను ఉత్తేజితం చేసిన ప్రముఖ వ్యక్తుల వివరాలు సేకరించండి.**

ఉదా: 1. స్వామి వివేకానంద 2. అబ్దుల్ కలాం 3. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 4. సరోజినీ నాయుడు మొదలగు వారు.

### పాఠాంత పద్యం

మ. నిరయంబైన, నిబంధమైన, ధరణీ నిర్మూలనంబైన, దు
ర్మరణం బైనఁ, గులాంతమైన నిజమున్ రానిమ్ము కానిమ్ము పో
హరుఁ డైనన్, హరి యైన, నీరజభవుం డభ్యాగతుం డైన నౌఁ
దిరుగన్ నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య! వే యేటికిన్? – బమ్మెర పోతన

భావం: (గురువైన శుక్రాచార్యా!) బుద్ధిమంతుడా! నరకం వస్తే రానీ, ఎవరైనా చెరసాలలో బంధిస్తే బంధించనీ, రాజ్యం పోతే పోనీ, భయంకరమైన చావు వస్తే రానీ, వంశం అంతరించి పోతే పోనీ, నిజం! ఇందులో ఏది వచ్చినా జరిగినా సరే! అడగడానికి వచ్చినవాడు సాక్షాత్తు ఆ శివుడైనా, విష్ణువైనా, బ్రహ్మదేవుడైనా సరే నేను ఇచ్చిన మాట తప్పను.

సూక్తి : “గొప్ప పనులు చేయటానికి మొదట ఆత్మవిశ్వాసం అవసరం”. – ఐ. జాన్సన్

## మీకు తెలుసా?

ప్రతి ఏటా ఆగస్టు 7వ తేదీని 'ప్రొఫెషనల్ స్పీకర్స్ దినోత్సవం'గా జరుపుకుంటాం.

### పగటివేషాలు



పట్టపగలు వేషాలు వేసుకొని హావభావాలతో, మేళ తాళాలతో పండిత పామరులను ఏక కాలంలో మెప్పించే కళారూపం పగటి వేషాలు. ఆయా పాత్రలలో లీనమైపోయి వారు ధరించిన వేషం ద్వారా సంఘంలో ఉన్న దురాచారాలను, బలహీనతలను చూపటం వీరి వృత్తిలోని ప్రత్యేకత. పురాణ కాలం నుండి పగటి వేషాలు ఉన్నట్లు తెలుస్తోంది. పగటి వేషాలను పూర్వం 'బహురూపాలు' అని పిలిచేవారు. కృష్ణా జిల్లాలోని గడ్డిపాడు పగటి వేషధారులకు కేంద్రం. పగటి వేషాలు వేయడం సులభం కాదు. ఏ పాత్ర వేస్తున్నామో ఆ పాత్ర మనస్తత్వాన్ని, ఉచ్ఛారణను, వేషధారణను, ఒంపులు వయ్యారాలను గమనించి ఆవాహన చేసుకోవాలి. పగటి వేషాలు వెయ్యడానికి చతుర్విధ అభినయాలు ప్రాముఖ్యం వహిస్తున్నాయి. రంగస్థలం పరికరాలు ఏవీ లేకుండా, కృత్రిమ అలంకారాలు లేకుండా ప్రజలను రంజింపజేసే కళారూపం ఇది.

ఈ వేషధారులు ఆంధ్రదేశంలోని అన్ని మాండలిక పదాలపై పట్టు సాధిస్తారు. బేతాళుడు, అర్ధనారీశ్వరి, పార్వతి, పిట్టలదొర, చిట్టిపంతులు మొదలైన వేషాలు ప్రసిద్ధి చెందాయి. పగటి వేషాలను ధరించిన వారిలో పసుమర్తి శేషయ్య, భాగవతుల కుమారస్వామి మొదలైన వారు ప్రసిద్ధులు.

## కసుమూరు ఉరుసు



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తానయ్య దర్గా సర్వమత సమ్మేళనానికి నిదర్శనం. సయ్యద్ కరీం ఉల్లా సా ఖాద్రి సమాధి నెల్లూరు నుండి 35 కిలోమీటర్ల దూరంలోని కసుమూరు గ్రామంలో ఉంది. వీరు కాలేషా మస్తాన్ బాబాగా ప్రసిద్ధి చెందారు. వీరు 18వ శతాబ్దపు గొప్ప ఫకీర్లలో ఒకరు. మస్తానయ్య బాబాను దర్శించుకోవడానికి ఆంధ్రరాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. చాలామంది ప్రజలు తమ అనారోగ్యాలను దూరం చేసుకోవడానికి ఫకీరు సమాధిని సందర్శించి పూజలు చేస్తారు. ఉరుసు (జాతర) ప్రతి సంవత్సరం రబ్బి ఉల్ అవల్ యొక్క పవిత్రమైన కాలం 26వ రోజున ఇక్కడ జరుపుకుంటారు. ఉరుసు సందర్భంగా కసుమూరు దర్గా షరీఫ్‌ను కులమతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శిస్తారు. గత 233 సంవత్సరాల నుండి ఘనంగా గంధమహోత్సవ కార్యక్రమం జరుగుతుంది. అక్కడ ఉన్న మర్రి వృక్షానికి ముడుపులు, ఉయ్యాలలు కడితే కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. దర్గాను దర్శిస్తే సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

## విద్యాసుందరి 'బెంగుళూరు నాగరత్నమ్మ'

– టి. పద్మిని(తెలుగు అనువాదం)

దేవాలయాలు మన జాతి సంస్కృతికి నిలయాలు. తమ ఇష్ట దైవాలను స్త్రీ కళాకారిణులు నాట్యంతో ఆరాధించడం అనేది ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం. వీరు ఆగమాది శాస్త్రానుసారం దేవాలయాల్లో నాట్యాన్ని ప్రదర్శించేవారు. వీరు ఒక వృత్తిపరమైన కళాబృందంగా రూపొందారు. వీరిని 'దేవదాసీలు' అని పిలిచేవారు. వీరంతా విద్యావంతులు. సంగీతంలోనూ, సాహిత్యంలోనూ, నృత్యంలోనూ కఠోరమైన శిక్షణ పొందడం వల్ల వీరు లలితకళలకు, సంప్రదాయాలకు సంరక్షకులయ్యారు.

అటువంటి కళాకారుల కుటుంబంలో పుట్టి, పురుషాధిక్య సమాజంలో స్త్రీల హక్కుల కోసం పోరాడి విజయం సాధించిన విదుషీమణి 'బెంగుళూరు నాగరత్నమ్మ'.




పాండవుల చరిత్రతో సంబంధం ఉందని చెప్పుకునే ప్రాచీన గ్రామం 'హగ్గడే దేవన్నకోట'లో 1878 నవంబర్ 3న నాగరత్నమ్మ జన్మించారు. పుట్టలక్ష్మి, సుబ్బారావులు వీరి తల్లిదండ్రులు. నాగరత్నమ్మ ఏకసంథాగ్రాహి. ఐదవ ఏట నుండి సంగీతం, సంస్కృత కావ్యాలను చదవడం మొదలుపెట్టారు. బిడారం కృష్ణప్ప దగ్గర నాగరత్నమ్మ సంగీత సాధన చేశారు. అలాగే కన్నడం, తెలుగు, కొంత ఇంగ్లీషు కూడా నేర్చుకున్నారు. తన కూతుర్ని ఆస్థాన నర్తకిని చేయడమే పుట్ట లక్ష్మి ధ్యేయం. కాని ఆ ఎంపిక చాలా కష్టతరమైనది నాట్యాచార్యులు అభ్యర్థి సంగీత పరిజ్ఞానాన్ని, వారి భాషాప్రావీణ్యాలను, వారి రూపురేఖలను, నడవడికను అన్నిటిని పరిశీలించేవారు. ఆశువుగా పద్యాలల్లి అప్పటికప్పుడు అభినయించి చూపమనేవారు. వీటన్నిటినీ తట్టుకోవడానికి కావ్య పురాణాలు బాగా తెలిసి ఉండాలి. ఇవన్నీ పుట్ట లక్ష్మి ప్రణాళికబద్ధంగా నాగరత్నమ్మకు నేర్పించింది. గిరిభట్ట తిమ్మయ్య వీరికి వాచకం, సంస్కృత, వ్యాకరణ అంశాలలో మంచి పునాది వేశారు. మేనమామ వెంకటస్వామి నాగరత్నమ్మకు వయోలిన్ నేర్పారు. త్యాగరాజ శిష్య పరంపరకు చెందిన మునుస్వామప్ప ఆమెకు గాత్రంలో శిక్షణ ఇచ్చారు. వీటితో పాటు నాట్యంలోని అభినయకళను మద్రాసు తిరువేంకటాచారి నేర్పారు. నాగరత్నమ్మ 26 ఏళ్ల వయసుకే 146 పట్టణాల్లో కచేరీలు చేసింది. తమిళ ప్రాంతంలోనే 1235 కచేరీలు చేసింది. వీటితో పాటు సముద్రాలు దాటి విదేశాల్లో కూడా కచేరీలు చేసింది. ఆమె పాట శాస్త్రీయంగా మంచి లయజ్ఞానంతో ఉండేది. మూడుగంటల పాటు ఏకబిగిన పాటలు పాడేది. కళాప్రపంచం ఆమెకు నీరాజనాలు పట్టింది.

"నా మాతృభాష కన్నడ అయినప్పటికీ తెలుగులో కూడా చాలా పుస్తకాలు చదివాను. మద్రాసులో తమిళ పుస్తకాలు చదివాను. అయినా నాకు తెలుగు భాష అంటేనే మక్కువ ఎక్కువ" అని తన తెలుగు భాషాభిమానం గురించి నాగరత్నమ్మ రాసుకుంది. తెలుగులో ఆమె ముద్దుపళని రాసిన 'రాధికా సాంత్వనము' అనే ప్రబంధాన్ని పరిష్కరించి, విపుల పీఠిక రాశారు. తెలుగులో 'మద్యపానం', 'దేవదాసి', 'ప్రబోధ చంద్రోదయం', మొదలైన గ్రంథాలను సంస్కృతంలో 'శ్రీ త్యాగరాజ అష్టోత్తర శతనామావళి', తమిళంలో 'పంచీకరణ భౌతిక వివేక విలక్కం' మొదలైన గ్రంథాలను ఆమె రచించారు. పురాణం సూర్యనారాయణ తీర్థులవారు నాగరత్నమ్మ గారికి **'విద్యా సుందరి'** బిరుదునిచ్చి సత్కరించారు. కవి సార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి **'గానకళావిశారద'** బిరుదుతో గౌరవించారు. ఆనాడు స్త్రీలకు త్యాగరాజస్వామి ఆరాధనలో ప్రవేశం లేదు. అందువల్ల ఆమె ప్రత్యేకంగా ఆరాధన ఉత్సవాలను జరపాలని నిర్ణయించింది. ఇందుకోసం తన స్థిరాస్తులమ్మి అంతా ఆలయానికే ఖర్చు చేసింది. త్యాగరాజ సమాధి చుట్టూ ప్రదక్షిణ చేయడానికి అనువుగా చట్రం కట్టించింది. ఆ ప్రాంతానికి 'త్యాగరాజ ఆశ్రమం' అని పేరు పెట్టింది. భరతనాట్యానికి, కర్ణాటక సంగీతానికి ఎనలేని సేవచేసి అజరామరమైన కీర్తి సాధించిన మహావనిత. త్యాగరాజసేవే శ్వాసగా, ధ్యాసగా జీవిస్తూ నాగరత్నమ్మ 1952 మే 19న ఈ లోకం విడిచి వెళ్లారు. ఎంతోమంది పేద పిల్లల చదువుకు నాగరత్నమ్మ ఇతోధికంగా తోడ్పాటు అందించారు. మరెంతోమంది ఆడపిల్లల వివాహ ఖర్చులు భరించారు. ఏ కారణం కోసం జన్మించారో ఆ కార్యాన్ని పరిపూర్ణం చేసుకొని తన జీవితాన్ని సార్థకం చేసుకున్న ధన్యురాలు **'విద్యా సుందరి బెంగుళూరు నాగరత్నమ్మ'.**

# 5 జలియన్‌వాలా బాగ్
(జల్యనువాలాబాగు)

H2P1N9

– డా. ఉమర్ ఆలీషా

## చదవండి – ఆలోచించి చెప్పండి

ఆ. స్వేచ్ఛకై ఒరిగిన వీరాధివీరుల
చరితలన్ని నీవు చదువవలయు
ఉబుసుపోని కబురు లూరక వాగిన
ఫలిత మేమి కలదు తెలుగుబిడ్డ. – నార్ల చిరంజీవి



ప్రశ్నలు :

1. ఎవరి చరిత్రలను చదవాలి? ఎందుకు?
2. భారతీయులు స్వేచ్ఛ కోసం ఎవరితో పోరాడాల్సి వచ్చింది?
3. నీకు తెలిసిన స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు చెప్పండి.

### ఉద్దేశం

భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అణచివేయడంలో భాగంగా బ్రిటిష్ అధికారి జనరల్ డయ్యర్ వేలాదిమంది భారతీయుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నాడు. ఈ దుర్మార్గపు చర్యను తెలియజేయడం, భారతవీరుల శౌర్య, పరాక్రమాలను చాటి చెప్పడం, తెల్లదొరలు భారతీయుల్ని ఏవిధంగా చిత్రహింసలకు గురిచేశారో తెల్పుతూ, విద్యార్థుల్లో దేశభక్తిని, స్వాతంత్ర్య స్ఫూర్తిని, త్యాగనిరతిని పెంపొందింపజేయడం ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



జననం: 28.02.1885
మరణం: 23.01.1945

కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా) పిఠాపురంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు చాంద్‌బీబి, మొహియ్యుద్దీన్ బాద్షా. వీరు తెలుగులో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించి మహాకవిగా, వక్తగా, అవధానిగా, ఆధ్యాత్మికవేత్తగా, బహుభాషా పండితునిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రసిద్ధి చెందారు. వీరి గురుపీఠం 'జ్ఞానసభ' పేరిట ప్రసిద్ధి చెందింది. మణిమాల, అనసూయాదేవి, చంద్రగుప్త, విషాద సౌందర్యం మొదలైన నాటకాలు రాశారు. ఖండకావ్యములు, బ్రహ్మవిద్యా విలాసం, సూఫీ వేదాంత దర్శనం, మహమద్ రసూల్ వారి చరిత్ర మొదలైన పద్య గ్రంథాలు రచించారు.. ఈశ్వరుడు, మహమ్మద్ వారి చరిత్ర, సాధన పథం మొదలైనవి వీరి గద్యరచనలు. వీరు ఏకాంకికలు, ప్రహసనాలు, నవలలు, కథలసంగ్రహం, అనువాదాలు మొదలైన రచనలు కూడా చేశారు. పండిట్, మౌల్వీ బిరుదులు పొందారు. ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ అమెరికా గౌరవ డాక్టరేట్‌తో వీరిని సత్కరించింది.

**ఈ పాఠ్యాంశం వీరి 'ఖండ కావ్యములు' అనే గ్రంథం నుండి స్వీకరించబడింది.**

## ప్రక్రియ-ఖండకావ్యం

మహాకావ్యాల నుండి రసాత్మకఘట్టాలను లేదా ఒకే కథా వస్తువు కలిగిన స్వతంత్రఘట్టాన్ని తీసుకుని రాసింది **'ఖండకావ్యం'**. చారిత్రక ఘట్టాలను, స్వీయ అనుభవాలను ,సన్నివేశాలను విడిగా గ్రహించి రాసిన కావ్యం కూడా ఖండకావ్యం అవుతుంది. ఇందులో ఆత్మాశ్రయ రీతి ఉంటుంది. వస్తువులోనూ, భావంలోను, శైలిలోను నవ్యత ఉంటుంది.

## నేపథ్యం

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో 'జలియన్‌వాలా బాగ్' దురంతం అత్యంత దురదృష్టకరమైన సంఘటనగా నిలిచింది. పంజాబ్ రాష్ట్రంలో అమృత్‌సర్‌లోని ఒక ఉద్యానవనం జలియన్‌వాలా బాగ్. 1919 ఏప్రిల్ 13న పంజాబీలు జరుపుకునే 'వైశాఖీ' పండుగ వేడుక చూసేందుకు వచ్చిన ప్రజలు జలియన్‌వాలా బాగ్‌లో బహిరంగ సభ జరుగుతుండటంతో అక్కడకు చేరుకున్నారు. తన ఆదేశాలను ధిక్కరించారని బ్రిటిష్ అధికారి జనరల్ డయ్యర్ నిరాయుధులైన ప్రజలపై కాల్పులు జరపాల్సిందిగా తన సైనికులను ఆదేశించాడు. స్త్రీలు, పురుషులు, పిల్లలపై విచక్షణారహితంగా 1650 రౌండ్ల కాల్పులు జరిపారు. ప్రజలు తప్పించుకోగలిగే అవకాశాలు అక్కడ ఏ మాత్రం లేవు. ఈ దుర్ఘటనలో 379మందికి పైగా భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది గాయపడ్డారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఈ ఉదంతం ఒక విషాద దినంగా, చీకటి రోజుగా మిగిలిపోయింది.

1. ఉ. పౌరుల శస్త్రశాస్త్రముల పద్ధతినేరనివారి సాధుసం
సారులఁ బట్టి డయ్యరు పిశాచము జల్యనువాలబాగులో
దూరి వధించెఁ దద్రుధిర దుఃఖసముద్రము భారతీయ హృ
ద్ద్వారము సొచ్చి యగ్నివలె జ్వాలలు వీచుచునున్న దెంతయున్.



2. ఉ. యూరపు దేశ మెక్క డల హూణకిరాటపుళిందు లేడ? యా
✲ ఘోరరణంబునం దరులఁ గూల్చి జయధ్వజ మెత్తినట్టి మా
భారతవీరయోధు లొక పాటె నిరంకుశ శాసనాగ్ని సం
స్కారముచేసినారు; సిత జాతికి నీతియటంచు నున్నదే.

3. ఉ. రౌలటు శాసనంబు సమరంబున గెల్చినదాని కంకుగా
గాలము మీనజాలమున గ్రై యొనరించినరీతి హూణభూ
పాలు రొసంగినారు పరి పంథినృపాలురు నవ్వునట్టు ల
య్యో! లవమైన ప్రేమమగునోయి కృతఘ్నత వేఱయున్నదే.



4. ఉ. యూరపు దేశ మట్టిటుల నూగగ శౌర్యపరాక్రమంబులన్
భారతవీరకోటి రణ పాండితి వైరులఁ జీల్చి రక్తసి
క్తారుణమూర్తులై నిజజయధ్వజముల్ నెలకొల్పినప్పు డీ
దారుణ మెచ్చెఁ దద్రుధిర ధారలు భోరునఁ బొర్లి పారఁగన్.

**ఆలోచించండి – చెప్పండి**

1. జలియన్‌వాలా బాగ్‌లో భారతీయుల్ని పొట్టన పెట్టుకున్నదెవరు?
2. రౌలట్ చట్టం ఎందుకు రూపొందించారు?

5. చం. ప్రళయపయోదముల్ గురియు భంగి ఫరంగి పిరంగిగుండ్ల గుం
✽ డెలదర దేహపంజరము డిల్లఁగ జల్లెడరీతి మార్చినన్
సొలసియు నిస్సురుస్సురని స్రుక్కఁడు చిక్కఁడు వైరిచేతికిన్
బలవదరిప్రభంజనుఁడు భారతవీరుఁడు మాటలేటికిన్.



6. శా. ఆహోరంబున కంగలార్పఁడు, రణవ్యాపారపారాయణుం
డై హర్యక్షమురీతి వైరిగజకుంభానీకముల్ చీల్చి సం
దేహం బందక యాత్మరక్త మొలికించెన్ భారతీసైనికుం
డాహా! ఆంగ్లకిరీటరక్షణ సముద్యద్భక్తిసంయుక్తుఁడై.



7.సీ. ఒకచోట నీహార నికరంపురాలపైఁ
బవళించు రణము రే బవలు సలిపి
ఉన్నచోఁ దిని యున్న యుదకముల్ ద్రావి జీ
వించుఁ బోరును విని ర్జించుచుండు
ఆసవపాన దుర్వ్యసనసంసక్తుఁడై
గతి మాలి వైరివంకలకుఁ జనఁడు
అగ్ని గోళములకు నాహుతియగుఁ గాని,
వెన్నిచ్చి పాఱఁ డే వేళఁ గాని

అట్టిశౌర్యంబు వెచ్చించి ఆవహమున
విజయ మార్జించి వచ్చిన వీరవరులు
భారతీయులు వట్టిసేవకు లటంచుఁ
జెప్ప నోరాడెనే విదేశీయులార ?



8. ఉ. ఈ యఘ మూరకే విడువదీ విపరీతము దారుణంబు; నే
దో యొకనాఁడు చండి యిలు దూరి మహాప్రళయంబులీల రా
జేయును భారతీయునెడ జేసిన పాపఫలంబుమీకు; కా
జేయుధనంబు వడ్డిగ్రసి యించినరీతి; గ్రహింపుడెంతయున్.



9.సీ. బానిసత్వము నుగ్గు పాలఁ బోసిన దోషి
అన్నవస్త్రము లాచి కొన్న ఖలుఁడు
కాటకం బనెడు రక్కసిని దెచ్చినపంద
కక్షలఁ బెంచిన రాక్షసుండు
నిర్బంధ శాసన నిచయమార్చినజాణ
పన్ను వేసిన మహా పాతకుండు
మత్తువస్తువు లమ్మి విత్తముఁ గొనుద్రోహి
కయ్యాలఁ బెంచిన కఠినతముఁడు.

ఆలోచించండి – చెప్పండి

1. బ్రిటిష్‌వాళ్ళు భారతీయుల్ని ఏ విధంగా భావించారు?
2. భారత వీరుడి పరాక్రమం ఎటువంటిది?

తే. కలికిఁ జెలికాఁడు యమునకు వలపుకాఁడు
మోసములకు తావు, విరోధములకు ప్రోవు
దుర్గుణంబులకాణాచి తులువ, బూచి
ఈ చికాకుల నించె మా యించెతేఁడు.



10 సీ. కవటాకులను బోలఁ గల పసిబాలుర
నెండలో నడిపి హింసించినారు
నడచిపోయెడు వారిఁ బడఁద్రోసి, ప్రజలను
బొట్టపైఁ బ్రాఁకించి పొడిచినారు
నిరపరాధుల నెల్ల నిలఁబెట్టి పిఱ్ఱలు
చితుకునట్టులఁ గొట్టి చెనకినారు
శుద్ధాంతకాంతలఁ జొచ్చి, కొప్పులఁ బట్టి
మానభంగము జేసి మరలినారు

వేల ప్రజల తుపాకుల పాలు జేసి
కోసి, ప్రాణార్థములు లాగి వేసినారు
తెలిసి పంజాబు పరువును దీసినారు
కలుషమని జంకఁబోక రాకాసిమూక.



11.చం. జలియనుబాగులో జనులఁ జంపిన రక్తము వర్షపాతముం
బలెఁబ్రవహించె; మొండెములఁ బ్రాణము లుండినవారి యార్తిసం
కలితరవంబు గర్జనము కైవడి మ్రోసె దిగంతభూములన్;
ప్రళయము వచ్చెనో యనుచు పౌరులు పారిరి ప్రాణభీతులై.

ఆలోచించండి – చెప్పండి

1. తెల్లదొరలు భారతీయుల్ని ఏ విధంగా చిత్రహింసలకు గురి చేశారు?
2. కాల్పుల సమయంలో జలియన్‌వాలా బాగ్‌లో పరిస్థితి ఏంటి?

భావాలు:

1. ఆయుధాలను ప్రయోగించడం తెలియని ప్రజలు జలియన్‌వాలా బాగ్‌లో వేడుకకు సమావేశమయ్యారు. ఇదే అదనుగా భావించి బ్రిటిష్ అధికారి డయ్యరనే ఆంగ్లపిశాచం అందులోకి ప్రవేశించాడు. సాధుస్వభావం కలిగిన వేలాదిమంది అమాయకుల్ని తన సైనికులచే కాల్చి చంపించాడు. ఆ రక్తంతో ఉప్పొంగిన దు:ఖ సముద్రం భారతీయ హృదయ ద్వారాల్లోకి ప్రవేశించింది. అది అక్కడివారి హృదయాంతరాల్లో అగ్నివలె మంటల్ని రేపుతోంది.

2. ఆ యూరపు దేశమెక్కడ? వ్యాపారానికై వచ్చి, భారతీయుల్ని వేటాడి వేధిస్తున్న తెల్లదొరలెక్కడ? భయంకరమైన యుద్ధంలో శత్రువులతో పోరాడి విజయం కోసం నెత్తురోడిన మా భారత వీరయోధులెక్కడ? నిరంకుశ శాసనం (రౌలట్ చట్టం) చేసి వారు ఈ దుర్మార్గపు పనికి పూనుకున్నారు. ఈ శ్వేతజాతికి అసలు నీతి అనేది ఉందా?

3. తిరుగుబాట్లను అణచడానికి బ్రిటిష్ వారు 'రౌలట్ చట్టాన్ని' ప్రవేశపెట్టారు. చేపల సమూహాన్ని పట్టే గాలంలా ఆ చట్టాన్ని డయ్యర్ జలియన్‌వాలాబాగ్‌లో ప్రయోగించాడు. దుర్మార్గంగా ఎంతోమంది అమాయకుల ప్రాణాలను తీశాడు. దీనిని చూసి సామంతరాజులు నవ్వుతున్నారు. అయ్యో! ఆంగ్లేయులకు భారతీయులపై కొద్దిగా కూడా ప్రేమ లేదు. ఇంతకన్నా కృతఘ్నత ఇంకేముంటుంది?

4. భారతవీరుల శౌర్యపరాక్రమాలతో యూరపు దేశం ఊగిపోయింది. యుద్ధంలో భారతీయులు తమ యుద్ధనైపుణ్యంతో శత్రువులను చీల్చి చెండాడుతూ వీరోచితంగా పోరాడుతున్నారు. అక్కడివారు రక్తసిక్తులై ఎఱ్ఱని రూపెత్తి పోరాడుతుండగా రక్తధారలు ఉవ్వెత్తున పొంగి పొర్లి ప్రవహిస్తున్నాయి.

5. ప్రళయకాలంలో గర్జించి వర్షించే మేఘాల్లా ఆంగ్లేయులు భారతీయ సమూహంపై తుపాకిగుండ్ల వాన కురిపిస్తున్నారు. శ్వేతజాతి వాడి పిరంగి గుండ్ల శబ్దాలకు అక్కడివారి గుండెలదరిపోతున్నాయి. తుపాకి కాల్పులకు కొన్ని దేహాలు నేలకొరిగాయి. ఇంతటి ఘోరయుద్ధంలో కూడా భారతీయుడు ఎక్కడా అలసిపోలేదు. శత్రువుల చేతికి చిక్కినా దాసోహమనలేదు. శత్రువుపై భారతవీరుడు విజృంభించాడు. అట్టి భారతవీరుని పరాక్రమం గురించి ఏమని చెప్పగలం?

6. ఆహా! భారతీయ సైనికుడు ఆంగ్లకిరీట రక్షణకై భక్తి, శ్రద్ధలతో సాగాడు. ఎప్పుడూ ఆహారం కోసం దేహీ అని ప్రార్థించలేదు. యుద్ధావేశంతో శత్రువులనే ఏనుగుల కుంభస్థలాలను సింహంలా చీల్చి పోరాటం సాగించాడు. శక్తి వంచన లేకుండా యుద్ధంలో తన రక్తాన్ని చిందించాడు.

7. విదేశీయులారా! "భారతీయులు కేవలం మాకు సేవకులు" అని చెప్పడానికి మీకు నోరెలా వస్తుంది? యుద్ధ సమయంలో ఒక్కోసారి రాత్రింబవళ్ళు మంచురాళ్ళపై నిద్రిస్తాడు. ఉంటే ఆహారం తీసుకుంటాడు. లేకుంటే నీళ్ళు తాగి జీవిస్తాడు. మత్తుపానీయాల కోసం గతిమాలి శత్రువుల వైపుకు వెళ్ళడు. అవసరమైతే అగ్నిగోళాలకు ఆహుతైనా అవుతాడేమోగాని, యుద్ధంలో వెనుతిరిగి పారిపోడు. అలాంటి పరాక్రమం కలిగి యుద్ధంలో విజయాన్ని సాధించి వచ్చిన వీరులు భారతీయులు.

8. ఈ పాపం ఊరికే పోదు. ఇంతమంది భారతీయుల్ని పొట్టన పెట్టుకోవడం చాలా దారుణం. దోచుకున్న ధనాన్ని వడ్డీతో సహా మింగినట్లు భారతీయుల పట్ల మీరు చేసిన పాపఫలితం అనుభవించక తప్పదు. ఏదో ఒకనాడు చండి (కాళికా) భారతీయుని ఇంట చేరి మహాప్రళయాన్ని సృష్టిస్తుంది. ఈ విషయాలను బాగా గుర్తుంచుకోండి.

9. భారతీయులకు బానిసత్వాన్ని ఉగ్గుపాలతో పోసినటువంటి పాపాత్ముడు ఆంగ్లేయుడు. అన్నవస్త్రాలను దోచుకున్న దుర్మార్గుడు. కరువనే రాక్షసిని తెచ్చిన పిరికివాడు. భారతీయుల మధ్య కక్షలను పెంచి పోషించిన రాక్షసుడు.

బలవంతంగా భారతీయుల్ని అణచివేసే శాసనాలను తెచ్చిన నేర్పరి. భరించలేని పన్నులను వేసిన మహాపాపాత్ముడు. విదేశీ మత్తువస్తువులనమ్మి మన సంపదనంతా దోచుకున్న ద్రోహి. భారతీయుల మధ్య తగవులను పెంచిన కఠిన హృదయుడు. చెడును ప్రేరేపించే కలిపురుషుడికి వీడు స్నేహితుడు. ప్రాణాలను హరించే యమునకు ఇష్టమైనవాడు. ఈ ఆంగ్లేయుడు మోసాలకు స్థానం. విరోధాలకు నిలయం. చెడు గుణాలకు మూల కేంద్రం. కుటిలమైన బుద్ధి కలవాడు. భారతీయులను భయపెట్టు భూతం వంటివాడు. ఇలాంటి కలతలను సృష్టించి భారతీయుల్ని మోసం చేసినవాడు ఆ ఆంగ్లేయుడు.

10. తెల్లదొరలనే రాకాసిగుంపు భారతీయుల్ని అనేక చిత్రహింసలకు గురిచేసింది. లేత ఆకులలాంటి పసిపిల్లలను ఎండలో నడిపించి తీవ్రంగా హింసించారు. నడుచుకుంటూ వెళ్ళేవారిని కిందకు తోసి, వారి పొట్టలపై పాకించారు. అతిక్రూరంగా పదునైన ఆయుధాలతో పొడిచేవారు. ఎటువంటి తప్పులు చేయనివారిని సైతం నిలబెట్టి వారి వెనుకభాగాలు చితికిపోయేలా అత్యంత కిరాతకంగా కొట్టారు. స్త్రీలు ఏకాంతంగా నివసించే అంత:పురాలలోకి ప్రవేశించి వారి జుట్టుపట్టి ఈడ్చి వారి గౌరవానికి భంగం కలిగించి వెళ్ళేవారు. వేలాది మంది ప్రజలను తమ తుపాకులతో కాల్చి చంపి, వారి ప్రాణాలనే సంపదలను తీసుకున్నారు. పాపమన్న భావన ఏ మాత్రం లేకుండా ఈ తెల్లదొరలనే రాక్షసగుంపు పంజాబు పరువును తీసింది.

11. దయ్యరు దురంతానికి జలియన్‌వాలా బాగ్‌లో ఎంతో మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారి రక్తం ఏరులైపారింది. తలలు తెగిన శరీరాలతో, నిలిచిన ప్రాణాలతో పోరాడుతున్న వారి ఆర్తనాదాలు దిక్కులంతటా ప్రతిధ్వనిస్తున్నాయి. ఈ భయంకర గర్జనలకు ఏదో వినాశం సంభవిస్తుందేమోనని కొందరు పౌరులు భయంతో అక్కడి నుండి పరుగులెత్తారు.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది అంశాల గురించి చర్చించండి.**

1. రౌలట్ చట్టాన్ని భారతీయులు ఎందుకు వ్యతిరేకించారు.
2. భారతీయుని శౌర్యపరాక్రమాలను వివరించండి.
3. ప్రళయపయోధముల్ .. పద్యానికి భావం రాయండి.



**ఆ) కింది గేయాన్ని చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

బంగరు పూవులు పూచే తల్లికి భారత ధాత్రికి వందనం-2
సింగారములు చెలువము చిలికే శీలవతికి మా వందనం-బం॥

జీవనదులతో సిరులొలికించే చిర యశస్వినికి వందనం-2
పావన ఋక్కులు భవ్య కావ్యములు -2 పలికిన మాతకు వందనం-బం॥

హిమవదాది సుమహీధరాల విలసిల్లిన మాతకు వందనం-2
అమర ఋషీంద్రుల విమల వాక్కులు -2 అలరిన మాతకు వందనం-బం॥

సామగానముల జోలలు పాడుచు సాకెడు తల్లికి వందనం-2
శత సహస్ర నర నారీసంస్తుత -2 చరణ పంకజకు వందనం-బం॥

దివ్య శిల్పులను దివ్య గాయకుల తీర్చిన జననికి వందనం-2
దేశదేశముల కాదర్శమ్ముల -2 తెలిపిన మాతకు వందనం-బం॥

**- కె. వీరరాఘవాచారి.**

ప్రశ్నలు:

1. పై గేయంలో కవి ఎవరికి వందనాలు సమర్పిస్తున్నారు?
2. గేయంలో దేశ గొప్పతనాన్ని చాటి చెప్పేవాటిని పేర్కొనండి.
3. ఈ గేయాన్ని రాసిందెవరు?
4. పై గేయానికి శీర్షికను సూచించండి?

**ఇ) కింది పేరాను చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

సైనిక దాడులనైనా అరికట్టవచ్చునేమోగానీ ప్రజల హృదయాంతరాళాల నుండి పెల్లుబికివచ్చే స్వతంత్ర భావతరంగాలను ఆపజాలరనేది చరిత్రలో రుజువైన సత్యం. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు రెండువందలేండ్లకు పైబడి పంజరాల్లో మనల్ని పట్టి బంధించారు. ఆ శ్వేతజాతి భారతీయుల్ని ఎన్నో చిత్రహింసలకు గురి చేసింది. క్రమేణా మనకు జ్ఞానోదయమైంది. మన నేత్రాల చీకటిపొరలు విడిపోయి, కర్తవ్యోన్ముఖులమయ్యాము. మేధావులు మనకు వెలుగుబాట చూపారు. మన వ్యక్తిత్వాన్ని వికసింపజేశారు. ప్రజలు చైతన్యవంతులయ్యారు. విజ్ఞాపనలు విఫలంకాగా, ఆందోళనలు సాగించారు. ఉద్యమాలు నడిపారు. సత్య, అహింసలతో కూడిన పోరాట కార్యక్రమాల నిర్బంధాలతో ఉద్యమాలను అణచివేయాలని చూసింది. 'విభజించి పాలించే' పద్ధతి అనుసరించింది. ఉద్యమాలు ఉధృతమైన కొద్దీ ఏవో స్వల్ప సంస్కరణలతో ప్రజలను బుజ్జగించ తలపెట్టింది. కాని, ఆ పాచికలేమీ పారలేదు. ప్రపంచంలో ప్రజా శత్రువులెవరూ విజయం పొందలేరు. నిర్బంధ విధానం, పరిష్కార మార్గం కాదని రుజువైంది. ఎట్టకేలకు దేశానికి స్వరాజ్యం సిద్ధించింది. బ్రిటిష్ సామ్రాజ్య ప్రభుత్వం మన దేశాన్ని వదలి వెళ్ళిపోక తప్పలేదు.

**- మాదల వీరభద్రరావు ('స్వరాజ్య సమరం.. మరువరాని సంఘటనలు')**

ప్రశ్నలు :

1. చరిత్రలో రుజువైన సత్యమేది?
2. మేధావులు చేసిన పని ఏమిటి?
3. బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యమాలను ఎలా అణచివేయాలని చూసింది?
4. పై పేరా ఆధారంగా అర్థవంతమైన ప్రశ్న తయారు చేయండి.

**ఈ) కింది వానికి అర్థసందర్భాలను రాయండి.**

1. సితజాతికి నీతియటంచు నున్నదే
2. కయ్యాల బెంచిన కఠినతముడు

**ఉ) కింది వానికి ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. జలియన్‌వాలా బాగ్‌లో అందరి కష్టాలకు కారకుడెవరు?
2. తిరుగుబాట్లను అణచడానికి బ్రిటీష్‌వాళ్ళు తెచ్చిన శాసనమేది?
3. భారతీయులకు బానిసత్వాన్ని ఉగ్గుపాలతో పోసిందెవరు?

## వ్యక్తీకరణ-సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. భారత వీరుల పరాక్రమం గురించి సంక్షిప్తంగా రాయండి.
2. బ్రిటిష్ వాళ్ళు భారతీయుల మధ్య ఎటువంటి కలతలు సృష్టించారు?
3. జలియన్‌వాలా బాగ్ కాల్పుల సమయంలో భారతీయుల దుస్థితిని తెల్పండి.

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. జలియన్‌వాలా బాగ్ దురంతాన్ని సవివరంగా తెల్పండి.
2. ఆంగ్లేయుల నిరంకుశత్వ పాలనలో భారతీయుల పరిస్థితిని మీ సొంతమాటల్లో రాయండి.
3. స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు నేలపై పోరాడిన యోధుల జీవితాలను ప్రస్తావించండి.

**ఇ) కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.**

1. ఆంగ్లేయుల దురాగతాలను వ్యతిరేకిస్తూ భారత వీరుడి ఏకపాత్రను రాసి, ప్రదర్శించండి.
2. మీకు నచ్చిన స్వాతంత్ర్య సమరయోధుడిని ప్రశంసిస్తూ, అభినందన పత్రం రాయండి.

## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి, వాటిని సొంతవాక్యాల్లో ప్రయోగించండి.**

1. వర్షాలు లేక పంటలు పండక కాటకం విలయ తాండవం చేస్తుంది.
2. అల్లూరి సీతారామరాజు సితజాతివారిని గడగడలాడించాడు.
3. తులువలతో స్నేహం మంచిది కాదు.
4. కురుక్షేత్ర సంగ్రామంలో రుధిరం ఏరులై పారింది.

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలు రాయండి.**

1. పయోధరం = __________, __________, __________
2. ఆర్తి = __________, __________, __________
3. రణం = __________, __________, __________
4. ఉదకం = __________, __________, __________

**ఇ) కింది పదాలకు నానార్థాలు రాయండి.**

1. హరి = __________, __________, __________
2. గజం = __________, __________, __________
3. మోక్షం = __________, __________, __________

**ఈ) కింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు రాయండి.**

1. నీహారము = ______________________________

2. పాతకము = ________________

3. పానీయము = ________________

**ఉ) కింది ప్రకృతులకు సరైన వికృతులను జతపరచండి.**

| | ప్రకృతి | | వికృతి |
|---|---|---|---|
| 1. | కిరీటి | (    ) | చండి |
| 2. | దోషి | (    ) | క్రీడి |
| 3. | చండికా | (    ) | రక్కసుడు |
| 4. | రాక్షసుడు | (    ) | దోసి |

**ఊ) కింది జాతీయాలను ఏ సందర్భాలలో వాడతారో వివరించండి.**

1. అంగలార్చు = ________________

2. వెన్నుచూపు = ________________

3. ఉగ్గుపాలతోపెట్టు = ________________

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.**

1. కవటాకులు = ________ + ________ = ________

2. ప్రాణార్థములు = ________ + ________ = ________

3. పాలుఁ జేసి = ________ + ________ = ________

3. ధ్వజమెత్తి = ________ + ________ = ________

**ఆ) పాఠంలోని సవర్ణదీర్ఘ , సరళాదేశ, ఉత్వ సంధులను గుర్తించి రాయండి.**

**జశ్త్వ సంధి**

వాక్ + ఈశుడు = వాగీశుడు

అచ్ + అంతం = అజంతం

విరాట్ +రూపం = విరాడ్రూపం

జగత్ + అంబ = జగదంబ

పై వాటిని గమనిస్తే మొదటి పదం చివర వర్గ ప్రథమాక్షరాలు (క,చ,ట,త,ప) ఉన్నాయి. రెండవ పదం మొదట సరళాలుగానీ (గ,జ,డ,ద,బ) హ, య, వ, రలుగానీ, అచ్చులుగానీ, వర్గ తృతీయ, పంచమాక్షరాలుగానీ ఏదో ఒకటి పరమైంది. అప్పుడు సంధి జరిగి క, చ, ట, త, ప లకు గ, జ, డ, ద, బ లు ఆదేశంగా వచ్చాయి. దీనినే 'జశ్త్వ సంధి' అంటారు.

సూత్రం : వర్గ ప్రథమాక్షరాలకు అచ్చులుగానీ, స్థిరాలుగానీ, వర్గ తృతీయ, చతుర్థ, పంచమాక్షరాలుగానీ పరమైతే గ,జ,డ,ద,బ లు ఆదేశమవుతాయి.

1. వాగ్వాదం =
2. హృద్వారం =
3. దిగంతం =

పై పదాలను విడదీసి సూత్రంతో అన్వయించండి.

**ఇ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసనామం తెల్పండి.**

1. శౌర్యపరాక్రమములు = __________ = __________
2. శుద్ధాంతకాంత = __________ = __________
3. పాపఫలం = __________ = __________
4. దేహపంజరం = __________ = __________
5. రాకాసిమూక = __________ = __________
6. ఘోరరణం = __________ = __________

**ఈ) పాఠంలోని మరికొన్ని సమాస పదాలను గుర్తించి వాటికి విగ్రహవాక్యాలు, సమాసనామాలు రాయండి.**

**ఉ) కింది పద్యపాదంలోని అలంకారాలను గుర్తించండి.**

1. దు:ఖ సముద్రము భారతీయ హృద్ద్వారము సొచ్చి యగ్నివలె జ్వాలలు వీచుచునున్న దెంతయున్.

**ఊ) కింది పద్యపాదాలకు గురువు, లఘువులు గుర్తించి, గణవిభజన చేసి, ఏ పద్య పాదమో రాయండి.**

1. రౌలటుశాసనంబు సమరంబునగెల్చినదాని కంకుగా
2. జలియను బాగులో జనుల జంపిన రక్తము వర్షపాతముం

**ఋ) సీసపద్య లక్షణాలను పరిశీలిద్దాం**

సీసపద్యంలో ప్రతిపాదం రెండు భాగాలుగా ఉంటుంది. ప్రతి భాగంలో నాల్గేసి గణాల చొప్పున ఒక్కొక్క పాదంలో ఎనిమిది గణాలుంటాయి. ఈ 8 గణాల్లో మొదటి ఆరు ఇంద్రగణాలు. చివరి రెండు సూర్యగణాలు. (పాదం మొదటి భాగంలో 4 ఇంద్రగణాలు, 2వ భాగంలో వరుసగా రెండు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలుంటాయి).

ఉదా :

| | | | |
|---|---|---|---|
| సల | సల | నల | భ |
| I I U I | I I U I | I I I I | U I I |
| కవటాకు | లను బోల | గల పసి | బాలుర |
| ఇంద్ర | ఇంద్ర | ఇంద్ర | ఇంద్ర |

| | | | |
|---|---|---|---|
| ర | నల | హ | హ |
| U I U | I I I U | U I | U I |
| నెండలో | నడిపి హిం | సించి | నారు |
| ఇంద్ర | ఇంద్ర | సూర్య | సూర్య |

- యతి ప్రతిపాదంలోనూ 3వ గణం మొదటి అక్షరంతో సరిపోతుంది. యతిలేని చోట ప్రాసయతి చెల్లుతుంది.
- ప్రాస నియమం లేదు.
- సీసపద్యం నాలుగు పాదాల తర్వాత తేటగీతిగాని, ఆటవెలదిగాని తప్పనిసరిగా ఉంటుంది.

ఈ కింది పద్య పాదాలకు గణ విభజన చేసి లక్షణ సమన్వయం చేయండి.

1. బానిసత్వము నుగ్గు పాల బోసిన దోషి

అన్నవస్త్రము లాచి కొన్న ఖలుడు

2. ఒకచోట నీహార నికరంపురాలపై

బవళించు రణము రే బవలు సలిపి

## ప్రాజెక్టుపని

మీ ప్రాంతంలోని స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు సేకరించి, ఒక నివేదిక రూపొందించండి. దానిని తరగతి గదిలో ప్రదర్శించండి.

## పాఠాంత పద్యం



సీ. ఎవ్వారి రణగాథ లింత రచింప, స
త్కవుల కలాలు సార్థకత నందు;
ఎవ్వారి జయగాథలించుక పాడ, గా
యకుల కంఠములు ధన్యత గడించు;
ఎవ్వారి రూపులొక్కింత రూపింప, శి
ల్పుల కళాకృతి మహోజ్జ్వలత గాంచు ;
ఎవ్వారి పదధూళి రవ్వంత సోకిన
భూదేవి నిలువెల్ల పులకరించు ;

తే. నభము మార్మోగు విజయదుందుభులు వారు ;
త్యాగధనులైన సత్యవర్తనులు వారు ;
జాతిరత్నాలు వారు; శాశ్వతులు వారు;
పావనులు వారు; ధన్యజీవనులు వారు!

– కరుణశ్రీ

భావం : ఎవరి యుద్ధ (వీర)గాథలను రచించడం వల్ల కవుల కలాలు సార్థకమవుతాయో, ఎవరి విజయగాథలను ఆలపించడం వల్ల గాయకుల కంఠాలు ధన్యమవుతాయో, ఎవరి రూపాలను నిర్మించడం వల్ల శిల్పుల కళాకృతులు ఉజ్జ్వలంగా వెలుగుతాయో, ఎవరి పాదధూళి సోకినంత మాత్రాన భూదేవి నిలువెల్లా పులకిస్తుందో – వాళ్ళు ఆకాశం మార్మోగే విజయ దుందుభులు, త్యాగధనులు, సత్యసంధులు, జాతిరత్నాలు, శాశ్వతులు, పుణ్యులు, ధన్యులైన (దేశభక్తులు) –దేశం కోసం ప్రాణాలిచ్చిన మహనీయులు.

సూక్తి: "స్వాతంత్ర్యం చాలా సున్నితమైన పువ్వు, వాడియైన కత్తి, విలువైన వజ్రం". – శ్రీశ్రీ

## మీకు తెలుసా?

### చెక్క భజన



ఆంధ్రప్రదేశ్ పల్లెల్లో అనాదిగా వస్తున్న కళారూపాలలో 'చెక్క భజన' ముఖ్యమైంది. ఇది శాస్త్రీయమైన జానపద నృత్యకళ. చేతుల్లో ఘల్లు ఘల్లుమనే చెక్కలను పట్టుకొని అందరూ కలిసికట్టుగా తాళం వేయాలి. తాళానికి తగినట్లు పాట పాడాలి. పాటకు తగిన భావాన్ని ముఖంలో చూపించాలి. కాళ్ళకు గజ్జెలు కట్టాలి. ఒకే రకంగా నృత్యం చేయాలి. ఎగురుతూ గుండ్రంగా తిరుగుతూ భజన చేయటం చెక్కభజన విశిష్టత. భక్తి పాటలు, భారత, భాగవత, రామాయణాలకు చెందిన పురాణ పాటలు, నీతిని ప్రబోధించే పాటలు, వీర గాథలు మొదలైనవి ప్రదర్శిస్తారు. తెలుగువారి భక్తి రస కళారూపాలలో చెక్కభజన ఒక సుందర కళారూపం.

### మొహర్రం (పీర్ల పండుగ)



ముస్లింలందరూ రంజాన్, బక్రీద్ తర్వాత జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో మొహర్రం ఒకటి. మొహర్రం నెలతో ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. శాంతి, ప్రజాస్వామిక మానవహక్కుల కోసం పద్నాలుగు శతాబ్దాల క్రితం జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అసువులు బాసిన అమరుల సంస్మరణే మొహర్రం. అందుకే దీనిని షాహీద్ మాసంగా పేర్కొంటారు. ఇస్లామ్ క్యాలెండర్ ప్రకారం మొదటి నెల పేరు మొహర్రం. ఇది ప్రారంభమైన 10వ రోజున మొహర్రం పండుగ జరుపుకుంటారు. దీనినే 'ఆషురా' అంటారు. మొహర్రం పండుగను తెలుగు ప్రాంతాల్లో 'పీర్ల పండుగ'గా పిలుస్తారు. దైవ ప్రవక్త మహమ్మద్ మనవళ్ళు హసన్, హుసేన్‌ల వీరోచిత ప్రాణత్యాగాన్ని జ్ఞాపకం చేసుకుంటూ పీరుల్ని ఊరేగిస్తారు. పీరు అనే పదం సూఫీ తత్వానికి సంబంధించినది. పీరు అనగా ఆధ్యాత్మిక గురువు. "ఊదు వేయందే పీరు లేవదు" అంటారు. ఊదు అంటే సాంబ్రాణి పొగ. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ముస్లిమ్‌లు అన్ని ప్రాంతాలలోనూ ఈ పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

# 6 ప్రకృతి సందేశం

- వై.సి.వి.రెడ్డి.

## చదవండి - ఆలోచించి చెప్పండి



సీ. కోడికుంపటి దింపుకొని పిల్లలను బిల్చి
కొసరి గింజియలేరుకొనుట నేర్పు
ఈని యీనకమున్నె మృగభామ పిల్లకు
వెనువెంట చెంగులు బెట్ట నేర్పు
ముందుబుట్టిన తీవె పందిరి కెగబ్రాకి
పసితీవియకు వెంట బ్రాక నేర్పు
నడువనేర్చిన బిడ్డ బుడతతమ్మునిc బ్రేమ
నడుగులో నడుగు లేయంగ నేర్పు.

తే.గీ ప్రకృతి సర్వంబు నీ గురుత్వంబునందు
లీనమై యున్నయది నీవులేని సీమ
దీపమెత్తని వ్యర్థ మందిరము సుమ్ము
ప్రాభవంబోయి నీనోటి వాక్యమునకు.

- గుఱ్ఱం జాషువా (ఖండకావ్యం)



**ప్రశ్నలు:**

1. పై పద్యంలో కవి ఏం చెబుతున్నారు?
2. ప్రకృతి ద్వారా మనం ఏయే విషయాలు నేర్చుకోవచ్చు?
3. విశ్వానికి గురువుగా దేనిని భావిస్తాము?

## ఉద్దేశం

ప్రకృతి మానవునికి చక్కని పాఠశాల. అనాదిగా మానవుడు ప్రకృతి నుంచి ఎంతో నేర్చుకున్నాడు. నేటికీ నేర్చుకుంటున్నాడు. ప్రకృతిలోని చెట్టు, పుట్ట, ఇలా ప్రతిదీ మనిషికి ఎన్నో సందేశాలనిస్తుంది. వాటిని విద్యార్థులకు తెలియజేయడం, ప్రకృతిని కాపాడుకోవాలని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



జననం: 26.03.1926
మరణం: 08.10.1989

అభ్యుదయ కవిగా, రచయితగా పేరు గాంచిన వై.సి.వి.రెడ్డి పూర్తి పేరు యమ్మనూరు చినవెంకట రెడ్డి. ఈయన వైయస్ ఆర్ (కడప) జిల్లాలో బోనాల గ్రామంలో జన్మించారు. లక్ష్మమ్మ, కొండారెడ్డి వీరి తల్లిదండ్రులు. వీరి రచనల్లో ముఖ్యమైనవి 'తొలకరి చినుకులు', మేనక, రంభ, సింధూర రేఖ, దక్షిణ నీలము, వైజయంతి, పారిజాతం మొదలైన కావ్యాలు. 'గట్టిగింజలు' కథల సంపుటి రచించారు. **ప్రస్తుత పాఠ్యభాగం వీరి సమగ్ర సాహిత్యం నుండి స్వీకరించబడింది.**

## ప్రక్రియ-గేయం

గేయకవిత పాడడానికి, లయబద్ధంగా చదవడానికి వీలైనది. గేయంలో లేదా గేయ కవితలో శబ్ద సంబంధమైన లయ ఉంటుంది. అందువల్ల గానయోగ్యంగా ఉంటుంది. గేయంలో మాత్రాగణాలుంటాయి. దీనిలో ఏ వస్తువునైనా వర్ణించి చెప్పవచ్చు.

గిరిదరీముకుర కందర సరోవరములను
అరవిచ్చు విరుల సంబరమైన తుమ్మెదలు;
వాసంతవేళ విభ్రమ కంచుకితమైన
సహకార మంజరీ సహకారములు పికము
లందించె సందేశముల్ - సంస్కృతీ
సదన మంజులగానముల్
ఆవేశగమనలై ఆలింగనము సేసె
గిరి శిఖరముల సుందర మేఘమాలికలు;
కొండ కోనలలోన నిండుగా పుష్పించి
అల్లిబిల్లిగ చెట్లనల్లుకొన్న లతాళి



అనుశాసనము లిచ్చెరా– మధురమౌ
ఐక్యతను కాంక్షించెరా
గగనకాంతకు వింతకాంతి కన్నులనింపి
పసరురెక్కల విప్పు వలరాజు తేజీలు;
గుసగుసలతో కొమ్మకొమ్మపై నివసించి
ముక్కులానించు లకుముకిపిట్ట దంపతులు;
అనురాగ సందేశముల్ – ప్రజలకై
అందించె సాకూతముల్
జరఠారుణచ్ఛవులు కరిగి పోయెడి వేళ
పురివిప్పి నాట్యముల్ పోహలించెడి నెమ్మి;
పైనుండి మలకలై పారు సెలకన్నెలకు
ఆటపాటల నేర్పు అలసమౌ తెమ్మెరలు
సమయ దీక్షల నిచ్చెనూ– స్వేచ్ఛకై
సమత మమతల దెచ్చెనూ

**ఆలోచించండి – చెప్పండి**

1. ఐక్యతను చెప్పేవి ఏవి?
2. అనురాగ సందేశాల వలన ప్రయోజనం ఏమిటి?
3. సమత మమతలు అనగా ఏమి?



కష్టపడి నష్టపడి కలసికట్టుగ నడచి
తిండిగింజల తెచ్చితీరు చీమలబారు;
పువ్వుపువ్వున వ్రాలి పూదేనెలందెచ్చి
పొరుగు వారికి పంచిపోవు తేనీగలీ
క్రమశిక్షణల నిచ్చెనూ దీక్షతో
కలసి నడువగా చెప్పెనూ



కొండ నెత్తాలలో కోనలోతుల లోన
ప్రభవించి పుంజుకొని పల్లవించిన కావి
ఒక కొమ్మలోపుట్టి ఒక రెమ్మలోవిడిగి
అందాల చిందించు అరవిరుల నెత్తావి;
కదిలి పోయెను కవితలై- మానవుల
గతికి చక్కని బాటలై

సర్వులకు అనురాగసార మందింపగా
మతము లన్నియు ఒక్క మమతకై పుట్టినవి
కుటిలబుద్ధులు కొంద రిటుబల్కి అటుబల్కి
సమరాలు కల్పించి చంపినారిదివరకు
సాగిపోయిన జిత్తులూ- యికపైన
సాగనీయము ఎత్తులూ
నింగిపై జీరాడు నీలినీడల లోన
గాలిలో అందాలు కలబోయు పక్షులకు;
రేయనక పగలనక కాయకష్టము జేయు
కార్మికులు కర్షకులు కలిసి పలికిరి నేడు
సమతకై పోరాడగా -ఈనేల
శాంతి సౌఖ్యము నింపగా

**ఆలోచించండి - చెప్పండి**

1. క్రమశిక్షణ అంటే ఏమిటి?
2. సమానత్వం కోసం మనం ఏం చేయాలి?

**భావం:**

పర్వత సానువుల్లోని అద్దాల వంటి నిర్మలమైన సరస్సులలో విచ్చుకుంటున్న తామరలు తుమ్మెదలకు సంతోషాలను పంచుతున్నాయి. వసంతకాలంలో ఆశగా తిరుగుతున్న కోకిలలకు మామిడిచెట్లు లేత మావిచిగురులను అందిస్తున్నాయి. ఇవి ఒకరికొకరు సహకరించుకోవడమే మన సంస్కృతి అనే గొప్ప సందేశాన్ని ఇస్తున్నాయి.

ఆకాశంలో తమని తాము మరచి తిరుగుతున్న అందమైన మేఘాలు పర్వత శిఖరాలను కౌగిలించుకుంటున్నాయి. కొండకోనలలో నిండుగా పూలుపూచిన తీగలు చెట్లను అల్లుకుంటున్నాయి. ఇవి మానవులంతా ఐకమత్యంతో ఉండాలని గొప్ప ఉపదేశాన్ని ఇస్తున్నాయి.

మన్మథుడి వాహనమైన రామచిలుకలు తమ ఆకుపచ్చని రెక్కలు విప్పి ఎగురుతూ ఆకాశమనే స్త్రీ కన్నులలో కాంతి నింపుతున్నాయి. అన్యోన్యమైన లకుముకి పిట్టల జంట అనురాగంతో గుసగుసలాడుతూ కొమ్మలపై నివసిస్తున్నాయి. ఇవి పరస్పరం ప్రేమానురాగాలతో జీవించాలని ప్రజలకు సందేశాన్ని ఇస్తున్నాయి.

మబ్బుపట్టిన వేళ ఆనందంతో నెమళ్ళు పురివిప్పి నాట్యమాడుతున్నాయి. కొండలపై నుండి దూకుతూ, మలుపులు

తిరుగుతూ, వయ్యారంగా సాగే సెలయేటి కన్యలకు చిరుగాలులు ఆటపాటలు నేర్పుతున్నాయి. ఇవి ఈ మనుషులంతా స్వేచ్ఛ, సమత, మమతలతో సాగిపోవాలని సందేశాన్నిస్తున్నాయి.

ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి చీమలు కలిసికట్టుగా తిండిగింజలను సేకరిస్తున్నాయి. తేనెటీగలు ప్రతి పువ్వు నుండి తేనెను సేకరించి కూడబెట్టి ఇతరులకు పంచుతాయి. ఇవి క్రమశిక్షణతో ఐక్యంగా ఉండాలని, మానవాళికి చెబుతున్నాయి. కొండల మధ్య లోయలలో పుట్టి వ్యాపిస్తున్న ఎఱ్ఱని కాంతి కొమ్మలలో, రెమ్మలలో అందాలు చిందిస్తూ అరవిరిసిన పువ్వుల సువాసన ఒక కవితలా సాగిపోతూ మానవుల జీవన గమనానికి చక్కటి దారులను చూపిస్తున్నాయి.

ప్రజలందరికీ ప్రేమానురాగాలను పంచడానికే మతాలన్నీ పుట్టాయి. కానీ కొందరు కుటిల బుద్ధితో మత గ్రంథాలు చెప్పే విషయాలకు వక్రభాష్యాలు చెప్పి, ఎన్నో ఎత్తులు, జిత్తులు వేసి, మతాల మధ్య చిచ్చుపెట్టి ఎందరి చావులకో కారణమైనారు. ఇలాంటివి ఇక్కడ ఇక మీదట సాగవు. (జరగవు).

ఆకాశంలో నీలిమేఘాలకింద అందంగా ఎగిరే పక్షులు, రాత్రనక, పగలనక కష్టపడే కార్మికులు, కర్షకులు కలిసి ఈ ప్రపంచంలో సమానత్వం సాధించాలని, శాంతిసౌఖ్యాలను నెలకొల్పాలని కోరుతున్నారు.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.**

1. గేయ కవితను రాగయుక్తంగా పాడండి.
2. మానవుడికి సందేశమిచ్చినవి ఏవి?
3. కవి గిరిదరీ సరోవరాలను దేనితో పోల్చాడు?

**ఆ) కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

పృథ్వి, ధరణి, వసుధ, ధాత్రి ఇలా ఎన్నో పేర్లతో పిలవబడే భూమి ఒక్కటే జీవరాశి మనుగడకు అనువైనది. ప్రకృతి భూమిలో ఒక భాగం. "ప్రకృతిని కనుగొనడం, ప్రకృతి ద్వారా నేర్చుకోవడమంటే మనల్ని మనం కనుకొనడమే" అని అంటారు మార్గిమ్ లగాకె. ప్రకృతి మన చుట్టూ ఉన్న మొత్తం భౌతిక ప్రపంచం. ఇందులో వాతావరణం, వృక్షజాలం, నదీప్రవాహాలు, ఆకాశాన్ని తాకే పర్వతాలు, అందమైన లోయలు, జలపాతాలు, సూర్యోదయం, సూర్యాస్తమయం, చీకటి, వెన్నెల ఇలా ఆశ్చర్యపరిచే దృశ్యాలెన్నో ఉన్నాయి. ప్రకృతి తల్లియై జీవరాశి మనుగడ కోసం గాలి, నీరు, ఆహారం, ఆవాసం, ఎండ, వాన, మొదలైన వాటన్నింటిని సమకూర్చి సకల ప్రాణులను పోషిస్తోంది. గురువై మార్గదర్శనం చేస్తుంది. ప్రకృతికి వెన్నెముక వృక్షాలు. ఇవి లేకపోతే ప్రకృతికి సౌందర్యముండదు. వర్షించే మేఘం కానరాదు. గలగల పారే నదులుండవు. పండే పంటలు ఉండవు. ఇలాంటి వృక్షాలను మనం కాపాడితే, అవి మనల్ని కాపాడుతాయి. అందుకే పెద్దలు "వృక్షో రక్షతి రక్షితః" అన్నారు.

– ప్రకృతి వ్యాసావళి

**ప్రశ్నలు:**

1. మార్గిమ్ లగాకె ప్రకృతి గురించి ఏం చెప్పారు?
2. ప్రకృతిలో ఏయే దృశ్యాలు ఉన్నాయి?
3. పై గద్యంలోని సూక్తిని గుర్తించండి?
4. పై గద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారుచేయండి?

**ఇ) కింది వచన కవిత చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**



గలగల పారే సెలయేళ్ళు
మిలమిల మెరిసే తారకలు
అందమైన పూదోటలు
హాయి గొలిపే పిల్ల తెమ్మెరలు,
ఎగిసిపడే కడలి కెరటాలు
సాగిపోయే నీలిమేఘాలు
కోయిల పాటల వసంతాలు
మట్టి వాసనల వర్షాలు,
కొండల్లో దూకే జలపాతాలు
కోనల్లో కొలువైన అందాలు
ఎన్నెన్నో అందాలు ఎన్నెన్నో అద్భుతాలు–ఇవి
మనకోసం ప్రకృతి ప్రసాదించిన వరాలు
మనిషి కోరికలకు
అవుతున్నాయి ప్రకృతి వినాశకాలు,
ప్రకృతిని రక్షించకపోతే!
మనిషి మనుగడ సాధ్యమవునా?

– ప్రకృతి కవితా సంకలనం

ప్రశ్నలు:

1. పై కవితలో ఏయే జలవనరులు గురించి వర్ణించాడు?
2. ప్రకృతి మనిషికి  ప్రసాదించిన వరాలు ఏవి?
3. మనిషి కోరికల వలన ఏం జరుగుతోంది?
4. కవిత ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

**ఈ) కింది వానికి అర్థసందర్భాలు రాయండి.**

1. పొరుగు వారికి పంచిపోవు తేనీగలు.
2. సమతకై పోరాడగా ఈ నేల శాంతి సౌఖ్యము నింపగా.

**ఉ) కింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. చీమల నుండి మనం ఏం నేర్చుకోవాలి?
2. కార్మికులు, కర్షకులు ఎలా కష్టపడుతున్నారు?
3. మతాలన్నీ ఏమి బోధిస్తున్నాయి?

## వ్యక్తీకరణ–సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి**

1. సహకరించుకోవడం గురించి మనకు ఏవేవి సందేశమిస్తున్నాయి?
2. మానవుల ప్రగతికి బాటలువేసినవి ఏవి?
3. పక్షులు మనకు ఏవిధమైన సందేశాన్ని ఇస్తున్నాయి?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాలలో జవాబులు రాయండి**

1. "ప్రకృతి సందేశం" పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి
2. ఐకమత్యాన్ని గురించి ఏవి ఎలా బోధిస్తున్నాయో రాయండి?

**ఇ) కింది సృజనాత్మక ప్రశ్నలకు జవాబులు రాయండి**

1. "పరితపిస్తున్న పర్యావరణం-ప్రకృతిని కాపాడుకోవలసిన తరుణం" ఈ అంశంపై ప్రసంగ వ్యాసం రాయండి.
2. ప్రకృతిలో మీరు చూసిన అందమైన ప్రదేశాన్ని వర్ణిస్తూ రాయండి?

## భాషాంశాలు పదజాలం

**అ) క్రింది వాక్యాలలో ఎరుపురంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి సొంత వాక్యాలలో రాయండి**

1. పిల్లలు ముకురం ముందు నిలబడి ముస్తాబవుతున్నారు.

______________________

2. పికము పంచమ స్వరంలో పాట పాడింది.

______________________

3. పురివిప్పిన నెమ్మి ఎంత అందంగా ఉందో.

______________________

4. మానస సరోవరం హిమాలయాల్లో ఉంది.

______________________

5. మల్లెల నెత్తావి తోట అంతా వ్యాపించింది.

______________________

**ఆ) కింది వాక్యాలు చదివి పర్యాయపదాలు గుర్తించి రాయండి**

1. తోటలో పుష్పాలు వికసించాయి. అమ్మ ఆ కుసుమాలను సేకరించింది. విరులను దండగా కూర్చింది.

______________________

2. రజని ధరణి అంతా కమ్ముకున్నది. రాత్రికి రాజైన చంద్రుడు తన వెలుగులతో రేయిని పగలుగా మార్చాడు.

______________________

3. కొండలపై వృక్షాలు ఎన్నో ఉన్నాయి. వాటి వల్ల పర్వతాలకు పచ్చదనం వచ్చింది. గిరులు భూమికి అందాన్ని ఇస్తాయి.

______________________

4. అడవులు ప్రగతికి మూలం. అరణ్యాలు లేకపోతే వర్షాలు కురవవు. అందుకే విపినాలను కాపాడుకోవాలి.

______________________

5. పిల్లలు ఆట మొదలు పెట్టారు. అందులో వారి నటన బాగుంది. వారి లాస్యము చూచి అందరూ సంతోషించారు.

______________________

ఇ) కింది పదాలకు సరైన నానార్థాలు గుర్తించి రాయండి.

| | |
|---|---|
| అ. శాఖ, స్త్రీ, కోటబురుజు | 1. అరుణం = ________ |
| ఆ. ఆకాశం, శూన్యం, దుర్లభం. | 2. మతం = ________ |
| ఇ. ఎరుపు, కుష్టువ్యాధి, బంగారం. | 3. కొమ్మ = ________ |
| ఈ. ప్రేమ, నెమ్మది, నెమలి | 4. నెమ్మి = ________ |
| ఉ. అభిప్రాయం, శాస్త్రం, సమ్మతి | 5. గగనం = ________ |

ఈ) కింది పదాలకు సరైన వ్యుత్పత్త్యర్థాలు గుర్తించి రాయండి.

| | |
|---|---|
| అ. చలనము లేనిది (పర్వతము) | 1. పికం : ________ |
| ఆ. ఉదకమును ధరించునది (మేఘం) | 2. అచలము : ________ |
| ఇ. మరణంతో కూడినది | 3. పయోధరం : ________ |
| ఈ. చాటు నుండి కూయునది( కోయిల) | 4. సమరం : ________ |

ఉ) కింది వాక్యాలు చదివి ప్రకృతి, వికృతులను గుర్తించి రాయండి.

1. మేఘాలు ఆకాశంలో విస్తరించాయి. మొగులు కురిస్తేనే పంటలు పండుతాయి.
2. కూచిపూడి నాట్యం ప్రసిద్ధ నట్టువలలో ఒకటి.
3. లతకు కవితలంటే ప్రాణం. ఆమె కయితలు వినడానికి ఇష్టపడుతుంది.
4. మా ఊరిలో సంక్రాంతి వేడుకలు సంబ్రమము గొల్పునట్లు జరిగాయి. అందరూ ఆ సంబరములలో పాల్గొన్నారు.

## వ్యాకరణాంశాలు

అ) కింది పదాలను విడదీసి, సంధి పేర్లను రాయండి.

1) మతములన్ని : ________ + ________ (        )

2) పూఁదేనె : ________ + ________ (        )

3) లతాళి : ________ + ________ (        )

4) కొలువైన : ________ + ________ (        )

**పద్వాదిసంధి :**

1. భయము + పడు = భయపడు, భయంపడు, భయముపడు
2. కష్టము + పడు = కష్టపడు, కష్టంపడు, కష్టముపడు
3. ఇష్టము + పడు = ఇష్టపడు, ఇష్టంపడు, ఇష్టముపడు
4. సందేహము + పడు = సందేహపడు, సందేహంపడు, సందేహముపడు

పై ఉదాహరణలు గమనించండి. పైవానిలో మొదటి పదం చివర 'ము' వర్ణం ఉంది. రెండో పదంగా 'పడు' ఉంది. పదాలు కలిసినప్పుడు 'ము' వర్ణకానికి లోపం, పూర్ణ బిందువు (0) విభాష గా వచ్చాయి. ఇలా రావడాన్ని పద్వాది సంధి అంటారు.

సూత్రం: పడ్వాదులు పరమైనప్పుడు 'ము' వర్ణకానికి  లోప, పూర్ణ బిందువులు విభాషనగు.
పడ్వాదులు అనగా పడు, పాటు, పెట్టు, పట్టు, పరచు మొదలైనవి.

**సమాసం:**

**అ) కింది సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాసి సమాసం పేరు రాయండి.**

1. గగనకాంత : ________________________ (                    )
2. సమతామమతలు : ________________________ (                    )
3. మేఘమాలికలు : ________________________ (                    )
4. సుందరమేఘాలు : ________________________ (                    )
5. కుటిలబుద్ధి : ________________________ (                    )
6. తిండిగింజలు : ________________________ (                    )
7. అనురాగసాగరం : ________________________ (                    )

**బహువ్రీహి సమాసం:**

**కింది సమాస పదాలను, వాటి విగ్రహ వాక్యాలను పరిశీలించండి.**

అన్యపదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి సమాసం

1. ఆజానుబాహుడు – జానువుల వరకు బాహువులు కలవాడు.
2. ముక్కంటి – మూడు కన్నులు కలవాడు.
3. చతుర్ముఖుడు – నాలుగు ముఖాలు కలవాడు.
4. పద్మాక్షి – పద్మం వంటి అక్షులు కలది.

పై పదాలలో మొదటి పదానికి గాని రెండవ పదానికి గాని ప్రాధాన్యం లేదు. రెండు పదాలు మరో పదం యొక్క అర్థాన్ని స్ఫురింపచేస్తున్నాయి. ఇలా మరో పదం యొక్క అర్థానికి ప్రాధాన్యం ఉన్న సమాసాన్ని బహువ్రీహి సమాసం అంటారు.

ఉదాహరణ: చక్రపాణి అనే సమాసపదంలో చక్రము అనే పదానికి ప్రాధాన్యం లేదు. పాణి (చేయి) అనే పదానికి కూడా ప్రాధాన్యం లేదు. చక్రము పాణియందు కలిగిన వానికి ప్రాధాన్యం ఉన్నది. ఇట్లా సమాసంలోని పదాలకుకాక మరో పదం యొక్క అర్థానికి ప్రాధాన్యం ఉన్నది కాబట్టి ఇది **బహువ్రీహి** సమాసం.

**ఇ) కింది గేయ కవితను పరిశీలించి అలంకారాన్ని గుర్తించండి.**

1. గుసగుసలతో కొమ్మకొమ్మపై నివసించి
ముక్కులానించు లకుముకిపిట్ట దంపతులు;

పై ఉదాహరణలో లకుముకి పిట్టలు  కొమ్మకొమ్మ పైనా నివసిస్తూ గుసగుసలాడుతూ ముద్దాడుతున్నాయి. అనే విషయాన్నే ఉన్నదున్నట్లుగా చెప్పడం జరిగింది.కాబట్టి ఇది స్వభావోక్తి అలంకారం.

లక్షణం: జాతి గుణ క్రియాదులచేత దాని స్వభావాన్ని రమణీయంగా వర్ణించిన యెడల **స్వభావోక్తి.**

**ఈ) స్వభావోక్తి అలంకారానికి చెందిన మరికొన్ని ఉదాహరణలు రాయండి.**

________________________________________

________________________________________

## ప్రాజెక్టుపని

ప్రకృతి సౌందర్యాన్ని తెలిపే గేయాలు లేదా పాటలు, పద్యాలు సేకరించి తరగతి గదిలో ప్రదర్శించి చర్చించండి.

## పాఠాంత పద్యం

ఉ. చల్లనివైన రాత్రుల వసంతసుఖోదయవేళ బుష్పముల్
చల్లెడు విస్ఫురత్పరిమళమ్ముల తీయదనమ్ములోన గాం
తిల్లిన కన్నులం బయికి ద్రిప్పుచు జాబిలి జూచు పిల్లలన్
మెల్లన జిన్కుగా గరగి నిండుమనంబున ముద్దులాడెదన్

**- వేంకట కాళిదాస కవులు. (మబ్బుతునక ఖండకావ్యం)**

**భావం :**

నేను తెల్లని మబ్బుతునకను. వసంతకాలంలో చల్లని వెన్నెల రాత్రుల్లో అందరికీ ఆహ్లాదం కలిగిస్తాను. పువ్వులు కమ్మని సువాసనలు వెదజల్లుతుంటాయి. చందమామను చూసి విప్పారిన కళ్ళతో కేరింతలు కొట్టే పసివాళ్ళను చూసి నేను మురిసిపోతుంటాను. నేనొక వెన్నెలచినుకుగా కరిగి పాలుగారే వాళ్ళ చెక్కిళ్ళను ప్రేమగా చుంబిస్తాను.

**సూక్తి:** పరోపకారాయ ఫలంతి వృక్షాః, పరోపకారాయ వహంతి నద్యః,
పరోపకారాయ దుహంతి గావః, పరోపకారార్థ మిదం శరీరమ్.

**భావం:** పరులకొరకే చెట్లు పండ్లను, నదులు నీటిని, గోవులు పాలను ఇస్తున్నాయి. అదే విధంగా ఈ శరీరము పరుల మేలుకొరకే కదా!

**మీకు తెలుసా?**

జూలై 28వ తేదీని 'ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినం'గా జరుపుకుంటున్నాం.

## పేరిణి నృత్యం



పేరిణి శివతాండవం అనేది తెలుగువారి ప్రాచీన నృత్యం. కాకతీయ రాజుల కాలంలో ఎంతో వైభవంగా ఉండేదని ప్రాచీన గ్రంథాల ద్వారా తెలుస్తోంది. దీనికి యోధుల నృత్యం అనే పేరు కూడా ఉంది. యుద్ధానికి వెళ్ళబోయే ముందు వీరులు తమ సైన్యంలో ప్రేరణను కలిగించడానికి ఈ నృత్యం చేసేవారు. ఇది మగవాళ్ళు ప్రదర్శించే కళ. మంచి దేహ సౌష్ఠవం గల మగవాళ్ళు శివుడు చేసే తాండవాన్ని అనుకరిస్తూ వీరరస ప్రధానంగా పేరిణి నృత్యం చేస్తారు. మృదంగ శబ్దానికి అనుకూలంగా ఆడే ఆట చాలా ఆకట్టుకుంటుంది. ఇందులో పాటలు గాని కథలు గాని ఉండవు. కేవలం మృదంగ ధ్వని, అవయవాల కదలికతోనే శివతాండవం జరుగుతుంది. రామప్ప దేవాలయంలో పేరిణి శివతాండవానికి సంబంధించిన శిల్పాలు ఉన్నాయి. కాకతీయుల కాలం తర్వాత పేరిణి క్రమంగా అంతరించిపోయింది. దేవాలయాలపై ఉన్న శిల్పాలు, ప్రాచీన గ్రంథాల ఆధారంగా ఆచార్య నటరాజ రామకృష్ణ గారు పేరిణి నృత్యాన్ని పునరుద్ధరించి వెలుగులోకి తీసుకొచ్చారు.

## మొలకల పున్నమి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు నిలయం. వివిధ మాండలికాలు, వేరువేరు సరిహద్దులు కలిగి ఉండటం వలన ఆయా ప్రాంతాల్లో జరిగే పండుగలు, జాతరలు అక్కడి సంప్రదాయాలను, ఆ ప్రజల నమ్మకాలను, వారి విశ్వాసాలను తెలియపరుస్తాయి. అలాంటి స్థానిక పండుగే 'మొలకల పున్నమి'. ఈ పండుగ అనంతపురం జిల్లాలో అనేక ప్రాంతాల్లో జరుపుకున్నా, ప్రధానంగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతం, వై.ఎస్.ఆర్. కడపజిల్లా, చక్రాయపేట, వేంపల్లి తదితర ప్రాంతాల్లో గల అనేక గ్రామాల ప్రజలు కలిసి జరుపుకునే అతి పెద్ద స్థానిక పండుగ 'మొలకల పున్నమి'. రైతులు తమ పంటలు బాగా పండాలని, ప్రకృతిని దేవతగా, తల్లిగా భావించి జరుపుకునే రైతుల పండుగ ఇది.



స్థానికులు ముందుగా కొత్త కుండలను, వ్యవసాయ భూమిలోని మట్టిని తీసుకువస్తారు. ఆ మట్టిని కుండలలో నింపి, చిరుధాన్యాలను నానబెట్టి భక్తిశ్రద్ధలతో ఆ కుండల్లో పోస్తారు. మూడు రోజుల తర్వాత ఆ మొలకలుగల కుండలను, చక్కగా ముస్తాబు చేసిన దేవర ఎద్దును ఊరేగింపుగా తీసుకొని 'చిన్నమ్మ' దేవత దగ్గరకు చేరుకుంటారు.

ఆ దేవతకు మొలకలను, ఫల, పుష్పాలను, కొబ్బరి కాయలను సమర్పించి పంటలు చక్కగా పండాలని చిన్నమ్మ దేవతను కోరుకుంటారు. ముందుగా దేవర ఎద్దును భక్తి శ్రద్ధలతో మేళ, తాళాలను లయబద్ధంగా వాయిస్తూ అమ్మవారి దేవాలయం చుట్టూ తిప్పే ఘట్టం కన్నులపండువగా ఉంటుంది. తర్వాత రైతులందరూ తమ ఎద్దుల బండ్లను కూడా ఆ గుడి చుట్టూ తిప్పుతారు. ఈ కార్యక్రమం అనంతరం అన్నదానం నిర్వహిస్తారు. అన్ని ప్రాంతాల వాళ్ళు కుల,మత, ప్రాంత భేదంలేకుండా అందరూ సామరస్యంతో ఈ వేడుకను ఘనంగా నిర్వహించుకుంటారు.

# 7 చేజారిన బాల్యం

L8J3F3

– శీలా వీర్రాజు

## చదవండి – ఆలోచించి చెప్పండి



ప్రతి శిశువూ కొన్ని సహజ వారసత్వ లక్షణాలతో ఒక నిర్దిష్ట సాంఘిక ఆర్థిక భావావేశ వాతావరణంలో జన్మిస్తాడు. ఆ పైన అధికారిక శక్తులూ సంస్థలూ అతన్ని తమకి అనుగుణంగా తయారు చేసుకుంటాయి. నేను నా తండ్రి నుంచి నిజాయితీనీ, ఆత్మ క్రమశిక్షణనీ అందిపుచ్చుకున్నాను. మా అమ్మ నుంచి మంచితనంలో నమ్మకాన్నీ, సానుభూతినీ అందుకున్నాను. నాతో పాటే నా ముగ్గురు సోదరులూ, నా సోదరీను.

కానీ జలాలుద్దీన్, షంషుద్దీన్లతో నేను గడిపిన సమయమే నా బాల్యంలోని అద్వితీయతకూ, నా తదనంతర జీవితంలోని మార్పుకీ కారణమనాలి. జలాలుద్దీన్లో షంషుద్దీన్లో కనవచ్చిన సహజాత ప్రజ్ఞ ఏ పాఠశాలల్లోనూ ఏ తర్ఫీదు వల్లా పొందలేని వివేకం. అది భాషకి అతీతంగా ప్రపంచం పట్ల స్పందించగల నేర్పు. అనంతరకాలంలో నా జీవితంలో ప్రకటితమైన సృజనాత్మకతకి నా బాల్యం వారి సాహచర్యంలో గడవడమే కారణమని నిస్సంకోచంగా చెప్పగలను.

– ఒక విజేత ఆత్మకథ

ప్రశ్నలు :

1. అబ్దుల్ కలామ్ తండ్రి నుంచి అందిపుచ్చుకున్నదేమిటి ?
2. అబ్దుల్ కలాం బాల్యంలో తల్లి నుంచి అందుకున్నదేమిటి ?
3. బాల్యంలో ఎవరితో గడిపిన సమయం తన జీవితంలోని మార్పుకి కారణమని కలాం పేర్కొన్నాడు ?

### ఉద్దేశం

బాల్య దశలో అంకురించిన వివిధ ఆసక్తులకు, అంతర్గత నైపుణ్యాలకు తగినట్లుగా సాధనచేస్తే మహోన్నత వ్యక్తిగా ఎదగవచ్చని తెలియజేయడం, విశ్వాసాలు, అభిరుచులు, గుణగణాలు, నడవడిక, వ్యక్తిత్వాలకు సంబంధించిన అన్ని అంశాలకు బాల్యంలోనే పునాదులు పడతాయి అని తెలపడం ఈ పాఠం ఉద్దేశం.

## రచయిత పరిచయం



జననం: 22.04.1939
మరణం: 01.06.2022

శీలా వీర్రాజు రాజమండ్రిలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు వీరభద్రమ్మ, సూర్యనారాయణ. ఆయన రచయితగా, చిత్రకారుడుగా తనదైన ముద్ర వేశారు. సమాధి, మబ్బుతెరలు, రంగుటద్దాలు, ఊరు వీడ్కోలు చెప్పింది, మనసులో కుంచె, మొదలైన కథా సంపుటాలు, కొడిగట్టిన సూర్యుడు, కిటికీకన్ను, ఎర్రడబ్బా రైలు, పడుగుపేకల మధ్య జీవితం మొదలైన కవితా సంపుటాలను, మైనా, కరుణించని దేవత, వెలుగురేఖలు మొదలైన నవలలను రాశారు. వీరు 'శీలావీ'గా సుపరిచితుడు. 1969లో 'మైనా' నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి పురస్కారం లభించింది. **ఈ పాఠ్యాంశం శీలా వీర్రాజు వ్యాస సంపుటి 'కలానికి ఇటూ అటూ' నుండి గ్రహించబడింది.**

## ప్రక్రియ-వ్యాసం

ఏదైనా ఒక విషయాన్ని తీసుకొని దాని పూర్వాపరాలను చర్చిస్తూ, విశ్లేషణాత్మకంగా విస్తరించి రాసేదాన్ని వ్యాసం అంటారు. దీనిలో ఉపోద్ఘాతం, విషయ విస్తరణ, ముగింపు వంటివి ప్రధానాంగాలుగా ఉంటాయి. వ్యాసంలోని విషయాన్ని బట్టి చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక, శాస్త్ర, వైజ్ఞానిక, సాహిత్య, తాత్విక, ఆధ్యాత్మిక మొదలైన విభాగాలుగా విభజించవచ్చు. ఇందులో అనుభవానికి సంబంధించిన ఆత్మకథాత్మక వ్యాసాలు కూడా ఉండవచ్చు.

## I



నేను పుట్టి పెరిగిన ఊరిని విడిచిపెట్టి వచ్చేసి ముప్పై ఆరేళ్ళయ్యింది. ఆ ఊరిని విడిచిపెట్టే నాటికే బాల్యం నా నుంచి పారిపోయి పదేళ్ళయ్యింది. నా బాల్యం అంటే నాకు చాలా ఇష్టం. ఇప్పటికీ నేను అప్పుడప్పుడు చిన్నపిల్లవాడిని అయిపోతుంటాను. అబద్ధం కాదు...... నిజంగానే! నేను చిన్నవాడిని అయిపోతుంటాను. అలాంటప్పుడు, యింకా అలానే మరికొంతసేపు ఆ బాల్యంలోనే వుండిపోతే బాగుండుననిపిస్తుంది. కల కదా, ఎక్కువసేపు వుండనివ్వదు. చటుక్కున కల చెదిరిపోయి మళ్ళీ నా అసలు వయసులోకి వచ్చేస్తుంటాను. ఎప్పుడైనా రైలు ప్రయాణం చేస్తున్నప్పుడో, సాయంత్రంపూట వర్షం వస్తుంటే వూళ్ళోకి వెళ్ళలేక గదిలో కూచుని కిటికీ లోంచి వెనక వీధిలో చూస్తున్నప్పుడో, పుట్టినరోజు నాడో నా కెందుకో విధిగా బాల్యం గుర్తుకు వస్తూనే వుంటుంది – ఏ ఏడాది కా ఏడాది బాల్యానికి నేను దూరం జరిగిపోతున్నాననే దిగులు వల్లనో ఏమో మరి! ఆ రోజులు మళ్ళీవస్తే బాగుండును కదా! అని కూడా అనుకుంటాను.

ఎంత అమాయకమైన రోజులవి! ఎంత చక్కని రోజులవి! ఆట పాటల్తో, ఆనందంగా, హాయిగా, నిష్కల్మషంగా, ఏ చీకూ చింతా లేకుండా గడిచిపోయాయి. చూస్తూ చూస్తుండగానే బాల్యం చెయ్యిజారిపోయింది! "మాటిమాటికీ నువ్వు అలా మారం చేయడానికి నువ్వింకా చిన్నపిల్లవాడివే ననుకుంటున్నావా" అని నాన్న కోప్పడినప్పుడే నేను బాల్యాన్ని దాటుకుని వచ్చేసానని అర్థమైంది. చితికిపోయిన మధ్యతరగతి కుటుంబంలో బాల్యం ఎలా గడుస్తుందో అలానే గడిచింది నాకునూ.

బాల్యాన్ని తలచుకుని గర్వపడే ప్రత్యేకతలేవీ నాకు లేవు. కానీ యీనాడు నన్ను నేను చూసుకుని గర్వపడడానికీ, తృప్తిపడడానికీ కారణమైన మూలబీజాలు మాత్రం నా బాల్యంలోనే వున్నాయి. నేను చిత్రకారుడిని కావడానికీ, సాహితీవేత్తను అవడానికీ ఆ రోజుల్లోనే పునాదులు పడ్డాయి. నాకు యింకా గుర్తుంది... చిన్నప్పుడు మా యింటికి వెనకవీథిలో రామ్మూర్తిగారని ఒక ముసలాయన ప్రయివేట్లు చెప్తుండేవారు. ఒక రూపాయి ఫీజు. అక్కడ ట్యూషనుకు వచ్చేవాళ్లు సుమారు ఇరవైమంది పిల్లలుండేవారు. వాళ్ళల్లో నేనూ ఒకడిని. నాది ఎలిమెంటరీ స్కూలు చదువు, బడినించి రాగానే ప్రయివేటుకి వెళ్ళేవాడిని. రాత్రి చీకటిపడేవరకు స్కూలు పుస్తకాల పాఠాలే కాకుండా ఇతర విషయాలుకూడా చెప్తుండేవారు. పెద్ద బాలశిక్ష చదివించేవారు. నీతి శతాకాల్లో పద్యాలు బట్టీపట్టించేవారు. ఎక్కాలు వల్లెవేయించేవారు. జంతువుల కథలు, బహుశా పంచతంత్ర కథలు కావచ్చు, చెప్పేవారు.

**ఆలోచించండి - చెప్పండి**

1. ఆ రోజులు మళ్ళీ వస్తే బాగుండు కదా! అని రచయిత ఎందుకు అనుకున్నాడు?
2. వీథిలో కిరసనాయిలు దీపాలు ఎందుకు వెలిగించ వలసి వచ్చింది?

ఒక రోజున పాఠాలు చెప్పడం అయిపోయాక, యింకా చీకటి పడలేదు కదా! అని బొమ్మలు వెయ్యమన్నారు. నేను విమానం బొమ్మ, ఇల్లు బొమ్మ, కిరసనాయిలు బుడ్డిదీపం బొమ్మా వేసాను. యుద్ధం రోజులు, తరచుగా ఆకాశంలో కాస్త కిందనించి విమానాలు ఎగురుతుండగా చూసినందువల్లనో ఏమో! అది వేసాను. మా ప్రయివేటు చెప్పే అరుగు ఎదురుగా రోడ్డుమీద కిరసనాయిలు వీధిదీపం వుంది. అప్పుడే ఒకాయన చిన్ననిచ్చెనతో వచ్చి బుడ్డి దీపంలో కిరసనాయిలు వేసి వెళ్ళడం చూసినందువల్ల మనసులో ఆ రూపం మెదిలి దానిబొమ్మ వేసాను. ఆ రోజుల్లో మావూళ్ళో పెద్దపెద్ద రోడ్లలో మాత్రమే కరెంటు దీపాలు ఉండేవి. మిగతా వీథులన్నిట్లో కిరసనాయిలు దీపాలే.

ఆ రోజున నేను వేసిన బొమ్మలకి నాకు ఫస్టు మార్కు వేసారు. బాగా వేసానని మెచ్చుకున్నారు. పలకమీద వేసిన ఆ బొమ్మలు చెరిగిపోకుండా జాగ్రత్తగా యింటికి తీసుకెళ్ళి మా అమ్మానాన్నలకు చూపించాను. వాళ్ళూ బాగున్నాయన్నారు. నేను బొమ్మలు బాగా వేస్తాను గాబోలు అనుకున్నాను. అప్పటినుంచి అప్పుడప్పుడు యింటి దగ్గర క్లాసు పుస్తకాల్లోని బొమ్మల్ని కాపీచేసి వేస్తుండేవాడ్ని. పలకమీద బలపంతో వేస్తుండే వాడినల్లా, కాగితంమీద పెన్సిలుతో వేయడం మొదలెట్టాను. కొంతకాలానికి చేయి తిరిగింది. ఆ తరువాత వాటర్ కలర్ బొమ్మలు, దామెర్ల రామారావు ఆర్ట్ గేలరీవారు హైస్కూలు విద్యార్థుల కోసం నిర్వహించే పోటీలలో పాల్గొనడాలు జరిగేవి.

మా పెదనాన్నగారు, మేమూ పక్కపక్కనే వుండేవాళ్ళం. మా పెద్దమ్మకి ఒక అక్క వుండేది. ఆమెకి చిన్నప్పుడే వైధవ్యం సంభవించి, తల్లిదండ్రులు చనిపోతే మా పెద్దమ్మ యింటికే వచ్చిచేరింది. పిల్లలు లేరు. ఆమెకు ప్రత్యేకంగా ఒక గది వుండేది. ఆ గదినిండా బొమ్మలే. ప్లాస్టిక్కువి, చెక్కవి, ఇత్తడివి, గాజువి, పింగాణీవి చిన్నచిన్న ఆటబొమ్మలు గది గోడలమీద, పెట్టెలమీద ఒక్క అరడుగైనా ఖాళీలేకుండా అంతటా నిండివుండేవి. పిల్లల్ని ఎవరిని ఆ గదిలోకి రానిచ్చేదికాదు. కిటికీలోంచో, కొద్దిగా తీసిన తలుపురెక్కల ఖాళీలోంచో బొమ్మలు చూసి ఆశ్చర్యపోతుండేవాళ్ళం. ఆ ఆసక్తే ఆ తర్వాత్తర్వాత నాకు కళాఖండాల సేకరణపట్ల అభిరుచి కలగడానికి కారణం.

ఆస్తిపంపకాల్లో మా నాన్నగారికి వచ్చిన వాటాలో వీథివైపునకు ఒకగది వుండేది. ఆ గదికి ఆకుపచ్చవి, ఎర్రవి అద్దాలరెక్కలున్న కిటికీలు వుండేవి. చిన్నప్పుడు ఆ రంగురంగుల అద్దాల్లోంచి వీధిలో వచ్చీపోయే జనాల్ని చూడ్డం భలే సరదాగా వుండేది. మధ్యాహ్నం దాటిన తరువాత ఎండ ఆ అద్దాల కిటికీలోంచి గదిలో పడి రంగులు గదినిండా పరుచుకుంటే, చూడ్డానికి ఎంతో ముచ్చట వేసేది. చదువుకోడానికి నేను ఆ గదినే వాడుకునేవాడిని.

బాల్యంలోని యీ సంఘటనలూ, దృశ్యాలే నాలో ఒక చిత్రకారుడు తయారు కావడానికి కారణం అయివుండవచ్చు. వీటికితోడు మా వూరిని ఆనుకుని విశాలంగా పరచుకుని ప్రవహించే జీవనది గోదావరి, దానిమీద ఊగిసలాడుతూ కదిలే

> **ఆలోచించండి - చెప్పండి**
>
> 1. మీరు బొమ్మలు వేయడానికి, కథలు, కవితలు, పాటలు రాయడానికి ఎప్పుడైనా ప్రయత్నించారా? వాటి గురించి చెప్పండి.
> 2. వీర్రాజు చదువుకోవడానికి వాడేగది ఎలాంటిది?

పడవలూ, రంగురంగుల ఆకాశం, ఊరిచుట్టూ అల్లుకుపోయిన చెట్లూచేమలూ-ఇవన్నీ పరోక్షంగా నాలో చిత్రకళపట్ల ఆసక్తి కలగడానికి బాల్యంలో దోహదం చేసివుండొచ్చు.

సాహిత్యానికి సంబంధించికూడా నాలో బాల్యంలోనే బీజాలు పడ్డాయి. మిషనరీ స్కూల్లో ఆరో తరగతో, ఏడో తరగతో చదువుకొంటున్న రోజులు. మా యింటిదగ్గరే వుండే ప్రకాశరావు, అప్పారావు అనే బాల్యమిత్రులు పిల్లలకోసం నెలనెలా ఒక చేతివ్రాత పత్రిక తీసుకువద్దాం అన్నారు. చందమామ, బాల, పాపాయి అనే పత్రికలు చదివి అందులోలాంటి రచనలు అటూయిటూ మార్చి కొత్తది తయారుచేసేపని ప్రకాశరావుదీ, నాదీ. అప్పారావు దస్తూరీ ముత్యాల కోవలాగ వుంటుంది. గనుక, వాటిని చందమామ పత్రికసైజు కాగితాల మీద అందంగా రాసే పని అతనిది. లోపల అక్కడక్కడ చిన్నచిన్న బొమ్మలు వేసి, అట్టమీద బొమ్మ రంగుల్లో వేసి పుస్తకంగా కుట్టి గోదావరి ఒడ్డున రామకృష్ణా మిషన్ వారి రీడింగ్ రూంలో పెట్టేవాళ్ళం. కొన్నినెలలు అలా చేయగలిగాం. అందుకోసం మాఊళ్ళోని' పిచ్చిపుల్లయ్య' కొట్లో అర్ధణాకీ, అణాకీ పాతవి పిల్లల పత్రికలు కొని తెచ్చి చదవవలసి వచ్చేది. బాల్యంలో నాలో సాహిత్యాభిరుచికి అది తొలిమెట్టు. అయిదో ఆరో సంచికలతో మా ప్రయత్నం ఆగిపోయినా, ఆ తర్వాత పుస్తకాలు చదివే లక్షణం కొనసాగుతూ వచ్చింది. మా యింట్లో పుస్తకాలు కొనే అలవాటు లేదు. మా తల్లిదండ్రులిద్దరిదీ వానాకాలపు చదువే.

మేగజైన్లు, పుస్తకాలేకాక దినపత్రికకూడా కొనే అలవాటు లేదు. అందువల్ల బాల్యమిత్రుడు ప్రకాశరావు దగ్గరనుంచి పుస్తకాలు తెచ్చుకునో, లైబ్రరీకి వెళ్ళో చదివేవాడిని. ఆ చదివే గుణం ఆ తర్వాత రాసే అభిరుచిలోకి పరిణామం చెందింది.




సృజనాత్మక విషయాలలోనే కాదు నా అభిరుచులు, నా విశ్వాసాలు, నా గుణగణాలు, నా నడవడిక, నా వ్యక్తిత్వానికి సంబంధించిన అన్ని అంశాలకు చాలావరకు బాల్యంలోనే పునాదులు పడ్డాయి. నాకేకాదు చాలామందికి బాల్యంలోనే మూలాలు దొరుకుతాయి. కాలంతోపాటు అవి నాలుగు వైపులకూ విస్తరించుకుని, వికాసం పొందుతూ మనిషి చుట్టూ అల్లుకుపోయి అతనికి ఒక వ్యక్తిత్వాన్నీ, సృజనాత్మక శక్తి సామర్థ్యాలనీ యిస్తాయి.

ఎనిమిది వీథులతో కూడిన మా పేటలో తొంభైఅయిదు శాతంమంది చేనేత కుటుంబాలవారే. వృత్తిపని చేసుకునేవారూ, ప్రతివీథిలోనూ అయిదారు చొప్పున వెలసిన మూసల (క్రూసిబుల్స్) కంపెనీల్లోనూ, ఇత్తడి, అల్యూమినియం పోతపాత్రల్ని తయారు చేసే కంపెనీల్లోనూ పనిచేసేవారూ సగంకన్న ఎక్కువే వుండేవారు. మిగిలినవారు బట్టల దుకాణాల్లో గుమాస్తాలుగా పనిచేస్తుండేవారు. అప్పట్లో చదువుకునేవారు చాలా తక్కువ. అంతా శ్రామిక వర్గమే. నా పద్నాలుగో ఏట తూర్పు గోదావరి జిల్లా విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో జరిగిన మహాసభల సందర్భంగా ఆర్ట్ ఎగ్జిబిషన్ పెట్టారు. అందులో ప్రదర్శించిన నా చిత్రానికి ప్రథమ బహుమతి రావడం, డాక్టర్ గరికపాటి రాజారావుగారి చేతులమీదుగా ఆ బహుమతిని అందుకోవడం, అదే నా తొలి బహుమతి కావడం నాకో కొత్త అనుభవం.

ఇప్పటి నాకూ, నా బాల్యానికీ మధ్య నాలుగున్నర దశాబ్దాల దూరం వుంది. ఇన్నేళ్ళలో దేశసామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. నాలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. ఎన్నెన్నో ప్రభావాలు నా మీద పడ్డాయి. కొత్తకొత్త అభిరుచులు ఏర్పడ్డాయి. కొత్తమిత్రులు ఏర్పడ్డారు. అయినా బాల్యమిత్రుల్ని నేను వదులుకోలేదు. వాళ్ళూ నన్ను వదిలేయలేదు. నా మట్టుకు నాకు బాల్యంలో పెనవేసుకున్న

> **ఆలోచించండి - చెప్పండి**
>
> 1. బాల్య మిత్రులను ఎందుకు వదులుకోలేము?
> 2. స్నేహం కలకాలం నిలబడాలంటే ఏం చేయాలి?
> 3. వానాకాలం చదువు అంటే మీకేమి అర్థం అయింది?

స్నేహాలే ఇప్పటికీ. ఏమాత్రం సడలిపోకుండా అలాగే కొనసాగుతూ వస్తున్నాయనిపిస్తుంది. స్నేహం స్నేహంకోసమే చేయడం ఒక్క బాల్యంలోనే వుంటుందని నేను అనుకుంటూ వుంటాను.

ఎంతో ఆత్మీయంగా, సన్నిహితంగా కలిసిమెలిసి వున్న చిన్ననాటి మిత్రులు నలుగురిలో ఒకరిని కాలం కాటేసింది. ముగ్గురు మిగిలారు. నాతోపాటు నలుగురం. ఎప్పుడోగాని మేం కలుసుకోం. కాని కలుసుకున్నప్పుడుమాత్రం మళ్ళీ చిన్నపిల్లలమైపోయి చాలా స్వచ్ఛమైన మనసుతో, నిష్కల్మషమైన చూపులతో, ఆత్మీయతతో, అభిమానంతో ఒకరి హృదయాల్లోకి ఒకరం ఒదిగిపోతాం. ఈ మధ్యకాలంలో ఏర్పడిన అభిప్రాయభేదాలు కాని, అంతరాలుకాని మాకు అడ్డుగా నిలవ్వు. ఒకరి లోపాల్ని ఒకరం తేలిగ్గా క్షమించుకోగలుగుతాం. ఎందుకోగాని ఆ తర్వాత ఏర్పడిన స్నేహాల్లో యిది కనిపించడం లేదు. ఒకరికొకరం ఎంత సన్నిహితంగా వచ్చినా, ఒకరికొకరం ఆప్యాయతల్ని ఎంతగా యిచ్చి పుచ్చుకుంటున్నా ఒకరిలోపాలు ఒకరికి గోరంతలు కొండంతలుగా అనిపించడమూ, ఒకర్ని ఒకరం తేలిగ్గా క్షమించలేకపోవడమూ గమనించాను.

అందుకే, జారిపోయిన బాల్యం ఎలాగూ తిరిగిరాదు కనుక, 'కనీసం బాల్యంలోని ఆ మనసైనా నాకు మళ్ళీ వస్తే ఎంత బాగుండును!' అనుకుంటూ వుంటాను.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.**

1) వీర్రాజుకు బాల్యం ఎప్పుడు గుర్తొస్తుంది?

2) రామ్మూర్తి మాస్టారి గురించి చెప్పండి.

3) మాస్టారు బొమ్మలు వెయ్యమన్నప్పుడు వీర్రాజు ఏయే బొమ్మలు వేశాడు?

4) వీర్రాజుకు కళాఖండాలసేకరణ పట్ల అభిరుచి ఎలా కలిగింది?

**ఆ) కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి**

నేను స్కూల్ వర్క్ ఎందుకు చేస్తున్నానో చాలా కాలం నుంచి నాకు తెలియదు. యుద్ధం ఆగడం కనుచూపుమేరలో ఎక్కడా కనిపించడం లేదు . సెప్టెంబర్‌లో గాని యుద్ధం ఆపకపోతే నేను రెండేళ్లు వెనకబడాల్సి వస్తుంది. నేను స్కూల్ వర్క్ కొనసాగించాలని, జర్నలిస్ట్ కావాలని నిర్ణయించుకొన్నాను. నేను రాయగలనని నాకు తెలుసు. నావి కొన్ని కథలు బాగున్నాయి.నా డైరీ ఎక్కువగా జీవితానికి దగ్గరగా ఉంది. కానీ నాకు నిజంగా సృజన ఉందో లేదో చూడాలి. ఈవాస్ డ్రీమ్ అనేది నా మొదటి జానపద కథ. బాగుంది కానీ మొత్తం మీద అదేమంత గొప్పది కాదు. నాకు నేనే మంచి విమర్శకురాలిని. ఏది బాగుందో ఏది బాగుండలేదో నాకు తెలుసు. నువ్వు రాస్తే తప్ప రాయడంలో ఉన్న ఆనందం, సంతోషం ఎంత బాగుంటుందో నీకు అర్థం కాదు. నేను బొమ్మలు వేయలేనని ఎప్పుడూ బాధపడేదాన్ని. కానీ ఇప్పుడు రాయగలనన్న సంతోషం ఎంతో ఉంది. ఒకవేళ నాకు పుస్తకాలు రాయడానికి పేపర్లో వ్యాసాలు రాయడానికి తగిన శక్తి లేకపోతే నాకోసం రాసుకుంటాను. కానీ అంతకంటే ఎక్కువ సాధించాలని నా కోరిక. చాలామందిలాగా వృథాగా బతకడం నాకు ఇష్టం లేదు. నేను అందరికీ ఉపయోగపడాలి. నేను ఇప్పుడు వాళ్లను కలుసుకోలేకపోయినా సరే...నేను నా చావు తర్వాత కూడా బతకాలి. అందుకే నేను ఈ బహుమతి ఇచ్చిన దేవుడికి కృతజ్ఞతగా ఉంటాను. నేను రాస్తున్నప్పుడు నా గురించి అన్నీ దులిపేసుకుంటాను.నాకు విచారం పోతుంది. నాకు ధైర్యం వస్తుంది. కానీ ఒకటే పెద్ద ప్రశ్న. నేను ఎప్పటికైనా ఒక గొప్ప రచన చేయగలనా? జర్నలిస్ట్ కాని, రచయిత గాని అవగలనా? నేను అలాగే ఆశిస్తాను. నా ఆలోచనల్ని, ఆదర్శాల్ని రాత రూపంలో పెట్టగలను.



(రెండో ప్రపంచ యుద్ధంలో నాజీలు యూదుల్ని తుదముట్టిస్తున్నప్పుడు 14 ఏళ్ల అన్నా ఫ్రాంక్ కుటుంబం రహస్య జీవితం గడపాల్సి వచ్చింది. గాలి వెలుతురు సరిగ్గా లేని ఒక ఇరుకు గదిలో వాళ్లు గడిపారు. ఆ కాలంలో 1942- 44 వరకు ఆమె రాసుకున్న డైరీ ప్రపంచ ప్రసిద్ధి చెందింది). **- అన్నా ఫ్రాంక్ డైరీ 1944 ఏప్రిల్ 5నుంచి**

ప్రశ్నలు:

1. ఫ్రాంక్ కోరిక ఏమిటి?
2. ఫ్రాంక్ రాసిన కథ పేరు ఏమిటి?
3. ఫ్రాంక్ ఎలా బతకాలని నిర్ణయించుకుంది?
4. గద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

**ఇ) కింది గద్యాన్ని చదివి జవాబులు రాయండి.**




మా నాన్నని తలుచుకోగానే నా కళ్ళ ముందుకు వచ్చే దృశ్యం కలం, కాగితాలు పట్టుకొని ఆయన ఎప్పుడూ రాసుకుంటూ ఉండడం. మేము కొంచెం పెద్దయ్యాక ఆయన మాకు రాత్రిళ్ళు ఆకాశంలో నక్షత్రాలని, గ్రహాలను చూపించి వాటి పేర్లు చెప్పేవాళ్ళు. ఒక చిన్న సైజు టెలిస్కోపును కూడా ఆయన ఇంట్లోనే తయారు చేశారు. సూర్యగ్రహణాలు, చంద్రగ్రహణాలు ఎలా ఏర్పడతాయో నా చిన్నతనంలోనే వివరించారు. మా ఇంట్లో ఇంగ్లీషు అమెరికన్ రష్యన్ రచయితల ప్రసిద్ధ గ్రంథాలు ఉండేవి. ఖగోళశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు, మానవ పరిణామం గురించిన పుస్తకాలు, ఈజిప్ట్ మాయా నాగరికత గురించిన పుస్తకాలు అన్ని మాకు అందుబాటులో ఉండేవి. వాటిని చదివే వాళ్ళం. చీమల గురించి, లిపి పుట్టుపూర్వోత్తరాల గురించి ఎన్ని వందలసార్లు చదివామో లెక్కేలేదు. ఎప్పుడైనా ఫలానా పుస్తకం చదివావా? అని అడిగేవారు. నాకు ఇప్పటికీ ఆశ్చర్యం వేసే విషయం ఏమిటంటే 'నాన్న' ఈ పని చెయ్యి ఇది చదువు అని ఎన్నడూ మాతో అనలేదు. ముఖ్యంగా పదహారేళ్లు వచ్చాక ఏదైనా చెప్పాలంటే సూచించేవారు తప్ప ఎప్పుడూ ఏదీ బలవంతానా మాచేత చేయించలేదు. ఆయన నుంచి నేను నేర్చుకున్న ముఖ్యమైన విషయాలలో ఇది కూడా ఒకటి. ఎప్పుడూ ఎవరిమీదా మన అభిప్రాయాన్ని రుద్దకూడదు. బలవంతంగా రుద్దడం వల్ల తాత్కాలిక ఫలితాలు ఉంటాయేమో కానీ పిల్లల వ్యక్తిత్వాలు సమగ్రతను సాధించలేవని. తండ్రి కొడవటిగంటి కుటుంబరావు గురించి శాంతా సుందరి చెప్పారు.

**ద్వా.నా.శాస్త్రి (సంకలనం చేసిన "మా నాన్నగారు" గ్రంథం నుంచి)**

ప్రశ్నలు :

1. తండ్రిని తలుచుకోగానే శాంతా సుందరికి కనిపించే దృశ్యం ఏమిటి?
2. శాంతా సుందరికి చిన్నప్పుడు తండ్రి ఏమి వివరించేవాడు?
3. తండ్రి నుండి శాంతా సుందరి ఏం నేర్చుకుంది?
4. పై గద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

**ఈ) కింది వాక్యాలకు అర్థసందర్భములు రాయండి.**

1. మాటిమాటికీ మారాం చేయడానికి నువ్వింకా చిన్నపిల్లాడివేననుకుంటున్నావా.
2. ఎంత అమాయకమైన రోజులవి.

**ఉ) కింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. 'చేజారిన బాల్యం ఏ గ్రంథంలోనిది?
2. వీర్రాజుగారు తొలి బహుమతి ఎవరి చేతుల మీదుగా అందుకున్నారు?
3. వీర్రాజుగారితో చేతివ్రాత పత్రిక తీసుకొద్దామని ఎవరన్నారు?

## వ్యక్తీకరణ-సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి**

1. వీర్రాజు గారికి కళాఖండాల సేకరణపట్ల అభిరుచి ఎలా కలిగింది?
2. వీర్రాజు చిత్రకారుడు కావడానికి పునాదులు బాల్యంలో ఎలా ఏర్పడ్డాయో వివరించండి?
3. మిత్రులతో కలిసి వీర్రాజు చేతివ్రాత పత్రికను ఎలా నిర్వహించాడు?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాలలో సమాధానాలు రాయండి**

1. పాఠం ఆధారంగా వీర్రాజుగారు బాల్యాన్ని గుర్తుచేసుకున్న విధానాన్ని సంక్షిప్తంగా రాయండి.
2. వీర్రాజుగారి సాహిత్యాభిరుచిని వివరించండి.
3. వీర్రాజుగారి సృజనాత్మకశక్తిని గురించి రాయండి.

**ఇ) కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి**

1. మీ అభిరుచులేమిటి? మీ చదువును, అభిరుచులను ప్రోత్సహించిన వారి గురించి రాయండి.
2. మీరు చూసిన చిత్రకళా ప్రదర్శన గురించి పత్రికకు ఒక వ్యాసం రాయండి

## భాషాంశాలు పదజాలం

**అ) కింది ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి సొంతవాక్యాలు రాయండి**

1. పిల్లలు నిష్కల్మషంగా ఉంటారు.

_______________________________________________

2. మంచి ప్రవర్తనకు చిన్నతనంలోనే బీజం పడాలి.

_______________________________________________

3. కష్టపడి చదివితే ఉత్తరోత్తరా అభివృద్ధి ఉంటుంది.

_______________________________________________

**ఆ) ఇచ్చిన పదాలకు కింది వాక్యాలలో పర్యాయ పదాలను గుర్తించి రాయండి** (ఏడాది, హృదయం, వర్షం, ఈప్సితము)

1. ఒక అబ్దం వర్షాలు పడితే మరో సంవత్సరం వర్షాలు తగ్గుతాయి.
2. డెందమునకు శాంతి అవసరం. అప్పుడు ఎదకి హాయిగా ఉంటుంది.
3. ఈ సంవత్సరం వానలు ముమ్మరంగా పడ్డాయి.ఆ వృష్టి వల్ల వాగులు పొంగి పొర్లాయి.
4. కోరిక నెరవేరాలంటే కష్టపడాలి .అప్పుడే ఆకాంక్ష తీరుతుంది.

**ఇ) కింది ప్రకృతి వికృతులను జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. ఆసక్తి | ( ) | అ) కండ /గండ్ర |
| 2. తంత్రం | ( ) | ఆ) ఆసత్తి |
| 3. చిత్రం | ( ) | ఇ) తంతు |
| 4. ఖండం | ( ) | ఈ) చిత్తరువు |

ఈ) కింది వాక్యాలలో జాతీయాలను గుర్తించి, వివరించి రాయండి.

1. అతడు చేయి తిరిగిన రచయిత : ______________________

2. జీవితం చేజారిపోనీయకూడదు : ______________________

3. చీకుచింతా లేని జీవితమే జీవితం : ______________________

4. ఉన్నత జీవితానికి మూలబీజాలు బాల్యంలోనే నాటాలి : ______________________

## వ్యాకరణాంశాలు

అ) కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి

1. అప్పుడప్పుడు : ________ + ________ = ____________
2. దీపాలు : ________ + ________ = ____________
3. ఎప్పుడైన : ________ + ________ = ____________
4. దశాబ్దం : ________ + ________ = ____________
5. గర్వపడు : ________ + ________ = ____________

ఆ) కింది పదాలను కలిపి, సంధి పేరు రాయండి.

1. తల్లి + తండ్రి : ____________ ____________
2. ఇన్ని + ఏళ్ళు : ____________ ____________
3. పుస్తకము + లు : ____________ ____________
4. చిన్న + అప్పుడు : ____________ ____________
5. సాహిత్య + అభిమానం : ____________ ____________

ఇ) కింది సమాసపదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసం పేర్లు రాయండి.

1. సాహిత్యాభిరుచి : ____________ ____________
2. చేతిరాత : ____________ ____________
3. నిష్కల్మషము : ____________ ____________
4. నాలుగుదిక్కులు : ____________ ____________

**ఈ. కింది విగ్రహవాక్యాలను సమాసపదాలుగా మార్చి సమాసం పేర్లు రాయండి.**

1. చిన్నదైన పిల్ల : ____________ ________________
2. బద్ధం కానిది : ____________ ________________
3. శక్తి మరియు సామర్థ్యము : ____________ ________________
4. మాయకము కానిది : ____________ ________________
5. బాల్యము నందలి మిత్రులు : ____________ ________________

**ఉ) ప్రత్యక్ష పరోక్ష వాక్యాలు**

"నువ్వింకా చిన్న పిల్లవాడివి" అని నాన్న అన్నాడు.

నువ్వింకా చిన్న పిల్లవాడివని నాన్న అన్నాడు.

ఈ రెండింటిని అనుకరణ లేక అనుకృతి వాక్యాలు అంటారు. రెండు వాక్యాలలోనూ తేడా ఉంది. మొదటి వాక్యంలో మరొకరు చెప్పిన వాక్యాన్ని యథాతథంగా అనుకరించడం ఉంది. రెండవ వాక్యంలో విషయాన్ని లేదా అభిప్రాయాన్ని మాత్రమే అనుకరించడం ఉంది. మొదటి వాక్యంలో "చిన్నపిల్లవాడివి" అని ఉంటే రెండవ వాక్యంలో 'చిన్నపిల్లవాడివని' అని కనిపిస్తుంది. మొదటి వాక్యాన్ని ప్రత్యక్ష అనుకృతి అని రెండవ వాక్యాన్ని పరోక్ష అనుకృతి అని అంటారు

ప్రత్యక్ష అనుకృతి పరోక్ష అనుకృతిగా మారినప్పుడు కొన్ని మార్పులు వచ్చాయి చూశారు కదా.. ఈ రెండిట్లో "అని" అనేది అనుకారకం. అంటే అనుకరిస్తున్నట్లు చెప్పే పదం. ఇప్పుడు ఈ రెండు వాక్యాల స్వభావాన్ని ఈ కింది విధంగా చెప్పవచ్చు.

ప్రత్యక్షానుకృతి

ఇతరులు చెప్పిన విషయాన్ని లేక తను చెప్పిన విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా అనుకరించి చెప్పడం.

ఉదాహరణ : 1. "నేను రాను" అని రవి రాజుతో అన్నాడు. 2. కోడి "కొక్కురోకో" అని కూస్తుంది.
3. "వ్యక్తికి బహువచనం శక్తి" అని అన్నాడు శ్రీశ్రీ.

పరోక్షానుకృతి : అనుకరించిన దానిలో విషయాన్ని, అభిప్రాయాన్ని మాత్రమే అనుకరించడం.

అనుకారకం : "అని" అనుకారక పదం కొన్ని సందర్భాలలో లోపించవచ్చు కూడా.

ఉదాహరణ :
1. వ్యక్తికి బహువచనం శక్తని అన్నాడు శ్రీశ్రీ.
2. నీవు ఎక్క దలచిన ట్రైను జీవితకాలం లేటని ఆరుద్ర అన్నాడు.
3. తాను రానని రవి రాజుతో అన్నాడు.
4. కోడి కొక్కురోకోమని కూస్తుంది.

## ప్రాజెక్టుపని

ప్రముఖుల ఆత్మకథలు, జీవిత చరిత్రలు చదివి వాటిలో వారి బాల్య జీవిత ఘట్టాలను సేకరించండి.

పాఠాంత పద్యం:

కం. జారిపోయిన ప్రతి నిమేషమ్ము గూడ
బ్రతుకు నందు భాగమ్ము పంచికొనును
దీపమున్నప్పుడే యిల్లు దిద్దుకొంచు
మించిపోనీరు సమయమ్ము మంచివారు - బొడ్డులూరు నారాయణరావు

భావం: కాలం విలువ తెలిసిన ఉత్తములు ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిని పొందుతారు దీపమున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలనే సామెతను నిజం చేస్తారు. సమయాన్ని వృథా కానీయరు.

సూక్తి : "మనకు లభించే చిన్న అవకాశాలే భవిష్యత్తులో ఉన్నత శిఖరాల్ని చేరుస్తాయి". - బెంజమిన్ ఫ్రాంక్లిన్

## మీకు తెలుసా?

### చిందు భాగవతం

యక్షగానం అతి ప్రాచీనమైనది పల్లె ప్రజలకు అందుబాటులో ఉన్న రమణీయ కళారూపం. ఈ కళారూపాన్ని అనుసరించి నృత్యకేళిక చేయువారే చిందు వారు. ఈ కళారూపానికి సుమారు రెండువేలసంవత్సరాల చరిత్ర ఉంది. వృత్తులను అనుసరించి జాతులు ఏర్పడినట్లే ఆ జాతులపై ఆధారపడి వారికి వినోదాన్ని చేకూరుస్తూ జీవించే మరికొన్ని తెగలు ఏర్పడ్డాయి. వీరు రామాయణ, భారత, భాగవత కథలను నృత్యనాటకాలుగా ఆడుతారు. వీరు పగటి వేష గాళ్ళు. స్త్రీ పురుషులు ఇరువురూ ప్రదర్శనలో పాల్గొంటారు బృందాలుగా ఏర్పడి ప్రదర్శనలు ఇస్తారు. వీరి ప్రత్యేకత ఏమిటంటే పాడుతూ ఆడుతారు.

ప్రదర్శనకు కావలసిన అలంకరణకు సంబంధించిన వస్తువుల్ని దుస్తుల్ని వారే తయారు చేసుకుంటారు. జోగిత అనే పదాన్ని ఒక బిరుదుగా ధరిస్తారు. వారి ప్రదర్శనలో మృదంగం, తాళం, చిప్పలు, గజ్జెలు, హార్మోనియం మొదలైనవి ప్రధానంగా వాయించే వాయిద్యాలు. ప్రదర్శన ఇచ్చే సమయంలో ఎల్లమ్మ ఆట ఆడడం తప్పనిసరి. దీనివల్ల కరువుకాటకాలు రావని నమ్మే ప్రజలు ఈనాటికీ అనేక గ్రామాల్లో ఉన్నారు. సాధారణంగా చిందు కళాకారులు ఒకే కుటుంబానికి చెందిన వారై ఉంటారు ఈ కళాకారుల బృందాన్ని మేళం అని పిలుస్తారు.

### కోనసీమ జగ్గన్నతోట ప్రభల తీర్థం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోనసీమలోని అంబాజీపేట మండలం, మొసలపల్లి శివారు జగ్గన్నతోట కొబ్బరి తోటలో మకరసంక్రమణ ఉత్తరాయణపుణ్యకాలంలో కనుమనాడు ప్రభల తీర్థం నిర్వహిస్తారు. జగ్గన్నతోటలో గుడికానీ, గోపురంకాని ఉండదు. ఈ ఉత్సవం అత్యంత ప్రాచీనమైంది. కోనసీమ చుట్టు పక్కనున్న 90 గ్రామాలకు చెందిన ప్రభలు ఈ తీర్థంలో పాలు పంచుకుంటాయి.

ప్రభల నిర్మాణానికి చాలా శ్రమిస్తారు. సంక్రాంతికి 10 రోజుల ముందు ప్రభ తయారీ మొదలు పెడతారు. ముందుగా వెదురు కర్రలతో ప్రభకు ఒక ఆకారాన్ని తీసుకొస్తారు. రంగురంగుల వస్త్రాలతో, పూలతో అలంకరిస్తారు. ఏ గ్రామానికి చెందిన ప్రభపై ఆ గ్రామానికి చెందిన పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలతో అలంకరించి జగ్గన్నతోటకు మోసుకు వస్తారు. ఈ ప్రభలు భక్తులు వచ్చే దారిలో కాకుండా కౌశికనది దాటుకుంటూ, పొలాల మధ్యనుండి ఊరేగింపుగా వస్తాయి. ఈ ప్రభలను ఒకసారి ఎత్తిన తరువాత కిందకి దింపరు. కౌశికనది దాటేటప్పుడు ప్రభ ఏమాత్రం తడవకుండా తీసుకొస్తారు. కౌశికనదిని దాటించడానికి 50 మందికి పైగా శిక్షణపొందిన వ్యక్తులు సిద్ధంగా ఉంటారు. వీరు ప్రభను నది దాటించి జగ్గన్నతోట తీర్థ ప్రదేశానికి తీసుకొస్తారు. తీర్థం పూర్తయిన తర్వాత వచ్చిన దారినే తిరిగి ప్రభలను ఆయా గ్రామాలకి తీసుకెళతారు.

జగ్గన్నతోట ప్రభల తీర్థం 17వ శతాబ్దం నుంచి జరగడం చారిత్రాత్మకమైన విషయం. ఈ తీర్థంలో వేల మంది భక్తులు పాల్గొంటారు. ఈ ప్రభల తీర్థానికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది.

# 8 జీవని

– డా.వి.చంద్ర శేఖర రావు

## చదవండి – ఆలోచించి చెప్పండి



అది 2021వ సంవత్సరం. టోక్యో పారా ఒలింపిక్ 50 మీటర్ల షూటింగ్ క్రీడాపోటీ ఫైనల్ జరుగుతోంది. జనంతో కిక్కిరిసిన స్టేడియంలోకి చక్రాల కుర్చీపై ఓ మహిళ తొణకని ఆత్మస్థైర్యంతో ప్రవేశించింది. ఆ పోటీలో కాంస్యపతకాన్ని కైవసం చేసుకుంది. అప్పటికే 10మీ. ఎయిర్ రైఫిల్ లో బంగారు పతకాన్ని సాధించింది. ఆ మహిళే 'అవని లేఖరా'. ఒకే పారా ఒలింపిక్స్‌లో రెండు పతకాలను భారతదేశానికి అందించిన ఏకైక మహిళ ఆమె. తన పదకొండు సంవత్సరాల వయస్సులో జరిగిన కారు ప్రమాదంలో రెండు కాళ్ళు కోల్పోయి అంగవైకల్యం పొందినా! అధైర్య పడలేదు. తన చదువును కొనసాగిస్తూనే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తనకిష్టమైన షూటింగ్ అకాడమిలో చేరి శిక్షణ పొందింది. షూటింగ్ విభాగంలో మనదేశానికి స్వర్ణపతకం అందించిన 'అభినవ్ బింద్రాను' ఆదర్శంగా తీసుకుంది. అదే విభాగంలో రాణించి 2021లో రాజీవ్ ఖేల్‌రత్న అవార్డును, 2022లో రాష్ట్రపతి చేతుల మీదుగా 'పద్మశ్రీ' అవార్డుని అందుకుని ఎందరికో ఆదర్శంగా నిల్చింది. జీవితంలో ఏదైనా సాధించడానికి సంకల్పబలం ఉండాలే కాని శారీరక వైకల్యం ఎంతమాత్రం అడ్డుకాదని నిరూపించింది. (పత్రిక వార్త)

**ప్రశ్నలు:**

1. అవని లేఖరా ఘనత ఏమిటి?
2. అవని లేఖరా ఎవరిని ఆదర్శంగా తీసుకుంది?
3. పై పేరా నుండి మీరేం గ్రహించారు?

### ఉద్దేశం

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల సహానుభూతితో ఉండాలని వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి, వారికి అండగా నిలవాలని, వారి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

## రచయిత పరిచయం



జననం: 13.04.1959
మరణం: 08.07.2017

వర్ధమాన కథా రచయితలలో డా.వి. చంద్రశేఖరరావు ఒకరు. మహాలక్ష్మి, దేవసహాయం గార్లు వీరి తల్లిదండ్రులు. వీరు ప్రకాశం జిల్లాలో జన్మించారు. 'జీవని', మాయాలాంతరు, ద్రోహవృక్షం, లెనిన్‌ప్లేస్ మొదలైన కథా సంపుటాలు. నల్లమిరియంచెట్టు, ఐదుహంసలు, ఆకుపచ్చని దేశం నవలలను రాశారు. జీవని కథ నాటకంగా రూపొంది 1991లో ఆకాశవాణిలో ప్రసారమై జాతీయ స్థాయిలో ఉత్తమ నాటకంగా బహుమతి పొందింది. వీరు కథాశిల్పంలో నూతన ఒరవడి సృష్టించారు. **ఈ పాఠం వీరి 'జీవని' కథల సంపుటి నుండి గ్రహించబడింది.**

## ప్రక్రియ - కథ

కథ, కథానిక అనేవి నేడు పర్యాయ పదాలుగా వాడుతున్నాం. 'కథ' సాహిత్య ప్రక్రియ. వ్యక్తి జీవితంలోని ఒక ముఖ్య సన్నివేశాన్ని, సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రిస్తుంది. క్లుప్తత దీని లక్ష్యం. పాత్రలూ, నేపథ్యం, కథనం, జీవితవాస్తవిక చిత్రణ ఇందులో ముఖ్యాంశాలుగా కన్పిస్తాయి.

## I

నా స్వప్న ప్రపంచం మీద ఇంత నిర్లజ్జగా దాడి చేయడానికి వీళ్ళకేం అధికారం వుంది? ముప్పయి ఏళ్ళ ఎడారిలో, ఆశలన్నీ వదులుకున్న తరుణంలో ఒక మహాద్భుతంలా జరిగిందా సంఘటన. ఈ ఆరేళ్ళలో ఎన్నో క్లినిక్‌ల చుట్టూ తిరిగాను.

"ఏ క్లినిక్ లో ఏ గైనకాలజిస్ట్ చేతిలో నుంచి దయగా, కరుణగా జారిన ఏ మందు ప్రభావమో ఇది" అనుకుంటూ, భయం, భయంగా వెళ్ళాను డాక్టర్ సరళ దగ్గరికి. ఆమె నన్ను పరీక్ష చేస్తున్నప్పుడు "ఈ ఒక్క కలను సఫలం చెయ్యి తండ్రీ! ఈ దీనురాలి ఈ చిన్నికోర్కెను తీర్చుదేవా!" అంటూ దేవుణ్ని దీనంగా వేడుకున్నాను. ఆశ, నిరాశల మధ్య ఎండుటాకులా కంపించి పోయానా పదినిమిషాలు. 'కంగ్రాట్స్ లలితా' అన్న మాటలు మృదుమధురంగా వినిపించాయి. ఆవిడ చేతుల్ని పట్టుకొని, 'థాంక్యూ డాక్టర్'! థాంక్యూ' అంటూ ఆనందంతో పెద్దగా ఏడ్చిన సంగతి, 'డోంట్ బి ఎమోషనల్" అంటూనే ఆవిడ నా ఆనందంలో పాలుపంచుకోవడం. ఇదంతా జరిగి ఇంకా మూడునెలలు కూడా కాలేదు. ఇంతలోనే పిడుగుపాటు లాంటి నిర్ణయం."సారీ! మిసెస్ లలితా! మీకు ఈ విషయం ఎలా చెప్పాలో తెలియడం లేదు. ఆలస్యంగా గర్భవతులయ్యే స్త్రీలలో చాలా అరుదుగా జరుగుతుందిలా. పుట్టబోయే పిల్లలు మెదడు పెరగకుండా వుంటారు. వికృతమైన రూపురేఖలు, ఒక్కోసారి ముఖ్య అవయవాలు లోపంతో పుట్టడం జరుగుతుందన్నారు డాక్టర్లు. ఎంత నిర్దయ? అమృతభాండాన్ని చేతిలో పెట్టినట్లే పెట్టి అంతలోనే వెనక్కు లాక్కోవడం అంటే ఇదేనేమో! బిడ్డలు లేకపోవడం కంటే ఎవరో ఒకరు అనే నిర్ణయానికి వచ్చాను.

కాలం గడిచింది. నెలలు నిండాయి. లేబర్ రూము నుంచి స్ట్రెచర్ సాయంతో వార్డుకు తరలిస్తున్నారు నన్ను. ఉదయం తొమ్మిది గంటల సమయమది. వెచ్చని సూర్యకిరణం జాలిగా చెంపల్ని నిమురుతోంది. ప్రసవయాతన ముగిసి వార్డులో చేర్చిన పది నిమిషాలకు బిడ్డను తెచ్చి పక్కనే పడుకోబెట్టారు. నా ప్రక్కన మరొక ప్రాణి. ఈ ప్రపంచంలోకి వచ్చి ఇంకా పదినిమిషాలు కూడా కాలేదు. బిడ్డస్పర్శ వెచ్చగా శరీరానికి తగులుతూ వుంటే తగిలినంతమేరా శరీరం వీణలా మారి, రాగలీనమవుతుంది. పుట్టిన బిడ్డ గురించి డాక్టర్ నా చెవి దగ్గర గుసగుసలాడింది. స్వర్గలోకం నుండి నా ద్వారా భూమి మీదికి షికారుకు వచ్చిన దేవదూత ఆడ అయితేనేం, మగ అయితేనేం? బిడ్డను దగ్గరకు జరుపుకొని తల పైకెత్తి దాని ముఖంలోకి చూశాను నిద్ర నటిస్తుంది. కనురెప్పల తలుపుల చాటున ఏ తీయని కలలు దాగున్నాయో? రెండు గంటల తరువాత కొద్దిగా పాలు త్రాగించగలిగాను. ఆ పాప మొదటి ఆకలి తీర్చాను. అత్త, ఆడబిడ్డ, భర్త ఇలా కుటుంబమంతా వున్నా, ఎవరూ మమ్మల్ని పట్టించుకోలేదు. "అందరూ ఉన్నా నేను ఒంటరినే!" అని అనిపించింది ఆ సమయాన. ఆ సాయంత్రమే డిశ్చార్జి చెయ్యమని

డాక్టర్ని అడిగాను. ఇంటికి వెళ్ళడానికి అనుమతిచ్చారు. హాస్పటల్ నుండి బయటకు నేను వేసే ఒక్కొక్క అడుగు నాలో మొండితనాన్ని, పట్టుదలను పెంచాయి. లక్ష్యం కొరకు జీవించే సైనికురాలిలా ఇంటికి చేరాను నేను.

**ఆలోచించండి - చెప్పండి**

1. లలిత ఎలాంటి నిర్ణయం తీసుకుంది?
2. లలితకు తాను ఒంటరిని అని ఎందుకు అనిపించింది?

## II

రోజులు పరుగు పెడుతున్నాయి. ఒకరోజు నా భర్త, నా దగ్గరకు వచ్చి, “చూడు! ఈ పిల్లను మనం పెంచలేం! ఇలాంటి పిల్లల్ని పెంచడానికి బెంగుళూరులో ఆశ్రమం వుందట. పాపను అక్కడ చేర్చి, నెలకు ఇంతని పంపిద్దాం”. అని ఇంకా ఏదో చెప్పబోయి నా కళ్లలోని ఎరుపు చూసి ఆగిపోయాడు. ఆయన నా కళ్లలో అంత తిరస్కారం, ద్వేషం, కోపం ఎప్పుడూ చూసి వుండడు. “ఇంకోసారి నా దగ్గర ఇలాంటి మాటలు మాట్లాడవద్దు, ఈ పాప నా ప్రాణం! నా సర్వస్వం! ఇది నా దగ్గరే నాతోనే వుంటుంది. నా సర్వశక్తుల్ని ధారబోసి, దీన్ని పెంచుకుంటాను. అంటూ నాలో ఏదో శక్తి ఆవహించిన దానిలా మాట్లాడాను”. ఆ తరువాత ఆయన ఆ ప్రసక్తే తేలేదు. కానీ పాప దగ్గరకు రావడమే మానేశాడు.

రెండు నెలలు తరువాత ఒక ఉదయం మా వీధిలో గారడి ఆట జరిగింది. ఆ ఆటను తల్లి, తండ్రి, కూతురు ముగ్గురు కలిసి చేస్తున్నారు. తండ్రి డప్పు వాయిస్తూ “జయమ్ము నిశ్చయమ్మురా ! భయమ్ము లేదురా!” అంటూ పాడుతున్నాడు. తల్లి హార్మోనియం వాయిస్తూంది. అద్భుతాలన్నీ కూతురే చేస్తూంది. ఆ పాపకు ఐదేళ్ళయినా వుంటాయో లేవో? పొడవైన గౌను వేసుకొని ఉంది. ఆ గౌను దాని పాదాల్ని దాటి నేలపై జీరాడుతుంది. ఆ పాపాయి నా కంటికి ఓ మాంత్రికురాల్లా అనిపించింది. ఆ ఆటలో ఆ పాపాయి చేస్తున్న విన్యాసాలు నాలో ఆశ్చర్యాన్ని కలిగించాయి. మరికొన్ని సాహస కృత్యాలు చూసి నాలో ఏదో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. ఇంత చిన్నపాప ఇన్ని అద్భుతాలు ఎలా చేయగలిగింది? ఎవరైనా ఏదైనా సాధించాలంటే శిక్షణ, తపస్సులాంటి పట్టుదల అన్నిటికంటే ముఖ్యంగా అవసరం. నాకు ఈ సందేశం ఇవ్వడానికే ఆ ఉదయం రోడ్డుపై అవతరించిన దేవతలా తోచిందా పాప. కష్టపడి నేర్పితే నా పాపకూడా తన జీవితానికి అవసరమైన పనులు నేర్చుకుంటుంది. అలాంటి పనులను అదే దీక్ష, పట్టుదలతో నేను నేర్పలేనా? అని నా మనస్సుకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. ఆట ముగిసింది. ఆ పాప ఇంటింటికి వెళ్ళి పైసలు తీసుకుంటూ నా దగ్గరకు వచ్చి నిలబడింది. అప్పుడు ఆ పాపాయి చేతిలో పది రూపాయల నోటు పెట్టి, నీ పేరేంటి?’ అన్నాను. ‘జీవమ్మంది’. చిరునవ్వుతో ‘థాంక్యూ జీవనీ సీనియర్’ అన్నాను. అర్థం కాని కళ్ళతో చూస్తూ వెళ్లిపోయిందా పాప. ఆ పేరు నాకూ ఇష్టమే అన్నట్లుగా లోపల జీవని జూనియర్ “కేర్ కేర్” మని ఏడుస్తుంది.

ఒక రోజు నేను పిల్లలకు వేసే టీకాల కోసం ఆసుపత్రికి వెళ్ళి వస్తున్నాను. చంకలో జీవని, భుజంపై వేలాడే హ్యాండ్ బ్యాగ్. సిటీ బస్సు నిండుగా ఉంది. ఆ జనం అరుపుల మధ్య “ పాపను నాకివ్వమ్మా”! అంటూ జీవనిని అందుకున్నాడు ఒక వృద్ధుడు. నెరిసిన జుట్టూ, కాంతివంతమైన కళ్ళూ, గొంతులో పొంగి పొర్లుతున్న అనురాగంతో జ్ఞానదీపంలా ఉన్నాడాయన. స్టేజి దగ్గర ఆయన నాతోపాటు దిగాడు. ‘థాంక్స్’ అంటూ పాపను అందుకోబోతుండగా ఇంటిదాకా ఆహ్వానించవా అన్నాడు నవ్వుతూ. ‘రండి’ అంటూ ఇంటివైపుకి దారితీశాను. సుమారు రెండు గంటలు ఆ వృద్ధుడు జీవనితో ఆప్యాయంగా గడుపుతూ, నాతో ఇలా అన్నాడు. ఈ క్షణం నువ్వు నాకెంతో సన్నిహితమైన దానివనిపిస్తుంది. ఎందుకంటే నువ్వు అనుభవిస్తున్న ఈ స్థితిని నేను, నా భార్య అనుభవించాము. జీవని లాంటి పిల్లలకు ఈ ప్రపంచంలో కొదవ లేదు. మీలాంటి తల్లులే అరుదు. మేము కూడా ఇరవై సంవత్సరాల క్రితమే జీవని లాంటి పాపకు జన్మనిచ్చామని, ఆ పాప పేరు ‘ప్రమోదిని’ అని, ఆమెను ఒక సైనికురాలిగా పెంచామని, పదవ తరగతి వరకు చదివించామని చెప్పారు. ఎందుకంటే? ఇలాంటి పిల్లలకు చేయూతనిస్తే వారు కూడా మామూలు మనిషిలా బతకగలరని నిరూపించాలన్నదే మా ఆరాటం. మేము కన్న కలలు నిజమయ్యాయి అని చెప్తూ, ‘జీవితం అంటే కాస్త వెలుగూ, కాస్త చీకటి. అన్నట్టు నా పేరు విశ్వనాథన్ తెలుగు వాణ్ణే. జీవని ఆత్మీయుల లిస్టులో నన్ను కూడా చేర్చుకో. జీవని ఎదుగుదలకు అవసరమయ్యే సహాయ, సహకారాలు మా నుంచి ఎప్పుడూ ఉంటాయి అని చెప్పాడు.

విశ్వనాథంగారు గొప్ప మనస్తత్వ శాస్త్రవేత్త. జీవని వ్యక్తిత్వవికాసానికి ఆయన చేస్తున్న ప్రయోగాలు, పాప పెంపకానికిచ్చే సూచనలు ఫలితంగా జీవనిలో మార్పులు రాసాగాయి. ఆ మార్పులు నాలో గొప్ప అనుభూతిని కల్గించాయి. సత్తువలేని జీవకణాల్లో కొద్దికొద్దిగా ఊపిరి రగిలి, నెమ్మదిగా నాలుగేళ్ళకు అడుగులు వేయడం నేర్చుకుంది జీవని. అదొక మహాపోరాటం. వెదురుబొంగు వేణువుగా కావడానికి పడినశ్రమ. లేశమైనా వెలుగు సోకని అంధకారంలో పడుతూ చేస్తున్న ప్రయాణం.



కొద్దిగా అడుగులు వేయడం వచ్చిన తరువాత జీవని కళ్ళలో అపూర్వమైన తేజస్సు కనిపిస్తుంది. ప్రపంచాన్ని పాదాల దగ్గరకు తెచ్చుకున్నాననే తృప్తి ఏమో? జీవనికి ఆకాశమంటే యిష్టం, నీలిమబ్బు ఇష్టం. ఎక్కడికో సాగిపోయే పక్షుల గుంపులంటే యిష్టం. ఆకాశం వైపుకు చేతులు చాచి, ఓ.....ఓ......అంటూ పాటలు పాడుతుంది. రోడ్డుపైన ఏ చిన్న అలికిడైనా బయటికొచ్చి చూస్తుంది. పొద్దుట పూట కాన్వెంటులకు పోయే నీలగౌనుల చిన్నారులు హడావుడి.. అల్లరి చూసి ఆనందపడిపోతుంది. ఏ..ఏ..ఏ.. అంటూ వాళ్ళవైపు చూసి అరుస్తుంది. తన భాషలో వాళ్ళకు చెప్పే శుభాకాంక్ష లేమో? సాయంకాలం వీధినిండా గుంపులు గుంపులుగా విడిపోయి ఆటలాడే పిల్లల వైపు ఆసక్తితో చూస్తుంది. వారి వైపు చేతులూపుతుంది. ఆటలలోని మాధుర్యాన్ని తనకూ పంచమని అభ్యర్థనా పూర్వకంగా చూస్తుంది.

**ఆలోచించండి - చెప్పండి**

1. గారడీ ఆట ద్వారా లలిత ఎటువంటి స్ఫూర్తి పొందింది?
2. విశ్వనాథం ఎవరు? జీవని ఎదుగుదలకు ఆయనెలా తోడ్పడ్డాడు?

## III

సాధారణంగా జీవని ఒంటరిగా ఉండడం జరగదు. తప్పనిసరిగా బయటకు వెళ్ళవలసి వస్తే గేటు తాళం వేసి వెళుతుంటాను. ఒక రోజు సాయంకాలం బజారుకెళ్ళి వస్తున్నాను. ఇల్లు చేరేసరికి గేటు తెరిచివుంది. తాళం పగులగొట్టబడివుంది. భయంతో కొయ్యబారి పోయాను. వణుకుతున్న పాదాలతో లోపలికి అడుగు పెట్టాను. అక్కడ అపురూపమైన దృశ్యం. పదిమంది పిల్లలు ఒక చోట చేరి, బొమ్మలతో ఆడుకుంటున్నారు. వాళ్ళ మధ్య జీవని వుంది. అది పెళ్ళి ఆట కాబోలు. జీవని చేతిలో పెళ్ళికూతురు బొమ్మ, ఇంకొక పాప చేతిలో పెళ్ళి కొడుకు బొమ్మ. మరోచోట చిన్నచిన్న గిన్నెలతో విందు భోజనం, ఆనందం, అరుపులు, కోలాహలం, చప్పట్లు, ఆ తోట, ఆ పరిసరాలు, అదంతా దేవతల రాజ్యంలా వుంది. పిల్లల ప్రపంచంలో వ్యతిరేక ఆలోచనలు వుండవు. అందుకే ముందువారు జీవనిని గేలిచేసినా, తరువాత సాదరంగా తమ బాహువులలోకి తీసుకున్నారు.

విశ్వనాథంగారి సూచన మేరకు జీవనిని పాఠశాలలో చేర్పించాము. కొంతకాలానికి ఆ తరగతి టీచర్ నన్ను పిలిచింది. "అ ఆ లు రాయమంటే ఆకాశాన్ని మబ్బుల్ని గీస్తుంది. ఎబిసిడి లు రాయమంటే చెట్లనీ, ఎగిరే పక్షుల్ని గీస్తుంది. పాప బళ్ళో చేరి సంవత్సరం దాటుతోంది. ఇంతవరకు వర్ణమాల రాలేదు" జీవని గురించి టీచర్ ఫిర్యాదు. "ఎంత నేర్చుకుంది అని కాక నేర్చుకోవడానికి ఎంత పెనుగులాడుతూందో గమనించండి. నెమ్మదిగానే దాని మస్తిష్కం గ్రహిస్తుంది. వందల కొద్దీ పిల్లలకు మీరు విద్య నేర్పి ఉంటారు. కానీ జీవని లాంటి పాప మీకు తటస్థపడి ఉండదు. జీవనిని ఒక ఛాలెంజిగా తీసుకోండి. మనం సామాజికంగా వెనకబడిన వాళ్ళకు ప్రత్యేక శిక్షణయిచ్చి, కోడిపిల్లల్ని రెక్కలచాటున పొదువుకుని పెంచుకొన్నట్లుగా పెంచుతున్నాం. ఎందుకు? ఈ విజ్ఞానం, నాగరికత ఆధునిక జీవితంలోని మాధుర్యం అందరికి సమంగా పంచుదామనే కదా! అలాగే మానసికంగా వెనుకబడ్డ పిల్లల్ని కూడా ఓపికతో, అనురాగంతో, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి ముందుకు నడిపిద్దాం, వారి అభివృద్ధికి తోడ్పడదాం. జీవని తల్లిగా కాదు మార్పును కోరే మహిళగా మిమ్మల్ని అర్థిస్తున్నాను 'జీవని ప్రత్యేక అవసరాలు గల పాప. తనపై ప్రత్యేక శ్రద్ధ చూపండి. తనను నిరుత్సాహపరచకండి'. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా ఉద్వేగంగా నేను చెప్పిన మాటలకు తరగతి ఉపాధ్యాయినితో పాటు పాఠశాల యాజమాన్యం మంచిగా స్పందించారు. జీవనిలోని ప్రత్యేకతను గుర్తించారు. జీవనిని 'మణిభూషణ్' అనే కొత్త టీచర్‌కి అప్పగించారు. ఆమెకు పిల్లలన్నా, పెయింటింగ్సన్నా యిష్టం. జీవనికి ఇష్టమైన రంగంలో అభివృద్ధి చేయడానికి మీతో పాటు మేము కూడా కృషిచేస్తామని నన్ను ఓదార్చుతున్నట్టుగా చెప్పారు వారు.

వయస్సు పెరిగే కొద్దీ జీవనిలో అనూహ్యమైన మార్పులొస్తున్నాయి. కళ్ళలో అమాయకత్వం పోయి, ఆలోచన స్థిరపడుతూంది. వెకిలి నవ్వు బదులు ముచ్చటగొలిపే స్నిగ్ధహాసం, ఇది వరకు కష్టం మీద మాటల్ని కూడబలుక్కొని మాట్లాడే స్థాయి నుంచి పరిమిత మాటల్ని స్వేచ్ఛగా మాట్లాడే స్థాయికి ఎదిగింది. చదువుతో పాటు తనకిష్టమైన బొమ్మలను గీయడంలో అభివృద్ధి సాధించింది.




ఆ రోజు ఆదివారం. ఆ వేళ ఆకాశం కూడా హాలిడే మూడ్‌లో వుంది. తూర్పున సూర్యనేత్రం ఇంకా తెరుచుకోలేదు. జీవని ఇంకా నిద్ర లేవలేదు. ఎదురు చూడని అతిథిలా కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీస్తే, జీవని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, క్లాస్ టీచర్ మాలినీ రావు, ఆర్ట్ టీచర్ మణిభూషణ్ మొదలైనవారు ఆహ్లాదకరమైన చిరునవ్వులతో ప్రత్యక్షమయ్యారు. ఆశ్చర్యం! ఓ వైపు ఉద్వేగం ఆక్షణం.. శుభాకాంక్షలు లలిత గారూ! జీవని పెయింటింగ్‌కి అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. 'అమ్మ' అనే తన పెయింటింగ్‌కి సోవియట్ లాండ్ చిల్డ్రన్స్ పెయింటింగ్స్ అవార్డు వచ్చింది. మొత్తం దక్షిణ భారతదేశంలో ఒక్కరికే వచ్చింది. అది మన జీవనికే! ఈ శుభాకాంక్షలు మీకే. ఇది మీ విజయమే! భూమి మీద భగవంతుని ప్రతినిధి **అమ్మ** అంటారు. అది మీ విషయంలో పూర్తిగా నిజం. జనవరి పదిన మాస్కోకి ప్రయాణం. రేపే పాస్‌పోర్ట్‌కి అప్లై చేయండి అని చెప్పి సెలవు తీసుకున్నారు వారు. ఆ సమయాన నా ఆనందానికి అవధుల్లేవు.

**ఆలోచించండి - చెప్పండి**

1. లలిత ఉపాధ్యాయులతో చెప్పిన మాటలను బట్టి మీరేం గ్రహించారు.
2. జీవనిలో వచ్చిన మానసిక మార్పులు ఏవి?

మంగళవారం రాత్రి టీవీలో జీవనితో ఇంటర్వ్యూ. స్కూల్లో రికార్డు చేసినట్టున్నారు. శ్రీవారు హడావిడి చేస్తున్నారు. స్నేహితులను ఇంటికి పిలిచారు. ఇంట్లో పండుగ

వాతావరణం. అందరికీ జీవనిని చూపించి " షీ ఈజ్ మై ప్రైడ్ చైల్డ్" అని పరిచయం చేశాడు. ఈ హడావిడిని మౌనంగా గమనిస్తున్నాను. ఎనిమిది గంటలకు ప్రోగ్రాం మొదలైంది. ముందుగా జీవని గురించి ఆ పాఠశాల ఉపాధ్యాయులు చెప్పిన విషయాలు టి.విలో వచ్చాయి. చివరిగా జీవనితో ఇంటర్వ్యూ. వారు ఎన్ని ప్రశ్నలు వేసినా జీవని సమాధానం మౌనమే.

నీ కిష్టమైన వారెవరు? అ..... అ..మ్మ'. మీకు స్ఫూర్తి ఎవరు? అ..... అ..మ్మ అంది. పెయింటింగ్ అంటే ఇష్టం ఎలా కలిగింది? టీచర్ వైపు చూసింది. ఇంట్లో నీ పెయింటింగ్‌కి ఎవరు సహాయం చేస్తారు? జీవని జవాబు చెప్పకుండా దిక్కులు చూస్తున్నది. బహుశా నాన్న గారు ఎంకరేజ్ చేస్తుంటారు కదూ! మళ్ళీ మౌనం... హఠాత్తుగా జీవని కళ్ళల్లో నీటిపొర కదలాడి ఆ....అమ్మే అంది.




## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.**

1. కథలో మీకు నచ్చిన సంఘటన గురించి మాట్లాడండి.
2. 'పిల్లల ప్రపంచంలో వ్యతిరేక ఆలోచనలు ఉండవు' ఈ వాక్యంపై మీ అభిప్రాయం చెప్పండి.

**ఆ) పద్యాన్ని చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

క. పరనారీ సోదరుఁడై
పరధనముల కాసపడక పరులకుహితుఁ డై
పరులుదనుఁ బొగడ నెగడక
బరులలగిన నలుగ నతఁ డు! పరముడు సుమతీ !

**ప్రశ్నలు:**

1. పర స్త్రీలతో ఎలా నడుచుకోవాలి?
2. దేనికి ఆశపడకూడదు?
3. ఉత్తముడు ఎవరు?
4. పై పద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

**ఇ) కింది గద్యం చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

ముద్దుముద్దుగా వచ్చీరాని మాటలు మాట్లాడుతూ గుండ్రంగా కళ్ళు తిప్పుతూ, ఇంటిల్లిపాదికి ఎంతో ఆనందాన్ని కలిగించే రెండేళ్ల పాపకు భయంకరమైన జ్వరం వచ్చింది. ఆ జ్వరంలో రోజుల తరబడి మత్తుగా ఏవేవో కలవరిస్తూ తల్లిదండ్రులను డాక్టర్లను కూడా ఎంతో కంగారు పెట్టింది. కొన్నాళ్లకు ఆమె ఆరోగ్యం బాగుపడింది కానీ వినికిడి శక్తి, మాట్లాడే శక్తి కోల్పోయింది. అంధురాలైంది. ఆమె తల్లిదండ్రులు కొంతకాలం తరువాత చెవిటి, మూగ పిల్లలకు పాఠాలు చెప్పే

ఉపాధ్యాయుని వద్దకు ఆ పాపను తీసుకువెళ్లారు. ఆయన పాపను పరీక్షించి మీ పాప చాలా చురుకైంది ప్రోత్సహిస్తే తెలివితేటలు అభివృద్ధి చేసుకోగలదు మంచి డాక్టర్ని సంప్రదిస్తే కనీసం మాట్లాడగలుగుతుంది. అయితే ఎల్లవేళలా ఆమెను అంటిపెట్టుకునే టీచర్ ఉంటే మంచిది అని సలహా ఇచ్చాడు. వారు ఓ టీచర్‌ని ఏర్పాటు చేశారు. ఆమె సహాయంతో ఆ అమ్మాయి బాగా చదువుకుంది. సహకారగుణం అలవర్చుకోవడం ద్వారా అందరినీ ఆకర్షించడం మొదలుపెట్టింది. బ్రెయిలీ లిపిని నేర్చుకుని అనేక పరీక్షల్లో



పాస్ అయింది. అదే లిపి ద్వారా విరామసమయంలో అనేక సంగతులను లోకవ్యవహారాలను తెలుసుకొని ఎంతో విజ్ఞానం సంపాదించింది. తనలాంటి అంధుల సంక్షేమం కోసం పాటుపడాలని దీక్ష పూనింది. కొన్నాళ్ల తర్వాత ఆమెకు మాట వచ్చింది. దీంతో ప్రజల్లోకి వెళ్లి అంధుల శ్రేయస్సు కోసం పాటుపడవలసిందిగా ప్రసంగాలు చేసింది. అవి ప్రజలకు బాగా నచ్చాయి. అంధులకు జీవితం మీద విశ్వాసం కలిగించింది. ఆమె ఎవరో కాదు తను పట్టిన దీక్ష కోసం జీవితాన్నే పణంగా పెట్టిన హెలెన్ కెల్లర్.

– ఆదర్శ బాల్యం

**ప్రశ్నలు:**

1. హెలెన్ కెల్లర్ అంగవైకల్యానికి కారణమేమిటి?
2. ఉపాధ్యాయుడు ఏమని సలహా ఇచ్చారు?
3. హెలెన్ విరామ సమయంలో ఏమి చేసేది?
4. హెలెన్ అంధుల కోసం ఏమి చేసింది?

**ఈ) కింది వాక్యాలకు అర్థసందర్భాలను రాయండి.**

1. ఈ ఒక్క కలను సఫలం చెయ్యి తండ్రి!
2. వారు కూడా మామూలు మనిషిలా బతకగలరు.
3. ఈ శుభాకాంక్షలు మీకే ఇది మీ విజయమే!

**ఉ) కింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. జీవని పెయింటింగ్‌కి ఏ అవార్డు వచ్చింది?
2. విశ్వనాథంగారు జీవని కోసం ఏం చేశారు?
3. జీవని చదువుతో పాటు ఎందులో అభివృద్ధి సాధించింది?

## వ్యక్తీకరణ-సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. జీవని తనకు ఇష్టమైన అంశాలపట్ల ఎలా స్పందించేదో రాయండి?
2. ప్రత్యేక అవసరాలు గల పిల్లల గురించి విశ్వనాథం అభిప్రాయాలు రాయండి?

3. లలిత జీవని కోసం తరగతి ఉపాధ్యాయినిని ఏమని అర్థించింది?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. 'జీవని' పాఠం ఆధారంగా మీరు గ్రహించిన విషయాలను సొంత మాటల్లో రాయండి.
2. జీవనిని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో తల్లి పాత్రను వివరించండి.

**ఇ) కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.**

1. పాఠంలోని సన్నివేశాల ఆధారంగా లలిత, విశ్వనాథం లేదా లలిత మరియు తరగతి ఉపాధ్యాయుల మధ్య చర్చను సంభాషణ రూపంలో రాయండి.
2. మీ పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నీవు ఎలా తోడ్పడతావు?

## భాషాంశాలు పదజాలం

**అ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి, సొంతవాక్యాలు రాయండి.**

1. గారడివారు రకరకాల విన్యాసాలు చేస్తారు.

_______________

2. వెన్నెల రాకతో అంధకారం తొలగిపోయింది.

_______________

3. సంజీవరాయ శర్మ జన్మాంధుడైనా ఆత్మస్థైర్యంతో గణితావధానాలు చేశారు.

_______________

4. పిల్లలు వేణువును ఊదుతూ ఆనందిస్తున్నారు.

_______________

5. కొందరిలో లేశము అయినా జాలిగుణం ఉండదు.

_______________

**ఆ) కింది వాక్యాలలోని పర్యాయపదాలు గుర్తించి రాయండి.**

1. సుధ కోసం పాల సముద్రం చిలికారు. ఫలితంగా పీయూషం దక్కింది. దేవతలు అమృతం త్రాగడం వలన అమరులు అయ్యారు.

_______________

2. అనాథల క్షుధ తన ఆకలిగా భావించి, ఆ క్షుత్తు తీర్చేవాడే మహాత్ముడు.

_______________

3. రవి తామరలకు బంధువు. సూర్యుని రాకతో అవి వికసిస్తాయి. భానుడు అంటే వాటికిష్టం.

_______________

4. జీవని చిత్రలేఖనంలో శిక్షణ తీసుకుంది. అభ్యాసం వల్ల చిత్రాలు గీయగల్గింది. నిరంతర తర్ఫీదుతో బహుమతి సాధించింది.

______________________________________________

5. మనిషికి మంచి కోరికలుండాలి. ఆ కాంక్షల కోసం కష్టపడి పనిచేయాలి. అప్పుడే ఆశలు నెరవేరుతాయి.

______________________________________________

**ఇ) కింది పదాలను సరియైన నానార్థాలతో జతపరచండి.**

1. ఉదరము ( ) అ) మేఘము, చీకటి, అజ్ఞానం
2. విన్యాసము ( ) ఆ) పొట్ట, యుద్ధం, నడుము
3. అమృతం ( ) ఇ) ఉంచుట, చక్కని ప్రదర్శన, రచన
4. మబ్బు ( ) ఈ) సుధ, పాలు, ముక్తి

**ఈ) కింది పదాలకు సరైన వ్యుత్పత్త్యర్థాలతో జతపరచండి.**

1. ఆకాశం ( ) అ) అజ్ఞానాంధకారం తొలగించే వాడు (ఉపాధ్యాయుడు)
2. అమృతం ( ) ఆ) దీనియందంతట సూర్యచంద్రులు ప్రకాశించుదురు(గగనం)
3. విశ్వనాథుడు ( ) ఇ) మరణాన్ని పొందింపనిది / కలిగింపనిది (సుధ )
4. గురువు ( ) ఈ) విశ్వానికి నాథుడు (శివుడు)

**ఉ) కింది వాక్యాలలోని ప్రకృతి- వికృతులను గుర్తించి, పట్టికలో రాయండి.**

1. హిమగిరి దృశ్యం అపూర్వం. అది నన్ను అబ్బుర పరిచింది.
2. ఆకాశంలో పక్షి ఎగురుతోంది. పక్కికి రెక్కలే బలం.
3. వైద్యులు ఆరోగ్య రక్షకులు. వెజ్జులు దైవంతో సమానం.
4. ఈ భవన నిర్మాణం ఆశ్చర్యం గొల్పుచున్నది. చూసే వారందరు అచ్చెరువునొందు చున్నారు.
5. అర్ధరాత్రి వేళ బయటకు వెళ్ళకూడదు. అద్దమరేయి ఇంటిలో ఉండడమే ఉత్తమం.

| ప్రకృతి | వికృతి |
|---|---|
| | |
| | |
| | |
| | |
| | |

**ఊ) కింది జాతీయాలను వివరించండి.**

గుసగుసలు, మారుమ్రోగుట, మనసులోముల్లు, చేజారిపోవు

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.**

1. సైనికురాలు = ________ + ________ ________
2. ప్రత్యేకం = ________ + ________ ________
3. కుటుంబమంతా = ________ + ________ ________
4. ఎండుటాకు = ________ + ________ ________
5. అవయవాలు = ________ + ________ ________

**ఆ) కింది పదాలు కలిపి సంధి పేరు రాయండి.**

1. మరి + ఒక = ________ ________
2. అప్పుడు + అప్పుడు = ________ ________
3. అవసరము + ఐన = ________ ________
4. తగిలిన + అంత = ________ ________

విసర్గ సంధి :

**1. సంస్కృత పదాల మధ్య విసర్గ మీద తరచు సంధి జరుగుతూంటుంది. అది వేరువేరు రూపాలుగా ఉండటం గమనిద్దాం. కింది ఉదాహరణలు విడదీసి చూడండి.**

అ) శిరోరత్నం

ఆ) తపోబలం

ఇ) పయోనిధి

ఈ) వచోనిచయం

★పై పదాలను విడదీస్తే – ఈ కింద విధమైన మార్పులు జరిగాయి గమనించండి.

అ) శిరః + రత్నం

ఆ) తపః + బలం

ఇ) పయః + నిధి

ఈ) వచః + నిచయం

} అకారాంత పదాల విసర్గకు శ, ష, స లు, వర్గ ప్రథమ, ద్వితీయాక్షరాలు (క, ఖ, చ, ఛ, ట, ఠ, త, థ, ప, ఫ లు) గాక మిగతా అక్షరాలు కలిస్తే – అకారాంత పదాల మీదున్న విసర్గ 'ఓ'కారంగా మారింది.

★కింది పదాలు కలిపి, మార్పును గమనించండి.

అ) తపః + శక్తి = ________

ఆ) చతుః + షష్టి = ________

ఇ) నభః + సుమం = ________

పదాలను కలుపగా వరుసగా మనశ్శాంతి, చతుష్షష్టి, నభస్సుమం అనే రూపాలు ఏర్పడ్డాయి కదా!

(విసర్గమీద శ, ష, స లు ద్విత్వాలుగా మారడం గమనించండి)

★కింది పదాలను విడదీయండి.

అ) యశఃకాయము = ____________

ఆ) తపఃఫలము = ____________

★'స' కారం (స్) విసర్గరూపంగా ప్రయోగిస్తారు. అందుకే నమస్కారం, శ్రేయస్కరం, వనస్పతి మొదలయిన సందర్భాల్లో మార్పులేదు.

★కింది పదాలను కలిపి, మార్పును గమనించండి.

ఉదా అంతః + ఆత్మ = అంతరాత్మ

అ) ధనుః + విద్య = ____________

ఆ) చతుః + భుజుడు = ____________

ఇ) ఆశీః + వాదము = ____________

ఈ) పునః + ఆగమనం = ____________

ఉ) అంతః + అంగం = ____________

} అంతః, దుః, చతుః, ఆశీః పునః మొదలైన పదాలకు వర్గప్రథమ, ద్వితీయాక్షరాలు, శ, ష, సలు గాక మిగతా అక్షరాలు కలిస్తే విసర్గ రేఫ (ర్) గా మారడం గమనించండి.

కింది పదాలు విడదీయండి.

ఉదా : ధనుష్టంకారం = ధనుః + టంకారం (ధనుస్ + టంకారం )

అ) నిష్ఫలము = ____________

ఆ) దుష్కరము = ____________

} ఇస్, (ఇః), ఉస్ (ఉః)ల విసర్గకు క, ఖ, ప, ఫ లు పరమైనప్పుడు విసర్గ (స్) 'ష' కారంగా మారుతుంది.

కింది పదాలు విడదీయండి.

ఉదా : నిస్తేజం = నిః + తేజం

అ) దుశ్చేష్టితం = ____________

ఆ) ధనుష్టంకారం = ____________

ఇ) మనస్తాపం = ____________

} విసర్గకు చ, ఛ లు పరమైతే 'శ'
ట, ఠ లు పరమైతే 'ష'
త, థ లు పరమైతే 'స' వస్తాయి.

పై ఉదాహరణలన్నీ పరిశీలించిన మీదట విసర్గ సంధి ఆరు విధాలుగా ఏర్పడుతున్నదని తెలుస్తున్నది.

i) అకారాంత పదాల విసర్గకు వర్గ ప్రథమ ద్వితీయాక్షరాలు (క, చ, ట, త, ప; ఖ, ఛ, ఠ, థ, ఫ), శ, ష, స లు గాక మిగతా అక్షరాలు పరమైనప్పుడు. విసర్గ లోపించి అకారం 'ఓ' కారంగా మారుతుంది.

ii) విసర్గకు శ, ష, స లు పరమైనప్పుడు శ, ష, స లు ద్విత్వాలుగా మారుతాయి.

iii) విసర్గ మీద క, ఖ, ప, ఫ లు వస్తే, మార్పురాదు (సంధి ఏర్పడదు).

iv) అంతః, దుః చతుః, ఆశీః, పునః మొదలైన పదాల విసర్గ రేఫ (ర్) గా మారుతుంది.

v) ఇస్, ఉస్‌ల విసర్గకు క, ఖ, ప, ఫ 'పరమైతే విసర్గ 'ష' కారంగా మారుతుంది.

vi) విసర్గకు చ, ఛలు పరమైతే 'శ' కారం; ట, ఠ లు పరమైతే 'ష' కారం; త, థ లు పరమైతే 'స' కారం వస్తాయి.

**ఇ) కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

1. ఐదునెలలు = ______________ ______________
2. మృదుమధురం = ______________ ______________
3. జ్ఞానదీపం = ______________ ______________
4. అనూహ్యం = ______________ ______________
5. పిల్లలప్రపంచం = ______________ ______________

అలంకారం-క్రమాలంకారం:/యథా సంఖ్యాలంకారం.

**కింది ఉదాహరణ ద్వారా క్రమాలంకారాన్ని అవగాహన చేసుకోండి.**

శత్రువుని మిత్రుని విపత్తుని జయింపుము రంజింపుము భంజింపుము.

పై ఉదాహరణ పరిశీలిస్తే శత్రువు, మిత్రుడు, విపత్తు అనే మూడు పదాలు ఉన్నాయి. వరుసగా జయింపుము, రంజింపుము, భంజింపుము అనేవి కూడా ఇచ్చారు. ఇప్పుడు మూడింటికి వరుసగా మూడు కలిపితే శత్రువుని జయింపుము, మిత్రుని రంజింపుము, విపత్తుని భంజింపుము అని ఏర్పడతాయి. ఈ విధముగా చెప్పడాన్ని క్రమాలంకారం అంటారు.

లక్షణం: వస్తు క్రమాన్ని పాటిస్తూ అదే వరుస క్రమంలో అన్వయాన్ని చెప్పడాన్ని క్రమాలంకారం అంటారు.

**కింది వాక్యాలను పరిశీలించి అలంకారాన్ని గుర్తించండి.**

1. గజకచ్ఛపమూషికంబులు వనజలబిలములందు ప్రవేశించాయి.
2. సూర్యచంద్రులు దివారాత్రములకు అధిపతులు.

**ఈ) కింది సామాన్య వాక్యాలను, సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.**

1. రేష్మ ఆసుపత్రికి వెళ్ళింది. రేష్మ పరీక్షలు చేయించుకుంది.

______________________________

2) విశ్వనాథం జీవని ఇంటికి వచ్చాడు. విశ్వనాథం జీవనికి సహాయం చేశాడు.

______________________________

3) పిల్లలందరూ ఒకచోట చేరారు. పిల్లలందరూ బొమ్మలతో ఆడుకుంటున్నా రు.

______________________________

4) ఆమె పాపకు చేయూతనిచ్చింది. ఆమె పాపను చక్కగా పెంచింది.

______________________________

5) జీవని చిత్రాలెన్నో గీసింది. జీవని ప్రథమ బహుమతి పొందింది.

______________________________

**ఉ) కింది వాక్యాలు చదవండి. అవి ఏరకమైన వాక్యాలో రాయండి.**

1. పాపాయి నడవగలదు ______________
2. పిల్లలూ! మీరందరూ ఆడుకోవచ్చు ______________

3. వాన వస్తుందో! రాదో! ______________________

4. ఆహా ! ఆ చిత్రం ఎంత బాగుందో! ______________________

5. వర్షాలు కురవక పంటలు పండలేదు ______________________

## ప్రాజెక్టుపని

ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల్లో పేరొందిన వారి జీవిత వివరాలు సేకరించి, తరగతి గదిలో చర్చించండి.
ఉదా: రాగతి పండరి, లక్కోజు సంజీవరాయ శర్మ, లూయీ బ్రెయిల్, హెలెన్ కెల్లర్, సుధాచంద్రన్.

## పాఠాంత పద్యం

పలుకంజాలుదు రర్థయుక్తముగ గీర్వాణంబు ముత్యాలదం
డలరీతిన్ లిఖియింపఁగాఁ గలరు గ్రంథ శ్రేణి నుద్యోగమున్
సలుపంగాఁగల రెట్టి లోపముల నైనం గానరానీక యీ
నెలఁతల్నేర్వఁగరాని విద్యగలదే ? నేర్పొప్పఁజొప్పించినన్

– గౌరావఝుల రామకృష్ణ సీతారామ సోదర కవులు
(సుమహారం ఖండకావ్యం)

భావం : స్త్రీలలో సహజ ప్రతిభ ఉంటుంది . సంస్కృత భాషను ఉచ్చారణ దోషం లేకుండా అర్థవంతంగ మాట్లాడగలరు. ముత్యాల వంటి స్వచ్ఛమైన భావాలతో గ్రంథాలు రాయగలరు.ఏమరుపాటు లేకుండా అన్ని పనులూ చేయగలరు. చక్కగా నేర్పితే స్త్రీలు నేర్చుకోలేని విద్య ఏదీ ఉండదు.

సూక్తి: వట్టి మాటలు చెప్పడం కంటే చేయూత నిచ్చే చేతులు మిన్న – అబ్దుల్ కలాం.

## మీకు తెలుసా?

డిసెంబర్ 3వ తేదీని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

### గొరవయ్యల నృత్యం

కర్నూలు అనంతపురం జిల్లాలలో గొరవయ్యల నృత్యం చాలా ప్రసిద్ధి చెందినది. గొరవయ్యలు శైవసంప్రదాయానికి చెందినవారు. కేవలం పాటలు పాడడమే కాకుండా వీరు నృత్యం కూడా చేస్తారు. వాటికి తోడు విలక్షణమైన వేషధారణ వీరి ప్రత్యేకత. తలపై ఎలుగుబంటి చర్మంతో చేసిన టోపీ, పులితోలులాంటి పొడవాటి చొక్కా ధరిస్తారు. చిన్న వాద్యాలతో శబ్దం చేస్తూ, పాటలు పాడుతూ, వీరు చేసే నృత్యాన్ని చూడడానికి ప్రజలు ఎంతో ఆసక్తిని కనబరుస్తారు. శాసనాలలోనూ, ప్రాచీన కావ్యాలలోనూ వీరి ప్రస్తావన ఉంది. వీటిని బట్టి గొరవయ్యలు అతిప్రాచీన జానపద సంప్రదాయానికి చెందినవారని చెప్పవచ్చు.

## ఫిరంగిపురం

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకి చెందిన ఒక గ్రామం ఫిరంగిపురం. ఇది మండల కేంద్రం కూడా. ఇది గుంటూరు పట్టణానికి 21 కి. మీ. దూరంలో ఉంది. ఫిరంగిపురం నుండి 6 కిలోమీటర్ల దూరంలో కొండవీడు గ్రామం ఉంది. ఆనాటి పూర్వం కొండవీటి రెడ్డిరాజులకు ఈ గ్రామం ఫిరంగుల తయారీ మరియు రవాణా కేంద్రంగా ఉండేది. క్రిస్మస్ వేడుకలు దేశవిదేశాల్లో ఏ విధంగా జరుపుకుంటారో ఫిరంగిపురం లోని బాలయేసు ప్రార్థనామందిరంలో కూడా అంతే ఘనంగా జరుపుకుంటారు. ఈ చర్చికి 125 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇది తెలుగు రాష్ట్రాల్లో రెండవ అతిపెద్ద చర్చి, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద చర్చి ఇదే. 1875వ సంవత్సరంలో లండన్ మిల్ హిల్ సభకు చెందిన ఫాదర్ థియోడర్ డిక్మన్ ఫిరంగిపురానికి వచ్చారు. ఆ సమయంలో అక్కడ ఉన్న బాలయేసు మందిరం శిథిలావస్థలో ఆయనకు కనిపించింది. అది చూసి ఆయన మనసు చలించిపోయింది. అప్పటి నుండి ఆయన ఫిరంగిపురంలోనే ఉండిపోయి, దాదాపు పదిహేను సంవత్సరాలు శ్రమించి, 1891 నాటికి బాలయేసు కేథెడ్రల్ చర్చ్‌ను నిర్మించారు. ఇక్కడ కార్మెల్ మాత పేరుతో జులై 14, 15, 16 తేదీలలో ఉత్సవాలు నిర్వహిస్తారు. వీటితో పాటు ప్రతి ఏడాది డిశంబర్ 23, 24, 25 తేదీలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయి. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని ప్రభువు ఆశీస్సులు అందుకుంటారు.



# 9 రాజధర్మం

A6Q2R7

– శ్రీకృష్ణదేవరాయలు



## చదవండి – ఆలోచించి చెప్పండి

తే.గీ బుద్ధిమంతుండు సాధించు బుద్ధి చేత
బాహు బలుడు జయించు దోర్బలము చేత
యోగ్యుడైన నరేశుడు యుక్తి చేత
గార్యసిద్ధిని జెందును గొరవేశ!
(విదుర నీతి ద్వితీయాశ్వాసం 26 పద్యం)

ప్రశ్నలు

1. బుద్ధిబలం గొప్పదా ? భుజబలం గొప్పదా ?
2. యోగ్యుడైన రాజు ఎలా పనులు చక్కబెడతాడు ?
3. అనుకున్న పనిని సాధించాలంటే ఎలా ప్రయత్నించాలి ?

## ఉద్దేశం

గొప్ప నాయకులుగా ఎదగడానికి అవసరమైన లక్షణాలు, సామర్థ్యాలను తెలుపుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందింపజేయడం ఈ పాఠం ఉద్దేశం.

## కవిపరిచయం



శ్రీ కృష్ణదేవరాయలు 16వ శతాబ్దికి చెందినవాడు. విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన తుళువవంశ ప్రభువు. సంస్కృత, ఆంధ్ర, కన్నడ భాషలలో పండితుడు. సంస్కృత భాషలో మదాలస చరిత్ర, సత్యవధూప్రీణనము, జ్ఞానచింతామణి, రసమంజరి మొదలైన మధురకావ్యాలు రచించాడు. అష్టదిగ్గజ కవిపండితులను పోషించడంతో బాటు తెలుగులో 'ఆముక్తమాల్యద' ప్రబంధాన్ని రచించాడు. 'సాహితీసమరాంగణ సార్వభౌముడు', 'మూరు రాయర గండడు', 'ఆంధ్రభోజుడు' ఆయన బిరుదులు. రాయల వారి రచనల్లో సామాన్య జనుల జీవితాలలో కనబడే చిన్న చిన్న సంగతులే అద్భుత రసాత్మక ఆవిష్కరణలవుతాయి. రాయలు తన చిన్నతనంలో సామాన్య ప్రజల మధ్య తిరుగుతూ, వారి జీవితాలను సూక్ష్మంగా పరిశీలించి ఉండి ఉండడం వల్ల సహజసుందర వర్ణనలు వారి రచనల్లో కనిపిస్తాయి అని ప్రతీతి. తెలుగు సాహిత్యంలో ఈ యుగాన్నే ప్రబంధయుగం అని అంటారు. ఈ పాఠ్యభాగం **ఆముక్తమాల్యదలోని చతుర్థాశ్వాసం** నుండి గ్రహించబడింది.

## ప్రక్రియ-ప్రబంధం

ప్రకృష్టమైన (గొప్పదైన) బంధం కలది ప్రబంధం. పురాణేతిహాసాలనుండి ఏదైనా చిన్న కథాంశాన్ని గ్రహించి కవులచే అష్టాదశ వర్ణనలతో పెంచి, పోషించి స్వతంత్ర కావ్యంగా రాయబడేది ప్రబంధం. కథా వస్తువు ఆద్యంతం ఉంటుంది. కథకు, పాత్రపోషణకు, భావ సంపదకు తగిన స్థానం ఉంటుంది.

## నేపథ్యం

యామునాచార్యులు తన శాస్త్రపాండిత్యంతో పాండ్యరాజును జయించి అర్ధరాజ్యం గెలుచుకున్నాడు. పరిపాలన చేస్తున్నాడు. క్షాత్రధర్మంతో యుద్ధాలు, యజ్ఞాలు, దానధర్మాలు చేశాడు. గురువైన శ్రీరామమిశ్రుని ఉపదేశంతో రాజ్యాన్ని కుమారునికి అప్పగించి రాజధర్మాలను బోధించే సందర్భంలోనిది ఈ పాఠం.



1. కం. ఏపట్టున విసువక ర
క్షాపరుడవు గమ్ము ప్రజల చక్కి విపన్నుల్
గూపెట్టిన విని తీర్పుము
కాపురుషులమీద నిడకు కార్యభరంబుల్

2. ఆ.వె. మొదలఁ బెనిచి పిదపఁ గుదియింప నెవ్వాఁడుఁ
దనదు తొంటిహీన దశఁ దలంపఁ
డలుగుఁ గాన శీల మరయుచుఁ గ్రమవృద్ధిఁ
బెనిచి వేళవేళఁ బనులుఁ గొనుము

3. శా. నీతిం దాన తలంచి చేయఁ బని గా నీ కాకపోనీ బల
వ్రాతార్థాధ్యత నెమ్మి నుండ కొరుఁ బ్రోవన్మంత్రి యంచుం గుణా
తీతుం గుమ్మడికాయ యంత యగు ముత్తెంబై మనం బేర్ప న
ట్లే తా నాతనిచేతిలో బ్రతుకువాఁడే యౌఁ జుమీ మీఁదటన్

4. కం. ధనముఖ్యము కేవల మే
పనికిన్ రా దాస్థ గలిగి పలువురు ప్రభువుల్
పని సేయక తద్వశ్యం
బునకు నలోభానృశంస్యముల్ బుతము జెలుల్

5. కం. మొదలనె యొరుదల కానిం
జెదరంగా నాడకాత్మఁ జింతింపు పదిం
బదిగ మృష యేని మఱి విడు
ముదస్తుఁగాఁ గాక యుండ నొక్క మతమునన్

6. తే. దేశవైశాల్య మర్థసిద్ధికిని మూల
మిల యొకింతైన గుంట కాల్వలు రచించి
నయము పేదకు నరిఁ గోరునను నొసంగి
ప్రబలఁ జేసిన నర్థ ధర్మములు పెరుఁగు

7. తే. ప్రజల విని చన్నc బిలువ కప్పసులc గొలుచు
నమ్మి యింద్లింధనంబున కాయె ననెదు
కలని నక్కైన యధికారి గలనృపతికి
నేదుదీవులు గొన్న సమృద్ధి లేదు



8. చ. ఎఱుఁగ నగున్ స్వశక్తి నవనీశుఁడు నాలుగుపాళ్ల మూఁడు.పా
ళ్లెఱుఁగక మోచినట్టిపని కిష్టసుహృత్తతి దెల్పఁనొక్క పా
లెఱుఁగ నగు న్న యాధ్యమతి నిట్లు నిరాగ్రహుఁడైనఁ జేయు నె
త్తతి విపదుగ్రదండ పరతంత్రుఁడు గాక చిరంబు రాజ్యమున్

9. తే.గీ. కన్నొకటి నిద్రవోc బెఱకంట జాగ
రంబు గావించు భూరుహాగ్రంబు మీఁది
యచ్ఛభల్లంబుగతి భోగ మనుభవించు
నెదను బహిరంతరరులపై దృష్టివలయు



10. ఆ.వె. హదను వచ్చుదాఁక నపరాధిపై రోష
మాcగి చెఱుపవలయు హదను వేచి
లక్ష్యసిద్ధిదాఁక లావున శర మాcగి
కాఁడ విడుచు వింటి వాఁడు వోలె

11. కం. హితులు హితాహితులు సదా
హితులునునై రాజు నెడల నిటు త్రివిధమునన్
క్షితి ననుచరు లుందురు సం
తతమున్ మఱి వారిc దెల్పెదన్ విను మనఘా

12. చ. హితులు భిషగ్గ్రహజ్ఞబుధ బృందకవీంద్ర పురోహితు ల్హితా
హితులు ధనార్జనాదినృప కృత్యనియుక్తులు, వెండి కేవలా
హితులు దశావశార్పిత సమృద్ధ రమాభరణేచ్ఛు, లౌటనా
హితమును నట్ల కాc జతుర వృత్తిc జరించుట నీతి తేనికిన్



13. ఆ.వె. పాత్రభూతు లెస్సc బరికించి యతc దదు
గకయునొకcడు సెప్ప కయు మునుపుగc
బనసపండ్లు దిగిన పరిగ స్వప్నము గన్న
నెటిగ నొసcగి వెఱcగు పఱుచు టొప్పు

**భావాలు :**

1. **కుమారా!** పాలకుడు తాను ఎటువంటి కష్టాల్లో ఉన్నా విసుక్కోకుండా ప్రజలను కాపాడాలి. ఆపదలో ఉన్నవాళ్లు తనను ఆశ్రయించి, తమ బాధలు చెప్పుకున్నప్పుడు వాటిని శ్రద్ధగా విని, వారి బాధ పోగొట్టాలి. ముఖ్యమైన కార్యక్రమాలను, బాధ్యతలను చెడ్డవాళ్లకు అప్పగించకూడదు.

2. ఎంత మంచి వాడినైనా ముందు గొప్ప స్థాయి లో ఉంచి తర్వాత అతని స్థాయిని తగ్గించకూడదు. అతను గతంలోని తన తక్కువ స్థితిని గుర్తించడు. ఇప్పుడు తన స్థాయిని తగ్గించినందుకు పాలకుడిని ద్వేషిస్తాడు. కనుక అతని ప్రవర్తనను గమనిస్తూ, క్రమంగా అతని స్థాయిని పెంచుతూ సమయానికి తగ్గట్లుగా పనులు చేయించుకోవాలి.

3. రాజుకు తగిన మంత్రి అవసరం. తగిన మంత్రి దొరక్కపోతే, రాజు తానే రాజనీతిని అనుసరించి పనులు చేసుకోవాలి. ఆ పనులయినా, కాకపోయినా, ధనబలాలు ఉంటాయి. కనుక ఇబ్బంది ఉండదు. అలా కాకుండా గుణహీనుడైనవాడిని మంత్రిని చేస్తే, అతడు రాజుకు లోబడి ఉండడు. పైగా రాజే అతనికి లోబడి ఉండాలి. అటువంటి మంత్రి గుమ్మడికాయంత ముత్యం లాంటివాడు. కనుక అతడు ప్రమాదకరం. మంత్రి లేకుండానైనా రాజ్యం నడుస్తుంది కానీ గుణహీనుణ్ణి మాత్రం మంత్రిని చేయకూడదు.

వివరణ: గుమ్మడికాయ అంత ముత్యం అంటే ధరించటానికి వీలుకానంత పెద్ద ముత్యం. గుమ్మడికాయంత ముత్యాన్ని ధరించినవాడు దానిని మోయలేక ఎలా బాధపడతాడో గుణహీనుణ్ణి మంత్రిగా చేస్తే రాజు కూడా అలా బాధపడతాడని భావన.

4. ఏ పనైనా కేవలం ధనంతోనే సాధ్యం కాదు. అధికారుల సహాయం కూడా ఉండాలి. వాళ్లు ఆసక్తిగా పనిచేయడానికి తగిన వేతనం ఇవ్వాలి. వాళ్ల పట్ల పిసినారితనం, క్రూరత్వం ఉండకూడదు. సత్ప్రవర్తన, నిబద్ధత కలిగి ఉండాలి. మిత్రత్వం కలిగి ఉండాలి.

5. కొందరు సన్నిహితులు కూడా ఎప్పుడూ చాడీలు చెపుతుంటారు. వాళ్ళను వెంటనే బెదిరించి, తిట్టి దూరం చేసుకోకూడదు. వాళ్ల మాటలు నిజమో, కాదో బాగా పరీక్షించాలి. అబద్ధమే చెబుతున్నారని తేలినా వెంటనే ఉద్యోగం నుంచి తొలగించకూడదు. ప్రమాదం లేని చోట వాళ్లను నియమించాలి. వారిని ఒక కంట కనిపెడుతూ ఉండాలి.

6. దేశాన్ని విశాలం చేస్తే ఆదాయం పెరుగుతుంది. ఒకవేళ నేలచిన్నదైతే చెరువులను, కాలువలను తవ్వించాలి. పేదవాడు డబ్బురూపంలో చెల్లించే పన్నును, పంట రూపంలో చెల్లించే పన్నును తగ్గించాలి. వాళ్ల ఆర్థికస్థితిని మెరుగుపరిస్తే ధర్మార్థాలు సిద్ధిస్తాయి.

7. ప్రజలు కరువు కాటకాలతో పంటలు నష్టపోయి, బతకలేక దేశం విడిచిపోతే, అధికారులు పట్టించుకోవాలి. వాళ్లను రప్పించి సాగుబడికి వసతులు కల్పించి, వారు కోలుకునేటట్లు చేయాలి. అంతే తప్ప వాళ్లు వదిలి వెళ్లిన పశువులను, ధాన్యాలను అమ్ముకుని, వాళ్ల ఇంటి కలపను వంట చెరకుగా వాడుకోవచ్చని సంతోషించే అధికారి యుద్ధ భూమిలో శవాలను పీక్కుతినే నక్కలాంటివాడు. అటువంటి అధికారులున్న పాలకుడు ఏడు ద్వీపాలకు అధిపతి అయినా అతని సంపదలు నిలవవు. (లోకోక్తి అలంకారం)

వివరణ: జంబూ ద్వీపం, ప్లక్ష ద్వీపం, శాల్మల ద్వీపం, కుశ ద్వీపం, క్రౌంచ ద్వీపం, శాక ద్వీపం, పుష్కర ద్వీపం – ఈ ఏడింటిని సప్తద్వీపాలు అంటారు.

8. రాజు ఎప్పుడూ నీతి మార్గాన్ని వదలకూడదు. తెలుసుకోవలసిన విషయాల్లో ముప్పాతిక భాగం తానే స్వయంగా స్వశక్తితో తెలుసుకోవాలి. మిగిలిన పావు భాగాన్ని ఆప్తమిత్రుల ద్వారా తెలుసుకోవాలి. అప్పుడతడు నీతిపరుడవుతాడు. తన ఇష్టానుసారం అంతా జరగాలన్న అహాన్ని విడిచి పెడతాడు. తనకు ఆపదలు కలిగినప్పుడు పారిపోడు. సేవకులను తీవ్రంగా శిక్షించడు. అటువంటి పాలకుడు సుఖంగా రాజ్యమేలుతాడు.

9. రాజు చాలా జాగరూకతతో ఉండాలి. ఎలుగుబంటి చెట్టుకొమ్మ మీద పడుకొని, ఒక కన్ను మూసి నిద్రపోతున్నా, రెండవ కన్ను తెరచి మెలకుగా ఉంటుంది. అదే విధంగా పాలకుడు కూడా సుఖాలు అనుభవిస్తూనే ఇంటా, బయటా ఉన్న శత్రువులపై ఒక కన్ను వేసి ఉంచాలి.

10. రాజు తప్పు చేసిన వాడిని వెంటనే దండించకూడదు. సమయం వచ్చేదాకా కోపాన్ని అదుపులో ఉంచుకోవాలి. చేతిలో

విల్లు, బాణాలు ఉన్నాయి కదాఅని బాణాన్ని ఎప్పుడంటే అప్పుడు విడువకూడదు. గురి కుదిరిందో లేదో చూసుకుని విలుకాడు బాణం వేస్తాడు. అదేవిధంగా పాలకుడు  సమయం చూసుకొని దోషిని శిక్షించాలి.

11. పుణ్యాత్ముడా! రాజు దగ్గర ఉండే అనుచరులు మూడు రకాలుగా ఉంటారు. ఒకరు హితులు. వీళ్ళెప్పుడూ రాజు మేలే కోరుతారు. రెండవ వారు హితాహితులు. వీళ్లు రాజు మేలు కోరుతూనే ఇతరుల ప్రలోభాలకు లోనై అహితులుగా మారుతుంటారు. మూడవ వారు అహితులు. వీళ్లెప్పుడూ రాజు మేలు కోరుకోరు.

12. వైద్యులు, జ్యోతిషులు,పండితులు, కవులు, పురోహితులు వీళ్లంతా రాజు మేలు కోరే హితులు. ధనం సమీకరించే పనుల్లో ఉన్న అధికారులు హితులవుతారు, ఆ ధనాన్ని దొంగిలించి, దొరికితే ఎక్కడ శిక్షిస్తాడో అన్న భయంతో రాజుకు అహితులు కూడా అవుతారు. మరికొందరు పూర్తిగా అహితులే. ఎప్పుడూ ఏదో ఒక తప్పు చేసి దొరికి పోతుంటారు. అప్పుడు పాలకుడు చట్ట ప్రకారం వాళ్ల సంపదనంతా రాజ్యపరం చేస్తారు. దాంతో వాళ్లు రాజును అదును చూసి దెబ్బతీయడానికి చూస్తుంటారు. కనుక ఈ ముగ్గురి విషయంలో పాలకుడు హితునిగా, హితాహితునిగా, కేవలం అహితునిగా ప్రవర్తిస్తూ, పైకి అందరికీ హితునిగా కన్పిస్తూ, నేర్పుగా ఉండాలి.

13. చిత్తశుద్ధిగా పనిచేస్తూ రాజ్యానికి మేలు చేసే హితుడిని పాలకుడు గుర్తించాలి. అతడు అడగకుండానే ఇంకొకరు చెప్పకుండానే అతని ఊహకందనంత సొమ్ము ఒక్కసారిగా ఇవ్వాలి. అది అతడు కలగన్నట్లుగా ఉండాలి. సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాలి.

విశేషాంశము : **పనస వనస్పతి.** ఈ పద్యంలో పనస పండ్లు దిగుట అన్నది ఒక జాతీయం. పూత పూయకుండానే కాయలు కాస్తుంది. కాయ ఏర్పడడానికి ముందు ఏ సూచన ఉండదు. ఉన్నట్టుండి దాన్నిండా పిందెలు పుడతాయి. ఆశ్చర్యకరంగా ఒక్కసారిగా పుష్కలంగా పళ్లనిస్తుంది. అదే విధంగా పాలకుడు హితులను అకస్మాత్తుగా గౌరవించి ఆశ్చర్యం కలిగించాలి అని అర్థం.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి రాయండి**

1. కన్నొ కటి.... దృష్టి వలయు పద్య భావాన్ని సొంత మాటల్లో చెప్పండి.
2. పాలకులకు, పాలితులకు మధ్య ఎలాంటి సంబంధాలు ఉండాలో తెలపండి.

**ఆ) కింది పద్యాన్ని చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

క. తన కధికుల కతిభక్తియు
మనమున నెయ్యంబు దన సమానులకును, హీ
నునియందు గృపయు జేకొని
మను జునకు వగయు గలదె మది బరికింపన్ **- నన్నెచోడుడు (కుమారసంభవము)**

1. పాలకుడు తనకంటే గొప్పవాళ్ళతో ఎలా ఉండాలి?
2. తనతో సమానమైన వాళ్ళతో ఎలా ఉండాలి?
3. తనకంటే తక్కువ వాళ్ళతో ఎలా ఉండాలి?
4. ఈ పద్యానికి ఒక శీర్షిక పెట్టండి?

**ఇ) కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి**

తంజావూరు నాయక రాజులలో ప్రసిద్ధుడు రఘునాథరాయలు. అతడు క్రీస్తు శకం 1600 మొదలు 1630 వరకు తంజావూరుని పాలించిన పండిత కవి. శ్రీకృష్ణదేవరాయల అంతటివాడు. శత్రువులను నిర్మూలించడంలో పరాక్రమశాలి. జనరంజకంగా దేశాన్ని పరిపాలించుటలో నేర్పుగల రాజనీతి నిపుణుడు. సహృదయులు మెచ్చేటట్లు రసభావకవిత సంస్కృతంలో, తెలుగులో చెప్పగల విద్వత్కవి.

రఘునాథుని చతురంగ బలాలలో చేమకూర వెంకటకవి సైనిక ఉద్యోగిగా ఉండేవాడు. రాజాస్థానాలలో ఎక్కువగా తిరగడం వలన చేమకూర కవికి పలువురు ప్రభువులతో పరిచయం కలిగి వారివారి గుణగణాలను, వైరాలను, వైషమ్యాలను, స్పర్థలను చాలా సమీపంలో ఉండి సునిశితంగా పరిశీలించే అవకాశం దొరికింది. అందుకే తన విజయవిలాస కావ్యంలో రఘునాథుని ముఖప్రీతి కోసం ఎదుటివారిని ప్రశంసించడని మంచి చెడులను గుర్తించి ఉద్యోగులను గౌరవిస్తాడని, ఎవరైనా సహాయం కోరి వస్తే అరకొరగా కాకుండా సంపూర్ణంగా సహాయం చేస్తాడని వర్ణించాడు. రఘునాథునికి అసాధ్యాలనుకునే కార్యాలను సాధించే నేర్పు, ఎటువంటి మహత్తరకార్యాన్నైనా బాధ్యతగా నిర్వహించే ఓర్పు ఉన్నాయి. ఒకరి సలహా లేకుండా చిత్తశుద్ధిగా పనిచేసే ఉద్యోగులను సమృద్ధిగా ఆదరించేవాడు. యాచకుల కొరకు సత్రాలు కట్టించి, ప్రతిరోజు వేలమంది ప్రజలకు అన్నదానం చేయించాడు. అతనిది ప్రజానురంజకమైన పాలన అని చేమకూర వెంకట కవి అభివర్ణించాడు.

**– తాపీ ధర్మారావు.**

**ప్రశ్నలు :**

1. రఘునాథరాయలను రచయిత ఎవరితో పోల్చాడు?
2. ఇతరులతో రఘునాథుని ప్రవర్తన ఎలా ఉండేది?
3. యాచకుల కోసం రఘునాథుడు ఏం చేశారు?
4. రఘునాథుడు తన సేవకులను ఎలా ఆదరించారు?
5. చేమకూర వెంకటకవి రాజాస్థానాల్లో ఏం తెలుసుకోగలిగారు?

**ఈ) కింది వానికి అర్థ సందర్భాలు రాయండి.**

1. శరమాగి కాడవిడుచు వింటివాడు వోలె
2. ఏడు దీవులు గొన్న సమృద్ధి లేదు
3. చతురవృత్తి జరించుట నీతి రేనికి
4. బహిరంతరరులపై దృష్టి వలయు

**ఉ) క్రింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. ఈ పాఠం ఏ కావ్యం నుండి స్వీకరించబడింది?
2. ముఖ్యమైన పనులను పాలకుడు ఎవరికి అప్పగించకూడదు?
3. పాలకుడు దేశాన్ని ఎవరిలాగా కాపాడుకోవాలి?

## వ్యక్తీకరణ–సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. పెద్దవారిపై ఏ భారం పెట్టకూడదు?
2. తప్పు చేసిన వారిని దండించే విధానం గురించి చెప్పండి?

3. నిజాయితీగా పనిచేసే సేవకుడిని ఎలా గౌరవించాలి?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది లేదా పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. యామునాచార్యులు చెప్పిన రాజనీతి సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. అనుచరులు ఎన్ని రకాలుగా ఉంటారు? వారి స్వభావాలను విశ్లేషించండి.
3. ప్రజలు నష్టపోయినప్పుడు వారిని పాలకులు అధికారులు ఎలా ఆదుకోవాలి?

**ఇ) కింది సృజనాత్మక ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. మీరు పాఠశాలకు నాయకులైతే ఏయే కార్యక్రమాలను ఏ విధంగా నిర్వహిస్తారో తెలియజేస్తూ ఒక వ్యాసం రాయండి.
2. మీ గ్రామ/పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజా ప్రతినిధి సేవలను అభినందిస్తూ **అభినందనపత్రాన్ని** తయారు చేయండి.

## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి, ఆ అర్థాలతో వాక్యాలు రాయండి.**

ఉదాహరణ: కాపురుషులకు ఏ పనులు అప్పగించరాదు.

కాపురుషుడు = చెడ్డవాడు, దుష్టుడు

దుష్టుల సహవాసం పనికిరాదు.

1. మన స్వప్నం సాకారం కావడానికి బాగా కృషి చేయాలి.
2. ఆస్థ కలిగిన ఉద్యోగులే నిజాయితీగా పని చేస్తారు.
3. రోగులకు భిషక్కులు చికిత్స చేసి ప్రాణం పోస్తారు.
4. హితులు, స్నేహితులు మన జీవితాన్ని ప్రభావితం చేస్తారు.
5. మృషలు చెప్పేవాడిని ఎవరు నమ్మరు.

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలు రాసి, వాటితో వాక్యాలు రాయండి.**

1. కలన =

2. బృందం =

3. క్షితి =

4. వ్రాతము =

**ఇ) క్రింది పదాలకు నానార్థాలను గుర్తించి జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. వృద్ధి | ( ) | అ. అభివృద్ధి, వడ్డీ, సంతోషం |
| 2. నయం | ( ) | ఆ. సత్యం, నీరు, సత్ప్రవర్తన |
| 3. ఋతం | ( ) | ఇ. రెల్లు, బాణం, నీరు |
| 4. కాడ | ( ) | ఈ. నీతి, మృదువు, అందం |
| 5. శరం | ( ) | ఉ. తొడిమ, బాణం |

**ఈ) క్రింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు రాయండి.**

1. పురోహితుడు : ______________________
2. మంత్రి : ______________________
3. నృశంస్యము : ______________________
4. దుర్గము : ______________________

**ఉ) కింది ప్రకృతి పదాలకు వికృతులను జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. మౌక్తికం | (   ) | అ. సత్తువ |
| 2. పశువు | (   ) | ఆ. ముత్యం |
| 3. ద్వీపం | (   ) | ఇ. నిదుర |
| 4. శక్తి | (   ) | ఈ. పసరము |
| 5. నిద్ర | (   ) | ఉ. దీవి |

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

1. ఎవ్వాడు : ____________ + ____________ (          )
2. గుణాతీతుడు : ____________ + ____________ (          )
3. ఒకింత : ____________ + ____________ (          )
4. దీవులుగొన్న : ____________ + ____________ (          )
5. మృషయేని : ____________ + ____________ (          )

**ఆ) కింది సంధి కార్యాలను పూరించండి.**

| సంధి పదం | విడదీసి రాయడం | సంధి పేరు |
|---|---|---|
| ఎదఁగోరు | | సరళాదేశ సంధి |
| | ఏ + తటి | త్రికసంధి |
| తదంతరము | | జశ్త్వ సంధి |
| కన్నొకటి | కన్ను + ఒకటి | |
| | వాడు + పోలె | గ,స,డ,ద,వాదేశ సంధి |

**ఇ) సమాసపదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

1. హితాహితులు : ______________________ (              )
2. అర్థధర్మాలు : ______________________ (              )
3. గుమ్మడికాయ : ______________________ (              )
4. ఏడుదీవులు : ______________________ (              )
5. చతురవృత్తి : ______________________ (              )

**ఈ) కింది పట్టికలోని సమాస కార్యాలను పూరించండి.**

| సమాస పదం | విగ్రహ వాక్యం | సమాసం పేరు |
|---|---|---|
| కలని నక్క | | సప్తమీ తత్పురుష సమాసం |
| | పెఱయైన కన్ను | |
| దేశవైశాల్యం | | |
| | లోభము కానిది | |
| | దుష్టమైన ప్రవర్తన కలవాడు | |

## శ్లేషాలంకారం

**కింది వాక్యాన్ని గమనించండి.**

**రాజు కువలయానందకరుడు**

ఈ వాక్యంలో రాజు(చంద్రుడు) కువలయం(కలువ)కు ఆనందాన్ని కలిగిస్తాడు అని ఒక అర్థం. రాజు(ప్రభువు) కువలయము(భూమి)నకు ఆనందం కలిగిస్తాడు అని మరొక అర్థం. ఇలా రాజు అంటే చంద్రుడు, ప్రభువు. కువలయం అంటే కలువ, భూమి అనే రెండర్థాలు వచ్చేలా ఈ వాక్యంలో ప్రయోగించారు. ఇలా విభిన్న అర్థాలు కలిగిన పదాలను వ్యాకంలో ప్రయోగించడాన్ని శ్లేషాలంకారం అంటారు.

లక్షణం: నానార్థాలను కలిగి ఉండే అలంకారం శ్లేషాలంకారం.

**ఉ) కింది పద్య పాదాలను పరిశీలించి అలంకారం తెల్పండి.**

1. లేమా! దనుజుల గెలువఁగ
   లేమా? నీవేల కడఁగి లేచితివిటురా? : ______________________
2. ప్రాయము జలకల్లోల ప్రాయము : ______________________

**ఛందస్సు** కింది పద్యపాదాలను పరిశీలించండి.

| | | |
|---|---|---|
| స | స | స |
| II U | I I U | II U |
| ధన ము | ఖ్యము కే | వల మే, |

| | | | | |
|---|---|---|---|---|
| స | గగ | నల | నల | స |
| II U | UU | I III | II II | II U |
| పనియుం | గాదా | స్థ గలిగి | పలువురు | ప్రభువుల్ |

1వ భాగం

| | | |
|---|---|---|
| స | స | గగ |
| IIU | II U | UU |
| పనిసే | యక త | ద్వశ్యం |

| | | | | |
|---|---|---|---|---|
| నల | గగ | జ | బ | స |
| III I | UU | IUI | U II | I IU |
| బునకు న | లోభా | నృశంస్య | ముల్ ఋత | ము జెలుల్ |

2వ భాగం

దీనిలోని గణాలను పరిశీలించండి.

ఇందులో గగ, భ, జ, స,నలం గణాలు ఉన్నాయి.

ఒకటవ పాదం మూడవ పాదం గణాల సంఖ్య సమానంగా ఉంది. రెండవ పాదం, నాల్గవ పాదం గణాల సంఖ్య సమానంగా ఉంటుంది.

**కంద పద్యం లక్షణాలు**

1. ఇందులో చతుర్మాత్రా గణాలైన భ,జ,స,నల,గగ గణాలుంటాయి.
2. ఒకటవ మూడవ పాదాలలోని గణాల సంఖ్య, రెండవ నాల్గవ పాదాలలోని గణాల సంఖ్య సమానంగా ఉన్నాయి.
3. ఒకటి,రెండు పాదాల్లో(3+5) 8 గణాలుంటాయి.మూడు,నాలుగు పాదాల్లో (3+5) 8 గణాలుంటాయి.
4. ప్రాస ఉంటుంది.
5. రెండు,నాలుగు పాదాల్లో చివరి అక్షరంగా గురువు ఉంటుంది.
6. రెండు, నాలుగు పాదాల్లో 1-4 గణాల మొదటి అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది.
7. ఆరవ గణం ‘ జ ‘ గణం గాని, ‘నలం’ గణం గాని ఉంటుంది.
8. బేసి గణాలైన 1,3,5,7, గణాలలో ‘జ’ గణం రాకూడదు.
9. మొదటి పాదం గురువుతో ప్రారంభమైతే తక్కిన పాదాలు కూడా గురువుతోను, లఘువుతో ప్రారంభమైతే తక్కిన పాదాలు లఘువుతోను ప్రారంభమవుతాయి.

**పాఠాంత పద్యం**

ఉ. మేదుర నీతి మార్గమున మేల్కని యుండెడు రాజు గల్గినన్
మేదినిలో జనంబు లెలమిన్ సుఖవృత్తిని నిద్ర గాంతు రే
బాధలు లేక మత్తుడయి పార్థివు డూరకె నిద్రవోయినన్
మోదము జెంది భూమిజనముల్ సుఖవృత్తిని నిద్ర గాంతురే

– జక్కరాజు వేంకటకవి – (ఆంధ్రకౌముందకము)

**భావం:** చక్కని రాజనీతి తెలిసిన పాలకుడు రాత్రి పూట కూడ ఒక కన్ను మూసి నిద్రపోయినా ఒక కన్ను తెరచి (గూఢచారులు, రక్షకభటులు పాలకునికి ఇంకొక కన్ను) ప్రజలను కాపాడుతుంటాడు. అతని రక్షణలో ప్రజలు గుండెలమీద చేతులు వేసుకుని హాయిగా నిద్రపోతారు. కానీ ప్రజలను పట్టించుకోకుండా పాలకుడు సుఖాల మైకంలో మునిగి కళ్ళు మూసుకుపోతే ప్రజలు క్షణక్షణం భయంతో కంటినిండా నిద్రకూడ పోలేరు. రాజనీతి తెలిసిన ప్రభువు పాలనలో ప్రజలు సుఖపడతారు.

సూక్తి : **చెక్కు చెదరని నీతి నిజాయితీలు కలిగి ఉండటం నాయకత్వానికి మౌలిక అర్హత.** – కార్లే

**మీకు తెలుసా?**

## ఒగ్గుకథ

ఒగ్గుకథ ఒక జానపదకళారూపం. శివుని ఢమరుకాన్ని ఒగ్గు అని పిలుస్తారు. ఈ ఒగ్గును వాయిద్యంగా వాడుతూ కథ చెబుతారు. కాలక్రమంలో అది ఒగ్గుకథగా రూపాంతరం చెందింది. ఒగ్గు కథలు శివునికి సంబంధించిన కథలు. ఒగ్గు కథల్లో మల్లన్న, వీరప్ప కథలు ప్రధానంగా ఉంటాయి. ఈ కథాగాన కళాప్రదర్శనలో ఒక ప్రధాన కథకుడు, ఐదు నుంచి పది మంది వరకు సహకళాకారులు ఉంటారు. వారిలో ఒకరు డోలు, ఒకరు తాళం, ఒకరు కంజిరా ధరిస్తారు. వీరంతా ఒకపక్క వాయిద్యాన్ని వాయిస్తూనే మరోవక్క వంతపాట కూడ పాడుతారు.



ప్రధాన కథకుడు సందర్భాన్ని బట్టి ఆయాపాత్రలకు తగిన వేషాలు ధరిస్తూ కథను పాడుతుంటాడు. కథను ప్రారంభించే ముందు డోలును వాయిస్తూ వీరణంతో శబ్దం చేస్తూ, ఢమరుకంతో దడదడలాడిస్తూ మొదటగా గంగాదేవి ప్రార్థన చేస్తారు. ప్రారంభంలో మల్లన్న, వీరన్నకథలు మాత్రమే ఒగ్గు కళాకారులు చెప్పినా తరువాతి కాలంలో అనేక జానపద, పౌరాణిక, కాల్పనిక కథలు కూడ చెబుతున్నారు. ఈ కళను కాపాడుకోవడం మనందరి బాధ్యత.

## పెదఅవుటపల్లి జోసఫ్ తంబి తిరుణాళ్లు

కృష్ణాజిల్లాలోని గన్నవరం సమీపంలో ఉన్న పెదఅవుటపల్లి గ్రామంలో ప్రతి ఏటా జనవరి 13, 14, 15 తేదీలలో నిర్వహించే జోసెఫ్ తంబి తిరునాళ్లు రాష్ట్రంలో చాలా ప్రముఖమైన తిరునాళ్ళుగా చెప్పుకోవచ్చు. ఇది కేవలం క్రైస్తవులకే కాకుండా క్రైస్తవేతరులు కూడా ఈ తిరుణాళ్ళలో ఉత్సాహంగా పాల్గొని తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటూ ఉంటారు. పెదవుటపల్లిలో దేవుని సేవ కోసం నియమితుడైన బ్రదర్ జోసఫ్ తంబి గారి సమాధి ఉంది. ఆ పరిసర ప్రాంతాలలో క్రైస్తవులను ఉత్తేజితులను చేసి దేవుని మార్గం వైపు నడిపి ఎంతోమందికి ఎన్నో అద్భుత క్రియలను చూపించిన గొప్ప వ్యక్తిగా జోసెఫ్ తంబి గారిని ప్రజలు విశ్వసిస్తారు. ప్రతి ఏడూ జనవరి 13,14,15 తేదీలను తిరుణాలగా జరుపుకుని బ్రదర్ జోసఫ్ తంబి గారి సేవలను గుర్తు చేసుకుంటూ విశ్వాసంతో ముందుకు సాగడానికి ఈ ప్రాంత ప్రజలు ఈ వేడుకలు చాలా ఘనంగా నిర్వహిస్తారు. ఈ మూడు రోజులూ దివ్య బలిపూజ, చక్కని దేవుని వాక్య పరిచర్య మరియు దైవ సంబంధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిమంది ప్రజలు ఈ తిరునాళ్లకు హాజరై తమ భక్తి విశ్వాసాలను బలపరుచుకుంటారు.



## కొడుకు కోసం అబ్రహంలింకన్ టీచర్‌కి రాసిన లేఖ




మా అబ్బాయి ఇవాళే మొదటిసారి పాఠశాలకు వస్తున్నాడు. కొంతకాలం అక్కడ అంతా వాడికి వింతగానూ కొత్తగానూ ఉండబోతోంది. అందుకే వాడితో మీరు కొంచెం సున్నితంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాను.

ఈ సాహసకృత్యం వాడిని సప్తసముద్రాలూ దాటి వెళ్ళేందుకు సాయపడవచ్చు. ఆ సాహసాల్లో యుద్ధాలు, విషాదాలు, దుఃఖాలు వాడికి అనుభవంలోకిరావచ్చు. అలాంటి జీవితంలో వాడికి నమ్మకం, ప్రేమ, ధైర్యం తోడుగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుచేత, దయచేసి మీరు దగ్గరుండి ప్రేమతో వాడు నేర్చుకోవలసినవన్నీ నేర్పిస్తారా? వీలైతే అవన్నీ సున్నితంగా నేర్పగలరా? ఒక మిత్రుడుంటే ఒక శత్రువు కూడా ఉంటాడని నేర్పండి. అందరు మనుషులు న్యాయంగా ఉండరనీ, అందరూ సత్యసంధులు కారనీ వాడికి తెలియాలి. ఒక దుష్టుడున్న చోట ఒక వీరుడు కూడా ఉంటాడనీ, జిత్తులమారి వ్యక్తులు ఉండే చోటే అంకితభావంతో పనిచేసే వారు కూడా ఉంటారని చెప్పండి.

అప్పనంగా దొరికిన ఒక డాలరు కన్నా సొంతంగా సంపాదించుకున్న పది సెంట్లు ఎక్కువ విలువైనవని నేర్పండి. పాఠశాలలో మోసం చేసి గెలవటం కన్నా ఓడిపోవడం ఎక్కువ గౌరవంగా ఉంటుందని నేర్పండి. ఓడిపోయినప్పుడు చక్కగా దాన్ని అంగీకరించటం, గెలిచినప్పుడు మనస్ఫూర్తిగా ఆనందించటం నేర్పండి.

# 10 కన్యాశుల్కం

(ద్వితీయాంకం మొదటి భాగం)

D5V9X6

– గురజాడ అప్పారావు

## చదవండి – ఆలోచించి చెప్పండి

అన్ని సాహిత్య స్వరూపాలకన్నా **నాటకం** సమాజాన్ని గాఢంగా బంధిస్తుంది. అనుభవాలను ప్రతిబింబిస్తుంది. అందునా సాంఘిక నాటకం సమకాలీన సమాజంలోని ప్రతిసమస్యకు ప్రతిస్పందిస్తుంది. ప్రతిఘటనను ప్రతిఫలింప చేస్తూ ప్రజా జీవనాన్ని ప్రతిబింబింప చేస్తుంది సాంఘిక నాటకం. కాలానికి అనుగుణమైన ఇతివృత్తాలనే నాటక రచయితలు స్వీకరించాలని అంటాడు భాసుడు. సాంఘిక స్థితిగతులను సమగ్రంగా ప్రతిఫలింప చేయడమే సాంఘిక నాటక పరమ ప్రయోజనమని ఆర్థర్ మిల్లర్ పేర్కొన్నాడు. సమకాలీన సమాజానికి ఫోటోగ్రాఫ్ వంటిదిగా నాటకాన్ని మనం పరిగణనలోకి తీసుకోవాలి.

– (తెలుగు సాంఘిక నాటకం – పరిణామ క్రమం)




ప్రశ్నలు:

1. సమాజాన్ని గాఢంగా బంధించే సాహిత్య స్వరూపం ఏది?
2. భాసుడు నాటక ఇతివృత్తాల గురించి ఏం చెప్పాడు?
3. మిల్లర్ సాంఘిక నాటకం ప్రయోజనాన్ని గురించి ఏం చెప్పాడు?

## ఉద్దేశం

భారతదేశంలో ఆంగ్లవిద్యా విధానం అడుగిడుతున్న తొలిరోజులలో ఆనాటి సమాజంలో ఆంగ్లవిద్యను గురించి ప్రజలలో ఉన్న ఆలోచన ధోరణిని తెలియ చెప్పడం, కొత్తకొత్త కొలువులు కావాలంటే ఆధునిక విద్యనభ్యసించాల్సిందేనని వెంకమ్మ లాంటి సాధారణ గృహిణి ఆనాడే గ్రహించిందని చెప్పడం, సమాజంలోని దురాచారాలు, సంఘసంస్కరణపై అవగాహన కల్పించి, విద్యార్థులను చైతన్యపరచడం ఈ పాఠం ఉద్దేశం.

## రచయిత పరిచయం



జననం: 21.09.1862
మరణం: 30.11.1915

ఆధునిక సాహిత్యానికి వేగుచుక్క గురజాడ. గురజాడ అప్పారావు విశాఖపట్నం సమీపంలో రాయవరంలో జన్మించారు. తల్లిదండ్రులు కౌసల్యమ్మ, వెంకట రామదాసు. కన్యాశుల్కం వంటి నాటకంతో పాటు గురజాడ కొండుభట్టీయం, బిల్హణీయం అనే రెండు అసంపూర్ణ నాటకాలు. ముత్యాలసరాలు అనే కవితా సంపుటి, దిద్దుబాటు, పెద్ద మసీదు, మీ పేరేమిటి? సంస్కర్త హృదయం, మెటిల్డా అనే కథలు రాశారు. 1892 ఆగస్టు 13న విజయనగరంలో కన్యాశుల్కం మొదటి నాటక ప్రదర్శన జరిగింది. ఈ నాటకం 1897సం॥లో అచ్చయ్యింది. చేర్పులు మార్పులతో 1909సం॥లో రెండవ కూర్పు వచ్చింది. **ప్రస్తుత పాఠ్యభాగం కన్యాశుల్కం నాటకంలోని ద్వితీయాంకం మొదటి భాగం నుండి స్వీకరించబడింది.**

## ప్రక్రియ-నాటకం

దశవిధ రూపకాల్లో నాటకమే ఉత్తమమైనదని సద్విమర్శకుల అభిప్రాయం. “కావ్యేషు నాటకం రమ్యం” అని మన అలంకారికులు చెప్పడాన్ని బట్టి ప్రక్రియలన్నింటిలోను నాటకమే గొప్పదని చెప్పవచ్చు. సమస్త సాహితీ ప్రక్రియల సమాహారం నాటకం. ఇతర సాహిత్య ప్రక్రియల లక్షణాలు ఇందులో ఇమిడిపోయి ఉండడం వల్ల నాటక ప్రక్రియ అగ్రస్థానం పొందింది. నటుల చేత ప్రదర్శింపబడేది నాటకం. నాటకంలో నాలుగు నుంచి పది వరకు అంకాలు ఉంటాయి. నాటకంలో సంభాషణలకి, అభినయానికి, నటుల హావ, భావ ప్రదర్శనకి అవకాశం ఉంటుంది. దీనిలో రస పోషణ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది.

## కన్యాశుల్కం రచనా నేపథ్యం

1890 సంవత్సర కాలంలో విజయనగరం పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న కన్యాశుల్క వివాహ వివరాలు సేకరించారు ఆనంద గజపతిరాజు. ఈ సర్వే వలన ఏటా దాదాపు 344 బాల్యవివాహాలు జరిగేవనే విషయం కన్యాశుల్కం నాటకం రాయడానికి ప్రేరణ కలిగించింది. ఆనంద గజపతిరాజు సూచనతో తనను ఎంతో బాధించిన ఈ సామాజిక దురాచారాన్ని ఇతివృత్తంగా తీసుకొని, జనరంజకమైన నాటకంగా రూపొందించి, ప్రజలను చైతన్యం చేయాలి అనుకున్నారు గురజాడ. నిరక్షరాస్యులను సైతం ఆకట్టుకుని, ఆలోచింప చేసే ప్రక్రియ నాటకం అని భావించారు. సామాజిక సమస్యల పరిష్కారం కోసం పుట్టిన నాటకం కన్యాశుల్కం. సామాజిక, సాహిత్య ప్రయోజనాలను ఏకకాలంలో సాధించిన గొప్ప నాటకం ఇది. ఈ నాటకాన్ని ఉత్తరాంధ్ర మాండలికంలో రచించారు.

## నేపథ్యం

వెంకమ్మ, అగ్నిహోత్రావధానుల పెద్దకూతురు బుచ్చమ్మ, చిన్నకూతురు సుబ్బి. కొడుకు వెంకటేశం. వెంకటేశం ఇంగ్లీష్ చదువుకోసం విజయనగరంలో ఉంటాడు. అతని ప్రైవేట్ మాస్టారు గిరీశం. పరీక్ష తప్పి సెలవుల్లో ఇంటికి ఏ మొహం పెట్టుకొని వెళ్లాలా? అని వెంకటేశం ఇబ్బంది పడుతున్న సమయంలో గిరీశం అతనికి భరోసా ఇస్తాడు. వెంకటేశంతో పాటు సెలవుల్లో అతనికి చదువు చెప్పే నెపంతో ఊరికి వెళ్తాడు. ఆ తరువాత సన్నివేశమే ప్రస్తుత పాఠ్యాంశం.

కన్యాశుల్కం ద్వితీయాంకం (మొదటి సన్నివేశం) (1వ స్థలం. కృష్ణారాయపురం అగ్రహారంలో అగ్నిహోత్రావధాన్లు ఇల్లు) (అగ్నిహోత్రావధాన్లు జంఝాలు వడుకుచుండును. కరటకశాస్తుల్లు శిష్యుడిచేత లేని పేలు నొక్కించుకొనుచుండును. వెంకమ్మ కూర తరుగుచుండును).

వెంకమ్మ : నిన్నట్నించి కిశిమీశ్శలవులని కుఱ్ఱవాడు ఉత్తరం రాశాడు. ఎన్నాళ్ళో ఐంది వాణ్ణిచూసి, కళ్లు కాయలు కాసిపోయినాయి. గడియో గడియో రావాలి.

అగ్ని : ఎందుకు వొట్టినే వగచడం? వొద్దువొద్దంటూంటే యీ యింగిలీసు చదువులో పెట్టేవ్. మెరక పొలం సిస్తంతా వాడికిందయిపోతూంది. కిందటి యేడు పరీక్ష ఫేలయిపోయినాడుగదా? యీయేడుయెలాతగలేశాడో తెలియదు. మనకీ యింగిలీషుచదువు అచ్చిరాదని పోరిపోరి చెబితే విన్నావు కావు. మా పెద్దన్న దిబ్బావుధాన్లు కొడుకుని యింగిలీషు చదువుకు పార్వతీపురం పంపించేసరికి వూష్టం వొచ్చి మూడ్రోజుల్లో కొట్టేశింది. బుచ్చబ్బి కొడుక్కి యింగిలీషు చెప్పిద్దాంవనుకుంటూండగానే చచ్చినంత ఖాయలా చేసింది.

వెంకమ్మ : మీరెప్పుడూ యిలాంటి వోఘాయిత్తం మాటలే అంచూవుంఛారు. డబ్బు కర్చయిపోతుందని మీకు బెంగ మొన్న మొన్న మనకళ్లెదట మనవాకట్లో జుత్తు విరబోసుకు గొట్టికాయలాడిన నేమాని వారి కుఱ్ఱాడికి మునసబీ ఐంది కాదూ?

అగ్ని : మనవెధవాయకి చదువొచ్చేదేం కనపడదు కానిపుస్తకాల కిందా జీతం కిందా యిహ నాలుగేళ్లయేసరికి మనభూమి కడతేరిపోయింది. ఆ పైని చిప్పా దొప్పా పట్టుకు బయల్దేరాలి. నిమ్మళంగా యింటి దగ్గరుంటే యీపాటికి నాలుగష్టాలు చెప్పేదును. వొద్దంటూంటే యీ యింగిలీషు చదువులో పెట్టేవు.

> **ఆలోచించండి – చెప్పండి**
>
> 1. కన్యాశుల్కం అంటే ఏమిటి?
> 2. అగ్నిహోత్రావధాన్లు ఇంగ్లీషు చదువు వద్దనడానికి కారణం ఏమిటి?

వెంకమ్మ : మనవాడికో మునసబీ ఐనా పోలీసుపనైనా ఐతే రుణాలిచ్చి యీ అగ్రహారం భూవులన్నీ కొనేస్తాడు. యీడాదికోనూఱ్ఱూపాయలు కర్చుపెట్టడాని కింత ముందూవెనకా చూస్తున్నారు. మీలాగే వాడూ జంఝాలు వొడుక్కుంటూ బతకాలని వుందా యేవిఁషి? మీకంత భారవం తోస్తే మావాళ్లు నాకు పసుపూ కుంకానికి యిచ్చిన భూవఁమ్మేసి కుఱ్ఱాడికి చదువు చెప్పిస్తాను.

కరటక : నీ భూ వెందు కమ్మాలమ్మా? మనసొమ్ము చదతిని కొవ్వున్నాడు అతడే పెట్టుకుంటాడు.

అగ్ని : ఐతే నన్ను ఆక్షేపణ చేస్తావషే? యీమారంటే నీఅన్న వున్నాడని వూరుకునేది లేదు.

(గిరీశం వెంకటేశం ప్రవేశింతురు.)

వెంక : మా బాబ్మా బాబు వచ్చావషోయ్ (వెంకటేశం కౌగిలించుకొనును.)

అగ్ని : వెధవాయా యీమారైనా ప్యాసయినావా? (వెంకటేశం తెల్లబోయి చూచును.)

గిరీశం : ప్యాసయినాడండి. ఫస్టుగా ప్యాసయినాడు. నేను చాలా శ్రమపడి చదువు చెప్పేనండి.

అగ్ని : వీడెవడోయ్?

గిరీశం : డామిట్, టెల్ మాన్.

అగ్ని : మాన్? మానులావుంచానంఛావూ? గూబ్బగల గొడతాను.

వెంకటేశం : (వణుకుతూ తల్లివైపు చూసి) అమ్మా! యీయ్నే నాకు చదువు చెప్పే మేష్టరు.

కరట : ఇంటికి పెద్దమనిషొస్తే అప్పుచ్ఛపు మాటలాడతావేవిఁటి బావా? ఆయనేదో కుఱ్ఱవాడితో యింగిలీషుమాటంటే పుచ్చకాయలదొంగంటే బుజాల్తడువుకున్నట్టు నీ మీద పెట్టుకుంటావేం? (బండివాడు సామాను దించును)

గిరీశం : (కరటకశాస్త్రితో) తమ బావగారా అగ్నిహోత్రావధాన్లుగారు? నన్ను తమరు యరక్క పోవచ్చును గాని డిప్టీకలక్టరుగారింటికి తమరు వచ్చేటప్పుడు నేను వారి పిల్లలికి చదువు చెబుతూ ఉండేవాణ్ణి.



డిప్టీకలక్టరుగారు తమర్ని యే మ్మెచ్చుకునేవారనుకుంటారు!

**కరట :** అవును మీ మొఖం చూసిన జ్ఞాపకము ఉంది. డిప్టీకలక్టరుగారు మాదొడ్డ ప్రభువ్.

**గిరీశం :** మీలాంటి చప్పన్నభాషలూ వచ్చిన మనిషి యెక్కడా లేడనీ, సంస్కృతం మంచినీళ్ల ప్రవాహంలా తమరు మాట్లాడతారనీ, తమలాంటివిదూషకుణ్ణి యక్కడా చూళ్లేదనీ డిప్టీకలక్టరుగారు శలవిస్తూండే వారు. కవితారసం ఆయన్లా గ్రహించేవారేరి? నాకవిత్వమంటే ఆయ్న చెవి కోసుకుంటారు. మహారాజావారి దర్శనం కూడా నాకు చేయించారండి.

**అగ్ని :** (ధుమధుమలాడుతూ) ఈ శషభిషలు నాకేం పనికిరావు. యితడి వైఖరి చూస్తే యిక్కడే బసవేసేటట్టు బలపడుతూంది. మా యింట్లో భోజనం యంత మాత్రం వీలుపడదు.

**వెంక :** ఆయనమాటలు గణించకు బాబూ, ఆయన మోస్తరది. మీ దయవల్ల మావాడికో ముక్కబ్బితే మీ మేలు మరిచిపోం.

**గిరీశం :** అందు కభ్యంతరవేవిటమ్మా! మీ వాడు శలవుల్లో చదువు చెప్పమని యెంతో బతిమాలుకుంటే పోనీ పనికొచ్చే కుఱ్ఱవాడు గదా అని వొచ్చాను గాని పట్నంలో మునసబు గారింట భోజనం చేదని వొచ్చానా వారిచ్చే డబ్బు చేదని వొచ్చానా అమ్మా.

**వెంకమ్మ:** యీ చదువులకోసవని పిల్లణ్ణి వొదులుకుని వుండడం, వాడు పరాయి వూళ్లో శ్రమదమాలు పడుతూండడం నాప్రాణాలు యెప్పుడూ అక్కణ్ణే వుంచాయి. డబ్బంటే యెన్నడూ వెనక చూళ్లేదుగదా. మేం కనడం మట్టుకు కన్నాం. మీరే వాడికి తల్లీ తండ్రీని. యెల్లా కడుపులో పెట్టుకు చెబుతారో మీదే భారం.

**గిరీశం :** తమరు యింతదూరం శలవియ్యాలమ్మా? నామంచిచెడ్డలు మీ కుఱ్ఱవాణ్ణిడిగితే తెలుస్తుంది. మునసబుగారూ, డిప్టీకలక్టరుగారూ యెన్నికచేసిన మనిషిని, నామాట నేచెప్పుకోవాలా, ఇంతెందుకూ, యిక మూడేళ్లు

నా తరిఫీదులో ఉంచితే క్రిమినల్లో వరసగా పోలీసుపరీక్ష ప్యాసు చేయిస్తాను.

అగ్ని : మూడేళ్లే! యీ సంవత్సరం పుస్తకాల కెంతవుతుందిరా అబ్బీ!

వెంక : పది హేన్రూపాయ లవుతుంది.

అగ్ని : ఒక్క దమ్మిడీ ఇవ్వను. వీళ్ళిద్దరూకూడి ఆరూపాయలు పంచుకుతినేటట్టు కనపడుచూంది. నేను వేదం యనభైరెండు పన్నాలూ ఒహదమ్మిడీ పుస్తకాలఖర్చు లేకుండా చదువుకున్నాను. ఇదంతా టోపీవ్యవహారంలా కనపడుతుంది.

**ఆలోచించండి - చెప్పండి**

1. కడుపులో పెట్టుకు చదువు చెప్పడం అన్న వెంకమ్మ మాట మీకు ఎలా అర్థమైంది?

కరట : (నవ్వుతూ) కోట్లకి విలువైన మాట అన్నావు బావా!

గిరీశం : (కరటకశాస్త్రితో) చూచారండి, జెంటిల్మేను అనగా పెద్దమనిషిని ఎలా అంటున్నారో! నేను యిక యిక్కడ ఉండడం భావ్యం కాదు, శలవు పుచ్చుకుంటాను.

వెంకమ్మ : చాల్చాలు బాగానే వుంది! యింటి కెవరొచ్చినా నాకిదే భయం, ఆయన మాటల కెక్కడికి బాబూ, వెళ్లిపోకండి.

కరట : అగ్నిహెూత్రావధానులూ కుఱ్ఱవాడికి రవ్వంత చదువు చెప్పించడానికి ఇంత ముందూవెనకా చూస్తున్నావ్. బుచ్చమ్మ నమ్మిన పదిహేనొందల రూపాయిలేంజేశావ్?

గిరీశం : సెల్లింగ్గర్ల్స్! డామిట్!

అగ్ని : ప్రతీ వాడూ అమ్మానమ్మా వంచుంచాడు. కూర గాయల్లోయ్ అమ్మడానికీ? ఆ రూపాయలు పుచ్చుకోకపోతే మొగుడు చచ్చాడుగదా, దానిగతి యావై యుండును?

కరట : చచ్చేడంటే వాడిదా తప్పు? మంచం మీంచి దించెయడానికి సిద్ధంగా వున్న వాడిక్కట్టావ్.

గిరీశం : తమరేనా నులక అగ్నిహెూత్రావధాన్లు గారు? యీ పట్టెని జటలో తమంత వారు లేరని రాజమహేంద్రవరంలో మావాళ్లనుకునేవారు.

అగ్ని : మీది రాజమహేంద్రవండీ. ఆ మాట చెప్పేరు కారేం? రామావుధాన్లు గారు బాగున్నారా?

గిరీశం : బాగున్నారండి. ఆయన మా మేనమావ గారండి.

అగ్ని : ఆ మాట చెప్పారు కారూ?

గిరీశం : మా మావఁయీదేశ బ్భోగట్టా వొచ్చినప్పుడల్లా తమర్ని యెన్నిక చేస్తూంటారండి.

అగ్ని : నాకూ వారికి చాలా స్నేహం. చూశారా కొంచం నాకు ప్రథమ కోపం, యెవరో తెలియకుండా అన్నమాటలు, గణించకండేం.

గిరీశం : దానికేవండి, తమవంటి పెద్దలు అనడం మాలాంటి కుఱ్ఱవాళ్లు పడడం విధాయకవేఁగదండీ.

కరట : (తనలో) యిన్నాళ్లకి మా అగ్నిహెూత్రుడికి తగినవాడు దొరికేడు.

అగ్ని : చూచారండీ, మీపేరేవిఁటండీ?

గిరీశం : గిరీశం అంటారండి.

అగ్ని : చూశారండి, గిరీశంగారూ! మా కరటక శాస్త్రుల్లు వట్టి అవక తవక మనిషి! మంచీ చెడ్డా యేమీ వాడి మనసు కెక్కదు. అల్లుడు చచ్చిపోయినాడంటే అందువల్ల యెంత లాభం కలిగింది. భూవుఁలకి దావా తెచ్చానా లేదా? నేను యీ మధ్య దాఖల్చేయించిన పిటీషనుమీద ఆర్డరు చదివి పెట్టండి. (గదిలోకి వెళ్లి కాకితం తెచ్చి గిరీశం చేతికి యిచ్చును).

గిరీశం: (చూసి) ఎవడో తెలివితక్కువ గుమస్తా వ్రాసినట్టుంది. అక్షరపొలికే లేదండి.

అగ్ని : మావకీలు గడగడ చదివేడండి.

గిరీశం : నేను మాత్రం చదవలేకనా. అంతకన్న గళగ్రాహిగా చదువుతాను, లెక్చర్లిచ్చేపండితుణ్ణి నాకిది పేలపిండీ కాదు; అయితే రాసినవాడి తెలివికి సంతోషిస్తున్నాను. ఇది అరటిపండు విప్పినట్టు తర్జుమా చేసి దాఖలు చెయ్యమని శలవా?

అగ్ని : అంతకంటేనా! (తనలో) డబ్బు ఖర్చులేకుండా వీడిచాత కాగితమ్ముక్కలన్నీ తర్జుమా చేయించేస్తాను.

గిరీశం : యింకా ఇంగ్లీషుకాయితాలు యేవున్నా నామీద పారెయ్యండి. తర్జుమా చేసి పెడతాను.

అగ్ని : అష్లాగే...

వెంకమ్మ : మా అబ్బాయీ మీరు ఒక్క పర్యాయం యింగిలీసు మాట్లాడండి బాబూ.

గిరీశం : అలాగేనమ్మా.

My dear Venkatesam
Twinkle! Twinkle! little star,
How I wonder what you are!

వెంకటేశం : There is a white man in the tent.

> **ఆలోచించండి - చెప్పండి**
>
> 1. అగ్నిహోత్రావధాన్లు దృష్టిలో కరటకశాస్త్రి ఎలాంటి మనిషి?
> 2. గళగ్రాహి అంటే ఏమిటి?

అగ్ని : యీ ఆడుతూన్న మాటలికి అర్థం యేవిఁటండీ.

గిరీశం : యీ శలవుల్లో యే ప్రకారం చదవాలో అదంతా మాట్లాడుతున్నావండీ.

కరట : అబ్బీ వోక తెనుగు పద్యం చదవరా?

గిరీశం : (మెల్లగా) "నలదమయంతులిద్దరు" చదువ్

వెంకటేశం : నలదమయంతు లిద్దరు మనః ప్రభవానల దహ్యమానులై సలిపిరి దీర్ఘవాసర నిశల్.

కరట : అంటే అంటే, మనఃప్రభవానలవంటే యేవిట్రా? –

వెంకటేశం : (యింటికప్పు వేపుచూసి వూరుకుండును.)

గిరీశం : పసిపిల్లలకి అలాంటికఠినవైన పద్యానికి అర్థం తెలుస్తుందా అండి?

అగ్ని : పద్యాలికి అర్థం చెప్పరూ?

గిరీశం : యిప్పటిమట్టుకు వేదంలాగే భట్టీయం వేయిస్తారు. యెంతసేపూ జాగర్ఫీ, గీగర్ఫీ, అర్థమెటిక్, ఆల్జీబ్రా, మేథమేటిక్స్ యివన్నీ హడలేసి చెప్తారండి.

కరట : (తనలో) తర్ఫీదు మాచక్కగా ఉంది, వీణ్ణి పెందరాళే తోవ పెట్టకపోతే మోసం వొఁస్తుంది.

అగ్ని : అన్నోటి చెప్తారండీ?

గిరీశం : మరేవనుకున్నారు? మీ కుఱ్ఱవాళ్ళాగ చదువుకునేవాడికి ఒక నిమిషవైనా తెరిపుండదు.

అగ్ని : అదుగో చదువంటే అష్లాగే చదువుకోవాలి. గొట్టికాయ లాడకుండా మావాణ్ణి ఖాయిదా చేస్తే యెంత చదువైనా వొస్తుంది.

గిరీశం : నాదగ్గిర గొట్టికాయలు గిట్టికాయలు పనికిరావండి. పుస్తకం చాతపడితే వేళ్లకి పుస్తకం అంటుకుపోవాలి. అలా చదివిస్తానండి.

అగ్ని : అలాగే చేస్తే
మావాడికి చదువొచ్చి
అన్ని పరీక్షలూ
ప్యాసవుతాడండి.
మావాడికి డబ్బు
ఖర్చులేకుండా పెళ్ళయే సాధనం కూడా తటస్థించిందండి.

> **ఆలోచించండి - చెప్పండి**
>
> 1. గిరీశం వల్ల మోసం వస్తుందని కరటక శాస్త్రి ఎందుకు అనుమానించాడు?
> 2. ఎలా చదివిస్తే చదువు బాగా వస్తుందని అగ్నిహోత్రావదాన్ల అభిప్రాయం?

వెంకమ్మ : మీ నైజంకొద్దీ ఛిఱ్ఱూ కొఱ్ఱూ మంఛారుగాని మీకు మాత్రం అబ్బిమీద ప్రేవలేదా యేవిషి? పట్టంలో గొట్టాలమ్మొచ్చినప్పుడు యెంతో బెంగ బెట్టుకుని అబ్బిని శలవర్జీరాసి వెళ్లిపో రమ్మన్నారు కారా? చదువూ చెప్పించక పెళ్ళీ చెయ్యక తీరుతుందా యేవిషి?

కరట : డబ్బు ఖర్చులేకుండా కొడుక్కి పెళ్లి చేస్తావుటోయి బావా? ఆడపిల్లల్ని అమ్మినట్టే అనుకున్నావా యేవిషి? పదిహేనొందలైనా పోస్తేనే గాని అబ్బికి పిల్ల నివ్వరు.

అగ్ని : డబ్బు ఖర్చులేకుండా వెంకడికి యలా పెళ్లి చేస్తానో నువ్వే చూతువుగాని, రామచంద్రపురం అగ్రహారంలో లుబ్ధావధాన్లుగార్ని యెరుగుదువా?

కరట : యెరగను.

అగ్ని : ఆయ్న లక్షాధికారి. పద్దెనిమిదివందలకి సుబ్బిని అడగొచ్చారు. ఉభయ ఖర్చులూ పెడతారష, పెళ్ళి మావైభవంగా చేస్తారట, మనం పిల్లని తీసికెళ్లి వాళ్లింటే పెళ్ళి చెయ్యడం, మనకి తట్టుబడి అట్టేవుండదు.పద్దెనిమిదివొందలూ పెట్టి వెంకడికి పెళ్ళి చేస్తాను.

వెంకమ్మ : పెళ్ళికొడుక్కెన్నేళ్లు?

అగ్ని : యెన్నేళ్లైతేనేమి? నలభైయ్యయిదు.

గిరీశం : లుబ్ధావధాన్లు మా పెత్తల్లి కొడుకండి, తమతో సమ్మంధవంటే నాకు సంతోషవేగానండి. ఆయనకి అరవయ్యేళ్లు దాటాయండి.

కరట : బావా యీసమ్మంధం చేస్తే నీకొంపకి అగ్గెట్టేస్తాను.

**ఆలోచించండి - చెప్పండి**

1. కొడుకు పెళ్లి విషయమై అగ్నిహోత్రావధాన్ల ఆలోచన ఏమిటి?
2. వెంకమ్మ చిన్న కూతురు పెళ్ళి విషయమై ఎవరెవరిని ప్రాధేయపడింది?

అగ్ని : ప్రతీవాడు తిండిపోతుల్లాగ నాయింట జేరి నన్నెనే వాళ్లే, **తాంబోలం యిచ్చేశాను, యిహ తన్నుకు చావండి.** (లోపలికి వెళ్ళును)

వెంకమ్మ : అన్నయ్యా !ఈసమ్మంధం చేస్తే నేన్నుయ్యో గొయ్యో చూసుకుంటాను.పెద్దదాన్ని రొమ్ము మీద కుంపట్లాగా భరిస్తూనే ఉన్నాం నేను బతికి బాగుండాలంటే యీసమ్మంధం తప్పించు.

కరటక : గట్టి అసాధ్యం తెచ్చిపెట్టావే, యేమీ పాలుపోకుండా ఉంది.

గిరీశం : అమ్మా! మీరు యెందుకలా విచారిస్తారు? అవధాన్లు గారు సావకాశంగా ఉన్నప్పుడు లెక్చరిచ్చి మనసు మళ్ళిస్తాను.

వెంకమ్మ : బాబూ అతడు మీమేనత్త కొడుకైతే మీ కాళ్లు పట్టుకుంటాను.మీరు వెళ్లి ఆయన మనస్సు మళ్లిస్తురూ. నా చర్మం చెప్పులు కుట్టిస్తాను.

కరటక : అమ్మీ నేనో ఉపాయం చెబుతాను యిలా రా. (నిష్క్రమిస్తారు)

(తర్వాత కథ క్లుప్తంగా)

కరటక శాస్త్రి తన శిష్యునికి ఆడవేషం వేసి తక్కువ డబ్బుకి, ముహూర్తానికి ముందుగానే ఆ ఊరు చేరి, లుబ్ధావధాన్లకిచ్చి పెళ్లి జరిపించేస్తాడు ముహూర్తం నాటికి అగ్నిహోత్రావధాన్లు పెళ్ళికి తరలివెళతాడు. వేరే సంబంధం చేసుకున్నందుకు వెళ్లి లుబ్ధావధాన్ల మీద చేయి చేసుకుంటాడు. ఈ గొడవలతో అగ్నిహోత్రావధాన్లు కోర్టుకు వెళ్తాడు.పెళ్లి సంబంధాలు కుదర్చడం తప్పించడంలో కీలకపాత్ర పోషించింది రామప్పంతులు. ఈ పెళ్లిలో మధురవాణి 'కంటె' రామప్పపంతులు తెచ్చి దొంగపెళ్ళికూతురికి పెట్టిస్తాడు. అది కాస్త మాయం అవటంతో కంటె ఇప్పించమని లుబ్ధావధాన్ల మీద ఒత్తిడి తెస్తాడు. అతడు తనకి ఏమీ తెలియదని చేతులు ఎత్తేస్తాడు. కంటె తెస్తే తప్ప రామప్పంతుల్ని ఇంటికి రానివ్వనంటుంది మధురవాణి. ఈ పెళ్లి వల్ల ఏమీ లాభం లేదు సరికదా తిరిగి నష్టం వచ్చినందుకు రామప్పంతులు పోలీసుల సాయంతో లుబ్ధావధాన్ల మీద కేసు పెట్టిస్తాడు.

అందరూ కోర్టు చుట్టూ తిరుగుతారు. అక్కడ సౌజన్యరావు పంతులు అనే సంస్కర్త సాయంతో, మధురవాణి మంచితనం, చాకచక్యంతో కేసులన్నీ విడిపోతాయి. సమకాలీన సమాజంలో దురాచారాలను విమర్శిస్తూ మరెన్నో జీవిత సత్యాలను రచయిత ఈ నాటకంలో ప్రదర్శించాడు.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) ఈ కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి, రాయండి.**

1. కన్యాశుల్కం నాటకంలో ప్రధాన ఇతివృత్తం ఏమిటో చెప్పండి?
2. కన్యాశుల్కం నాటకం రాయడానికి గురజాడకు ప్రేరణ కలిగించిన సంఘటన ఏది?

**ఆ) కింద ఇచ్చిన ప్రహసనం చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**



ఇంద్రుడు : నారద మునీంద్రా! మీరిప్పుడేలోకము నుండి దయచేయుచున్నారు?

నారదుడు : నేనిప్పుడు భూలోకం నుండి వచ్చుచున్నాను.

ఇంద్రుడు: అక్కడ వింతలు విశేషములు ఏమి?

నారదుడు: చెప్పెదను వినుండు. భూలోకంలో జనులు కొత్త గ్రహము నొకదానిని కనిపెట్టినారు.

ఇంద్రుడు: ఆ గ్రహము యొక్క లక్షణములేవో సెలవియ్యవలయును. వినుటకు నాకెంతో ఆత్రముగ నున్నది.

నారదుడు: చెప్పుటకు గూడా నాకెంతో యాత్రముగానున్నది. కొత్తగా కనిపెట్టిన ఈ దశమగ్రహము భూమి మీదనే సంచరించుచుండును.

ఇంద్రుడు : ఇది క్రూర గ్రహమా? శాంతగ్రహమా?

నారదుడు : ఇది ఎల్లప్పుడూ వక్ర గ్రహము . ఎల్లప్పుడూ క్రూర గ్రహము.

ఇంద్రుడు : ఈ గ్రహమెవరికి కీడు కలుగ జేయును? ఎవరికి మేలు కలుగ జేయును?

నారదుడు : ఈ గ్రహము జన్మస్థానమునకు మేలు కలగజేయుచు ఆడపిల్లలు గల తల్లిదండ్రులకు సదా కీడు చేయుచుండును.

ఇంద్రుడు : ఈ గ్రహమునకు శాంతి ఎట్లు?

నారదుడు : ఆడపిల్లలు గల వారు నిరంతరము హిరణ్యదానము చేయుచున్న పక్షమున ఈ గ్రహం యొక్క క్రూరత్వము కొంతవరకు శమించును. అప్పటికి శాశ్వతముగా శమింపదు. తాత్కాలికముగా శమించును.

ఇంద్రుడు : ఈ గ్రహమునకు శని గ్రహమునకు భేదమేమి?

నారదుడు : ఈ గ్రహము కంటే శని గ్రహమే చాలా మంచిది. ఎందుచేతననగా? శని యేడు సంవత్సరాలు మాత్రమే మనుష్యు నాశ్రయించి బాధపెట్టును. ఈ గ్రహము ఆశ్రయించిన వారిని యావజ్జీవము బాధపెట్టును. వెయ్యేల? ఇంత పాడుగ్రహము లేదు. ఈ గ్రహము వలన బాధపడని వారు లేరు.

ఇంద్రుడు : ఆ గ్రహము పేరేదో చెప్పి నన్ను సంతోషపెట్టు.

నారదుడు : ఇది జామాత గ్రహము. అనగా అల్లుడు గ్రహము.

ఇంద్రుడు: ఇదటయ్యా ! నువ్వు చెప్పిన గ్రహము. మిక్కిలి చమత్కారముగా చెప్పినావే. పరమేశ్వరానుగ్రహము చేత నీ పదవ గ్రహ బాధ మన స్వర్గలోకమునకు లేదు.

నారదుడు : బాధ గీధో నేనెరుగను స్వామి! చదువుకున్నవాడని లేదు. చదువు లేనివాడనియు లేదు. ఆస్తి కలవాడనీ లేదు లేనివాడనియు లేదు. గుడ్డిగవ్వ చేయనివాడు, గడ్డిపరక చేయని వాడు కూడా అల్లుడు కావాలని కట్నములు, కానుకలు తెమ్మని ఆడపిల్లల తండ్రి సంసారములు దిబ్బ చేయును. ఈ దురవస్థకు అంతు పారము లేక యున్నది.

ఇంద్రుడు : ఈ దశమగ్రహమునకు దగిన శాంతి ఎట్లు చేయవలెనో నేను బృహస్పతితో నాలోచించెదను. రండి వెళ్ళుదాము.

– చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి ప్రహసనాల నుండి

ప్రశ్నలు :

1. పై సంభాషణ ఎవరెవరి మధ్య జరిగింది?
2. ఈ ప్రహసనంలో కవి ఏ దురాచారాన్ని ఎత్తి చూపాడు?
3. భూలోకంలో ఉన్న గ్రహం ఎలాంటిది?
4. పై సంభాషణ ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

**ఇ) కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఆధునిక రష్యన్ సాహిత్యమంతా నికొలాయ్ గొగోల్ రాసిన 'ఓవర్ కోట్' అనే కథలోంచే పుట్టిందని మహారచయిత దాస్తోయవిస్కీ ప్రకటించాడు. అమెరికాలోనూ, ఐరోపా ఖండంలోనూ, ల్యాటిన్ అమెరికాలోనూ, ఆఫ్రికాలోనూ వచ్చిన ప్రాంతీయ సాహిత్యమంతా కూడా మార్క్ ట్వయిన్ సాహిత్యంలోంచే పుట్టింది. ప్రాంతీయ జీవితమూ, భాషా సంబంధమైన పలుకుబళ్ళు, ఆ మట్టిన పుట్టిన సజీవ వ్యక్తుల జీవితాల్లోని వెలుగునీడలూ ఇవన్నీ కూడా ఆ ఇద్దరు మహారచయితలు తమ రచనల్లో పరమాద్భుతంగా చిత్రించారు. వారి ప్రభావంతో ఆయా దేశాల్లో, భాషల్లో తదనంతర రచయితలందరూ కథలూ, నవలలూ, నాటకాలూ రాశారు.

పందొమ్మిదో శతాబ్దంలో ఆ మహానుభావులు వేసిన బీజాలవల్ల ఆ శతాబ్దంలోనే కాక, ఇరవయ్యవ శతాబ్దిలోనూ, ఇప్పుడు నడుస్తున్న 21వ శతాబ్దిలో కూడా ఆ ప్రభావం అవిచ్ఛిన్నంగా, సముజ్జ్వలంగా కొనసాగుతున్నది. తెలుగు సాహిత్యంలో

నేడు విరాజిల్లుతున్న ప్రాంతీయ జీవన చిత్రణ, వివిధ సామాజిక, మత వర్గాల వారి జీవన విధానవర్ణన, ప్రాంతీయ భాషల సొగసు, వైవిధ్యం ఇవన్నీ కూడా గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం నుంచి పుట్టినవే నని నేను నమ్ముతున్నాను. ఆధునిక తెలుగు సాహిత్యానికి 'కన్యాశుల్కం' అమ్మ. **- కె.ఎన్.వై.పతంజలి.**

ప్రశ్నలు:

**1. 'ఓవర్‌కోట్' కథను రాసింది ఎవరు?**

**2. 19వ శతాబ్దంలో ఏ రచయితల ప్రభావం ఎక్కువ?**

**3. ఆధునిక తెలుగు సాహిత్యానికి 'అమ్మ' ఎవరని రచయిత అభిప్రాయం?**

**4. పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.**

**ఈ) కింది వానికి అర్థసందర్భములు రాయండి.**

1. డబ్బు ఖర్చయిపోతుందని మీకు బెంగా..
2. పుస్తకం చేతబడితే వేళ్ళకి అంటుకుపోవాలి.
3. తాంబోలం యిచ్చేశాను, యిహ తన్నుకు చావండి.

**ఉ) కింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. కన్యాశుల్కం నాటకం ఏ మాండలికంలో రచించారు?
2. వెంకటేశం చదివిన పద్యం ఏది?
3. "పుచ్చకాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు" ఈ మాటలు అన్నది ఎవరు?

## వ్యక్తీకరణ-సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. కరటక శాస్త్రి ఎవరిని తొందరగా తోవ పెట్టాలనుకున్నాడు? ఎందుకు?
2. అగ్నిహోత్రావధానుల పాత్ర స్వభావం ఎలాంటిది?
3. గిరీశం ఎలాంటివాడు?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. కన్యాశుల్కం పాఠ్యభాగం ద్వారా కవి చెప్పదలచుకున్న అభిప్రాయం ఏమిటో రాయండి?
2. వెంకటేశం ఇంగ్లీషు చదువు విషయంలో వెంకమ్మ పట్టుపట్టడంలో ఉద్దేశాన్ని మీ సొంత మాటల్లో రాయండి?
3. ఆధునిక విద్య వలన కలిగే ప్రయోజనాలను విపులీకరించండి?

**ఇ) కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.**

1. కన్యాశుల్కం పాఠాన్ని సొంతమాటలలో కథగా మార్చి రాయండి.
2. మీ ఊరిలో జరిగే నాటక ప్రదర్శనకు ప్రేక్షకులకు ఆహ్వానం పలుకుతూ కరపత్రాన్ని తయారు చేయండి.

## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి వాటితో సొంతవాక్యాలు రాయండి.**

1. ఏటేట పొలం శిస్తు పెరగడం వల్ల చెల్లించడం భారమవుతుంది.

2. వ్యాష్టం వచ్చినప్పుడు వైద్యుడిని సంప్రదించాలి.

______________________________

3. ఖాయిలా పరిశ్రమలను ఆదుకునేందుకు ప్రభుత్వం కమిటీ వేసింది.

______________________________

4. గ్రామీణ ప్రాంత ఆటలలో గొట్టికాయలు ఆట ఒకటి.

______________________________

5. ఈ వాక్యం కాస్త తర్జుమా చేసి పెట్టు.

______________________________

**ఆ) కింది వాక్యాలను చదివి, ఇచ్చిన పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

1. జాబు రాయడానికి జాగు సేయకు. నీ బాగోగులు లేఖలో తెలియజేయి.

ఉత్తరం : ______________ ______________

2. కష్టపడే వారికి తగిన వేతనం ఇవ్వాలి. ఆ భృతి వారికి జీవనాధారం.

జీతం : ______________ ______________

3. ధనమే జగత్తుకు మూలం. ఆ ద్రవ్యాన్ని జాగ్రత్తగా ఉపయోగించాలి.

సొమ్ము : ______________ ______________

**ఇ) కింది పదాలకు నానార్థాలను జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. తల్లి | ( ) | అ) దొరతనం, అధ్యక్షత, ఆశ్రయం |
| 2. పెద్ద | ( ) | ఆ) మాత, పెద్దది, పూజ్యురాలు |
| 3. అధికారం | ( ) | ఇ) ఆనందం, తృప్తి, ధైర్యం |
| 4. అర్థము | ( ) | ఈ) వృద్ధుడు, గొప్పవాడు, జ్యేష్ఠుడు |
| 5. సంతోషం | ( ) | ఉ) ధనము, కారణం, శబ్దార్థం |

**ఈ) కింది పదాలలో ప్రకృతి వికృతులను వేరుచేసి రాయండి.**

పురము, నీరు, దర్శనం, ఛాత్రుడు, ప్రోలు, దరిసెనము, వఱువాత, ప్రభాతము, నీరము, చట్టు

| ప్రకృతి | వికృతి |
|---|---|
| | |
| | |
| | |
| | |
| | |

**ఉ) కింది జాతీయాలను వివరించి సొంత వాక్యాలు రాయండి.**

1. కళ్ళు కాయలు కాచు : ______
2. చెవికోసుకొను : ______
4. కడుపులో పెట్టుకొను : ______
5. చర్మం చెప్పులుకుట్టించు : ______

**ఊ) కింది పదాలకు వ్యవహార రూపాలు రాయండి**

1. వోఘాయిత్తం : ______
2. అంచూవుంఛారు : ______
3. అగ్గురారం : ______
4. అప్పుచ్ఛపు : ______
5. వచ్చావషోయ్ : ______
6. రాజమహేంద్రంషండీ : ______

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదిసి సంధి పేర్లు రాయండి.**

1. అభ్యంతరం : ______ ______ ______
2. రవ్వంత : ______ ______ ______
3. సావకాశం : ______ ______ ______
4. కళ్ళెదుట : ______ ______ ______

### పుంప్వాదేశ సంధి

**కింది ఉదాహరణలు పరిశీలించండి.**

ఆదరము + మాట = ఆదరపుమాట, ఆదరంపుమాట

నీలము + కండ్లు = నీలపుకండ్లు, నీలంపుకండ్లు

మధురము + కావ్యం = మధురపుకావ్యం, మధురంపుకావ్యం

పై పదాలలో కర్మధారయ సమాసం ఉంది. వీటిని విడదీసినపుడు మొదటి పదానికి (విశేషణానికి) చివర 'ము' ఉంది. సంధి జరిగినపుడు 'ము' వర్ణకము పోయి 'పు' అనే అక్షరం గానీ లేదా 'ంపు' గానీ వస్తుంది. ఇలా రావడాన్ని పుంప్వాదేశ సంధి అంటారు.

సూత్రం: 'కర్మధారయమునందు ము వర్ణకమునకు పు, ంపు లగు'

మరికొన్ని ఉదాహరణలు చూద్దాం:

1. అప్పుచ్ఛపుమాటలు : ____________ ____________

2. విరసపుమాట : ____________ ____________

3. ఉన్నతపుగొడుగు : ____________ ____________

4. కోమలపుజ్ఞానం : ____________ ____________

5. సరసపుమాట : ____________ ____________

**ఆ) కింది సమాసాలకు విగ్రహవాక్యాలు రాసి ఏ సమాసాలో రాయండి**

1. నూరురూపాయలు : ____________ ____________

2. దొడ్డప్రభువు : ____________ ____________

3. కలిమిలేములు : ____________ ____________

4. లక్షాధికారి : ____________ ____________

**ఇ) కింది తరగతిలో నేర్చుకున్న ఉత్ప్రేక్షాలంకారమును గుర్తుచేసుకుందాం.**

1. ఈ వెన్నెల పాలవెల్లియో అన్నట్లున్నది.
2. ఆకాశం కాటుకను వర్షిస్తున్నట్లుంది.
3. ఆ ఏనుగు నడుస్తున్న కొండా అన్నట్లుంది.

పై వాక్యాలలో ఊహ ప్రధానంగా ఉంది. కనుక ఇది ఉత్ప్రేక్షాలంకారం.

ధర్మస్వామ్యాన్ని బట్టి ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించినట్లయితే అది ఉత్ప్రేక్షాలంకారం అవుతుంది.

**ఈ) కింది ఇచ్చిన వాక్యాలను క్రియ ఆధారంగా వ్యతిరేకార్థక వాక్యాలుగా మార్చండి.**

1. ఆ కప్పు ఖాళీగా ఉంది. ________________________

2. వానలు ఎక్కువగా పడ్డాయి. ________________________

3. ఆ చిత్రాన్ని చూసి అందరూ మెచ్చుకున్నారు. ________________________

4. నాటక ప్రదర్శన జరిగింది. ________________________

5. ఆలోచింపచేసే ప్రక్రియ నాటకం అని భావించారు. ________________________

## ప్రాజెక్టుపని

1. మీ ప్రాంతంలో ఉన్న నటులు, నాటక సంస్థల వివరాలు సేకరించి పట్టికను తయారు చేయండి.

లేదా

2. నేటి సమాజంలో దురాచారాలను ప్రతిఘటిస్తూ ఒక నాటికను రాసి ప్రదర్శించండి?

### పాఠంలో గల పదాలకు అర్థాలు

శిస్తు = పన్ను
వూష్టం = జ్వరం
కొట్టేసింది = చంపేసింది
ఖాయలా = దివాళా
గొట్టి కాయలు = గోలీ కాయలు
చప్పన్న భాషల = 56 భాషలు
విదూషకుడు = సంస్కృత నాటకాలలో కథానాయకుడికి వినోదాన్ని పంచే సచివుడు
శషభిషలు = గొప్పలు
గణించు = లెక్కలోకి తీసుకొను
శ్రమదమాలు = శ్రమ పడుతూ కష్టాన్ని ఓర్చుకోవడం
దమ్మిడి = 192 దమ్మిడీలు ఒక రూపాయి
పట్టెని = పరిసర ప్రాంతంలో
భోగట్టా = ప్రస్తావన, విచారణ, వివరము, సమాచారం
విధాయకం = ఆచరించదగ్గది
పొలితి = పోలిక
గళగ్రాహి = తడబడకుండా
పేలపిండి = పేలాలతో చేసిన పిండి
తోవ పెట్టడం = దారిపెట్టడం, సాగనంపడం
ఖాయిదా = కాపలా/ అదుపు
కంటె = కంఠాభరణం
క్రిమినల్ పరీక్ష = ఐపీసీ కోడ్ ఆఫ్ క్రిమినల్. ప్రొసీజర్ పోలీసుల విధివిధానాలు ఇందులో ఉంటాయి.


నటాలి
★
1944-వ సం॥ ఏప్రియల్ 2-వ తేది ఆదివారం సాయంత్రం
7 ~~6-45~~ గంటలకు
సెంట్ మేరీస్ హాలులో
శ్రీ గురజాడ అప్పారావుగారి
కన్యాశుల్కం
ప్రయోక్త: అబ్బూరి రామకృష్ణరావు
★
నాటక ప్రయోగంలో నవీన విధానం.
రంగనిర్మాణంలో రమణీయ వాస్తవికత.
★
అబ్బూరి రామకృష్ణరావు. నండూరి శేషాచార్యులు.
నళినీ కుమార్. సోమంచి యగ్గెన్నశాస్త్రి. వేణుగోపాల్.
రంగస్వామి అయ్యంగారు, పూర్ణిమ, కమల, నటిస్తారు.
రేట్లు: రు. 5; 3; 2; 1.

నాటక ప్రదర్శన కరపత్రం

### కొన్ని పదాలకు వివరణ

అష్టాలు (అర్థాలు)
వేదాన్ని అష్టకాలుగా విభజించారు.
అష్టకాలను మళ్లీ పన్నాలుగా విభజించారు.
జఠ (జట)
వేదాధ్యయనం పదము, క్రమము, జట, ఘన అనే క్రమంలో సాగుతుంది

❊ "నల దమయంతులిద్దరు మనః ప్రభవానల... దహ్యమానులై సలిపిరి దీర్ఘవాసర నిశల్"

❊ ఈ పద్యం ఆంధ్ర మహాభారతం అరణ్యపర్వం రెండవ ఆశ్వాసంలో 24వ పద్యం.

పాఠాంత పద్యం :

తిరమై సంపదలెల్ల వెంటనొకరీతిన్ సాఁగిరా వేరి కే
సరికేపాటు విధించినో విధి యవశ్యప్రాప్య మద్దానినె
వ్వరు దప్పించెద రున్నవాఁడనని గర్వంబేరికిన్ గాదు కిం
కరుఁడే రాజగు రాజె కింకరుఁడగున్ గాలానుకూలంబుగన్.

(బలిజేపల్లి లక్ష్మీ కాంతం-సత్యహరిశ్చంద్ర నాటకం)

భావం : సంపదలు ఎప్పుడు ఒకరి దగ్గరనే స్థిరంగా ఉండవు. కాలం ఎవరికి ఎప్పుడు ఏది అనుగ్రహిస్తుందో అదే అందుతుంది. దానిని ఎవ్వరూ తప్పించలేరు. సంపదలున్నవన్న గర్వం ఎప్పుడూ పనికిరాదు. కాలం రాజునే కింకరుడిని(సేవకుడిని) చెయ్యగలదు. కింకరుడినే రాజును చెయ్యగలదు. కనుక గర్వాన్ని విడిచి అందరు మానవత్వంతో ఒకరికొకరు సహకరించుకోవాలి.

సూక్తి: గతం నశోచామి, కృతం స్మరామి.

జరిగిపోయినదాన్ని పట్టించుకోను కాని పొందిన ఉపకారాన్ని మాత్రం జ్ఞాపకం చేసుకుంటూ ఉంటాను

మీకు తెలుసా?

1. ప్రతి ఏటా మార్చి 27వ తేదీని 'ప్రపంచ రంగస్థల దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.
2. కందుకూరి వీరేశలింగం గారి జన్మదినమైన ఏప్రిల్ 16వ తేదీని 'తెలుగు నాటకరంగ దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.

### కొమ్ము వాద్యకళ



గ్రామదేవతల జాతర్లలో కొమ్ము వాద్యం వారి స్థానం ప్రత్యేకమైనది. వీరి వద్ద కొమ్ము ఆకారంలో ఇత్తడితో చేయబడిన వాయిద్యం ఉంటుంది. వీటిని నోటితో ఊదితే విలక్షణమైన శబ్దం వస్తుంది. వీరి దగ్గర కొమ్ము ఉంటుంది కాబట్టి వీరిని కొమ్ము కళాకారులు అని అంటారు. కొమ్ము వాయిస్తూ జోడు అనే డప్పు కొడుతూ కథలు చెప్తారు. వీరు ముఖ్యంగా కాటమరాజు కథ, రేణుకాదేవి కథ, అంకమ్మ కథ ఎక్కువగా చెబుతుంటారు. కథ అంటే మామూలుగా చెప్పినట్లు కాకుండా మధ్యమధ్య పాటలు ఆటలు ఉంటాయి. నవ్వుల కోసం అప్పుడప్పుడు పిట్ట కథలు కూడా చెప్తారు. గ్రామ దేవతల ఉత్సవాలను అమ్మవారి రూపాన్ని వివిధ రంగులతో నేలమీద చిత్రిస్తారు ఆ ముగ్గు ముందు నిలబడి దేవతలను ఆహ్వానిస్తూ పాటలు పాడుతారు. వీరు చెప్పే కథతో కొందరు తాదాత్మ్యంచెంది ఆవేశంతో ఆడుతారు. దీనినే సిగమెక్కడం అంటారు. ఇలా వాయిద్యం వాయించడం, కథలు చెప్పడం బొమ్మలు వేయడం లాంటి మూడు పనులను ఎంతో నైపుణ్యంతో చేసే వీరు బహుముఖ ప్రజ్ఞాశాలులు.

## శంబర జాతర

శంబర జాతరను పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబర అనే గ్రామంలో జరుపుతారు. ఆ ఊరి గ్రామ దేవత పోలమాంబ. పోలమాంబ అమ్మవారు ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ రోజుకు ముందు వచ్చే మంగళవారం నాడు ఈ జాతర ప్రారంభమవుతుంది. అక్కడి ప్రజలు పోలమాంబను ఇంటి ఆడపడుచుగా భావిస్తారు. అందువలన ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు ప్రతి ఆడపిల్ల పుట్టింటికి వెళ్లే సాంప్రదాయం అక్కడ ఉంది. ఇది ఆనవాయితీగా కొనసాగుతూ ఉంది. సంక్రాంతి పండుగకు తర్వాత వచ్చే మంగళవారం అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. మళ్లీ వారం తర్వాత మంగళవారం నాడు అమ్మవారికి సిరిమానోత్సవం జరిపిస్తారు.

కొండ దొరల కుటుంబంలో పోలేశ్వరి అనే పేరుతో ఆమె శక్తి స్వరూపిణిగా అవతరించిందని అక్కడ ప్రజలు భావిస్తారు. చారిత్రకంగా ఈ కథకు ఆధారాలు ఉన్నట్లు చెప్పవచ్చు. కళింగాంధ్ర ప్రజల కల్పవల్లిగా చెప్పుకునే పోలమాంబను ఆదిశక్తి పార్వతీదేవి అవతారంగా భావించి, ప్రతి ఏటా లక్షలాది భక్తులు మొక్కులు చెల్లిస్తుంటారు. ఈ జాతరలో ఒరిస్సా, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ప్రజలు కూడా పాల్గొంటారు.

### సామాజిక న్యాయ మహాశిల్ప విశేషాలు

విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని తేది 19/01/2024న గౌరవ ముఖ్యమంత్రి గారు ఆవిష్కరించారు. ఈ విగ్రహం ప్రపంచంలోనే ఎత్తైన అంబేద్కర్ విగ్రహం. 81 అడుగుల ఎత్తులో నిర్మించిన కాంక్రీట్ పీఠంపై 125 అడుగుల అంబేద్కర్ ప్రతిమను అత్యాధునిక పద్ధతుల్లో నిర్మించి ప్రతిష్ఠించారు. విగ్రహం తయారీకి 112 మెట్రిక్ టన్నుల కంచు, 352 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను వినియోగించారు. విగ్రహం కింది భాగంలో మొదటి, రెండవ అంతస్తులలో మ్యూజియం, గ్రంథాలయం, యాంఫీ థియేటర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎక్స్పీరియన్స్ సెంటర్ మొదలైనవి ఏర్పాటు చేశారు.



# 11 యుద్ధవిజేత

C2B1X3

– నేతల ప్రతాప్ కుమార్

## చదవండి – ఆలోచించి చెప్పండి

తల్లీ చల్లని శాంతీ
ధారుణి పండించవమ్మా
తల్లీ వెన్నెల కాంతీ
ధారుణి నిండించవమ్మా!

పసిపాపలు నీ బిడ్డలు
పాలకడలి తరంగాలు
పసి హృదయం శశివదనం
విషతుల్యం చేయకమ్మ

మానవతా మందిరాన
మంటలు రగిలించకమ్మ
పుడమితల్లి పురిటియిల్లు
బూడిదగా మార్చకమ్మ

ఆశాకుసుమముల మాల
అనురాగ పుటుయ్యాల
అవనీ గర్భంలోపల
అగ్నిధార నింపకమ్మ

ఈ సుందర లోకంలో
వసంతం కురిపించుము
ఈ చంద్రుని హాసంలో
హేమంతం ఒలికించుము

తల్లీ చల్లని శాంతీ
ధారుణి పండించవమ్మ
తల్లీ వెన్నెల కాంతీ
దారుణి నింపించవమ్మ



– శ్రీ రెంటాల గోపాలకృష్ణ

**ప్రశ్నలు:**

1. పై కవితలో కవి ఎవరిని ప్రార్థించాడు?
2. కవి పసిపాపల గురించి ఏం చెప్పాడు?
3. కవి ఈలోకం ఎలా ఉండాలని కోరుతున్నాడు?

**ఉద్దేశం**

ప్రపంచానికి శాంతి, అహింసల్ని ప్రబోధించిన దేశం మనది. యుద్ధం ఎక్కడ, ఎప్పుడు జరిగినా మానవాళికి తీరని నష్టం వాటిల్లుతుంది. యుద్ధం వలన కలిగే అనర్థాలను, శాంతి ఆవశ్యకతను గురించి విద్యార్థులకు తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



జననం: 13.08.1965
మరణం: 08.06.2021

నేతల ప్రతాప్ కుమార్ నేటి తూర్పుగోదావరి జిల్లా (ఒకప్పుడు పశ్చిమగోదావరి) నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో జన్మించారు. శాంతకుమారి, సత్యం వీరి తల్లిదండ్రులు. పాలకంకి, దళితనానీలు, అన్నంగిన్నె, భీంపాలరాగం, పుట్టినరోజు ఒక్కటే, బౌద్ధభాషితాలు, బుద్ధిజం-శాస్త్రీయత, నాభూమికి నేనే, సమతావసంత గానం, పిల్లలకోసం అంబేద్కర్ కథ, నాగపూర్ యాత్ర తదితర గ్రంథాలు రాశారు. విమల శాంతి జాతీయ కవితా పురస్కారం అందుకున్నారు. **ఈ పాఠం సమతావసంతగానం' కవితా సంపుటి నుండి గ్రహించబడింది.**

## ప్రక్రియ-వచన కవిత

పద్యం, గేయాల్లో ఉండే ఛందో నియమాల అవసరం లేకుండా లయాత్మకంగా సాగే కవిత **వచనకవిత**. ఇది విషయ ప్రధానంగా ఉంటుంది. నిత్యజీవితంలో ఉపయోగించే పదాలు ఎక్కువగా ఉంటాయి. చదివేవారికి ఎలాంటి క్లిష్టత లేకుండా సులువుగా అర్థమయ్యే లక్షణం దీనిలో ప్రధానంగా ఉంటుంది. అంత్యానుప్రాస వంటి అలంకారాల ప్రయోగంతో వచన కవిత సొబగులద్దుకుంటుంది.

## నేపథ్యం

రోహిణి నది జలవివాదంలో యుద్ధం చేయాలని శాక్యులు చేసిన తీర్మానాన్ని సిద్ధార్థుడు వ్యతిరేకించాడు. యుద్ధాల వలన నష్టమే గాని లాభం లేదన్నాడు. యుద్ధాన్ని నివారించడానికి ఇల్లు వదిలి వెళ్ళిపోవడం నేపథ్యంగా రాసిన కవిత యుద్ధ విజేత.

### I

యుద్ధంలో గెలవడం తథ్యం
ఎవరో ఒకరు
యుద్ధంలో ఓడిపోవడమూ తథ్యం
ఎవరో ఇంకొకరు
అసలు యుద్ధం అంటేనే
ఒక గెలుపు ఒక ఓటమి

ఒక్కొక్కసారి
దద్దమ్మ కూడా యుద్ధంలో గెలవవచ్చు.
కానీ..
యుద్ధంలో గెలిచినవాడికంటే
యుద్ధాన్ని గెలిచినవాడే
నిజమైన విజేత
వేల వేల సంవత్సరాలు
కాలగర్భంలో కలసిపోతున్నా
అతనెప్పటికీ మానవాళి
హృదయ విజేత

అంగబలం, అర్థబలం ఉన్నవాడు
అది లేని వాడిపై గెలవడం
గెలుపు ఎలా అవుతుంది
యుద్ధవ్యూహం తెలిసినవాడు
అది తెలియని వాడిపై గెలవడం
విజయం ఎందుకవుతుంది



రెండు పశువుల కుమ్ముకున్నాక
బలమైన పశువు కొమ్ములెగరేసినట్లు
యుద్ధం పేరిట ఇద్దరు తన్నుకున్నాక
కండబలం ఉన్నవాడు
కాలరెగరేస్తున్నాడు
గెలిచినంత మాత్రాన
పశువు పశువు కాకుండా పోతుందా
యుద్ధోన్మాది ఉన్మాది కాకుండా ఉంటాడా

II

మనిషికి మనిషికి మధ్య
యుద్ధం ప్రారంభమైన తరువాత
సాటి మనిషికి శత్రువని
నామకరణం చేయవలసి వచ్చింది
పచ్చని నేలకు నెత్తుటి తిలకం
దిద్దవలసి వచ్చింది.

రాజ్యం కోసమో రమణి కోసమో
పదవి కోసమో – పౌరుషం కోసమో
యుద్ధం అనే ఉన్మాదాన్ని నెత్తికెక్కించుకుని
మానవాళికి మరణ మృదంగం
వినిపించవలసి వచ్చింది.

శత్రురాజ్యమనీ శత్రుదేశమని
రాజ్యవిస్తరణ అనీ
జాతి అహంకారమనీ
బాణాలతో అప్పుడు
బాంబులతో ఇప్పుడు
చంపుకోవడమే యుద్ధం
మనుషులు నివసించే నేలను
మాంసపు ముద్దగా మార్చేయటమే యుద్ధం
అన్నెం పున్నెం ఎరుగని
అమాయక పసిపిల్లల
మోములపై విరిసే చిరుదరహాసాలను
చెరిపేయడమే యుద్ధం



**ఆలోచించండి – చెప్పండి**

1. యుద్ధాలు ఎందుకు జరుగుతాయి?
2. యుద్ధాల వల్ల ప్రకృతికి జరిగే నష్టం ఏమిటి?

## III

పూసే పూలను తుంచెయ్యడం
ఎగిరేపక్షుల రెక్కలు విరిచెయ్యడం
ఆడే నెమళ్ళకు అంగవైకల్యం ప్రసాదించడం
గంతులేసే జింకపిల్లకు కాళ్ళునరికేయడం
సకల చరాచర ప్రకృతిని
ధ్వంసం చేసి పారేయడమే యుద్ధం

ఇలాంటి యుద్ధంలో గెలవడం
వీరత్వం కాదు పశుత్వం
పౌరుషం కాదు వట్టి చవటతనం
అందుకే....
యుద్ధంలో గెలిచి
పశ్చాత్తాపం ప్రకటించాడు అశోకుడు
భార్యాబిడ్డలతో పాటు
సకల రాజ్యభోగాలను త్యజించి
అసలు యుద్ధాన్నే గెలిచాడు బుద్ధుడు.

**ఆలోచించండి - చెప్పండి**

1. వీరత్వం కానిదేది?
2. యుద్ధాన్ని గెలవడం అంటే ఏమిటి?
3. పశ్చాత్తాపం అంటే ఏమి?

### సారాంశం

యుద్ధం మొదలు పెట్టాక గెలుపు ఎవరో ఒకరి పక్షాన నిలుస్తుంది. ఒకరు గెలిస్తే మరొకరు ఓడిపోవడమూ ఉంటుంది. యుద్ధం అంటేనే గెలుపు ఓటములు కలగలిసి ఉంటాయి.

ఒక్కోసారి ఎందుకూ కొరగానివాడు కూడా యుద్ధంలో గెలుపును పొందుతాడు. అయినప్పటికి యుద్ధంలో విజేత అయినవాడి కంటే యుద్ధాన్ని జయించిన వాడే నిజమైన విజేత అవుతాడు. అనేక సంవత్సరాలు గతించిపోయినప్పటికి అలాంటి వాళ్ళు ఎప్పటికీ ప్రజల హృదయవిజేతగా ఉండిపోతాడు.

పటిష్ఠమైన సైన్యం, తగినంత సంపదలు ఉన్నవాడు అవి ఎంతమాత్రం లేని వాడిమీద గెలవడం గెలుపు ఎలా అవుతుంది? యుద్ధాన్ని మంచి తెలివితో, ప్రణాళికాబద్ధంగా చేయడం తెలిసినవాడు అలాంటివేవి తెలియని వారిపై గెలవడం విజయం ఎందుకు అవుతుంది? రెండు జంతువులు పోట్లాడుకున్నప్పుడు గెలిచిన జంతువు వీరత్వంతో రంకెలేస్తుంది. యుద్ధం ముసుగులో ఇరుపక్షాలు రణరంగంలోకి దూకినప్పుడు బలమైన ప్రత్యర్థి విజయగర్వాన్ని చూపుతాడు. విజయం పొందినంత మాత్రాన జంతువు జంతువే. యుద్ధోన్మాది ఉన్మాది కాకుండా పోతాడా?

మనిషికి, మనిషికి మధ్య యుద్ధం మొదలయ్యాక సాటిమనిషికి శత్రువు అని ముద్రవేయవలసి వస్తుంది. అందువల్ల పచ్చగా వున్న నేల రక్తపంకిలం అవుతుంది.

రాజ్యంపై కాంక్షతోనో, రాణివాసం పట్ల వ్యామోహంతోనో, పదవులు అనుభవించాలనో, తన పౌరుషాన్ని ప్రదర్శించాలనో యుద్ధమనే పిచ్చిని బుర్రలోకి ఎక్కించుకుని మానవజాతి నాశనానికి కారణమవ్వాల్సి వచ్చింది. వారంతా యుద్ధం కారణంగా మరణాన్ని త్వరగా చవిచూడవలసి వచ్చింది.

శత్రుదేశమని, రాజ్యవిస్తరణమని లక్ష్యాలుగా జాత్యహంకారంతో గతంలో బాణాలతో ఇప్పుడు బాంబులతో యుద్ధాలు

జరుగుతున్నాయి. యుద్ధమంటే ఒకరినొకరు చంపుకోవడంగా మారింది. మానవ జాతికి నివాసయోగ్యమైన భూమిని మాంసపు ముద్దలుగా మార్చేసింది. అభంశుభం తెలియని అమాయకపు బాలల మోముపై చిరునవ్వుల్ని చెరిపివేసింది.

విచ్చుకున్న పూలను కోసి పారవేస్తున్నారు. ఎగురుతున్న పక్షులను పట్టుకుని రెక్కలు విరిచేస్తున్నారు. మబ్బులను చూసి సంబరపడి పురివిప్పి నాట్యం చేస్తున్న నెమళ్ళ కాళ్లు తొలగిస్తున్నారు. చక్కగా ఆడుకుంటున్న జింక పిల్లల కాళ్లు నరికేస్తున్నారు. ఇలా సమస్త జీవులకు నివాసయోగ్యంగా ఉన్న అందమైన ప్రకృతిని పాడు చేయడమే యుద్ధంగా భావించవలసిన పరిస్థితి దాపురించింది.

మానవజాతిని, ప్రకృతిని, సమస్త విశ్వాన్ని వినాశనం చేసే యుద్ధమనే ఆటలో గెలవడం వీరత్వం కాదు. అది పశు స్వభావం. యుద్ధం చేయడం పౌరుషం అనిపించుకోదు. అది పనికిమాలిన స్వభావమే అవుతుంది. అశోకుడు కొన్ని వేల మంది చావుకు కారణమై యుద్ధంలో గెలిచినప్పటికీ పశ్చాత్తాప హృదయంతో యుద్ధాలు చేయడం మానేశాడు. యుద్ధాన్ని తిరస్కరించి సిద్ధార్థుడు భార్యబిడ్డలను, రాజ్యాన్ని త్యాగం చేసి ప్రజల హృదయాలను గెలిచి నిజమైన విజేతగా నిలిచాడు. అసలైన విజయం ఇది అని నిరూపించాడు.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. రాయండి.**

1. "యుద్ధంలో గెలవటం వీరత్వం కాదు" అనడంలో కవి ఉద్దేశం ఏమిటి?
2. శాంతిని ప్రబోధించిన మహనీయుల గురించి చెప్పండి?



**ఆ) కింది పద్యం చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.**

మ. మహితంబైన స్వతంత్రభారతము నిర్మాణంబు సేయంగ దు
స్సహ కష్టంబుల కోర్చి వీరులయి స్వచ్ఛందంబుగా బోరి శ
త్రుహత ప్రాణులుగా ధరంబడిన నిత్యుల్ నాకు సాక్షాత్కరిం
త్రు హితాశీస్సులు నింత్రుగాక భవమందున్ భావలోకంబులన్

– పుట్టపర్తి నారాయణాచార్యులు (సిపాయిపితూరి)

**ప్రశ్నలు :**

1. కవి ఎటువంటి దేశాన్ని నిర్మించాలని కోరుకున్నాడు?
2. కవి ఎవరి ఆశీస్సులు కోరుకున్నాడు?
3. జాతీయోద్యమంలో ప్రాణత్యాగం చేసిన వీరుల స్వభావం గురించి తెల్పండి?
4. పద్యం ఆధారంగా ప్రశ్న తయారు చేయండి.

**ఇ) కింది పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ప్రపంచవ్యాప్తంగా నేడు నెలకొనివున్న హింసాతత్వవాదానికి స్వస్తిచెప్పి, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటుతున్న సంస్థ 'అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ'. జాతి, కుల, మత, సాంస్కృతిక తారతమ్యాలు లేకుండా మానవతాదృక్పథంతో తోటి మానవులకు ఈ సంస్థ సేవలందిస్తుంది. స్విట్జర్లాండ్ దేశానికి చెందిన జీన్ హెన్రీ డ్యూనాంట్ కేవలం ఐదుగురు స్నేహితులతో 9 ఫిబ్రవరి 1863వ సం॥లో 'రెడ్ క్రాస్ సంస్థను స్థాపించారు. ప్రస్తుతం 137 దేశాలు దీనిలో సభ్యులుగా వున్నాయి. నేడు సభ్యుల సంఖ్య 25,00,00,000 మందికి చేరింది. మానవత, నిష్పాక్షికత, తటస్థత, స్వతంత్రత, స్వచ్ఛందసేవ, ఐక్యత,



విశ్వజనీనత ప్రధానమైన ప్రాథమిక సూత్రాలుగా ఈ సంస్థ ప్రారంభమైంది. ఈనాడు 600 పైగా ప్రాదేశిక సూత్రాలున్నాయి. రెడ్ క్రాస్ సంస్థలో సభ్యులైన ప్రతిదేశం, ప్రతివ్యక్తి ఎలాంటి విభేదాలు లేకుండా ఈ సూత్రాలకు కట్టుబడి, తమ వంతు సేవలందిస్తున్నారు. రెడ్ క్రాస్ చిహ్నం అధికారికంగా 1863లో జెనీవాలో ఆమోదించబడింది. గాయపడిన పోరాట యోధుల రక్షణ మరియు సైనికవైద్యసౌకర్యాల కోసం అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రమాణాలను స్థాపించడంలో స్విస్ పౌరుల మార్గదర్శక కృషికి గుర్తింపుగా ఈ చిహ్నం ఉంది. ఆపదలలో ఉన్నవారికి కావలసిన ఔషధాలు, ఆహార వస్తువులు, దుస్తులు సరఫరా చేయడమేగాక, వారి పరిరక్షణ బాధ్యత కూడా చూస్తుంది. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొని, శాంతి సమయాల్లో కూడా పీడిత ప్రజలకు కోట్లాది ధనం వెచ్చిస్తూ, వారిని ఆదుకుంటుంది. రెడ్ క్రాస్ సంస్థ మానవతదృక్పథంతోనే తోటి మానవులకు సేవలందిస్తూ ఉంది. యుద్ధంలో గాయపడినవారికే కాకుండా, భూకంపాల్లో, తుఫానుల్లో, అగ్ని ప్రమాదాల్లో, అంటువ్యాధులతో బాధితులైనవారికి రెడ్ క్రాస్ చేసే సేవలు ప్రశంసనీయాలు.

– సాలిపర్నోజ్ఞాపకాలు

ప్రశ్నలు:

1. రెడ్ క్రాస్ సంస్థ సేవా కార్యక్రమాలు ఏవి?
2. రెడ్ క్రాస్‌ను ఎవరు ఎప్పుడు స్థాపించారు?
3. రెడ్ క్రాస్ సంస్థ చిహ్నం ఎప్పుడు ఆమోదించారు?
4. పై పేరా ఆధారంగా ప్రశ్న తయారు చేయండి?

**ఈ) కింది వాటికి అర్థసందర్భములు రాయండి?**

1. పచ్చని నేలకు నెత్తుటి తిలకం దిద్దవలసి వచ్చింది.
2. చిరుదరహాసాలను చెరిపేయడమే యుద్ధం.

**ఉ) కింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. పూర్వం యుద్ధాలు దేనికోసం జరిగేవి?
2. పశ్చాత్తాపం ప్రకటించిన రాజు ఎవరు?
3. రాజ్యసుఖాలను వదిలివెళ్ళింది ఎవరు?
4. యుద్ధాన్ని గెలవటం అంటే ఏమిటి?

## వ్యక్తీకరణ–సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు లఘు సమాధానాలు రాయండి**

1. ప్రజల హృదయాల్లో విజేతగా నిలిచేది ఎవరు?
2. కవి ప్రకృతిని ధ్వంసం చేయడం కూడా ఉన్మాద చర్యగా ఎందుకు భావించాడు?
3. యుద్ధంలో గెలిచిన వాడికంటే యుద్ధాన్ని గెలిచిన వాడే నిజమైన విజేత అని కవి ఎందుకు అన్నాడు?

**ఆ) కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి**

1. యుద్ధవిజేత పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. యుద్ధాలను నివారించడానికి, శాంతిని నెలకొల్పడానికి ఏం చేయాలి?

**ఇ) కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.**

1. యుద్ధాల వలన వచ్చే నష్టాలను, శాంతి వలన చేకూరే ప్రయోజనాలను పట్టిక రూపంలో రాయండి?
2. కింది కవితను పొడిగించండి.

నేనే సైనికుడనైతే...
దేశరక్షణకు పాటుపడతాను
దేశగౌరవాన్ని కాపాడుతాను
మువ్వన్నెల జాతీయపతాకం కీర్తి నిలుపుతాను
నేనే సైనికుడనైతే....

.......................................
.......................................
.......................................
.......................................
.......................................

## భాషాంశాలు

### పదజాలం

**అ) కింది ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి వాటితో వాక్యాలు రాయండి.**

1. ప్రణాళికా బద్ధంగా చదివితే విజయం తథ్యం.
2. పంటలకు మంచి ధర రావడంతో రైతన్నల మోముపై దరహాసం వెల్లివిరిసింది.
3. విజయం సాధించడానికి వ్యూహం అవసరం.
4. బుద్ధుడు సర్వస్వాన్ని త్యజించి భిక్షువుగా మారాడు.

**ఆ) కింది వాక్యాలలో పర్యాయపదాలు గుర్తించి రాయండి**

1. సమరంలో సైనికులు పోరాడుతూ ప్రాణత్యాగం చేశారు. ఆ సంగ్రామం వలన ఎంతోమంది అనాథలు అవుతారు.
   యుద్ధం :......................
2. గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు. జయం దక్కలేదని నిరుత్సాహపడకూడదు.
   విజయం :..................
3. సేవాతత్పరత వల్ల యశస్సు కలుగుతుంది. ఆ పేరు శాశ్వతమైనది.
   కీర్తి :..................

**ఇ) కింది పదాలకు నానార్థాలు జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. పశువు | ( ) | అ) సమయం, నలుపు, చావు |
| 2. కాలం | ( ) | ఆ) రాష్ట్రం, ఏలుబడి, దొరతనం |
| 3. రాజ్యం | ( ) | ఇ) గొఱ్ఱె, ఆత్మ, ప్రమథ గణము |

**ఈ) కింది పదాలకు వికృతులను రాయండి.**

1. ప్రకృతి : ____________________
2. భోగము : ____________________
3. పుణ్యం : ____________________
4. గర్వము : ____________________

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి సంధిని పేరు రాయండి.**

1. సంవత్సరాలు : ________________ + ________________ ( )
2. కొమ్ములెగరేసిన: ________________ + ________________ ( )
3. చరాచర : ________________ + ________________ ( )

4. ఇంకొకరు : ________________ + ________________ (                    )

5. మానవాళి : ________________ + ________________ (                    )

**ఆ) కింది సంధి పదాలను కలిపి, సంధి పేరు రాయండి.**

1. ఒక్క + ఒక్క : ________________________________
2. ఎందుకు + అవుతుంది : ________________________________
3. అతను + ఎప్పటికి : ________________________________
4. నెత్తికి + ఎక్కు : ________________________________
5. యుద్ధ + ఉన్మాది : ________________________________

**ఇ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

1. శత్రురాజ్యం :________________________________ (                    )
2. భార్యాభర్తలు :________________________________ (                    )
3. రాజ్యభోగాలు :________________________________ (                    )
4. యుద్ధవ్యూహం :________________________________ (                    )

**ఈ) కింది విగ్రహ వాక్యాలను సమాసపదాలుగా మార్చి సమాసం పేరు రాయండి.**

1. మరణము అనెడి మృదంగం :________________, ________________
2. అర్థము చేత బలము :________________, ________________
3. పసివారైన పిల్లలు :________________, ________________
4. చిరుదైన దరహాసం :________________, ________________

**అలంకారం:**

అతిశయోక్తి అలంకారం: ఒక వస్తువు యొక్క స్థితిని, స్వభావాన్ని, గుణాన్ని, ఉన్నదాని కంటే అతిశయంగా చేసి చూపడాన్ని అతిశయోక్తి అలంకారం అంటారు. అంటే గోరంతను కొండంత చేసి చెప్పడం అని అర్థం .

ఉదా: మా నూతిలో నీళ్ళు పాతాళానికి చేరాయి.

ఇందులో నిజానికి నూతిలో నీళ్ళు పాతాళానికి చేరలేదు. కాని పాతాళానికి చేరినట్లుగా అతిశయించి చెప్పడం జరిగింది. కాబట్టి ఇది అతిశయోక్తి అలంకారం.

**ఉ) కింది వాక్యాలలోని అలంకారాలను గుర్తించి రాయండి.**

1. భూమి, ఆకాశాలు ఏకమగునట్లుగా వర్షం కురుస్తోంది.
2. సముద్రపుటలలు ఆకాశాన్ని తాకుతున్నాయి.
3. పి.టి.ఉష గాలి కంటే వేగంగా పరుగెత్తింది.

4. మలయగిరి నుండి వచ్చే గాలి గాలి.

5. అమ్మ చూపించే ప్రేమ ప్రేమ.

## ప్రాజెక్టుపని

నోబుల్ శాంతి బహుమతి పొందిన నలుగురి వివరాలు సేకరించి శాంతి కొరకు వారు చేసిన కృషిని వివరించండి.

పాఠాంత పద్యం:

చం. వినయ విధేయ వర్తనుఁ డవిస్మృతిశాలి యసంశయా శయుం
డనితర సక్తమానసుఁ డపార్థవిదూరుఁ డధీతపాఠచిం
తనపరుఁడున్ సుఖగ్రహణ ధారణ గణ్యుఁడు సూక్ష్మబుద్ధి సు
స్వనుఁడు గురుప్రియుండునగువానినె శిష్యునిగాఁ గొనందగున్



– మహేంద్ర విజయము–దేవులపల్లి సోదర కవులు.

భావం: శిష్యుడు వినయంతో గురువు చెప్పినట్లు నడుచుకోవాలి. మరుపు ఉండకూడదు. స్థిరమైన మనస్సుతో ఉండాలి. గురువు పట్ల, చదువు పట్ల మాత్రమే ఏకాగ్రత కలిగి వుండాలి. అపార్థం చేసుకోకూడదు. చదివిన పాఠాన్ని మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకోవాలి. గురువు బోధించే విషయాన్ని అర్థం చేసుకొని జ్ఞాపకం పెట్టుకోవాలి. చురుకైన బుద్ధితో మెలగాలి. మంచి కంఠస్వరం వుండాలి. గురువు మనస్సును సంతోష పెట్టాలి.

సూక్తి :

## మీకు తెలుసా?

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న 'అంతర్జాతీయ శాంతి దినోత్సవం' జరుపుకుంటున్నాం.

## థింసా నృత్యం

థింసా నృత్యం విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలలో విశేషాదరణ పొందిన జానపద సామూహిక నృత్యాలలో ఒకటి. ఇది గిరిజనుల సంప్రదాయ నృత్యం. ఆడా, మగా వయసుతో నిమిత్తం లేకుండా అన్ని కొండ జాతులవారు ఈ జానపద నాట్య సమ్మేళనంలో పాల్గొంటారు. ఈ నాట్యాన్ని ప్రతి పండుగ సందర్భంలోనూ, వివాహాది సందర్భాలలోనూ చేస్తుంటారు. వీరి దైనందిన జీవితానికి, ఆచార వ్యవహారాలకు ఈ నాట్యం అద్దం పడుతుంది. అరకులోయలో కొండదొర, భగత, ఖ్యోద్, బోండీ అనే తెగల గిరిజనులున్నారు. ఉత్సవాల సమయంలో ఒక గ్రామం వారు, మరో గ్రామానికి వెళ్ళి, 'థింసా'



నృత్యం. చేస్తారు. వివాహం సమయంలోనూ, చైత్రమాసంలో ఇటికల పండుగ రోజుల్లోనూ, గిరిజనులు ఈ నృత్యం చేస్తారు. థింసా జట్టుకు ఒక నాయకుడు ఉంటాడు. 20 మంది స్త్రీలు నృత్యం చేస్తారు. వాయిద్యాలు, మగవారు వాయిస్తారు. థింసాలో సన్నాయి, తుడుము, కిరిడి, డప్పు, బాకా, పిన్నలగర్ర, జోడి కొమ్ములు అనే ఆరు వాయిద్యాలు పురుషులు వాయిస్తారు. తమ గ్రామదేవత 'నిసాని దేవత' ను ఆరాధిస్తూ చేసే నృత్యాన్ని, "బోడి థింసా" అంటారు. ఈ నృత్యంలో ఒకవైపు మగవారు, మరొకవైపు స్త్రీలు, చేతులు పట్టుకొని వరుసగా నిలబడతారు. వీరు బృంద నాయకుడిని అనుసరిస్తూ లయబద్ధంగా అడుగులు వేస్తారు. ఈ నృత్యంలో పొంగిబుల్లమ్మ, కొర్రరాజమ్మ, కిలోల్ల లక్ష్మమ్మ మొదలయిన థింసా నృత్యబృందాలు. దేశమంతా ప్రదర్శనలు ఇస్తూ పేరుపొందాయి.

## అమీన్ పీర్ దర్గా

అమీన్ పీర్ దర్గా, కడప పెద్ద దర్గాగా కూడా పిలుస్తారు, ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప నగరంలో ఉన్న ఒక సూఫీ ముస్లిం పుణ్యక్షేత్రం. ఇది 17వ శతాబ్దంలో రెండు సూఫీ సంతులైన అమీన్ పీర్ మరియు షేక్ మహామద్ ఉమర్ల సమాధులపై నిర్మించబడింది. దర్గా ప్రధాన భవనం ఒక శిఖరరూపంలో ఉంది మరియు ఇది పాలరాయితో నిర్మించబడింది. దాని గోడలపై ముస్లిం చిహ్నాలు మరియు శాసనాలు చెక్కబడ్డాయి. దర్గాలో అనేక చిన్నభవనాలు మరియు మసీదులు ఉన్నాయి. దర్గా ప్రతి సంవత్సరం నవంబర్లో నాలుగురోజుల పాటు అంగరంగ వైభవంగా ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తుంది. ఈ ఉత్సవాలలో భక్తులు దర్గాను సందర్శించి, సంతుల సమాధులకు ప్రార్థనలు చేస్తారు. అమీన్ పీర్ దర్గా ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత ముఖ్యమైన సూఫీ పుణ్యక్షేత్రాలలో ఒకటి. ఇది ముస్లిం మరియు హిందూ భక్తులకు ఇష్టమైన ప్రదేశం.



# 12 సూక్తి సుధ

S9Q8B5

– ఎస్. గంగప్ప

## చదవండి – ఆలోచించి చెప్పండి

దాక్షిణాత్య భాషల్లో ప్రథమ వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. అన్నమయ్య తెలుగులో పదకవితా రచనకు శ్రీకారం చుట్టడం తెలుగుజాతి అదృష్టం. “వాచం గేయంచ కురుతే యః స వాగ్గేయకారకః” అని సంస్కృత లాక్షణికుని నిర్వచనం. అంటే వాగ్గేయకారుని రచన ధాతుమాతువుల సంయోగం కలదన్నమాట. ధాతువు అంటే సంగీతం, మాతువు అంటే సాహిత్యం. ఒక్క వాక్యంలో కుదించి చెప్పాలంటే ఎవరు స్వయంగా గీత రచన చేసి స్వరాలు కూర్చి గానం చేస్తారో వారు వాగ్గేయకారులు. అన్నమయ్య 32 వేల కీర్తనలను రచించాడని చారిత్రకుల అంచనా. అన్నమయ్య పదాల్లో భావపుష్టి, రాగదృష్టి సమాంతరంగా సాగిపోతాయి. అన్నమయ్య కృతుల్లో ఒకవైపు ఆధ్యాత్మిక దృష్టి మరొకవైపు సామాజిక దృష్టి హృదయంగమఫణితిలో అగుపిస్తాయి అత్యంత పరిణత పద్య కవుల రచనలతో సరితూగే పదాలతో పాటు నాటి జానపద గీతాల బాణీల్లో అన్నమయ్య ఆణిముత్యాల్లాంటి పాటలు రచించారు

– (డా॥సి. నారాయణ రెడ్డి)



**ప్రశ్నలు :**

1) దాక్షిణాత్య భాషలలో ప్రథమ వాగ్గేయకారుడు ఎవరు?
2) వాగ్గేయకారులు అని ఎవరిని అంటారు?
3) అన్నమయ్య కృతుల్లో ఏమి కనిపిస్తుంది?

### ఉద్దేశం

సమస్త జీవరాశులలో మానవజన్మ ఉత్కృష్టమైనది. మానవుడు విద్య, శీలం, సహృదయత, సమత వలన గౌరవప్రపత్తులు పొందుతాడు. ఆదర్శవంతమైన వ్యక్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని, సార్థకతను, ఉత్తమస్థితిని పొందడం ఎలాగో విద్యార్థులకు తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

### కవి పరిచయం



జననం: 08.11.1936
మరణం: 07.10.2022

సాహిత్య పరిశోధకుడు, బహుగ్రంథకర్త అయిన ఎస్ గంగప్ప గారి పూర్తి పేరు శ్రీరామప్పగారి గంగప్ప. వీరు ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుగొండ తాలూకా నల్లగొండ్రాయని అనే గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు వెంకటప్ప, కృష్ణమ్మలు. సుమారు 100 కు పైగా గ్రంథాలు రాసి ప్రచురించారు. వీరు సాహిత్యసుధ, సాహిత్యానుశీలన, తెలుగులో పదకవిత, క్షేత్రయ్య పదసాహిత్యం, అన్నమాచార్యులు– ఇతర ప్రముఖ వాగ్గేయకారులు తులనాత్మక అధ్యయనం, జాతికి ప్రతిబింబం జానపద సాహిత్యం మొదలైన గ్రంథాలు రచించారు. 1972 మరియు 1981 లలో ఆంధ్రప్రదేశ్ తెలుగు సాహిత్య అకాడమి అవార్డును పొందారు. **ప్రస్తుత పాఠ్యాంశం వీరు రచించిన “సాహిత్యాను శీలన” గ్రంథం నుండి స్వీకరించబడింది.**

## ప్రక్రియ-వ్యాసం

ఏదైనా ఒక విషయాన్ని తీసుకొని దాని పూర్వాపరాలను చర్చిస్తూ, విశ్లేషణాత్మకంగా విస్తరించి రాసేదాన్ని వ్యాసం అంటారు. దీనిలో ఉపోద్ఘాతం, విషయ విస్తరణ, ముగింపు వంటివి ప్రధానాంగాలుగా ఉంటాయి. వ్యాసంలోని విషయాన్ని బట్టి చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక, శాస్త్ర, వైజ్ఞానిక, సాహిత్య, తాత్విక, ఆధ్యాత్మిక మొదలైన విభాగాలుగా విభజించవచ్చు.

## ప్రవేశిక

తెలుగులో పదకవితకు, ఆద్యుడు, అనవద్యుడు అన్నమాచార్యుడు. పదకవితా పితామహుడనీ, సంకీర్తనాచార్యుడనీ ప్రసిద్ధికెక్కిన వీరు తెలుగు సాహిత్యంలో తొలిసారిగా సంకీర్తన రచనకు శ్రీకారం చుట్టి యోగ, వైరాగ్య, శృంగార, ఆధ్యాత్మిక తత్వాలకు చెందిన సంకీర్తనలు రచించి, పరమాత్మ ప్రణయాన్నీ, భక్తి, మధురభక్తి ప్రపత్తుల్ని ప్రకటించారు. తన ఆధ్యాత్మికతత్వాన్ని నిరూపించారు. తన సంకీర్తనల్లో సందర్భోచితంగా మానవుని మనుగడకు 'ఏడుగడ'లాగా ఉపకరించే నీతిని ప్రబోధించి, వైరాగ్యస్వరూపనిరూపణ చేశారు. పదరచనలో, భాషలో, భావంలో అన్నమాచార్యులు ప్రజాకవి. వాస్తవానికి వాగ్గేయకారులందరూ ప్రజాకవులంటే తప్పులేదు. కనుకనే అన్నమాచార్యులు ప్రజాశ్రేయస్సునుద్దేశించి నీతిప్రతిపాదక సంకీర్తనలు రచించారు. అవి ఏమిటో పరిశీలిద్దాం.

మానవుడు ఎన్ని చదువులు చదివి, ఎంతపాండిత్యం గడించినా, పెద్దల మాటలు ఎన్ని విన్నా పాపపంకిలంలో పడిపోక సచ్ఛీలసంపన్నుడై నప్పుడే ఉన్నతుడవుతాడంటాడు అన్నమాచార్యులు. ఇవి మనకందరికీ తెలిసిన సంగతులే. మనకు తెలిసికూడా తప్పుచేస్తున్నాం. అది తప్పు అని తెలిసి మానుకొంటే తప్ప ప్రయోజనం లేదంటారు అన్నమాచార్యులు. ఈ భావనను కింది విధంగా చెప్పారు.



"ఎంత చదివిన నేమి వినిన తన  
చింతయేల మానుసిరులేల కలుగు  
ఇతర దూషణములు యెడసినగాక  
మతిచంచలము గొంతమానినగాక  
గతియేల కలుగు దుర్గతులేలమాను".

పరనింద పనికిరాదు. అంతమాత్రాన ఆత్మప్రశంస మంచిదని కాదు. మనలో ఎన్నిదోషాలున్నా ఇతరుల్ని దూషించడం మానవ సహజం. అదితప్పు. బుద్ధిస్థిరంగా ఉండడం అవసరం. క్షణ క్షణానికి మతిచలించే తత్వం మంచిది కాదు. ఈ మంచిని పెంచుకొంటేనే మానవులకు సద్గతి కలుగుతుందని అన్నమాచార్యుల ప్రబోధం. ఈ భావనను పై సంకీర్తనలో చూడవచ్చు.

"పరధనముల యాస పాసినగాక  
అరిది నిందలులేని యప్పుడుగాక  
విరసవర్తనము విడిచినగాక  
పరమేల కలుగు నాపదలేలమాను".

పరధనాపేక్ష పనికిరాదు అన్నారు అన్నమయ్య. ఈనాడు సమాజంలో ఎందరినో చూస్తున్నాం. సులభధనం కావాలి. కష్టం లేకుండా ధనం సంక్రమించాలి. ప్రాణాపాయముంటే ఉండవచ్చుగాక. అయినా కొందరు దోపిడీ మూలంగా సంపాదిస్తున్నారు. ఇది మంచిది కాదు. నిందలపాలు గాకుండా జీవించడం ఉత్తమ లక్షణం. కానీ ఒక్కోసారి మన తప్పిదం లేకున్నా నిందలూ, అనుమానాలు వస్తూంటాయి. అలాంటివాటికి చోటివ్వకుండా బతకడం ముఖ్యం. ఇది కష్ట సాధ్యమే కావచ్చుగాక. కానీ అలవరచుకోవడం అవసరం. సరసజీవనం గడపడం మానవుని మనుగడకు మంచిది. విరసవర్తనం తనకు తనతోటివారికి దుఃఖాన్ని కలిగిస్తుంది. విరసవర్తనాన్ని విడనాడడమే ముఖ్యం. ఈ మంచి లక్షణాలు కలిగినప్పుడే జీవితం సుఖమయమవుతుంది. అది ఒక వ్యక్తికి మాత్రమే కాదు. సమాజాని కంతటికీ  ఉపకరిస్తుంది. ఇలాగా అన్నమాచార్యులు నీతిని చక్కని తేటతెలుగు మాటలలో చెప్పి అందరికీ ప్రబోధిస్తున్నారు.

కులమూ, జాతి, మతమూ వీటికి ఏనాడూ ప్రాధాన్యం లేదు. అయితే స్వార్థపరులు వాటికి భేదాలు, అంతస్తులు కల్పించి, సుఖమయజీవితాలలో చిచ్చు పెడుతుంటారు. ఈనాడు మనమావిషయం గమనించగలం. ఒకవేళ కొందరి కల్పనలో అధిక , హీన అనే తేడా ఉన్నా నిక్క మెరిగినవాడే మహాత్ముడంటారు అన్నమాచార్యులు.

ఎన్ని చదివినా, ఎన్ని వేషధారణలు వేసినా అందులో నీతిని గ్రహించి మసలుకోమన్నారు. ఉన్నతంగా ఎదగమన్నారు. అదే జీవిత లక్ష్యం కావాలన్నారు. ఈ భావనను పరిశీలిస్తే

**ఆలోచించండి - చెప్పండి**

1. మనసు ఎటువంటిది
2. మానవుడు ఎప్పుడు ఉన్నతుడౌతాడు?

"తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు
మనసు చంచల బుద్ధి మానీనా
జడ్డు మానవుఁడు చదువఁ జదువ నాస
వడ్డివారుఁగాక వదలీనా
గుడ్డి కుక్క సంతకుఁబోయి తిరిగిన
దుడ్డు పెట్టే కాక దొరకేనా
దేవదూషకుఁడై తిరిగేటివానికి
దేవతాంతరము తెలిసీనా
శ్రీ వేంకటేశ్వరు సేవాపరుఁడుగాక
పావనమతియై పరగీనా" ఈ విషయాన్నే తర్వాత వేమన్న తన శతక పద్యాలలో "కులము కన్నా గుణము మిన్న" అని తెలిపాడు.

మానవుడు బానిసగా బతకడంకంటే భగవంతునికి దాసుడై ఉండడం మంచిదంటాడు అన్నమాచార్యులు. స్వలాభాపేక్ష కోసం పరులను కొలుచుటకంటే, ఇతరులను యాచించడంకంటే హైన్యమూ, దైన్యమూ లేదంటాడాయన.

చీచీ నరులదేటి జీవనము
కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాక
అడవిలో మృగజాతియైన గావచ్చుగాక
వడి నితరుల గొలువగ వచ్చునా
వుడివోయిన పక్షియై వుండనైనావచ్చుగాక.
విడువ కెవ్వరినైనా వేడవచ్చునా" అని చక్కగా వివరించాడు. ఒక ప్రాణి అడవిలో జంతువైనా పరవాలేదు కానీ ఇతరులకు ఊడిగం చేయడం మంచిది కాదంటారు. అలాగే పక్షిగా జన్మించినా మంచిదే కానీ పరులను వేడుకోవడం సముచితం కాదంటారు. నిజమే కదా! గరుత్మంతుడు తన బానిసత్వం నుంచి బయటపడడానికి చేసిన ప్రయత్నం ఎంతటిదో మనకు తెలుసు. ఈ ఆధునికయుగంలో కేవలం వ్యక్తులే కాదు. దేశాలే స్వాతంత్ర్యం కోసం ఎన్నెన్ని త్యాగాలైనా చేసి సాహసించి సాధించాయి. సభ్యసమాజంలో అందరూ సమానమేనని నిరూపించాయి. అయినా కొన్ని స్వార్థపర శక్తులు సమాజాన్ని

పీడినస్తానే ఉన్నాయి. కాని భగవంతుని సృష్టిలో హెచ్చుతక్కువలు లేవు. అందరూ సమానమే ఈ భావాన్ని అన్నమయ్య కింది విధంగా చెప్పాడు.

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటునిద్ర అదియు నొకటే
దినమహో రాత్రములు తెగి ధనాఢ్యునకొకటే
వొనర నిరుపేదకును వొక్కటే అవియు
కొరలి శిష్టాన్నములు గొను నాకలొకటే
తిరుగు దుష్టాన్నములు తిను నాకలొకటే
పరగ దుర్గంధములపై వాయువొకటే
వరుస బరిమళముపై వాయువొకటే
కడగి యేనుగు మీద గాయు యెండొకటే
పుడమి శునకము మీద బొలయు యెండొకటే.......

అని తెలిపిన అన్నమాచార్యుల సర్వసమానత్వభావం ఈనాడు ఎంతైనా అవసరం.

మానవులకు ఏ పనిలోనైనా ఆత్మపరిశీలన ముఖ్యమంటాడు అన్నమాచార్యులు. ఏదైనా మనం సాధించినప్పుడు మన విజయంగానే భావించి గర్విస్తాము. ఓటమి కలిగినప్పుడు, తలచిన పని సాధించ లేనప్పుడు ఇతరులను నిందిస్తాము. ఇది మంచిది కాదు. దేనికైనా మానవ ప్రయత్నం తప్పదు. కానీ ఫలించినంతనే గర్వించరాదు. అన్నమాచార్యులు ఈ విషయాన్ని చక్కగా వివరించారు. అలాగే మానవ సహజమైన ఈర్ష్య, ద్వేషం, అసూయ, మొదలైన వాటిని వదిలివేయాలనీ మనలోని ఈ దుర్గుణాల్ని గణించంగాని, ఇతరులను దూషిస్తాం, ద్వేషిస్తాం, గేలిచేస్తాం, అసహ్యించుకుంటాం, అసూయపడతాం. ఆత్మపరిశీలన చేసుకుంటే వీటికి చోటు లేదంటారు అన్నమాచార్యులు. ఈ విషయాన్ని కింది విధంగా చెప్పారు.

చదివితి దొల్లి కొంత చదివేనింకా గొంత
యెదిరి నన్నెరుగను యెంతైన నయ్యో
వొరుల దూషింతుగాని వొకమారైన నా
దురిత కర్మములను దూషించను.

ఆకడబుద్ధులుచెప్పి అన్యుల బోధింతుగాని
తేకువ నాలోని హరి దెలుసుకోలేను
యితరుల దుర్గుణము లెంచి యెంచి రోతుగాని







**ఆలోచించండి - చెప్పండి**

1. ఎటువంటి దుర్గుణాలను వదిలివేయాలి?
2. మానవులకు సద్గతి ఎప్పుడు కలుగుతుంది?

మతిలో నాయాసలు మానలేను”.......అని అన్నమాచార్యులు తననుగూర్చి చెప్పుకొన్నా అది అందరికీ అన్ని వేళలా ఆత్మపరిశీలనకుపకరించే ప్రబోధమది.

సోమరితనం మంచిది కాదని తెలియజేస్తూ... అలాంటి సోమరిపోతుల్ని, పరుల సొమ్ము సొంతం చేసుకోవాలని ప్రయత్నించే వారిని మిక్కిలి గర్హించారు. ఛాయాపహారులైనవారిని అసహ్యించుకొన్నారు. దేనినైనా సాధించడానికి శక్తిని కూడగట్టుకోవాలి. ఆ శక్తి సామర్థ్యాలతో అనుకొన్నదాన్ని సాధించగలగాలని చెపుతూ ఇతరుల సొమ్ములతో గొప్పవారం కావాలనే భావనగల వాళ్ళని ఈ విధంగా గర్హించాడు అన్నమాచార్యులు.

వెర్రులాల మీకు వేడుక గలిగితేను
అర్రువంచి తడుకల్లగరాదా
ముడిచివేసిన పువ్వు ముడువ యోగ్యముగాదు
బడినొకరు చెప్పిన ప్రతి చెప్పబోతేను

అంటూ చాలా కఠినంగానే గర్హించాడు. నిజమే! ఇలాంటివాటికి దూరమైనప్పుడు నిజశక్తి ప్రకాశిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మంచిని పెంచుతుంది.

బయటి శత్రువుల్ని జయించేముందు అంతశ్శత్రువులైన అరిషడ్వర్గాల్ని జయించవలసి ఉంది. ఆ అరిషడ్వర్గాలు మనపై అధికారం వహించి మనల్ని వశపరచుకొంటాయి. వాటిని జయించడానికి ఆత్మనిగ్రహం అవసరమని మధురమంజులంగా వివరించాడు అన్నమాచార్యులు.

కాయమనే పూరికి కంతలు తొమ్మిది యాయ
పాయక తిరిగాడేరు పాపపుతలారులు
కాముడనియెడి రాజు గద్దెమీద నుండగాను
దీము గోపపు ప్రధాని దిక్కులేలీని
కోమలపు జ్ఞానమెల్లా కొల్లబోయ నాడనాడ
గామడులై రింద్రియపు కాపులెల్లా నిదివో
చిత్తమనే దళవాయి చింతలనే పౌజువెట్టి
యిత్తల విషయములు యెన్నికిచ్చిరి
తుత్తుమురై కోరికల దొండెము రేగగజొచ్చె
జొత్తుల వెరగుపడి చూచీ బుట్టుగులు”

**అరిషడ్వర్గాలు**
కామ, క్రోధ, లోభ,
మోహ, మద, మాత్సర్యాలు

ఇలా అంతశ్శత్రువుల్ని జయించగలిగే శక్తి ఆభగవంతుడు ఇచ్చి వాటికి అధిపతిని చేశాడట. ఇది అందరికి అవసరమే. వీటిని జయించడం సాధన వలనే జరుగుతుంది.

మానవజీవితమే ఒక నాటకం. సులభంగా అందరికి అర్థమయ్యే రీతిలో జీవితతత్వాన్ని తెలిపారు అన్నమాచార్యులు. ఎంతచదివినా, ఎంత విన్నా, ఎంత శాస్త్ర చర్చచేసినా, విజ్ఞానాన్ని సంపాదించినా జీవితంలో రెండే రెండు ఘట్టాలు. అవి పుట్టడం గిట్టడం తక్కిన నడిమిదంతా నాటకం.

“నానాటి బతుకు నాటకము
కానక కన్నది కైవల్యము
పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమి పని నాటకము

విశేషాంశాలు : ఏడుగడలు : సప్తప్రాకారాలు గల రక్షకాలు (1. గురువు, 2. తల్లి, 3. తండ్రి, 4. పురుషుడు, 5. విద్య, 6. దైవం, 7. దాత)

యెట్టయెదుట గలదీ ప్రపంచము....

నడుమంత్రపు పని నాటకము

తెగదు పాపమును తీరదు పుణ్యము

నగినగి కాలము నాటకము"........అని తెలిపి ఈనాటకమైన బతుకునుంచి విముక్తి పొందాలని ఆకాంక్షిస్తారు. కాదు అది అందరికి హెచ్చరిక. అందుకే వృథాగా కాలం గడపడం సముచితంకాదు. కాలమూ, ప్రాయమూ రెండూ గడచిపోతున్నాయి. ఇది మంచిది కాదని అన్నమయ్య భావన.

ఇది సమస్త మానవాళికి అన్నమయ్య చేసిన ప్రబోధం.

## ఇవిచేయండి

### అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.**

1. పాఠంలోని సంకీర్తనలను రాగయుక్తంగా పాడండి. వాటి భావాలు చెప్పండి.
2. విరసవర్తనం అంటే ఏమిటి? దానిని ఎందుకు విడనాడాలి?
3. ఏది జీవిత లక్ష్యం కావాలని అన్నమయ్య ప్రబోధించాడు?

**ఆ) కింది గద్యం చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి**



మన దేశంలో ఏ ఊరిలోనైనా, ఏ గుడిలోనైనా ఏ ఇంట్లో నైనా ప్రభాత వేళల్లో ఎమ్మెస్ సుబ్బులక్ష్మి గళం నుంచి వెలువడే విష్ణుసహస్రనామాలు, సుప్రభాతగీతాలు, భజనలు వినపడుతూనే ఉంటాయి. మన దేశీయుల్నే కాదు విదేశీయుల్ని సైతం పరవశింపచేసిన మధురమైన కంఠం ఆమెది. కర్ణాటక శాస్త్రీయ సంగీతసాగరాన్ని మథించి అమృతోపమానమైన రాగ ఝురులను అశేషజనావళికి అందించిన అమరమూర్తి ఆమె.

త్యాగయ్య కృతులు, శంకరాచార్యుల శ్లోకాలు, ఆండాళ్ తిరుప్పావై భక్తి గీతాలు, అనేక మంది వాగ్గేయకారుల కీర్తనలు, ఆమె గళసీమ నుంచి జాలువారి శ్రవణానందాన్ని కలిగించాయి. సంస్కృతం, తెలుగు, తమిళం, కన్నడం, హిందీ మొదలైన భాషలలో ఆమె గానం చేశారు. దేశవిదేశాల్లో ఎన్నో కచేరీలు చేసి తన గంధర్వగానంతో శ్రోతలను సమ్మోహితులను చేసారు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, రష్యా వంటి వివిధ దేశాల్లో లెక్కకు మించి కచేరీలు నిర్వహించి, కళలకు ఎల్లలు లేవని రుజువు చేసారు. 1937 నుంచి నాలుగేళ్లలో సేవా సదన్, శకుంతల, సావిత్రి, మీరా వంటి చలన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మెప్పు పొందారు. ఆ తర్వాత తన పూర్తికాలాన్ని, జీవిత పర్యంతం సంగీతరంగానికే అంకితం చేశారు. సంగీతకళానిధి, సప్తగిరిసంగీత విద్వన్మణి వంటి బిరుదులు పద్మ విభూషణ్, భారతరత్న, రామన్ మెగసెసే వంటి పురస్కారాలు ఆమెకు లభించాయి.

ప్రశ్నలు :

**1. సుబ్బులక్ష్మి స్వర ప్రత్యేకత ఏమిటి?**

**2. సుబ్బులక్ష్మి ఏ రకమైన పాటలు పాడారు?**

**3. సుబ్బులక్ష్మికి వచ్చిన బిరుదులు, అవార్డులు ఏవి?**

**4. పై పేరాకు ఒక శీర్షిక పెట్టండి.**

**ఇ) కింది కీర్తన చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**



ప॥ శాంతము లేక సౌఖ్యము లేదు
సారసదళనయన ॥శాం॥
అ॥ప॥ దాంతునికైన వేదాంతునికైన ॥శాం॥
చ॥ దార సుతులు ధన ధాన్యములుండిన
సారెకు జపతప సంపద గల్గిన ॥శాం॥
యాగాది కర్మములన్నియుఁజేసిన
బాగుగ సకలహృద్భావముఁదెలిసిన ॥శాం॥
ఆగమశాస్త్రము లన్నియు జదివిన
భాగవతులను బాగుగ జేఁసిన ॥శాం॥
రాజాధిరాజ శ్రీ రాఘవ త్యాగ
రాజ వినుత సాధురక్షక తనకుప ॥శాం॥

**– త్యాగరాజ కీర్తనలు**

**ప్రశ్నలు**

1. శాంతము లేకపోతే ఏమి ఉండదు ?
2. త్యాగయ్య ఈ కృతిలో ఎవరిని, ఏమని సంబోధించాడు?
3. ఏవి ఉన్నా సుఖము ఉండదు ?
4. కీర్తన ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

**ఈ) పాఠం ఆధారంగా కింది వాక్యాలకు అర్థసందర్భములు రాయండి.**

1. నిండార రాజు నిద్రించు నిద్రయు ఒకటే !
2. పరధనముల యాస పాసినగాక
3. ఈ విశ్వంలో కులం, జాతి, మతాలకు ఏనాడు ప్రాధాన్యం లేదు.

**ఉ) కింది ప్రశ్నలకు ఏకవాక్య సమాధానాలు రాయండి.**

1. అన్నమయ్యకు గల బిరుదులేవి?
2. ధన సంపాదన గురించి కవి ఏమన్నాడు?
3. ఏది ఉత్తమ జీవితం?
4. ఏడుగడలు అని వేటిని అంటారు?

## వ్యక్తీకరణ–సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1 అరిషడ్వర్గాల గురించి అన్నమయ్య ఏమన్నాడు?
2 అన్నమయ్య ఎవరిని అసహ్యించుకున్నాడు? ఎందుకు?
3 మనిషి ఎప్పుడు ఉన్నతుడవుతాడు?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమది నుండి పది వాక్యాలలో సమాధానాలు రాయండి?**

1 పాఠం ద్వారా మీరు గ్రహించిన విలువలను మీ సొంత మాటల్లో రాయండి?

2 పరనింద, పరధనాపేక్ష, సేవ, కులమతాలు, ఆత్మ పరిశీలనలను గురించి వ్యాఖ్యానించండి
3 పాఠం ఆధారంగా అన్నమయ్య సంస్కరణాభిలాషను గురించి రాయండి

**ఇ) కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.**

1 అన్నమయ్య ఆరాధనోత్సవాలను గురించి తెలుపుతూ గోడపత్రిక తయారుచేయండి.
2 మీ పాఠశాలలో జరిగే భాషోత్సవాలకు ప్రముఖ కవి వచ్చారు. తెలుగుకవుల గురించి తెలుసుకోవడానికి ప్రశ్నావళిని తయారు చేయండి.

## భాషాంశాలు   పదజాలం

**అ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి సొంత వాక్యాలు రాయండి.**

1. అన్నమయ్య తెలుగు పదకవిత్వానికి ఆద్యుడు.

____________________

2. మానవులకు ధనంపై అపేక్ష మంచిది కాదు.

____________________

3. మంచి పనులు చేయడం వలనే సద్గతి పొందగలం.

____________________

4. వాగ్గేయకారులలో అన్నమయ్య ఘనత ఎనలేనిది.

____________________

5. ఇతరులను ఆరడి చేయడం తగదు.

____________________

**ఆ) కింది పదాలకు సరైన పర్యాయ పదాలను పట్టికలో వెతికి రాయండి.**

తలపు, శరీరం, దిగులు, దేహం, బెంగ, దివి, పరులు, నాకం, ఇతరులు, వాంఛ, ఉసురు, తృష్ణ, జీవం, ఈప్సితం

1. ప్రాణం = ____________________
2. కోరిక = ____________________
3. ఒరులు = ____________________
4. మేను = ____________________
5. చింత = ____________________
6. స్వర్గం = ____________________

**ఇ) కింది పదాలకు సరిపోయే నానార్థాలు పట్టికలో ఉన్నాయి. వాటిని గుర్తించి, రాయండి.**

1. పాలు, అమృతం 2. వంశం, జాతి, ఇల్లు 3. స్వభావం, వింటినారి 4. ఎఱుక, తెలివి, బుద్ధి

1. మతి = ______ ______ ______

2. కులం = ______ ______ ______

3. గుణం = ______ ______ ______

4. సుధ = ______ ______ ______

**ఈ) కింది పట్టికలో ప్రకృతి-వికృతి పదాలు కలిసి ఉన్నాయి. వాటిని వేరుచేసి పట్టిక రూపంలో రాయండి.**

భక్తి, స్థిరం, బత్తి, ప్రాణం, భాష, నిక్కం, గొనం, తిరం, పానం, బాస, నిజం, గుణం

| | ప్రకృతి | వికృతి |
|---|---|---|
| 1. | ................ | ................ |
| 2. | ................ | ................ |
| 3. | ................ | ................ |
| 4. | ................ | ................ |
| 5. | ................ | ................ |
| 6. | ................ | ................ |

## వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.**

1. సంకీర్తనాచార్యుడు = ______ + ______, ______
2. వైరాగ్యపు పద్ధతి = ______ + ______, ______
3. నట్టనడుమ = ______ + ______, ______
4. పరమాత్ముడు = ______ + ______, ______

**ఆ) కింది పదాలను కలిపి రాసి, సంధి పేరు రాయండి.**

1. పరధన + అపేక్ష = ______ , ______
2. దోషాలు + ఉన్న = ______ , ______
3. సత్ + గతి = ______ , ______
4. మహా + ఆత్ముడు = ______ , ______
5. దీపము + ఉండగ = ______ , ______

**శ్చుత్వసంధి:**

1. తపస్ + చర్య = తపశ్చర్య
2. సత్ + చిత్ = సచ్చిత్
3. జగత్ + జనని = జగజ్జనని

పై ఉదాహరణలను గమనించండి. మొదటి పదం చివర సకార తవర్గాక్షరాలలో ఏదో ఒకటి ఉంది. రెండవ పదం మొదట శవర్ణం కానీ, చవర్గాక్షరాలలో ఏదో ఒకటి గానీ ఉంది. సంధి కలిసినపుడు శవర్ణం కానీ, చవర్గాక్షరం కానీ ఆదేశమయ్యింది. ఇలా జరగడాన్ని శ్చుత్వసంధి అంటారు.

సూత్రం: సకార, తవర్గాక్షరాలకు శవర్ణ చవర్గాక్షరాలు పరమైతే శవర్ణ, చవర్గాక్షరాలే ఆదేశంగా వస్తాయి.

1. సజ్జనులు : ______________
2. తపశ్శక్తి : ______________

పై పదాలను సంధి విడదీసి సూత్రంతో సమన్వయం చేయండి.

**సమాసములు**

**ఇ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

1. మధురభక్తి = ______________ , ______________
2. పరులసొమ్ము = ______________ , ______________
3. అసహ్యం = ______________ , ______________
4. మధురమంజులం = ______________ , ______________
5. సరసవర్తనం = ______________ , ______________

**ఈ) కింది విగ్రహ వాక్యాలను, సమాస పదాలుగా మార్చి రాయండి.**

1. మానవుని యొక్క ప్రయత్నం = ______________ , ______________
2. శక్తియును, సామర్థ్యమును = ______________ , ______________
3. వివేకం లేని వాడు = ______________ , ______________
4. ఉత్తమమైన లక్షణం = ______________ , ______________
5. పరధనం కొరకు అపేక్ష = ______________ , ______________

**అలంకారం-ముక్తపదగ్రస్తం :**

**కింది పద్యాన్ని పరిశీలించండి. ప్రత్యేకతను గుర్తించండి.**

కం. మన వేటికి నూతనమా!
తన మానిని బ్రేమ? తనకు దక్కితిననుమా
ననుమానక దయ దనరం
దనరంతులు మాని నరసధవు రమ్మనవే

పై పద్యంలోని ప్రత్యేకతను గమనించారు కదా!

ఒక పద్యపాదంగాని వాక్యంగాని ఏ పదంతో పూర్తవుతుందో అదే పదంతో తర్వాత పాదం/వాక్యం మొదలవుతుంది దీన్నే ముక్తపదగ్రస్త అలంకారం అంటారు. (ముక్తపదం = విడిచిన పదాన్ని, గ్రస్త = తిరిగి గ్రహించడం అని అర్థం)

ఉదా: సుదతీ నూతన మదనా
మదనాగ తురంగ పూర్ణ మణిమయ సదనా
సదనామయ గజరదనా
రదనాగేంద్ర నిభకీర్తి రసనరసింహా

## ప్రాజెక్టుపని

అన్నమయ్య సంకీర్తనలు సేకరించి తరగతి గదిలో ప్రదర్శించి, చర్చించండి.

### పాఠాంత పద్యం

"దయ ప్రేమ యొక్క రూపము
దయ పట్టగజాల దవ్వు్రతవ్వంగ వలయున్
దయ పుట్టెనేని రాక్షస
చయమైనను వేల్పులగుట సమకూడుకదా

భావం : ప్రేమయొక్క రూపమే దయ. దయకలగాలంటే చాలా లోతుగా ఆలోచించాలి. దయ పుడితే రాక్షసమూక కూడా దేవతలవ్వడం జరుగుతుంది

సూక్తి : 'పుస్తక పఠనం లెక్కలేనంత మంది అనుభవాలను ఆలోచనలను తెలియజేస్తుంది'.

## మీకు తెలుసా?

### పులి వేషం



పులి వేషం శతాబ్దాలుగా తెలుగు నాట పేరుపొందిన జానపద కళారూపం. దీనిని వేట నృత్యం అని కూడా అంటారు. జాతర్లు, ఉత్సవాలలో పులి వేషధారులు మనకు కనిపిస్తుంటారు. పులినృత్యం జంతు అనుకరణ నృత్యాలలో ఒకటి. కండలు తిరిగిన దేహం గల వ్యక్తి ఒంటిపై పెద్దపులి లాగా పసుపు, నలుపు చారలు చిత్రించుకొని, తలకు పులి తలలాంటి కవచం పెట్టుకొని, తోకతో అచ్చం పెద్ద పులి లాగానే అభినయం చేస్తారు. కొన్నిచోట్ల ఇద్దరు పులి వేషధారులు రెండు పెద్ద పులులు కలబడి పోరాడుతున్నట్లు ప్రదర్శన ఇస్తారు. ఒక్కోసారి పులితోపాటు వేటగాడి పాత్ర కూడా ఉంటుంది. వేటగాడు వీరోచితంగా పులిని వేటాడడం అందులో ప్రధాన అంశం. పులి నృత్యంలో అత్యంత ప్రధానమైనది మరియు కష్టమైనది వేషధారణే. వీధిలో పులి ఆట ఆడడానికి గంభీర ధ్వని చేసే డప్పులను ఉపయోగిస్తారు. ఆ డప్పుల శబ్దానికి తగ్గట్లు పులి వేషధారులు వేసే అడుగులు చూపరులను భయభ్రాంతులకు గురిచేస్తాయి. అన్ని మతాల ఉత్సవాలు, ఊరేగింపులలో పులి వేషాలు వేయించడం ఒక ప్రత్యేకత.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలు

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఆర్త త్రాణపరాయణుడు అయిన శ్రీ వేంకటేశ్వర స్వామి వెంకటాద్రిపై వెలసి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ తరింప చేస్తున్నారు. భక్తుల పాలిట కల్పవృక్షమైన తిరుమలేశునికి నిత్య కళ్యాణాలూ, పచ్చ తోరణాలతో ఎల్లప్పుడూ ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి.

శ్రీవారికి జరిగే ఉత్సవాలు క్రీ.శ 9వ శతాబ్ది నుండే ప్రారంభమయ్యాయి. సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే తొలుత ప్రారంభించారు కనుక వీటిని బ్రహ్మోత్సవాలంటారని భవిష్యోత్తర పురాణంలో చెప్పబడింది. ఎందరో కవి పండితులు, అన్నమయ్య వంటి వాగ్గేయకారులు ఈ బ్రహ్మోత్సవాలను తమ కీర్తనల్లో ఎంతో గొప్పగా వర్ణించారు. ఇవి తొమ్మిది రోజుల పాటు జరుగుతాయి.


సేకరణ : తిరుమల తిరుపతి దేవస్థానం

ఈ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యే మొదటి రోజున ఆలయ శుద్ధిని శాస్త్రోక్తంగా చేసి అంకురార్పణతో ప్రారంభిస్తారు. పాలికలలో నవధాన్యాలను వేసి రోజూ నీరు పోస్తూ అవి మొలకలెత్తేలాగా చేయడమే అంకురార్పణ. మొదటి రోజునే గరుడ ధ్వజమును ఆరోహిస్తారు. గరుడుడు వెళ్లి ఇంద్రాది దేవతలను అగ్ని కుబేర వాయుదేవాదులను వశిష్ఠాది ఋషి పుంగవులను ఆహ్వానించి వస్తారని ప్రగాఢ నమ్మకం. శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీనివాసుడు తిరుమాడ వీధులలో విహరిస్తారు. తదుపరి మహా నైవేద్యాలను చెల్లిస్తారు. ఉత్సవానంతరం శ్రీవారికి అలసట పోవడానికి ఓషధీకృత జలాలతో అభిషేకించడాన్ని స్నపనం అంటారు.

రెండో రోజు శ్రీదేవీ, భూదేవీ సమేత మలయప్ప స్వామిని పుష్పాదులతో మౌక్తిక మాలలతో వజ్రవైడూర్యాలతో వివిధ అలంకారాలతో విశేషంగా వజ్రఖచితమైన బంగారు శేష వాహనంపై ఊరేగిస్తారు. మూడో రోజున నరసింహావతారమెత్తి భక్తవరేణ్యులను గాచిన స్వామిని మృగరాజు అయిన సింహ వాహనంపై ఊరేగిస్తారు. నాలుగో రోజున కామితార్థ ప్రదాయినిగా కీర్తినొందిన విశిష్ట కల్పవృక్ష వాహనంపై ఎక్కి భక్తుల పాలిట కొంగు బంగారు అయి ఊరేగుతూ భక్తులకు నయనానందం కల్గిస్తారు. ఐదో రోజున శ్రీవారి ఆలయం నుంచే పల్లకిలో వజ్ర వైడూర్యాలు, రత్నాభరణాలను ధరించి, కుడిచేత చిలుకను ధరించి విహరిస్తూ నయనానందం చేస్తారు. ఆ రోజు సాయంకాల సేవలో శంఖు చక్రాలను ధరింపజేసి, గరుడ వాహన సేవను చేస్తారు. ఆ రోజున ఉంగరాల జుట్టుతో సర్వాలంకార భూషితుడై అమ్మవారి చేతిని గట్టిగా పట్టుకొని, ఏనుగుపై ఊరేగుతారు. ఆనాటి ఉదయకాలంలో హనుమత్ వాహనంపై విహరించిన స్వామికి ఊంజల్ సేవ, వసంతోత్సవాలు కూడా జరుపుతారు. ఏడో రోజున జగతి కంతటికి వెలుగులను ప్రసరించే సూర్యుడే సూర్యప్రభ వాహనంగా మారగా స్వామి ఊరేగుతూ, భక్త జనాలకి ఆశీస్సులను ఇస్తారు. ఆనాటి సాయంకాల వేళ మానవ మేధస్సును పరిపాలిస్తూ ఔషధాలకి రాజైన చంద్రుడు చంద్రప్రభ వాహనంగా మారి స్వామి వారిని సేవిస్తారు. ఉభయదేవేరులతో ఊరేగుతున్న శ్రీనివాసుడు చిరునవ్వుల చల్లని వెన్నెలను ఆశీస్సులుగా కురిపిస్తారు. 8వ రోజున దారుకుడు రథసారథి అయి శైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వలాహకం అనే నాలుగు మేలు జాతి గుర్రాల రథాన్ని ఎక్కి స్వామి ఊరేగుతారు.

తొమ్మిదో రోజు గోవిందా గోవిందా అంటూ దిక్కులు మారుమోగుతుండగా సర్వపాప హరిణి పుష్కరిణిలో శ్రీదేవి భూదేవి సహిత మలయప్ప స్వామి వారికి ఉదయం చక్రస్నాన మహోత్సవాలు చేస్తారు. సాయంకాల వేళ స్వామివారిని పసుపు కుంకుమ చందనాది లేపనాలతో అభిషేకించి పిదప ఊరేగింపులో భక్తులందరికీ చందనాన్ని పంచిపెడతారు. గరుడ ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన సకల దేవతలకూ వీడ్కోలు చెబుతున్నట్లుగా గరుడ ధ్వజాన్ని అవరోహణ చేస్తూ, బ్రహ్మోత్సవాలను ముగిస్తారు. ఈ విధంగా ఆపదమొక్కులవానిగా, అనాథ రక్షకునిగా, పిలిచిన పలికే దైవంగా కలియుగ రక్షకుడైన శ్రీ వెంకటేశ్వరని బ్రహ్మోత్సవాలు శ్రీవారి బ్రహ్మోత్సవాలుగా కీర్తిగాంచాయి. ఈ బ్రహ్మోత్సవాలకు దేశ విదేశాల నుంచి లక్షల కొలది భక్తులు వచ్చి, దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారు. పొందుతూనే ఉంటారు.

# అమృతమూర్తి అమ్మ



నీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరంగా పెట్టుకో, తనను తాను విమర్శించుకోవడం వివేకం ఇతరులను విమర్శించడం అవివేకం.
మంచిని మించిన మహిమలు లేవు.
లేని దాని కొరకు ఆశించేది దుఃఖం.
ఉన్నది చాలనుకునేది సుఖం.

ఇలాంటి ఆచరణశీలమైన మాటలు అమృత మూర్తులే చెప్పగలరు. అలాంటి అమృతమూర్తి అమ్మగా భక్తుల చేత పిలువబడిన విశ్వజనని శ్రీమతి అనసూయాదేవి.

గుంటూరు జిల్లా పొన్నూరు సమీపంలోని మన్నవ గ్రామంలో 28-03-1923 న సీతాపతిరావు, రంగమ్మ దంపతులకు అనసూయమ్మ గారు జన్మించారు. 13వ ఏట మేనత్త కొడుకు అయిన బ్రహ్మాండం నాగేశ్వరరావుతో వివాహం జరిగింది. 1940లో దంపతులు ఇరువురు జిల్లెళ్ళమూడిలో తమ నివాసం ఏర్పరచుకున్నారు.

గ్రామంలో దేవాలయం, సత్రం ఏర్పాటు చేయాలని సంకల్పించుకొని గ్రామ ప్రజల సహకారంతో పిడికెడు బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ప్రతిరోజు గ్రామంలో ప్రజలు వండుకునే వాటి నుండి పిడికెడు బియ్యం పక్కకు తీసేవారు. వాటిని అన్నదాన కార్యక్రమానికి ఇచ్చేవారు. తక్కువ కాలంలోనే అది మంత్రంగా పనిచేసి ఎంతోమంది ఆకలికేకలను మాన్పింది. లోకంలో అన్ని బాధల కంటే ఆకలి బాధే ఎక్కువ అని చెప్పే అమ్మ వేషధారణలను బట్టి కాకుండా ఆకలితో వచ్చే ప్రతి వ్యక్తికి అన్నం పెట్టి ఆదరించారు.

**విద్య - వైద్య ప్రదాత:** అమ్మ కేవలం ధార్మిక కార్యక్రమాలకే పరిమితం కాలేదు. సమాజంలో పెను సమస్యలైన విద్య, వైద్యం అందరికీ ఉచితంగా అందించాలని భావించారు. అందుకు అనుగుణంగా 1971 వ సంవత్సరంలో మాతృశ్రీ విద్యాపరిషత్ ను ఏర్పాటు చేశారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలతో సంస్కృత పాఠశాలను, తెలుగు, సంస్కృత భాషలకు సంబంధించిన ప్రాచ్యకళాశాలలను నెలకొల్పి తెలుగు, సంస్కృత భాషలు సజీవంగా వెలిగేందుకు తనవంతు కృషి చేశారు. రోగ పీడితుల కొరకు 1878వ సంవత్సరంలో అప్పటికే ఉన్న ఆయుర్వేద వైద్యాలయానికి తోడు మాతృశ్రీ మెడికల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, హోమియోపతి, అల్లోపతి వైద్యాలయాలను ఏర్పాటు చేశారు. జబ్బులతో బాధపడుతూ ఎవరూ పట్టించుకోని అనాథలకు అండగా ఆదరణాలయాన్ని ప్రారంభించి సుమారు 100 మందికి ఆశ్రయాన్ని కల్పిస్తున్నారు. ఈ విధంగా వారి పాలిట "దీనబంధువే" అయింది అమ్మ. ఈనాటికీ 200 మంది కళాశాల విద్యార్థులకు, వందలాదిమంది అన్నార్తులకు నిత్యం ఆకలి తీరుస్తూ అన్నపూర్ణాలయం అలరారుతోంది నేటికీ వృద్ధులకు ఆదరణాలయం, గ్రామస్తులందరికీ వైద్యాలయం అందుబాటులో ఉండి విజయవంతంగా నిర్వహించబడుతున్నాయి

"ప్రేమే తత్వం సేవే మార్గం" అనే మాటలను గుండెచప్పుడుగా చేసుకుని అమ్మ చూపిన మమతా, సమతలు అభినందనీయాలు. ఆహార, విద్యా, వైద్య సదుపాయాలు కల్పించిన అమ్మ ఆలోచనలు అందరికీ ఆచరణీయాలు. "సర్వేజనా సుఖినోభవంతు" అనేది ఆమె జీవిత ఆశయం సందేశం కూడా.

# ఉపవాచకం

మన ఇతిహాసం

## రామాయణం

(వాల్మీకి రామాయణానికి సంక్షిప్త వచనరూపం)



కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం
ఆరుహ్యకవితా శాఖాం వందే వాల్మీకీ కోకిలమ్

# రామాయణాన్ని ఎందుకోసం చదవాలంటే...

మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామాయణం. మానవ హృదయాలనుంచి ఎప్పటికీ చెరగని కథ. 'అమ్మానాన్నల అనురాగం, పుత్రుల అభిమానం - అన్నదమ్ముల అనుబంధం, భార్యాభర్తల సంబంధం - గురుభక్తి, శిష్యానురక్తి - స్నేహఫలం, ధర్మబలం - వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం - జీవకారుణ్య భావన, ప్రకృతిలాలన' - ఇలా జీవిత పార్శ్వాలనెన్నింటినో పట్టి చూపిస్తుంది రామాయణం. రామాయణాన్ని చదవడమంటే జీవితాన్ని చదవడమే. రామాయణం పారాయణ గ్రంథం కాదు, ఆచరణ ప్రధాన గ్రంథం. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి మనీషిగా ఎలా ఎదగగలడో నేర్పుతుంది. చిన్న చిన్న పాత్రల ద్వారా సమున్నత సందేశాన్నందిస్తుంది. "రామో విగ్రహవాన్ ధర్మః సత్యధర్మ పరాక్రమః" అన్న మహితోక్తిని మారీచుని నోటినుండి మహర్షి పలికించాడు. రామునివంటి ఆదర్శమూర్తి, రామాయణం వంటి ఆదర్శకావ్యం 'నభూతో నభవిష్యతి!' మనిషి ఉన్నంతకాలం రామాయణం ఉంటుంది.

ప్రపంచ సాహిత్యంలోనే ఆదికావ్యం రామాయణం. వాల్మీకి మహర్షి దీన్ని రచించి 'ఆదికవి'గా కీర్తిపొందాడు. 'రామాయణం, పౌలస్త్యవధ, సీతాయాశ్చరితం మహత్' అనే మూడు పేర్లు దీనికున్నాయి. ఆరు కాండల (విభాగం) తో, ఇరవై నాలుగు వేల శ్లోకాలతో, సంస్కృత భాషలో సాగిన రచన ఇది. తరువాతి కాలంలో ఎన్నో రామాయణాలు వచ్చాయి. మన దేశంలోనే కాదు ప్రపంచంలోని పలుదేశాల్లో ఈ రామాయణ కథ మనకు కనిపిస్తుంది. వారి వారి ప్రతిభననుసరించి వాల్మీకి కథకు జోడింపులు చేసిన కవులూ ఉన్నారు. అవే నిజం అన్నంతగా ప్రచారం పొందాయి కొన్ని సంఘటనలు.

వాల్మీకి రామాయణ కథను సంక్షిప్తంగా అందించే ప్రయత్నం ఇది. సమున్నత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముందు తరాలవారికి స్ఫూర్తికోసం చేసిన రచన ఇది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# బాలకాండ

శ్రీమన్నారాయణుని నిరంతరం స్మరించే నారదమహర్షి ఒకనాడు మునిశ్రేష్ఠుడైన వాల్మీకి ఆశ్రమానికి వచ్చాడు. నారదుడు తపస్వి, వాక్చతురుల్లో శ్రేష్ఠుడు. వాల్మీకి జిజ్ఞాసతో నారదులవారి నడిగాడు (జిజ్ఞాసే విజ్ఞానానికి మూలం) : 'ఓ మహర్షీ! అన్నీ మంచి గుణాలు కలవాడు, ఎలాటి ఆపదలు చుట్టుముట్టినా తొణకనివాడు, ధర్మంతెలిసినవాడు, ఆశ్రయించినవారిని ఆదుకునేవాడు, మాటతప్పనివాడు, సకలప్రాణులకు మేలుచేసేవాడు, వీరుడు, ధీరుడు, అసూయలేనివాడు, అందమున్నవాడు... ఇలాంటి శుభలక్షణాలు కలవాడు ఎవరైనా ఈ లోకంలో ఉన్నారా?' అని ప్రశ్నించాడు. నారదుడు చిరునవ్వుతో సమాధానమిచ్చాడు. 'మహామునీ! ఇన్ని లక్షణాలు ఒకే వ్యక్తిలో కుదురుకోడం సాధారణంగా జరగదు. కానీ, నీవు తెలిపిన విశిష్ట గుణాలన్నీ మూర్తీభవించినవాడు శ్రీరాముడ'ని తెలిపాడు. రామాయణగాథను సంక్షిప్తంగా వాల్మీకికి వినిపించాడు నారదుడు. అక్కడినుంచి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

రామకథ వాల్మీకి మనసులో నాటుకుపోయింది. నారదుని మాటలు ఇంకా చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్నాయి. గంగానదీ సమీపానగల తమసానదికి స్నానం చేయడానికి బయల్దేరాడు. భరద్వాజాది శిష్యులు వెంట నడుస్తున్నారు. తమసానది మంచివాని మనసువలె స్వచ్ఛంగా ఉంది.

స్నానానికి నదిలోకి దిగిన వాల్మీకి చుట్టూ ఉన్న ప్రకృతి అందాలకు పరవశిస్తున్నాడు. సమీపంలో ఒక కొమ్మపైన క్రౌంచ పక్షుల జంటను చూశాడు. వాటి అనురాగం ముచ్చటగొలుపుతున్నది. వాటి మధురధ్వనులు వీనులవిందు చేస్తున్నాయి. ఇంతలో ఒక వేటగాడు క్రూరబాణంతో మగపక్షిని నేలకూల్చాడు. అది నెత్తురోడుతూ విలవిలలాడుతూ ప్రాణాలను విడచింది. ఆ ఎడబాటును తట్టుకోలేని ఆడపక్షి తల్లడిల్లిపోయింది. హృదయవిదారకమైన ఈ దృశ్యాన్ని చూశాడు వాల్మీకి. కరుణరసం జాలువారింది. ధర్మావేశం కట్టలు తెంచుకుంది. వెంటనే నోటి వెంట అప్రయత్నంగా...

**మానిషాద ప్రతిష్ఠాంత్వ**
**మగమః శాశ్వతీః సమాః।**
**యత్ క్రౌంచమిథునాదేకమ్**
**అవధీః కామమోహితమ్॥**

(ఓ కిరాతుడా! క్రౌంచపక్షి జంటలో పరవశమైయున్న ఒక పక్షిని చంపిన నీవు శాశ్వతంగా అపకీర్తి పాలవుతావు) అన్న మాటలు వచ్చాయి.

అననైతే అన్నాడు కానీ తరవాత అతనికే ఆశ్చర్యంవేసింది. ఈ మాటలు సమానాక్షరాలుగల నాలుగు పాదాలతో లయబద్ధంగా వచ్చాయి. ఇది ఛందోబద్ధమైన శ్లోకమేనని నిర్ధారించుకున్నాడు. **శోకంనుంచి శ్లోకం పుట్టింది.** ఆశ్రమానికి తిరిగివచ్చారందరూ. కాని క్రౌంచపక్షి దారుణ దృశ్యం మాత్రం వాల్మీకి మనసునుంచి వెనుదిరగడం లేదు. అదే ఆలోచన. అదే ఆవేదన. ఇంతలో సృష్టికర్త అయిన బ్రహ్మ వాల్మీకిని చూడడానికి ఆశ్రమానికివచ్చాడు. అతనికి శాస్త్రోక్త ఉపచారాలన్నీ చేశాడు వాల్మీకి. బ్రహ్మ వాల్మీకిని కూర్చోమన్నాడు. బ్రహ్మ ఆసనంకన్నా కొంచెం తక్కువ ఎత్తుగల ఆసనంపైన కూర్చున్నాడు వాల్మీకి. **ఇది పెద్దలపట్ల ప్రవర్తించవలసిన తీరు.** బ్రహ్మ ఎదురుగా ఉన్నా క్రౌంచపక్షి బాధ వాల్మీకిని వదలడం లేదు. మనసులో 'మానిషాద' శ్లోకమే మళ్ళీ ధ్వనించింది. అన్నీ తెలిసిన బ్రహ్మ చిరునవ్వును చిందిస్తూ 'ఓ ఋషీశ్వరా! నీవు పలికినది శ్లోకమే.

అది నా సంకల్ప ప్రభావం. ఈ ఛందస్సు (అనుష్టుప్) లోనే శ్రీరామచరిత్రను రాయమని ఆదేశించాడు. నారదుడు స్పష్టంగా వివరించని రామకథా రహస్యాలు కూడా నీకు స్ఫురిస్తాయని అనుగ్రహించాడు. ఈ భూమండలంలో పర్వతాలు, నదులు ఉన్నంతకాలం రామాయణగాథను జనులు కీర్తిస్తూనే ఉంటా'రని ఆశీర్వదించాడు. బ్రహ్మ ఆదేశానుసారం రామాయణరచనకు శ్రీకారం చుట్టాడు వాల్మీకి మహర్షి.

**అయోధ్యా నగరం :**

సరయూనదీతీరంలో 'కోసల' అనే సుప్రసిద్ధ దేశముంది. అందులోదే 'అయోధ్యా' అనే మహానగరం. 'అయోధ్య' అంటే యోధులకు జయించడానికి శక్యంకానిది. మనువు దీన్ని నిర్మించాడు. కోసలదేశాన్ని దశరథమహారాజు పరిపాలిస్తున్నాడు. అతడు సూర్యవంశంవాడు. మహావీరుడు. దేవతల పక్షాన రాక్షసులతో ఎన్నోమార్లు యుద్ధం చేసినవాడు. ధర్మపరాయణుడు. ప్రజలను కన్నబిడ్డలలా చూసుకునేవాడు. వశిష్ఠ, వామదేవులు అతని ప్రధానపురోహితులు. సుమంత్రుడు మొదలుగాగల ఎనిమిదిమంది మంత్రులు. ఇతని పాలనలో కోసలదేశం భోగభాగ్యాలతో విలసిల్లింది. ప్రజలు ధర్మవర్తనులై సుఖసంతోషాలతో ఉన్నారు. **'యథారాజా తథా ప్రజాః' – రాజు ఎలా ఉంటే ప్రజలూ అలాగే ఉంటారు.**

ఎన్ని ఉన్నా సంతానం లేదన్న చింత దశరథుణ్ణి కుంగదీసింది. సంతానప్రాప్తికోసం అశ్వమేధయాగం చేయాలన్న ఆలోచన కలిగింది. వెంటనే పురోహితులు, గురువులతో సమావేశమయ్యాడు. మనసులోని మాట చెప్పాడు. వారు తథాస్తు అన్నారు. సరయూనదికి ఉత్తర తీరంలో యజ్ఞవేదిక సిద్ధమైంది. మంత్రీ, సారథి అయిన సుమంత్రుడు ఈ యాగానికి ఋష్యశృంగ మహర్షిని ఆహ్వానిస్తే ఫలవంతమౌతుందని సూచించాడు. ఋష్యశృంగుడు విభాండక మహర్షి కుమారుడు. నిష్ఠాగరిష్ఠుడు. అతడు ఎక్కడ ఉంటే అక్కడ వానలు బాగా కురుస్తాయి. దశరథుని ఆజ్ఞమేరకు ఋష్యశృంగుణ్ణి సగౌరవంగా తోడ్కొనివచ్చారు. మూడు రోజులపాటు అశ్వమేధయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

తరవాత దశరథుడు ఋష్యశృంగునితో పుత్రప్రాప్తికోసం చేయవలసిన క్రతువును గురించి అడిగాడు. ఆ భారాన్ని ఋష్యశృంగునిపైనే ఉంచాడు. దశరథుని అభ్యర్థనను మన్నించిన ఋష్యశృంగుడు 'పుత్రకామేష్టి' అనే యాగాన్ని ప్రారంభించాడు. హవిస్సులందుకోడానికి బ్రహ్మాదిదేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు యజ్ఞశాలలో ప్రత్యక్షమయారు.

అదే సమయంలో దేవతలందరూ బ్రహ్మను చేరి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. రావణాసురుడు బ్రహ్మ వరప్రభావంచేత విర్రవీగుతూ తమను చిత్రహింసలకు గురిచేస్తున్నాడన్నారు. ముల్లోకాలను బాధించడమేగాక ఇంద్రుణ్ణిసైతం రాజ్యభ్రష్టుణ్ణి చేయడానికి పూనుకొన్నాడని తెలిపారు. అతని దుండగాలకు అంతే లేదన్నారు. ఋషుల, యక్షగంధర్వుల మాట అటుంచి అతని భయంతో సూర్యుడు, సముద్రుడు, వాయువు కూడా తమ సహజస్థితిని ప్రకటించలేకపోతున్నారని వాపోయారు. అతని పీడ విరగడయే ఆలోచనను బ్రహ్మనే చెప్పమని వేడుకున్నారు.

బ్రహ్మ దేవతలతో 'రావణుడు గంధర్వ, యక్ష, దేవ, దానవులచే మరణం లేకుండా నన్ను వరం కోరాడు. మానవులపట్ల అతనికి చులకనభావం. అందుకే వారి గురించి ప్రస్తావించలేదు. కనుక మానవుని చేతిలోనే రావణునికి మరణం ఉంద'ని అన్నాడు.

ఇంతలో శ్రీమహావిష్ణువు శంఖచక్రగదాధారియై వచ్చాడు. దేవతలు ఆ దేవదేవుణ్ణి అనేక విధాలుగా స్తుతించారు. వరగర్వంచేత కన్నూమిన్నూగానక ప్రవర్తిస్తున్న రావణుణ్ణి సంహరించడానికి మానవుడిగా అవతరించమని అభ్యర్థించారు. దశరథ మహారాజుగారి ముగ్గురు భార్యలకు నాలుగు రూపాలలో పుత్రుడవు కమ్మని ప్రాధేయపడ్డారు. అభయమిచ్చాడు, ఆశ్రితవత్సలుడు. అందరి పూజలందుకొని అంతర్ధానమయ్యాడు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

దశరథుడు పుత్రకామేష్టి చేసినప్పుడు యజ్ఞకుండంనుంచి గొప్ప తేజస్సుతో కూడిన ఒక దివ్యపురుషుడు ఆవిర్భవించాడు. అతడు బ్రహ్మ పంపగా వచ్చినవాడు. చేతిలో బంగారుపాత్ర, వెండిమూతతో. అందులో దివ్యపాయసముంది. దాన్ని దశరథున కందించాడు. 'ఈ పాయసం సంపదలనిస్తుంది ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. అన్నిటినీ మించి సంతానాన్ని ప్రసాదిస్తుం'దన్నాడు. పేదవానికి పెన్నిధి దొరికినట్లైంది దశరథునికి. అతని మనస్సు ఆనందతాండవం చేసింది.

దివ్యపాయసాన్ని తన భార్యలైన కౌసల్య, సుమిత్ర, కైకేయిలకు పంచాడు. సంవత్సరకాలం గడిచింది. చైత్రశుద్ధనవమినాడు కౌసల్యకు శ్రీరాముడు జన్మించాడు. దశమినాడు కైకేయికి భరతుడు, సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులు జన్మించారు. ఈ వార్త విన్న అయోధ్య ఆనందసముద్రమైంది.

రామలక్ష్మణభరతశత్రుఘ్నులు శుక్లపక్ష చంద్రునిలా పెరుగుతున్నారు. వేదశాస్త్రాలనభ్యసించారు. ధనుర్విద్యలో నైపుణ్యం సంపాదించారు. విజ్ఞానఖనులయ్యారు. సద్గుణాలకు ఆటపట్టైనారు. ఉత్తమవిద్యార్థులకు ఉండవలసిన లక్షణాలివి. రాముడు ఎప్పుడూ తల్లిదండ్రుల సేవలో నిమగ్నమయ్యేవాడు. చిన్ననాటినుంచీ అన్నసేవే మిన్నగా భావించేవాడు లక్ష్మణుడు. ఇతడు రాముడికి బహిఃప్రాణం. భరతశత్రుఘ్నులు అన్యోన్య ప్రేమాభిమానాలు కలవారు.

కాలచక్రం తిరుగుతున్నది. ఒకనాడు దశరథుడు తన మంత్రులు పురోహితులు మొదలైనవారితో సమావేశమయ్యాడు. తన కుమారుల వివాహ ప్రస్తావన చేస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో అక్కడ అడుగుపెట్టాడు మహాతేజశ్శాలియైన విశ్వామిత్ర మహర్షి. సృష్టికి ప్రతిసృష్టి చేయగల సమర్థుడతడు. దశరథుడు ఎదురేగి సాదరంగా స్వాగతించాడు. **అతిథిదేవోభవ – అతిథి మనకు దేవుడితో సమానం.** ఇది తెలిసిన దశరథుడు విశ్వామిత్రునకు సముచితరీతిన మర్యాదలు గావించాడు. వినయపూర్వకంగా చేతులు జోడించి విశ్వామిత్రుని రాకకు కారణాన్ని అడిగాడు. తనపైన కార్యభారం పెడితే నెరవేరుస్తానన్నాడు. దశరథుని వినయానికి మురిసిపోయాడు విశ్వామిత్రుడు. 'వశిష్ఠుని ఉపదేశాలను పొందినవాడివి. నీవు ఇలాగే ప్రవర్తిస్తా'వని మెచ్చుకొన్నాడు.

విశ్వామిత్రుడు దశరథునితో తాను వచ్చిన పనిని తెలుపుతానన్నాడు. దాన్ని ఆచరించమన్నాడు. ఆడినమాట తప్పవద్దన్నాడు. అసలు విషయం చెప్పాడు. 'ఓ రాజా! నేనొక యజ్ఞాన్ని సంకల్పించాను. కాని మారీచ, సుబాహులనే రాక్షసులు ఆ యజ్ఞానికి విఘ్నాలు కలిగిస్తున్నారు. వారిని కోపించడానికి, శపించడానికి శక్తి ఉన్నా యజ్ఞదీక్షలో ఉన్నాను కాబట్టి అది నాకు తగనిపని ఉచితానుచితాలు గ్రహించకుండా శక్తిని దుర్వినియోగపరచగూడదు. అందుకు సత్యపరాక్రముడు, శూరుడు అయిన శ్రీరాముణ్ణి పదిదినాలపాటు నా వెంట పంపు. అతడే ఆ రాక్షసులను చంపగల సమర్థుడు. నా వెంట వచ్చి యాగసంరక్షణ చేయడంవల్ల శ్రీరాముడికి అనేక శ్రేయస్సులు కలుగుతాయి. శ్రీరాముడి పరాక్రమమెలాంటిదో నాకు బాగా తెలుసు. నాకే కాదు వశిష్ఠులవారికి, వామదేవాది మహర్షులకూ తెలుసు. వారంతా అంగీకరించిన తర్వాతే రాముణ్ణి నాతో పంపమ'ని అన్నాడు.

ఈ మాటలు వింటూంటే దశరథుని గుండెలో రాయిపడ్డది. చేతులు జోడించి 'మహర్షీ! నా రాముడు పదహారేండ్లు కూడా నిండనివాడు. ధనుర్విద్య ఇంకా పూర్తికాలేదు. యుద్ధవిషయాలతో తగిన పరిచయం లేనివాడు. కనుక దయచేసి నా రాముణ్ణి కోరకండి. అంతగా కావాలంటే ధనుర్బాణపాణినై నేను మీ వెంటవస్తాను. మీ యాగాన్ని సంరక్షించే బాధ్యత నాది. ఇవన్నీ ఎట్లా ఉన్నా రాముణ్ణి వదలి నేను ఒక్క క్షణమైనా బతకలేను. మా నోముల పంట రాముడు. ఇంతకూ ఆ రాక్షసులు ఎవరి అండతో ఈ దుండగానికి ఒడిగట్టార'ని అడిగాడు.

విశ్వామిత్రుడు సమాధానమిస్తూ 'పౌలస్త్యవంశజుడైన విశ్రవసుడనే ముని కుమారుడు రావణాసురుడు. అతడు కుబేరుని సోదరుడు. అనేక రాక్షసబలాలు కలవాడు. బ్రహ్మ ఇచ్చిన అసాధారణ వరాలవల్ల అతని గర్వం ఇబ్బడిముబ్బడైంది. ముల్లోకాలనూ అల్లకల్లోలం చేస్తున్నాడు. అటువంటివాడికి యజ్ఞం భగ్నంచేయడమనేది అల్పంగా తోస్తున్నది. అందుకే ఇటువంటి పనులలో పాల్గొనడు. మారీచ, సుబాహులు ఇతనిచేత ప్రేరితులై యజ్ఞాలకు విఘ్నాలను కలిగిస్తున్నార'నగానే

దశరథుడు మరింత భయపడ్డాడు. 'యుద్ధంలో యమునితో సమానులైనవారి నెదుర్కోవడానికి నా చిన్నిపాపణ్ణి పంపను. నేను కూడా యుద్ధవిషయంలో అశక్తుడ'నని పలికాడు.

దశరథుని మాటలకు విశ్వామిత్రుడు అగ్గిమీద గుగ్గిలమైనాడు. 'ఇచ్చినమాట తప్పటం మీ ఇంటావంటా లేదు. నీవందుకు సిద్ధపడితే రిక్తహస్తాలతో తిరిగి వెళతాను. మీరు సుఖంగా ఉండండి' అన్నాడు విశ్వామిత్రుడు. పరిస్థితి తీవ్రతను గమనించాడు వశిష్ఠమహర్షి. ఇచ్చిన మాట నిలబెట్టుకోమని దశరథునికి హితవు పలికాడు. మాట నిలబెట్టుకోనివానికి ధర్మకార్యాలనాచరించిన ఫలం నశిస్తుందని హెచ్చరించాడు. వివిధాస్త్రప్రయోగదక్షుడైన విశ్వామిత్రుడి వెంట రాముణ్ణి పంపడంలో సంశయానికి తావుండగూడదన్నాడు. రాముణ్ణి పంపితే మేలు జరుగుతుందని సుతిమెత్తగా సూచించాడు.

వశిష్ఠుని హితవచనాలకు దశరథుడు తలొగ్గాడు. రామలక్ష్మణులను పిలిపించాడు. కౌసల్యతో కలిసి ఆశీర్వదించాడు. ప్రశాంతమైన మనస్సుతో విశ్వామిత్రుడికి అప్పగించాడు.

విశ్వామిత్రుని వెంట ధనుర్ధారి అయి రాముడు నడుస్తున్నాడు. లక్ష్మణుడు అనుసరిస్తున్నాడు. సరయూనదీ తీరం వెంబడి చాలా దూరం ప్రయాణించారు ముగ్గురూ. తరవాత రామలక్ష్మణులకు 'బల' 'అతిబల' విద్యలనుపదేశించాడు విశ్వామిత్ర మహర్షి. వీటి ప్రభావంవల్ల అలసట, ఆకలిదప్పులు ఉండవు. రూపకాంతులు తగ్గవు. నిద్రలో ఉన్నా, ఏమరుపాటుతో ఉన్నా రాక్షసులేమీ చేయలేరు. ముల్లోకాల్లో ఎదురొడ్డి నిలచేవారుండరు.





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

రాముడు గురుసేవలో నిమగ్నుడయ్యాడు. విశ్వామిత్రుని పాదాలొత్తాడు. సేవలు చేశాడు. **గురుసేవ విశేష ఫలితాన్నిస్తుంది.** సరయూనదీ తీరంలోనే వాళ్ళు ఆ రాత్రి నిద్రించారు.

తెల్లవారుతోంది. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు మేల్కొలుపు పలికాడు.

**కౌసల్యా సుప్రజారామ పూర్వాసంధ్యా ప్రవర్తతే**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్.**

'కౌసల్యాదేవి సత్సంతానమైన ఓ రామా! తూర్పున ఉషఃకాంతులు ప్రసరిస్తున్నాయి. నిద్రలేచి నిత్యకర్మలను ఆచరించ'మన్నాడు. గురువాక్యం శిరసావహించాడు రాముడు, లక్ష్మణునితో కలసి. మళ్ళీ ప్రయాణం కొనసాగింది. సరయూగంగానదుల సంగమ ప్రదేశాన్ని చేరుకున్నారు. అక్కడి విశేషాలను గురుముఖతః తెలుసుకున్నారు. **జ్ఞానాన్ని పొందడంలో నిరంతరం అప్రమత్తులై ఉండడం ఉత్తమ విద్యార్థుల లక్షణం.**

ప్రయాణం సాగుతున్నది. 'మలద', 'కరూశ' అనే జనపదాలకు చేరుకున్నారు. ఇంద్రుని అనుగ్రహ విశేషంచేత ఈ ప్రాంతాలు ధనధాన్యాలసమృద్ధితో ఉండేవి. కాని 'తాటక' అనే యక్షిణి ఈ ప్రాంతాలకు వచ్చి విధ్వంసాన్ని సృష్టించింది. పుట్టుకతోనే వేయి ఏనుగుల బలం కలిగిన ఈమెను ఎవరూ ఎదిరించలేకపోతున్నారు. 'అగ్నికి ఆజ్యంతోడైనట్లు' ఈమెతోబాటు ఈమె కుమారుడు 'మారీచుడు' విరుచుకపడుతూ ఈ జనపదాలను అతలాకుతలం చేస్తున్నాడు. దుష్టురాలైన తాటకను వధించమని రాముడితో అన్నాడు విశ్వామిత్రుడు. ఒక్కక్షణం రాముడు మౌనముద్ర దాల్చాడు. రాముడి భావం గ్రహించాడు విశ్వామిత్రుడు. 'స్త్రీని ఎలా చంపాలనే సంశయం వద్దు. అధర్మపరాయణ అయిన తాటకను చంపితే దోషం రాద'ని కర్తవ్యముపదేశించాడు. వెంటనే రాముడు దృఢనిశ్చయుడై అంజలి ఘటించాడు. 'మీరు చెప్పినట్లుగా నడచుకొమ్మని మా నాన్నగారు నన్ను ఆదేశించారు. వారి ఆజ్ఞ నాకు శిరోధార్య'మని పితృవాక్య పరిపాలనాసక్తిని చాటాడు. అలాగే గురువు ఆజ్ఞను పాలించడం శిష్యునిగా తన కర్తవ్యమని భావించి తాటకవధకు ఉద్యుక్తుడైనాడు.

వికృతాకారంతో విరుచుకుపడుతున్న తాటక చేతులను తన నిశితబాణాలతో ఖండించాడు రాముడు. అయినా ఆవేశంతో మీదికి వస్తున్న తాటక ముక్కు చెవులను కోసివేశాడు లక్ష్మణుడు. తాటక ఆవేశం రెండింతలైంది. తాను కనబడకుండా వాళ్ళపై రాళ్ళ వానకురిపిస్తున్నది. ఇదంతా గమనిస్తున్నాడు విశ్వామిత్రుడు. సంధ్యాకాలం సమీపిస్తున్నది. ఈ లోపే తాటకను పరలోకానికి పంపమని పురమాయించాడు. అసురసంధ్యాకాలంలో రాక్షసులు మహాబలాన్ని పొందుతారు. ఎదుర్కోవడం కష్టం. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రాముడు శబ్దవేధి విద్యను ప్రదర్శిస్తూ బాణప్రయోగం చేశాడు. క్షణకాలంలో తాటక నేలపైబడి ప్రాణాలను వదిలింది. తాటకవధతో దుష్టసంహారానికి పూనుకొన్నాడు రాముడు. ఇంద్రాది దేవతలు రాముణ్ణి స్తుతించారు. సంతుష్టుడైన విశ్వామిత్ర మహర్షి రామునకు ఎన్నో దివ్యాస్త్రాలను అనుగ్రహించాడు. **గురువు అనుగ్రహిస్తే ఇవ్వలేనిదేమిటి? శిష్యుడు పొందలేనిదేమిటి?**

రామలక్ష్మణసహితుడయి విశ్వామిత్రుడు 'సిద్ధాశ్రమం' చేరుకున్నాడు. అదే అతని యజ్ఞభూమి. రామలక్ష్మణులు వినయంగా చేతులు జోడించి గురువుగారిని యజ్ఞదీక్షను స్వీకరించమని ప్రార్థించారు. మన్నించాడు మహర్షి. యజ్ఞదీక్షితుడయ్యాడు. మరునాడే యజ్ఞం ప్రారంభమైంది. ఆరు రోజులపాటు సాగే ఈ యజ్ఞవిషయంలో అత్యంత జాగరూకులై ఉండమని రామలక్ష్మణులకు సూచించారు మునులు. ఐదురోజులైంది. కంటిమీద కునుకులేకుండా యజ్ఞాన్ని కాపాడుతున్నారు రామలక్ష్మణులు. కర్తవ్యాన్ని నెరవేర్చడంలో ఇంత నిష్ఠ ఉండాలి. చివరిరోజు ఉన్నట్టుండి ఒక్కసారిగా యజ్ఞకుండంనుండి జ్వాలలు ఎగసిపడ్డాయి. ఇది రాక్షసుల రాకకు సూచన.

మారీచ, సుబాహులు అనుచరులతో వచ్చారు. యజ్ఞవేదిక పరిసరాలు రక్తవర్షంతో తడిసి ముద్దయ్యాయి. రాముడు 'శీతేషువు' అన్న మానవాస్త్రాన్ని మారీచుడిపైకి ప్రయోగించాడు. దాని దెబ్బకు మారీచుడు నూరు యోజనాల దూరం ఎగిరి సముద్రంలో పడిపోయాడు. స్పృహకోల్పోయి గిరగిరా తిరుగుతూ కొట్టుకుపోతున్నాడు. మరు నిమిషంలో 'ఆగ్నేయాస్త్రం'తో సుబాహుని వక్షస్థలాన్ని వ్రక్కలు చేశాడు. 'వాయవ్యాస్త్రం'తో మిగతా రాక్షసుల పనిపట్టాడు. రాక్షసబాధ తొలగింది. యజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది. విశ్వామిత్రుడు సంతోషించాడు. **సమర్థులైన శిష్యులను చూసి ఏ గురువు సంతోషించడు?**

మరునాడు ఉదయాన్నే రామలక్ష్మణులు విశ్వామిత్రుని ఎదుట వినయంతో నిలిచారు. ఇంకా ఏమి చేయాలో ఆజ్ఞాపించమన్నారు. విశ్వామిత్రుడు 'ఓ రామా! మిథిలానగర ప్రభువు, పరమధార్మికుడైన జనక మహారాజు ఒక యజ్ఞాన్ని చేయ సంకల్పించాడు. మనం అక్కడకి వెళదాం. అక్కడ అద్భుతమైన ఒక మహాధనుస్సుంది. నీవు చూడవచ్చునన్నాడు. సంసిద్ధులయ్యారు రామలక్ష్మణులు. మునిననుసరిస్తూ మిథిలవైపుగా ముందుకు సాగుతున్నారు.

అడుగులతోపాటు మాటలూ సాగుతున్నాయి. రాముని కోరిక మేరకు తమ వంశ పుట్టుపూర్వోత్తరాలను వివరించాడు విశ్వామిత్రుడు. ఆ రాత్రి శోణానదీ తీరంలో విశ్రమించారు. మరునాడు పవిత్ర గంగానదిని దర్శించారు. స్నానాలాచరించి విధ్యుక్తధర్మాలను నెరవేర్చారు. గంగావృత్తాంతాన్ని వినగోరుతున్నానని వినయంగా అడిగాడు రాముడు. వినిపించాడు విశ్వామిత్రుడు. **జిజ్ఞాసువులైన శిష్యులు, విజ్ఞాని అయిన గురువు – ఇక జ్ఞాన ప్రసారానికి అడ్డుంటుందా?**

పాతాళంలో బూడిదకుప్పలై పడివున్న తన పితరులైన సగరపుత్రులకు ఉత్తమగతులు కల్పించడానికి సంకల్పించాడు భగీరథుడు. అందుకు ఒకటే మార్గం ఉంది. సురగంగను వారి బూడిదకుప్పలపై ప్రవహింపజేయడం. కాని ఆకాశంలోని గంగను పాతాళానికి దింపడం ఒక పట్టాన జరిగే పనేనా? అయినా దృఢసంకల్పానికి అసాధ్యమైనది లేదు. భగీరథుడు తీవ్రమైన తపస్సుచేశాడు. బ్రహ్మను, శివుణ్ణి మెప్పించాడు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సంకల్పంనుంచి పక్కకు తప్పుకోలేదు. గంగను పాతాళందాకా తీసుకువెళ్ళడంలో సఫల మనోరథుడయ్యాడు. **అందుకే పట్టుదల విషయంలో 'భగీరథ ప్రయత్నం' అన్న జాతీయం ఏర్పడింది.** భగీరథుని వంశంలోని వాడే రాముడు.



గంగావతరణాన్ని గురించి విశ్వామిత్రుడు రాముడికి చెప్పడంలో ఒక ఆంతర్యముంది. తన పూర్వికులు ఎంతగొప్పవారో తెలుసుకుని దానికనుగుణంగా నడవడం. పితరులపట్ల ఎంత భక్తిప్రపత్తులుండాలో తెలపడం. పట్టిన పని ఫలవంతమయేవరకు పట్టుదల ఎలా ఉండాలో చెప్పడం. అయితే ఇవన్నీ నేరుగా చెప్పలేదు విశ్వామిత్రుడు. అయినా ఆంతర్యాన్ని గ్రహించాడు రాముడు. ఇదే ఉత్తమ గురుశిష్యుల వ్యవహారం.

మిథిలానగర సమీపానికి చేరుకున్నారు విశ్వామిత్ర రామలక్ష్మణులు. అక్కడ ఒక ఆశ్రమాన్ని చూశాడు రాముడు. అది పాతదైనా అందంగా అగుపిస్తున్నది. కాని జనసంచారమే లేదు. 'ఏమిటీ చిత్ర'మని అడిగాడు రాముడు. అది గౌతమ మహర్షి ఆశ్రమమని, ఆ కథనంతా వివరించాడు విశ్వామిత్రుడు. 'మహాతపస్సంపన్నుడైన గౌతమ మహర్షి తన భార్య అయిన అహల్యతో ఈ ఆశ్రమంలో ఉండేవాడు. ఒకానొక సందర్భంలో అహల్య అపరాధం చేసిందని భావించి ఆగ్రహోదగ్రుడయాడు గౌతముడు.



కొన్ని వేల సంవత్సరాలు అన్నపానాదులు లేక వాయువునే ఆహారంగా తీసుకుంటూ ఈ ఆశ్రమంలోనే బూడిదలో పడి ఉండమని ఆమెను శపించాడు. ఎవ్వరికీ కనబడకుండా ఉంటావన్నాడు. రాముని రాకతో శాపవిముక్తి కలిగి నిజరూపాన్ని పొందుతా'వన్నాడు. 'రామా! గౌతమాశ్రమంలో కాలుమోపి అహల్యకు శాపవిముక్తి కలిగించు' అని విశ్వామిత్రుడు ఆజ్ఞాపించాడు.

చుట్టూ బూడిద ఆవరించి ఉండి కఠోరదీక్షలో ఉన్న అహల్య పొగకమ్ముకొన్న అగ్ని తేజస్సులా ఉంది. ఆ మహాత్మురాలిని రాముడు చూశాడు. రాముడి దర్శనంతో ఆమెకు శాపవిముక్తి కలిగింది. అహల్యాగౌతములు రాముణ్ణి యథావిధిగా గౌరవించారు. వారి సత్కారాలందుకొని రాముడు విశ్వామిత్రుని వెంట లక్ష్మణసహితుడై మిథిలా నగరానికి బయలుదేరాడు.

మిథిలానగరంలో ప్రభువైన జనకమహారాజు వీరిని సముచితంగా సమాదరించాడు. మిథిలలో అహల్యా గౌతముల పెద్ద కుమారుడైన

శతానందుడు రామదర్శనం చేసుకున్నాడు. తన తల్లినుద్ధరించినందులకు కృతజ్ఞతాంజలులు సమర్పించాడు. మహాతపశ్శాలియైన విశ్వామిత్రుని అనుగ్రహం పొందగలగడం చాలా విశేషమని రాముణ్ణి మెచ్చుకున్నాడు. విశ్వామిత్ర మహర్షి అసాధారణ శక్తిసామర్థ్యాలను వివరించాడు శతానందుడు.

మరునాడు ప్రాతఃకాలంలో జనకుడు విశ్వామిత్ర రామలక్ష్మణులను ఆహ్వానించాడు. కర్తవ్యోపదేశం చేయవలసిందిగా విశ్వామిత్రుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు ప్రత్యుత్తరమిస్తూ విశ్వామిత్రుడు 'వీరు దశరథమహారాజు కుమారులు. జగత్ప్రసిద్ధులైన వీరులు. మీ దగ్గర ఉన్న ధనుస్సును చూడాలనుకుంటున్నారు. దాన్ని చూపించండి. శుభం జరుగుతుంది. వాళ్ళ ముచ్చటా తీరుతుం'దన్నాడు. అప్పుడు జనకుడు తనదగ్గరున్న 'శివధనుస్సు' చరిత్రను వివరించాడు. యాగం కోసం భూమిని దున్నుతుండగా ఒక పాప దొరికిందని, నాగటిచాలున దొరికినందువల్ల ఈమెకు 'సీత' అనే పేరు వచ్చిందనీ చెపుతూ ఆమెను గొప్ప పరాక్రమవంతుడికివ్వాలన్న తన అభిమతాన్ని వెలిబుచ్చాడు. శివధనుస్సును ఎక్కుపెట్టగలవాడే సీతకు తగిన భర్త అన్నాడు. గతంలో ఎందరో రాజులు వచ్చి శివధనుస్సు ఎక్కుపెట్టడానికి విఫలప్రయత్నం చేశారని, ఎక్కుపెట్టడం మాట ఎలా ఉన్నా కనీసం కదలించలేకపోయారన్నాడు.

ఇదంతా విని శివధనుస్సును తెప్పించమన్నాడు విశ్వామిత్రుడు. సరేనన్నాడు జనకుడు. బలిష్ఠులు, దీర్ఘకాయులైన ఐదువేల మంది అతికష్టం మీద శివధనుస్సుతో కూడిన పేటికను తీసుకువచ్చారు.

విశ్వామిత్ర మహర్షి అనుమతితో ధనుస్సు మధ్యభాగాన్ని అవలీలగా పట్టుకున్నాడు రాముడు. ధనుర్విద్యలో ఆరితేరిన రాముని చేయి సోకగానే ఆ ధనుస్సు వంగింది. వింటినారిని సంధించాడు. వేలకొలది సదస్యులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. అల్లెతాడును ఆకర్ణాంతంగా లాగాడు రాముడు. పిడుగుపాటులా భయంకరశబ్దాన్ని చేస్తూ విల్లు ఫెళ్ళున విరిగింది. విశ్వామిత్రుడు, జనకుడు, రామలక్ష్మణులు తప్ప మిగతావారంతా మూర్ఛపోయారు.

ఇచ్చినమాట ప్రకారం జనకుడు సీతారాముల వివాహం జరపడానికి సంసిద్ధుడయాడు. దశరథ మహారాజుకు వర్తమానం పంపాడు. అయోధ్యనుంచి అందరూ తరలివచ్చారు. జనకుడు తన కుమార్తెలైన సీతను, ఊర్మిళలను రామలక్ష్మణులకు, తన తమ్ముడు కుశధ్వజుని కుమార్తెలైన మాండవిని, శ్రుతకీర్తిని భరతశత్రుఘ్నులకు ఇచ్చి వివాహం జరిపించాడు. అంగరంగవైభవంగా జరిగాయి  కల్యాణాలు.

మరునాడు విశ్వామిత్ర మహర్షి కొత్త దంపతులను ఆశీర్వదించి, దశరథజనకమహారాజులను వీడ్కొని హిమాలయపర్వతానికి వెళ్ళాడు. తరవాత బంధుమిత్ర సమేతంగా దశరథుడు అయోధ్యకు బయలుదేరాడు.

దారిలో వీళ్ళకు పరశురాముడు ఎదురుగా వచ్చాడు. అతడు ప్రళయకాల రుద్రుడిలా ఉన్నాడు. గండ్రగొడ్డలిని, ధనుర్బాణాలను ధరించాడు. ప్రజ్వరిల్లే అగ్నిలా భయంకరంగా ఉన్నాడు. క్షత్రియులంటే ఇతనికి  సరిపడదు.  పూర్వం  క్షత్రియుడైన కార్తవీర్యార్జునుడు ఇతని తండ్రి అయిన జమదగ్నిని చంపాడు. అప్పటి నుండి క్షత్రియనిర్మూలనానికి కంకణం  కట్టుకున్నాడు.  ఇరవై  ఒక్కసార్లు భూప్రదక్షిణం చేసి ఎంతోమంది క్షత్రియులను తన గండ్రగొడ్డలికి బలిచేశాడు.

పరశురాముడు శ్రీరామునితో తనదగ్గరున్న వైష్ణవ ధనుస్సునెక్కుపెట్టమని సవాలు విసిరాడు. సరేనని రాఘవుడు అవలీలగా ఎక్కుపెట్టాడు. ఓటమినంగీకరించిన పరశురాముడు తక్షణమే మహేంద్రపర్వతానికి వెళ్ళిపోయాడు

దశరథుడు సపరివారంగా అయోధ్యకు చేరుకున్నాడు. భరతుడు శత్రుఘ్నునితో మేనమామ వెంట తాతగారింటికి వెళ్ళాడు. రామలక్ష్మణులు తల్లిదండ్రుల సేవలో, గురువుల సేవలో తరిస్తూ అయోధ్యలోనే ఉండిపోయారు.

# అయోధ్యా కాండ

దశరథునికి పుత్రులమీద ఎంతో ప్రేమ. వారిని తన శరీరంనుండి పుట్టిన నాలుగు చేతులలాగ భావించాడు. ఈ నలుగురు కుమారులలో భరత, శత్రుఘ్నులు దేశాంతరంలో ఉండడంవల్ల బెంగపెట్టుకున్నాడు. వాళ్ళను మళ్ళీమళ్ళీ తలచుకుంటున్నాడు. దశరథునికి శ్రీరామునిమీద మక్కువ ఎక్కువ. దానికి కారణం శ్రీరాముడు సద్గుణరాశి కావడమే. రూపంలోనూ గుణంలోనూ శ్రేష్ఠుడు. మహావీరుడు. మృదువుగా మాట్లాడతాడు. శరణన్నవారిని కాపాడతాడు. కోపం, గర్వం లేనివాడు. సత్యం పలికేవాడు. పరుల సంపదను ఆశించనివాడు. దీనులను ఆదుకొనేవాడు. కాలాన్ని వృథాచేయకుండా జ్ఞానులతో, సజ్జనులతో వివిధ విషయాలను చర్చించేవాడు. వినయశీలి. తల్లిదండ్రులపట్ల, గురువులపట్ల నిశ్చలభక్తి కలవాడు. సోమరితనం, ఏమరుపాటు లేనివాడు, కళలలో ఆరితేరినవాడు, అసూయ, మాత్సర్యం లేనివాడు. ప్రజలపట్ల వాత్సల్యం కలవాడు... ఇన్ని మంచిగుణాలకు పాదైన శ్రీరాముడంటే తల్లిదండ్రులకే కాదు, ప్రజలందరికీ పరమప్రీతి.

సకల గుణాభిరాముడైన శ్రీరాముడు తమకు ప్రభువు కావాలని ప్రజల కోరిక – దీనికి తోడు 'నేను జీవించి ఉన్నప్పుడే శ్రీరాముడు రాజైతే ఎంత బాగుంటుంది? నేనెంతగా సంతోషిస్తానో?' అని ఉవ్విళ్ళూరుతున్నాడు దశరథుడు. మంత్రులతో ఆలోచించి శ్రీరాముణ్ణి యువరాజును చేయడానికి నిశ్చయించుకున్నాడు. రాజ్యంలోని ప్రముఖులను, జానపదులను, సామంతరాజులను, ప్రజలను పిలిపించాడు. శ్రీరాముడి యువరాజ పట్టాభిషేక విషయాన్ని వెల్లడించాడు. ఇది అందరకు నచ్చినట్లైతేనే అనుమతినివ్వమన్నాడు. దీనికన్నా ప్రజలకు మేలుకలిగించేది ఏదైనా ఉన్నా ఆలోచించి చెప్పమన్నాడు. **ప్రజానురంజకపాలన అంటే ఇదే.** సభలోనివారంతా శ్రీరామపట్టాభిషేకాన్నే సమర్థిస్తూ హర్షధ్వానాలు చేశారు.

రాజాజ్ఞమేరకు వశిష్ఠుడు మంత్రులను, అధికారులను యౌవరాజ్యపట్టాభిషేకమహోత్సవానికి ఏర్పాట్లను చేయవలసిందని ఆదేశించాడు. దశరథుడు శ్రీరాముణ్ణి పిలిపించాడు. శ్రీరాముడు వచ్చి తండ్రికి పాదాభివందనం చేశాడు. దశరథుడు శ్రీరాముణ్ణి అక్కున జేర్చుకున్నాడు. బంగారు సింహాసనంమీద కూర్చోబెట్టాడు. చిరునవ్వులు చిందిస్తూ 'రామా! నీ సుగుణాలతో ప్రజలను మెప్పించావు. కనుక నీవు యువరాజ పట్టాభిషేకం చేసుకోవాలి. నీ బాధ్యత పెరుగుతున్నది. మరింత వినయవంతుడివి కావాలి. జితేంద్రియుడివి కావాలి...' అంటూ రాజధర్మాలను నూరిపోశాడు. తండ్రివద్ద సెలవుతీసుకొని తల్లి అయిన కౌసల్య దగ్గరికి వచ్చాడు శ్రీరాముడు. ఆమె ఆశీస్సులందుకున్నాడు. వశిష్ఠుని ఆదేశం మేరకు పట్టాభిషేకానికి అనువుగా సీతారాములు ఉపవాసదీక్షను తీసుకొన్నారు.

శ్రీరామపట్టాభిషేకమహోత్సవంకోసం అయోధ్య తనను తాను అలంకరించుకుంది. నగరమంతా ఆనందశోభ తాండవిస్తున్నది. ఇది చూసిన మంథర కళ్ళలో నిప్పులు పోసుకున్నది. కైకేయి అత్తవారింటికి వచ్చినప్పుడు వెంటవచ్చిన అరణపుదాసి మంథర. పరుగు పరుగున కైకేయి దగ్గరకి వెళ్ళి పట్టాభిషేక విషయం చెప్పింది. కైకేయి చాలా ఆనందించి, వార్త చెప్పినందుకు మంథరకు విలువైన బహుమానాన్నందించింది. నిశ్చేష్టురాలైంది మంథర. దుఃఖించవలసిన సమయంలో ఎందుకు సంతోషిస్తున్నావని నిలదీసింది కైకేయిని. 'నాకు రాముడు, భరతుడు ఇద్దరూ సమానమే. రాముడు పట్టాభిషిక్తుడు అవుతున్నాడంటే అంతకన్నా నాకు ఆనందమేముంటుం'దన్నది కైకేయి.

కైకేయి మాటలు విని ముక్కున వేలేసుకుంది మంథర. 'రాముడు రాజైతే కౌసల్య రాజమాత అవుతుంది. అప్పుడు మాతోపాటు నీవు కూడా ఆమెకు దాసివవుతావు. రామునికి నీ కొడుకు దాస్యం చేయాల్సివస్తుంది. రాముడి సంతానానికే తరువాతి కాలంలో రాజ్యాధికారం వస్తుంది. కాని భరతుని సంతానానికి రావడం శూన్యం. కనుక భరతునికి రాజ్యాధికారం

దక్కేటట్లు, రాముడు అడవుల పాలయ్యేటట్లు చూడ'మని దుర్బోధ చేసింది. కైకేయి మనసు మారింది. **చెప్పుడు మాటలు చేటుకు కారణం.** తగిన ఉపాయాన్ని చెప్పమని మంథరను కోరింది కైకేయి. గతంలో దశరథుడు ఇచ్చిన రెండు వరాలను ఇప్పుడుపయోగించుకొమ్మని సూచించింది మంథర. ఈ సూచన మేరకు దశరథునివల్ల వరాలు పొందడానికి కోపగృహంలోకి ప్రవేశించింది కైకేయి.

దశరథుడు శ్రీరామ పట్టాభిషేక వార్తను తెలపడానికి కైకేయి దగ్గరికి వచ్చాడు. కటికనేలమీద ఉన్నది కైకేయి. తీవ్రమైన అలకతో ఉన్నది. దశరథుడు ఓదార్చడానికి పూనుకున్నాడు. కాని అతని ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఏం చేయాలో పాలుపోలేదు. విషయమడిగాడు. అదే అదనుగా భావించింది కైకేయి. 'నాకొక కోరిక ఉంది. దాన్ని మీరే తీర్చాలి. అలా తీరుస్తానని మాట ఇవ్వా'లన్నది. ప్రాణానికి ప్రాణమైన శ్రీరాముడిమీద ఒట్టు పెట్టి సరేనన్నాడు దశరథుడు. ఇంకేం మనసులోని మాటను చెప్పేసింది. గతంలో మీరిచ్చిన రెండు వరాలను ఇప్పుడు కోరుకుంటున్నాను. శ్రీరాముడికోసం ఏర్పాటుచేసిన సన్నాహాలతో భరతుడికి పట్టాభిషేకం చేయాలి. శ్రీరాముడు నారచీరలు, జింకచర్మం ధరించి, జటాధారి అయి దండకారణ్యానికి వెళ్ళి తాపసవృత్తిలో పదునాల్గు సంవత్సరాలు ఉండాలి. శ్రీరాముడు ఇప్పుడే, నేను చూస్తుండగానే బయలుదేరాలి' అని కోరింది.

కైకేయి మాటలకు స్పృహకోల్పోయాడు దశరథుడు. కొంతసేపటికి తేరుకున్నాడు. తన్నుకొని వస్తున్న దుఃఖంతో 'కైకా! రాముడు నీకేం అపకారం చేశాడు? భరతుడికన్నా ఎక్కువగా నిన్ను సేవించాడు. అటువంటివాణ్ణి అడవుల పాల్జేయమని అడగడానికి నీకు నోరెలా వచ్చింది? నా రాముణ్ణి విడిచి నేను ఒక్క క్షణమైనా బతకలేను. చేతులు జోడిస్తున్నా. నీ పాదాలు పట్టుకొంటా... రాముణ్ణి మాత్రం నాకు దూరం చేయవద్ద'ని బతిమాలాడు. **కఠినశిల కన్నీటికి కరుగుతుందా?** కైకేయి మారలేదు.

శ్రీరాముణ్ణి తోడ్కొని రావలసిందిగా కైకేయి సుమంత్రుణ్ణి ఆజ్ఞాపించింది. రాజాజ్ఞ కావాలన్నాడు సుమంత్రుడు. 'శ్రీరాముణ్ణి చూడాలని ఉంది వెంటనే తీసుకురమ్మ'న్నాడు దశరథుడు. రాజాజ్ఞను పాటించాడు సుమంత్రుడు. శ్రీరాముడు వచ్చి దశరథుడికి, కైకేయికి పాదాభివందనాలు చేశాడు. దశరథునికి మాట రావడం లేదు కన్నీళ్ళు తప్ప. తండ్రి బాధకు కారణమేమిటో తెలియక సతమతమవుతున్నాడు దాశరథి. కైకేయిని అడిగాడు. 'గతంలో నాకిచ్చిన రెండు వరాలను అడిగాను. నిన్ను దృష్టిలో ఉంచుకొని వాటిని ఉల్లంఘించేందుకు చూస్తున్నారు. వాటిని నువ్వు పాటిస్తానని ప్రమాణంచేస్తే చెపుతాను' అన్నది కైకేయి.

రాముడు క్షణం కూడా ఆలోచించలేదు 'నా తండ్రే నాకు గురువు, పాలకుడు, హితుడు. ఆయన ఆదేశించాలే కాని విషాన్ని తాగడానికైనా, సముద్రంలో దూకడానికైనా సిద్ధమే. తండ్రి గారి కోరిక ఏమిటో చెపితే తప్పక పాటిస్తాను. రాముడు ఆడినమాట తప్ప'డని పలికాడు. శ్రీరాముని పితృభక్తి, సత్యానురక్తి అలాంటివి.

కైకేయి రెండు వరాలను గురించి చెప్పింది. రాముడి ముఖంలో ఎలాంటి మార్పులేదు. **సంతోషాలకు పొంగకపోవడం, బాధలకు కుంగకపోవడం స్థితప్రజ్ఞుని లక్షణం.** 'అమ్మా! నీవు చెప్పినట్లే చేస్తా. భరతుడంటే నాకు ప్రాణం. అతని పట్టాభిషేకాన్ని గూర్చి నాన్నగారు నాకు చెపితే కాదంటానా? ఆయన మాటలను పాటించకుండా ఉండగలనా? నాకు రాజ్యకాంక్ష లేదు. తండ్రికి సేవచేయడం, ఆయన ఆజ్ఞలను పాటించడంకన్నా మించిన ధర్మాచరణం మానవులకు ఇంకొకటి లేనేలేదు. నాన్నగారు నన్ను స్వయంగా ఆదేశించకున్నా మీరు చెప్పారు కదా! అది చాలు. నేనిప్పుడే దండకారణ్యానికి బయలుదేరుతా'నన్నాడు శ్రీరాముడు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

శ్రీరాముని మాటలు విన్న దశరథుడు శోకభారంతో స్పృహకోల్పోయాడు. శ్రీరాముడు తండ్రి పాదాలకు ప్రణమిల్లాడు. కైకేయి పాదాలకు నమస్కరించాడు. అంతఃపురం నుండి బయటకు వచ్చాడు. లక్ష్మణునితో కలసి కౌసల్యామాతను దర్శించుకున్నాడు. తన అరణ్యవాస విషయం చెప్పాడు. ఆ మాటలు వింటూనే కౌసల్య గండ్రగొడ్డలిచేత నరికిన మద్దిచెట్టులా నేలమీద పడిపోయింది. అంతులేని ఆవేదనకు లోనైంది. వనవాసానికి వెళ్ళవద్దని కౌసల్యా లక్ష్మణులు పరిపరివిధాల శ్రీరాముడికి నచ్చజెప్పజూశారు. కాని శ్రీరాముడు తండ్రిమాటకే తలొగ్గాడు. వెళ్ళక తప్పదన్నాడు. కైకేయిపట్ల తనకు ఏమాత్రం అనాదరభావం లేదన్నాడు. తన పట్టాభిషేకం ఆగిపోవడానికి కైకేయి కారణం కాదని, విధి ప్రేరణచే ఆమె అట్లా మాట్లాడిందని సమర్థించాడు. తనకు రాజ్యమైనా వనవాసమైనా సమానమేనని ప్రకటించాడు.

పుత్రవ్యామోహంతో కౌసల్య శ్రీరాముని వెంట వనవాసానికి సిద్ధపడింది. కాని భర్తను వదలిరావడం ధర్మంకాదన్నాడు శ్రీరాముడు. ఎలాగో మనసును స్తిమితపరుచుకొని కౌసల్య శ్రీరాముణ్ణి దీవించింది. 'రామా! సత్పురుషుల బాటలో నడువు. నీ ధర్మమే నీకురక్ష. నువ్వు చేసిన తల్లిదండ్రుల సేవ, నీ సత్యబలం నీకు రక్షగా ఉంటాయి. నీకు ఎలాంటి బాధలూ కలుగకుండుగాక' అని శుభాశీస్సులందించింది.

అక్కడి నుండి సీతామందిరానికి వెళ్ళాడు శ్రీరాముడు. తన వనవాసవిషయం చెప్పాడు. అయోధ్యలో ఎలా మసలుకోవాలో సీతకు తెలిపాడు. కాని సీత రామునివెంటే వనవాసానికి వెళ్ళడానికి నిశ్చయించుకుంది. ఆ మాటే శ్రీరామునితో చెప్పింది. 'మీరు లేకుండా స్వర్గసుఖాలు లభించినా ఇష్టపడను. పతిని అనుసరించడమే సతికి ధర్మం, సుఖప్రదం, శుభప్రద'మని తెలిపింది. శ్రీరాముడు అంగీకరించక తప్పలేదు. తనను కూడా వెంట తీసుకెళ్ళమని లక్ష్మణుడు శ్రీరాముణ్ణి ప్రాధేయపడ్డాడు. శ్రీరాముడి సేవాభాగ్యం ముందు త్రిలోకాధిపత్యం కూడా చిన్నదేనని, సకలోపచారాలు చేసే అవకాశం తనకిమ్మని అభ్యర్థించాడు. సరేనన్నాడు శ్రీరాముడు. తల్లి అయిన సుమిత్రకు, ఆత్మీయులకు ఈ విషయం తెలిపి వారి ఆమోదాన్ని పొందమన్నాడు.



సీతారామలక్ష్మణులు దశరథుని దర్శించడానికి బయలుదేరారు. కాలినడకన వస్తున్న శ్రీరాముణ్ణి చూసి ప్రజలు బావురుమన్నారు. లక్ష్మణునిలాగ తామందరూ రాముని వెంట వెళ్లాలనుకొన్నారు. రాముడు ఉంటే చాలు అది అడవియైనా తమ పాలిటి అయోధ్యేననుకున్నారు. సీతారామలక్ష్మణులు దశరథుని మందిరానికి చేరుకున్నారు. దశరథుడు రాణులందరినీ రప్పించాడు. అందరూ విలపిస్తున్నారు కైకేయి తప్ప. దశరథుని మందిరం కన్నీటిశాల అయింది.

కైకేయి స్వయంగా తెచ్చి ఇచ్చిన నారచీరలను సీతారామలక్ష్మణులు ధరించారు. తల్లిదండ్రులకు నమస్కరించారు. సుమిత్రలక్ష్మణునితో, 'నాయనా, శ్రీరాముణ్ణి నీ తండ్రి అయిన దశరథులవారిలాగా, సీతను నన్నుగా భావించు. అడవిని అయోధ్య అనుకో. సుఖంగా వెళ్ళి ర'మ్మని దీవించింది. సుమంత్రుడు రథాన్ని సిద్ధంచేశాడు. సీతారామలక్ష్మణులు రథాన్ని ఎక్కారు. రథం వేగంగా ముందుకు సాగుతున్నది. శ్రీరాముణ్ణి విడవలేక కొందరు పౌరులు ఆ రథానికి రెండువైపులా, వెనక భాగంలో వేలాడారు. మంగళ వాద్యఘోషతో మార్మోగవలసిన అయోధ్య దు:ఖసంద్రమైంది. దశరథుడు తీవ్రమైన బాధతో కౌసల్యామందిరానికి వచ్చాడు. కౌసల్యాదేవి శోకమూర్తిలా ఉంది. సుమిత్రాదేవి ఆమెను ఓదార్చింది.

శ్రీరాముని రథాన్ని నీడలా అనుసరిస్తున్నారు ప్రజలు. అయోధ్యకు మళ్ళిపొండని వాళ్ళకు శ్రీరాముడు ఎంతగానో చెప్పాడు. 'మీరే అయోధ్యకు రండి లేదా మేము మీ వెంట రావడానికి అనుమతించండి' అని వేడుకుంటున్నారు ప్రజలు. రథం తమసానదీ తీరానికి చేరింది. ఆ రాత్రి అందరూ అక్కడే విడిది చేశారు. తెల్లవారుతున్నది. అలసటచేత పౌరులందరూ గాఢనిద్రలో ఉన్నారు. ఇంకా వాళ్ళను శ్రమపెట్టడం శ్రీరామునకు ఇష్టంలేదు. అందుకని వాళ్ళు నిద్రలేచేలోపే అక్కడి నుండి వెళ్ళాలని లక్ష్మణునితో అన్నాడు. సుమంత్రుని సారథ్యంలో సీతారామలక్ష్మణులు అక్కడినుంచి బయలుదేరారు. నిద్రలేచిన పౌరులు శ్రీరాముడు కనబడకపోవడంతో తికమకపడ్డారు. తమ మొద్దునిద్రను తామే నిందించుకున్నారు. చేసేదిలేక అయోధ్యకు తిరుగు ముఖం పట్టారు.

రథం వేదశ్రుతి, గోమతీ, సనందికా నదులను దాటింది. కోసలదేశపు పొలిమేరలకు చేరుకుంది. అక్కడి నుండి అయోధ్యవైపుగా తిరిగి శ్రీరాముడు నమస్కరించాడు. ముందుకు సాగుతూ గంగాతీరానికి చేరుకున్నారు. ఆ తీరంలో శృంగిబేరపురమున్నది. 'గుహుడు' ఆ ప్రదేశానికి రాజు. అతడు శ్రీరామభక్తుడు. శ్రీరాముడు వచ్చాడన్న వార్త విని, తనవారితో శ్రీరాముని దగ్గరకు బయల్దేరాడు. గుహుణ్ణి చూసి, రాముడు లక్ష్మణుడితోపాటు ఎదురువెళ్ళి కలుసుకున్నాడు. ఆ రాత్రి గుహుడి ఆతిథ్యం తీసుకున్నాడు.

మరునాడు శ్రీరాముని ఆదేశం మేరకు గుహుడు నావను సిద్ధం చేశాడు. 'శ్రీరాముడు మర్రిపాలను తెప్పించాడు. వాటితో తనకు లక్ష్మణునకు జడలను సిద్ధపరచాడు. రామలక్ష్మణులు జటాధారులయ్యారు. సీతారామలక్ష్మణులు పడవ ఎక్కారు. అవతలి తీరానికి తీసుకువెళ్ళాలని నావికులకు సూచించాడు గుహుడు. శ్రీరాముడు సుమంత్రునికి, గుహునికి వెళ్ళడానికి అనుమతినిచ్చాడు. నావను ముందుకు సాగించవలసిందిగా నావికులను ఆదేశించాడు.

నదిమధ్యలో నావ సాగుతున్నది. సీత గంగను ప్రార్థించింది. నావ దక్షిణతీరానికి చేరింది. నావదిగిన శ్రీరాముడు సీతాలక్ష్మణసమేతుడై వనాలకు బయలుదేరాడు. శ్రీరాముని ఆదేశం మేరకు ముందు లక్ష్మణుడు వెనక సీత, ఆమె వెనక శ్రీరాముడు నడుస్తున్నారు. సాయంకాలానికల్లా భరద్వాజాశ్రమానికి చేరారు. ఇది గంగాయమునసంగమప్రదేశంలో ఉంది. ముని వాళ్ళకు అతిథిసత్కారాలు చేశాడు. వనవాసకాలాన్ని ఆ ప్రాంతంలోనే గడపమని కోరాడు. కాని రాముడు సుతిమెత్తగా తిరస్కరించాడు.

జనులకు అందుబాటులో ఉండని, ఆశ్రమవాసానికి అనువైన ప్రదేశమేదైనా సూచించమని శ్రీరాముడు కోరాడు. పది కోసుల దూరంలో 'చిత్రకూటం' అనే పవిత్రమైన పర్వత ప్రదేశం ఉందని, మహర్షుల నివాసస్థానమైన అదే తగిన చోటని భరద్వాజుడన్నాడు. మహర్షి సూచననుసరించి యమునానదిని దాటి చిత్రకూటం చేరుకున్నారు సీతారామలక్ష్మణులు. అన్న ఆదేశం ప్రకారం అక్కడ నేరేడు కర్రలతో కుటీరాన్ని నిర్మించాడు లక్ష్మణుడు. సశాస్త్రీయంగా అందులోకి ప్రవేశించారు.

ఈ విషయాన్నంతా గూఢచారుల ద్వారా గుహుడు తెలుసుకున్నాడు. గుహుని ద్వారా సుమంత్రుడు గ్రహించాడు. సుమంత్రుడు గుహుడి దగ్గర సెలవు తీసుకొని అయోధ్యకు వెళ్ళాడు. దశరథుడు సుమంత్రుడి ద్వారా రాముడి విషయాలను తెలుసుకున్నాడు. కౌసల్యాదశరథుల ఆవేదనకు అంతులేదు. దశరథుడు గతంలో తాను మునిబాలకుణ్ణి పొరబాటుగా చంపిన సంఘటనను, అతని తల్లిదండ్రులిచ్చిన శాపాన్ని గుర్తుచేసుకున్నాడు. అదే పుత్రవియోగానికి కారణమనుకున్నాడు. శ్రీరాముని ఎడబాటుకు దశరథుని మనసు కకావికలమైంది. దుఃఖాగ్నికి తట్టుకోలేక గుండె చల్లబడింది. అర్ధరాత్రి తరువాత దశరథుడు ప్రాణాలు విడిచాడు. అందరూ బావురుమన్నారు.

దశరథుని దేహాన్ని ఒక తైలద్రోణిలో భద్రపరచారు. వసిష్ఠుడి ఆజ్ఞమేరకు దూతలు భరతశత్రుఘ్నులను తీసుకురావడానికి వెళ్ళారు. ఏడురోజులు ప్రయాణం చేసి ఎనిమిదవనాడు అయోధ్యకు చేరుకున్నారు భరతశత్రుఘ్నులు. తండ్రిమరణానికి తల్లడిల్లాడు భరతుడు. తండ్రి అంత్యక్రియలను భరతుడు నిర్వర్తించాడు.

శ్రీరామ వనవాస విషయంలో తల్లిని తప్పుబట్టాడు భరతుడు. మంథరను చంపడానికి ఉద్యుక్తుడైన శత్రుఘ్నుడు భరతుని మాట విని విరమించుకున్నాడు. మంత్రులు భరతుణ్ణి రాజ్యాధికారం చేపట్టమన్నారు. కాని భరతుడు అంగీకరించలేదు. 'పెద్దవాడైన శ్రీరాముడే రాజు కావాలి. ఆయనకు బదులు నేను పదునాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తాను. చతురంగ బలాలను సిద్ధపరచండి. నేను వెళ్ళి శ్రీరాముణ్ణి అయోధ్యకు తీసుకువస్తాను' అని తెలిపాడు.

భరతుడు అయోధ్యావాసులతో కూడి బయలుదేరాడు. శృంగిబేరపురం చేరాడు. గుహుడు భరతుని ఆంతర్యం తెలియక యుద్ధసన్నద్ధుడయ్యాడు. తీరా విషయం తెలిశాక ఎదురువెళ్ళి భరతుణ్ణి ఆహ్వానించాడు. గుహుని సహకారంతో భరద్వాజాశ్రమం చేరుకున్నాడు భరతుడు. మహర్షి సత్కారాలనంది చిత్రకూటం వైపు ప్రయాణించారందరు.

అడవిలో మృగాల అలజడి మొదలైంది. కారణమేమిటో చూడమన్నాడు లక్ష్మణునితో శ్రీరాముడు. వెంటనే లక్ష్మణుడు ఒక పెద్దమద్ది చెట్టెక్కాడు. విషయం అర్థమైంది. చెట్టు దిగి శ్రీరాముని వద్దకు వచ్చాడు. 'భరతుడు దుర్బుద్ధితో ససైన్యంగా వస్తున్నాడు. మన ధనుర్బాణాలను సిద్ధంచేసుకుందా' మన్నాడు లక్ష్మణుడు. శ్రీరాముడు లక్ష్మణుని ఆలోచనలో పొరపాటు ఉందని చెప్పాడు. భరతుడలాంటివాడు కాదన్నాడు. 'లక్ష్మణా! ఒకవేళ నీకు రాజ్యకాంక్ష ఉంటే చెప్పు భరతునికి చెప్పి ఆ రాజ్యాన్ని నీకే ఇప్పిస్తా' నన్నాడు. ఇంతలో భరతుడు పర్ణశాలకు చేరుకున్నాడు. శ్రీరాముణ్ణి చూడగానే దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు. శత్రుఘ్నుడు శ్రీరాముడి పాదాల మీద పడ్డాడు. శ్రీరాముని కళ్ళనుంచి అశ్రుధారలు కురిశాయి. కొంతసేపటికి తేరుకున్నాడు. భరతుణ్ణి కుశల ప్రశ్నలు వేశాడు. ప్రసంగవశాత్తు రాజనీతి ధర్మాలను బోధించాడు. శ్రీరాముడు తండ్రి మరణవార్త విని విలపించాడు. శ్రీరాముణ్ణి అయోధ్యకు రమ్మని, రాజువుకమ్మని సవినయంగా ప్రార్థించాడు భరతుడు. కాని తండ్రిమాటే శిరోధార్యమని శ్రీరాముడు అంగీకరించలేదు. శ్రీరాముని నాస్తికవాదంతో ఒప్పింపజూచాడు జాబాలి. ఇతడు దశరథుని పురోహితుడు. కాని జాబాలి వాదాన్ని శ్రీరాముడు ఖండించాడు.



భరతుని అభ్యర్థన మేరకు శ్రీరాముడు పాదుకలను అనుగ్రహించాడు. అప్పుడు భరతుడు ‘అన్నా! ఈ పాదుకలమీదనే రాజ్యపాలనాభారాన్ని ఉంచుతాను. ఈ పదునాలుగు సంవత్సరాలు నేనుకూడా జటలను ధరించి, నారచీరలు కట్టి, వనవాసనియమాలతో, నగరం వెలుపల ఉంటాను. పదునాల్గవ సంవత్సరం కాగానే నీ దర్శనం కాకుంటే అగ్ని ప్రవేశం చేస్తా’నన్నాడు. సరేనన్నాడు శ్రీరాముడు. ఆదర్శ సోదరభావమంటే ఇది. భరతుడు నందిగ్రామం చేరుకొని, పాదుకలకు పట్టాభిషేకం చేశాడు.

శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతంగా అత్రిమహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అత్రి అనసూయలు వీరికి సముచిత మర్యాదలు చేశారు. మహాపతివ్రత అయిన అనసూయాదేవి సీతకు దివ్య వస్త్రాభరణాలనిచ్చింది. మునీశ్వరుల ఆశీస్సులు తీసుకొని సీతా రామ లక్ష్మణులు దండకారణ్యంలోకి ప్రవేశించారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# అరణ్య కాండ

దండకారణ్యం పవిత్రప్రదేశం. ప్రశాంతప్రదేశం. అక్కడ మునుల ఆశ్రమాలు ఎన్నో ఉన్నాయి. పక్షులు, మృగాలు - సకలప్రాణులకు సురక్షితమైన ప్రాంతం అది. అక్కడ లోకక్షేమం కోసం యజ్ఞయాగాలు జరుగుతున్నాయి. ఆశ్రమ సముదాయాన్ని చూడగానే అల్లెతాటిని ధనుస్సునుంచి వేరుచేశాడు శ్రీరాముడు. అక్కడ వినయానికి తప్ప వీరత్వానికి అవకాశం లేదు. **ఎక్కడ ఎట్లా ప్రవర్తించాలో తెలుసుకోడమే ఉచితజ్ఞత.** ఇది శ్రీరామునిలో సంపూర్ణంగా ఉంది.

సీతారామలక్ష్మణులకు మహర్షులు సాదరస్వాగతం పలికారు. ఆ సముదాయంలోని ఒక పర్ణశాలలో విడిది ఏర్పాటుచేశారు. మరునాడు ఉదయం నిత్యోచిత కర్మలను ముగించుకొని మహర్షులకు వీడ్కోలు పలికి సీతారామలక్ష్మణులు ప్రయాణాన్ని కొనసాగించారు.

వనంమధ్యకు చేరుకున్నారు. ఇంతలో వికృతాకారంలో ఉన్న విరాధుడనే రాక్షసుడు అమాంతంగా సీతారామలక్ష్మణుల పైకి విరుచుకుపడ్డాడు. రామలక్ష్మణులను తన భుజాలపై వేసుకొని తీసుకుపోసాగాడు. సీతగగ్గోలు పెడుతున్నది. రామలక్ష్మణులు విరాధుని రెండు భుజాలను నరికివేశారు. నేలపై కుప్పకూలాడు విరాధుడు. ముష్టిఘాతాలతో, మోకాళ్ళతో దాడిచేశారు రామలక్ష్మణులు. ఎంతకూ చావని విరాధుణ్ణి గోతిలో పాతిపెట్టడానికి సంసిద్ధులయ్యారు. వెంటనే విరాధుడు తన పూర్వకథను వివరించాడు. తుంబురుడనే గంధర్వుడైన తాను కుబేరుని శాపంచేత రాక్షసుడిగా మారిన విషయం తెలిపాడు. శ్రీరామునివల్ల శాపవిముక్తి కలుగుతుందన్న కుబేరుని మాటలను జ్ఞాపకం చేసుకున్నాడు. దగ్గరలోనే ఉన్న శరభంగ మహర్షిని దర్శించుకొమ్మని, శుభం జరుగుతుందని శ్రీరామునికి చెప్పాడు. తనను గోతిలో పూడ్చమన్నాడు. అలాగే చేశారు రామలక్ష్మణులు.

విరాధుని మాట ప్రకారం శరభంగ మహర్షి దర్శనానికి బయల్దేరారు. శరభంగుడు మహాతపస్వి. దైవసాక్షాత్కారం పొందినవాడు. శ్రీరాముని చూసి శ్రీరామ దర్శనం కోసమే తాను వేచివున్నానన్నాడు. తన తపఃఫలాన్నంతా శ్రీరామునికి ధారపోశాడు. భవిష్యత్తులో శ్రీరాముడు చేయవలసిన రావణసంహారానికి ఇది కూడా తోడ్పడుతుంది. **ఒక మహాకార్య సాధనలో ఎవరివంతు వారు సహకారమందించాల్సిందే.** అక్కడికి చేరువలోనే ఉన్న 'సుతీక్ష్ణ' మహర్షిని దర్శించమని శ్రీరామునకు సూచించాడు శరభంగమహర్షి. సీతారామలక్ష్మణులు చూస్తుండగానే తన దేహాన్ని విడచి అగ్నితేజస్సుతో బ్రహ్మలోకం చేరాడు.

అక్కడి మునులందరూ శ్రీరాముని వద్దకు వచ్చి తమగోడును వెళ్ళబోసుకున్నారు. రాక్షసులు మునులపై చేసే అకృత్యాలను ఏకరువుపెట్టారు. రాక్షసుల చేతిలో బలైన మునుల కళేబరాలను చూపించారు. రాక్షసుల బారి నుండి రక్షించమని ప్రార్థించారు. వారితో శ్రీరాముడు 'మహాత్ములారా! మీరు నన్ను ప్రార్థించడం తగదు. ఆజ్ఞాపించాలి. మీ ఆజ్ఞలను నేను శిరసావహిస్తా'నన్నాడు. **అహంకరించకుండా తన బాధ్యతను గుర్తించడంలోనే గొప్పదనముంది.**

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం చేరుకున్నారు. శ్రీరామదర్శనం కోసమే సుతీక్ష్ణ మహర్షి దేహం విడువకుండా ఉన్నాడు. తన తపశ్శక్తినంతా శ్రీరామునకు ధారాదత్తం చేశాడు. మరునాడు వారు మహర్షి అనుమతి తీసుకొని బయలుదేరారు.

దండకారణ్యంలోని మునుల ఆశ్రమాలను సందర్శిస్తూపోతున్నారు సీతారామలక్ష్మణులు. అక్కడక్కడ కొంతకాలం ఉంటున్నారు. ఇలా పది సంవత్సరాలు గడిచింది. మళ్ళీ సుతీక్ష్ణ మహర్షి వద్దకు వచ్చారు. అతనితో అగస్త్య మహర్షిని దర్శించుకోవాలన్న తమ ఆకాంక్షను వెలిబుచ్చారు. సుతీక్ష్ణ మహర్షి మార్గాన్ని చెప్పాడు. తన ఆశ్రమానికి దక్షిణంగా నాల్గుయోజనాల దూరంలో అగస్త్య సోదరుని ఆశ్రమం, అక్కడికి యోజనదూరంలో అగస్త్యాశ్రమం ఉందని తెలిపాడు. మహర్షివద్ద సెలవు తీసుకొని బయలుదేరారు సీతారామలక్ష్మణులు.

సాయంకాలానికి అగస్త్యసోదరుని ఆశ్రమానికి చేరుకున్నారు. ఇక్కడో విషయం చెప్పుకోవాలి. **అగస్త్యసోదరుని పేరేమో చెప్పలేదు. ఎక్కడ సందర్భం వచ్చినా అగస్త్యభ్రాత (సోదరుడు) అనే చెప్పారు. అందుకే పేరు తెలియని వారిని 'అగస్త్యభ్రాత' అంటూంటారు. ఈ పదబంధం జాతీయంగా స్థిరపడింది.** అగస్త్యసోదరుని ఆతిథ్యంలో ఆరాత్రి గడిపారు సీతారామలక్ష్మణులు. ఉదయాన్నే అగస్త్యాశ్రమం వైపుగా అడుగులు వేశారు.

అగస్త్యుడు తపశ్శక్తి సంపన్నుడు. ఆకాశాన్ని తాకిన వింధ్య పర్వతగర్వాన్ని అణచినవాడు. **'అగమ్ స్తంభయతీతి అగస్త్యః' పర్వతాన్ని స్తంభింపజేసినవాడు కనుక అగస్త్యుడయాడు.**

శ్రీరాముడి రాకను గమనించి అగస్త్యుడు శిష్యసమేతంగా ఎదురువెళ్ళాడు. అతిథిని గౌరవించే సంప్రదాయమది. శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై మహర్షికి పాదాభివందనం చేశాడు. అగస్త్యుడు శ్రీరామునకు దివ్యధనుస్సు, అక్షయతూణీరాలు, అమోఘమైన ఖడ్గాన్ని బహూకరించాడు. జయం కలుగుతుందని ఆశీర్వదించాడు. కష్టాలతో కూడిన వనవాసానికి సీత కోరిరావడం సాహసమని అభినందించాడు. ఆమెకుగల భర్తృప్రేమను మెచ్చుకున్నాడు.

శ్రీరాముడు తాము నివసించడానికి అనువైన ప్రాంతాన్ని సూచించమని అగస్త్యుణ్ణి అభ్యర్థించాడు. ఒక్క క్షణం ధ్యానమగ్నుడైనాడు మహర్షి. తరువాత శ్రీరామునితో 'ఇక్కడికి రెండు యోజనాల దూరంలో 'పంచవటి' అనే ప్రదేశం ఉంది. అక్కడ ఫలాలకు, జలానికి కొదువలేదు గోదావరీనదీతీరంలో ఉన్న ఆ ప్రాంతంలో జనసంచారం ఉండదు. ప్రశాంతంగా ఉంటుంద'ని తెలిపాడు. అగస్త్యుడి దగ్గర సెలవు తీసుకొని పంచవటికి ప్రయాణమయ్యారు సీతారామలక్ష్మణులు.

దారిలో బలిష్ఠమైన ఒక పెద్దగద్దను చూశారు. పక్షిరూపంలో ఉండే రాక్షసుడేమోననుకున్నారు. 'నువ్వెవరి'వని అడిగారు. తనపేరు 'జటాయువు' అనీ, దశరథుని మిత్రుడిననీ చెప్పుకొన్నాడు. తన వంశచరిత్రనూ శక్తిసామర్థ్యాలను వివరించాడు జటాయువు. తన తండ్రికి ఆత్మీయుడైన జటాయువునకు సీతరక్షణ బాధ్యతను అప్పగించాడు శ్రీరాముడు. శ్రీరాముని ఆజ్ఞమేరకు పంచవటిలో పర్ణశాల నిర్మాణం చేశాడు లక్ష్మణుడు.

పంచవటిలో జీవనం ప్రశాంతంగా గడుస్తున్నది. ఒకనాడు శ్రీరాముడు పురాణకథా ప్రసంగంలో ఉన్నాడు. ఇంతలో 'శూర్పణఖ' అనే రాక్షసి అక్కడికి వచ్చింది. ఈమె రావణాసురుడి చెల్లెలు. శ్రీరాముడి సౌందర్యానికి ముగ్ధురాలైంది. తనను చేపట్టమన్నది. తమ మధ్య అడ్డుగా ఉన్న సీతాలక్ష్మణులను చంపితింటానన్నది. శ్రీరాముడు పరిహాసంగా లక్ష్మణుని వద్దకు వెళ్ళమన్నాడు. లక్ష్మణుడు తాను అన్నకు దాసుడనని తనతో ఉంటే శూర్పణఖ కూడా దాస్యం చేయాల్సివస్తుందని, అందుకే శ్రీరాముణ్ణి చేరడమే సబబని సమాధానమిచ్చాడు. శ్రీరాముడివైపు తిరిగింది శూర్పణఖ. సీత ఉండడంవల్లే తనను నిరాకరిస్తున్నాడని అట్టుడికిపోయింది. సీతాదేవి అడ్డు తొలగించుకోవాలని ఆమెపై దాడికి దిగింది.

**క్రూరులైన దుష్టులతో పరిహాసం పనికిరాదు. అది ఎంతో ప్రమాదకరం.** ఆలస్యం చేయకుండా శూర్పణఖను విరూపిని చేయమన్నాడు శ్రీరాముడు. అన్న ఆజ్ఞే ఆలస్యం – శూర్పణఖ ముక్కుచెవులు తెగిపడ్డాయి లక్ష్మణుని కత్తిదెబ్బకు. లబోదిబోమని మొత్తుకొంటూ సోదరుడైన ఖరుడి దగ్గరికి వెళ్ళింది శూర్పణఖ. ఖరుడు పద్నాలుగుమంది యోధులను పంపాడు. వాళ్ళంతా శ్రీరాముని చేతిలో మట్టిగరచారు. ఇది చూసిన శూర్పణఖ ఖరుని వద్దకు వెళ్ళి చెప్పింది. ఖరదూషణులు పద్నాలుగువేల మంది రాక్షసులతో రాముడిమీదకు దండెత్తారు. మూడుగడియల్లో వాళ్ళందరినీ యమపురికి పంపించాడు శ్రీరాముడు.

ఈ వార్త అకంపనుడి ద్వారా వేగంగా లంకకుచేరింది. అకంపనుడు రావణాసురుడి గూఢచారుల్లో ఒకడు. ఈ విషయాన్ని సహించుకోలేని రావణుడు శ్రీరాముణ్ణి హతమారుస్తానని ఆవేశపడ్డాడు. అకంపనుడు, అసహాయశూరుడైన శ్రీరాముణ్ణి వధించడం దేవాసురులకు కూడా సాధ్యంకాదని తేల్చేశాడు. కాని అందుకు తగిన ఒక ఉపాయాన్ని చెప్పాడు. 'శ్రీరాముడి భార్య సీత అందాల రాశి. శ్రీరాముడికి ప్రాణం. ఎలాగైనా ఆమెను అపహరిస్తే చాలు – ఆ ఎడబాటును తట్టుకోలేక రాముడు జీవితాన్ని



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

చాలిస్తాడు' అని. ఇది రావణునికి ఎంతగానో నచ్చింది.

మరునాడుదయమే రథంమీద ఆకాశంలో ప్రయాణిస్తూ మారీచుడి ఆశ్రమానికి చేరుకున్నాడు. సీతాపహరణ విషయం తెలిపాడు. ఈ పనిలో తనకు సహాయపడమన్నాడు. మారీచుడు మండిపడ్డాడు. 'ఓ రాక్షసేంద్రా! ఈ ఆలోచన నీకెవరు చెప్పారు? నిజంగా అతడు నీకు మిత్రుడి రూపంలో ఉన్న శత్రువు. శ్రీరాముడు సింహంవంటివాడు. సింహందగ్గరికి వెళ్ళడం ఎంత ప్రమాదం? పైగా ఇతరులకు హాని చేయాలనే ఆలోచన లేకుండా ప్రశాంతంగా ఉన్న రాముణ్ణి కవ్వించడం కొరివితో తల గోక్కోవడమే. శాంతించి, ఈ ఆలోచన విరమించి సుఖించ'మని సదుపదేశం చేశాడు. రావణుడి ఆవేశం తిరుగు ముఖం పట్టింది. రావణుడూ లంకకు తిరుగుముఖం పట్టాడు.

ఖర, దూషణ త్రిశరులు, పద్నాలుగు వేలమంది రాక్షసవీరులు రాముడిధాటికి నిలువలేక యముడి ఇంటికి పోవడాన్ని భరించలేకపోయింది శూర్పణఖ. లంకకు పరుగుదీసింది. మంత్రులతో కొలువుదీరిన రావణుని సభలోకి వెళ్ళింది. వికృతరూపంతో వచ్చిన చెల్లెలి దీనావస్థను చూసి కూడా చలించలేదు రావణుడు. శూర్పణఖ ఆవేశం కట్టలు తెంచుకుంది. రావణుడి మూర్ఖత్వాన్ని తిట్టిపోసింది. శ్రీరాముడివల్ల లంకకు ముప్పువాటిల్ల గలదని హెచ్చరించింది. 'సౌందర్యవతి అయిన సీతకు తగిన భర్తవు నీవే'నని రావణుడిలో కొత్త ఆశలను రేకెత్తించింది.



ఒకవైపు మారీచుడి మాటలు, మరొకవైపు శూర్పణఖ పలుకులు లంకేశుని మనసును కుదిపేస్తున్నాయి. అయోమయంలో పడ్డాడు. సీతాపహరణంలోని మంచిచెడులను ఆలోచించాడు. శ్రీరాముని బలంతో తన బలాన్ని పోల్చుకున్నాడు. చివరకు సీతను అపహరించడానికే నిశ్చయించుకున్నాడు.

రావణుడు మళ్లీ మారీచుని వద్దకు వెళ్ళాడు. సీతాపహరణకు బంగారులేడిగా మారి సహకరించమన్నాడు. ఆ ఆలోచనను విరమించుకోమని లంకేశునికి పరిపరివిధాల నచ్చజెప్పజూశాడు మారీచుడు. విశ్వామిత్రుని యాగ సంరక్షణ సందర్భంలో రామబాణం రుచి ఏమిటో తాను తెలుసుకున్నానన్నాడు. మారీచుడి మాటలను పెడచెవిన పెట్టాడు రావణుడు. **మూర్ఖులకు హితబోధలు చెవికెక్కవు.**

'నేను చెప్పినట్లు చేయకుంటే నా చేతిలో నీకు చావు తప్ప'దని హెచ్చరించాడు రావణుడు. ఆశ్రమానికి వెళ్తే శ్రీరాముడు చంపుతాడు. వెళ్ళకుంటే రావణుడు చంపుతాడు. 'ముందు నుయ్యి వెనక గొయ్యి'లా ఉంది మారీచుని స్థితి. చివరకొక నిశ్చయానికి వచ్చాడు. రావణునితో 'నీ చేతిలో చావడం కన్నా శ్రీరాముడి చేతిలో చావడమే నయం. నా జన్మ తరిస్తుం'దని తేల్చిచెప్పాడు.

మారీచుడు బంగారులేడిగా మారి శ్రీరాముని ఆశ్రమప్రాంతంలో తిరుగుతున్నాడు. పూలు కోయడానికి వచ్చిన సీతాదేవి ఆ జింకను చూసి ఆశ్చర్యపడింది. రామలక్ష్మణులను పిలిచింది. వారు ఆ మృగాన్ని చూశారు. లక్ష్మణుడు అది మాయామృగమేనని నిస్సంశయంగా పలికాడు. మారీచుడే ఈ రూపంలో వచ్చి ఉంటాడన్నాడు. వేటకు వచ్చే రాజులను మాయామృగరూపంలో చంపడం మారీచుడికి కొత్తదేమీ కాదన్నాడు. ఇలాంటి లేడి ప్రపంచంలో ఉండదని అనుమానాన్ని వెలిబుచ్చాడు. సీత మాత్రం పట్టు వదలలేదు. తనకు అదెంతో నచ్చిందని, తీసుకురావాలని కోరింది. తెస్తే ఆశ్రమంలో క్రీడామృగంగా ఉంటుందని, అయోధ్యచేరాక అంతఃపురానికే అలంకారమౌతుందని ఆశించింది.

సీత ఇష్టాన్ని తోసివేయలేక ఆ మాయలేడిని చంపి అయినా సరే తేవడానికి సంసిద్ధుడయ్యాడు శ్రీరాముడు. సీతాదేవి రక్షణ విషయంలో జటాయువు సహాయంతో అప్రమత్తంగా ఉండమని లక్ష్మణుణ్ణి ఆదేశించాడు. మాయలేడిని పట్టుకోడానికి బయల్దేరాడు.

మృగాన్ని ప్రాణంతో పట్టుకోవాలని శతవిధాల ప్రయత్నించాడు శ్రీరాముడు. అందినట్టే అంది అందకుండా పరుగుదీస్తున్నదా మృగం. ఇక లాభం లేదనుకొని బాణాన్ని సంధించాడు, ప్రయోగించాడు శ్రీరాముడు. బాణపు దెబ్బకు తాటి చెట్టంత ఎత్తు ఎగిరి భయంకరంగా అరుస్తూ పడిపోయాడు మారీచుడు, నిజస్వరూపంతో. రాముని కంఠధ్వనిని అనుకరిస్తూ 'అయ్యో సీతా! అయ్యో లక్ష్మణా!' అని బిగ్గరగా అరుస్తూ ప్రాణాలు విడిచాడు. ఈ మాటలకు సీతాలక్ష్మణులు ఎంత కలవరపడతారోనని భయపడినాడు శ్రీరాముడు.

మారీచుని కంఠధ్వనిని రామునిదిగా భావించి సీత ఆందోళనచెందింది. శ్రీరాముడు ఏదో ఆపదలో చిక్కుకున్నాడని తలచింది. ఆదుకోడానికి వెంటనే వెళ్ళమని లక్ష్మణుణ్ణి పురమాయించింది. లక్ష్మణుడు చలించలేదు. ఇది శ్రీరాముని స్వరం కాదన్నాడు. మారీచుడి మాయాజాలమన్నాడు. 'అమ్మా! నీ రక్షణ భారం శ్రీరాముడు నాకప్పగించాడు. నిన్ను ఇలా ఒంటరిగా వదలివెళ్ళలే'నని స్పష్టం చేశాడు. సీత ఆవేశం రెండింతలైంది. మనసులో ఏదో దుష్టాలోచనతో ఇలా ప్రవర్తిస్తున్నావని నిష్ఠురోక్తులాడింది. చేసేదిలేక లక్ష్మణుడు బయలుదేరడానికి సంసిద్ధుడయ్యాడు. 'అమ్మా! నీకు భద్రమగుగాక. వనదేవతలు నిన్ను రక్షింతురుగాక. నాకు అపశకునాలు తోస్తున్నాయి. మళ్ళీ నువ్వు మా అన్నతో కలిసి ఉండగా చూసే భాగ్యం కలుగుతుందో, లేదో?' అని వాపోయాడు. సీతమౌనంగా ఉన్నది. అక్కడి నుంచి వెళ్ళడానికి ఏమాత్రం మనస్కరించకున్నా సీతకు నమస్కరించి శ్రీరాముడు వెళ్ళిన దిశగా నడిచాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు వెళ్ళడాన్ని గమనించాడు రావణుడు. అదే అదనుగా సన్న్యాసి వేషంలో సీత సమక్షానికి వచ్చాడు. యతి రూపంలో వచ్చిన రావణుణ్ణి ఆసనంమీద కూర్చుండబెట్టి సముచితంగా అతిథి మర్యాదలు చేసింది సీత. మధ్యమధ్యలో రామలక్ష్మణుల కోసం వాకిలివైపు చూస్తున్న సీతకు నిరాశే మిగులుతున్నది. రావణుడు సీతను గురించిన వివరాలు అడిగాడు. తెలిపింది. సన్న్యాసి వివరాలను కోరింది. తాను రాక్షసరాజు లంకేశ్వరుడనని ప్రకటించాడు. తనను పతిగా స్వీకరించమని అడిగాడు. అలా చేస్తే అంతులేని భోగభాగ్యాలతో విలసిల్లుతావని ఆశ చూపాడు. ఆ మాటలకు సీత మండిపడింది. రావణుణ్ణి తృణీకరించి మాట్లాడింది. శ్రీరాముడి పరాక్రమాన్ని ప్రస్తావించింది. 'నన్ను అపహరించి నీ చావును నీవే కొనితెచ్చుకోకు' అని హెచ్చరించింది.

రావణుడి కన్నులు నిప్పులు చెరుగుతున్నాయి. సన్యాసి వేషాన్ని వదిలి పదితలలతో భయంకరమైన నిజస్వరూపంతో సీత ఎదుట నిలిచాడు. బలవంతంగా సీతను తన రథంలో లంకకు తరలిస్తున్నాడు. సీత 'రామా! రామా!' అంటూ ఆర్తనాదాలను చేస్తున్నది. ఆమె వేదన అరణ్యరోదనయింది.

అప్పుడప్పుడే నిద్రకుపక్రమిస్తున్న జటాయువుకు సీతాదేవి ఆర్తనాదాలు వినబడ్డాయి. చూసే సరికల్లా సీతను అపహరించుకు పోతున్న రావణుడు కంటబడ్డాడు. జటాయువు రావణుణ్ణి ఎదిరించాడు. ఇద్దరి మధ్య పోరు హోరాహోరీగా సాగింది. చివరకు రావణుడు ఖడ్గంతో జటాయువు రెక్కలను, కాళ్ళను నరికివేశాడు. నేలపై కూలాడు జటాయువు. రక్తంతో తడసి ముద్దయిన అతణ్ణి చూసి ఆత్మబంధువును పోగొట్టుకున్నట్లు సీత ఆక్రందించింది.

రావణుడు సీతాదేవిని తీసుకొని ఆకాశమార్గం పట్టాడు. దీనురాలైన సీత హీనుడైన రావణుణ్ణి పరిపరి విధాల దూషించింది. ఇంతలో ఒక పర్వతశిఖరంమీద ఐదుగురు వానరముఖ్యులను సీత చూసింది. ఉత్తరీయపు కొంగులో తన ఆభరణాలను కొన్నింటిని మూటగట్టి వారి మధ్య పడేటట్లు వదలింది. ఒకవేళ అటువైపుగా శ్రీరాముడువస్తే తనను గురించి వానరులు అతనికి తెలియజేస్తారనే చిన్న ఆశ.

రావణుడు సీతతో లంకకు చేరాడు. తన అంతఃపురంలో సీతనుంచాడు. తన వైభవమంతా చూపించాడు. దాన్ని తృణప్రాయంగా భావించింది సీత. కనికరించమని కాళ్ళపైబడ్డాడు. నిరాకరించిందా మహాసాధ్వి. భరించలేకపోయాడు దశకంఠుడు. ఆవేశంతో, 'మైథిలీ! నీకు పన్నెండు నెలల గడువిస్తున్నాను. ఈలోపున నువ్వు దారికి రాకపోతే మరునాడే ప్రాతఃకాల భోజనానికి వంటవాళ్ళు నిన్ను సిద్ధంచేస్తా'రని బెదిరించాడు. అక్కడి రాక్షసులతో, 'ఈమెను అశోకవనానికి తీసుకుపొండి. వనం మధ్య ఒక రహస్య ప్రదేశంలో ఉంచి చుట్టూ కాపలాగా ఉండండి ఎలాగో ఒకలాగ ఈమెను ఒప్పించండి' అని ఆజ్ఞాపించి రుసరుసలాడుతూ వెళ్ళాడు. ఆడపులల మధ్య జింకలాగ రాక్షసస్త్రీల మధ్య సీత బిక్కుబిక్కుమంటూ కాలాన్ని గడుపుతున్నది.

మారీచుణ్ణి వధించి శ్రీరాముడు వెనుదిరిగాడు. లక్ష్మణుడు ఎదురయ్యేసరికి నిశ్చేష్టుడయ్యా?డు. సీతను ఒంటరిగా వదలి ఎందుకు వచ్చావని నిలదీశాడు. జరిగిన విషయాలు పూసగుచ్చినట్లు చెప్పాడు లక్ష్మణుడు. ఇద్దరూ ఆశ్రమానికి చేరుకున్నారు. సీతాదేవిజాడ కనిపించలేదు. వనమంతా వెతికారు. సీత జాడ కనిపించలేదు. సీతజాడ చెప్పమని ప్రకృతిని ప్రార్థించాడు శ్రీరాముడు. ఆమె ఎడబాటును తట్టుకోలేక కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఆవేదన ఆవేశంగా మారింది. లోకాలను ధ్వంసం చేయడానికి శ్రీరాముడు సిద్ధపడ్డాడు. లక్ష్మణుడు ఓదార్పు వాక్యాలతో అన్నను శాంతపరిచాడు.

అరణ్యంలో సీతను వెదుకుతూ వెళుతున్న రామలక్ష్మణులకు జటాయువు కనిపించాడు. రక్తంతో తడిసిన అతనిని గుర్తించలేదు శ్రీరాముడు. మీదు మిక్కిలి అతడు గద్దరూపంలో ఉన్న రాక్షసుడని సీతనతడే భక్షించి ఉంటాడనీ భ్రమపడ్డాడు. బాణంతో చంపడానికి పూనుకున్నాడు. ఇంతలో జటాయువు జరిగిన విషయం చెప్పాడు. రావణుడు సీతను అపహరించాడని, ఎదిరించిన తనకీగతి పట్టించాడని వివరించాడు. అపహరణకు గురైన సీత, అవసానదశలో ఉన్న ఆత్మీయుడు – రాముడి దుఃఖం రెండింతలైంది. తన తండ్రికి ఆత్మీయుడైన జటాయువుపట్ల పితృభక్తిని ప్రదర్శిస్తూ అతని శరీరాన్ని నిమిరాడు. జటాయువు కన్నుమూశాడు. శ్రీరాముడు జటాయువుకు దహనసంస్కారాలు చేశాడు. అతనికి ఉత్తమగతులు కలగాలని గోదావరిలో జలతర్పణాలు చేశాడు.

రామలక్ష్మణులు దండకారణ్యంనుంచి క్రౌంచారణ్యానికి చేరుకున్నారు. అక్కడి వనంలో భయంకరుడైన ఒక రాక్షసుణ్ణి చూశారు. అతని తల, మెడ కనబడడంలేదు. కడుపు భాగంలో ముఖముంది. రొమ్ముమీద ఒకే కన్ను ఉంది. యోజనం పొడవు వ్యాపించిన చేతులు. ఆ చేతులతో పక్షులను, మృగాలను పట్టితింటాడు. అతనిపేరు 'కబంధుడు'. తన సమీపంలోకి వచ్చిన రామలక్ష్మణులను అమాంతంగా రెండు చేతులతో పట్టుకున్నాడు. అతని చేతుల్లో చిక్కితే తప్పించుకోడం ఎవరితరమూ కాదు. **అందుకే 'కబంధహస్తాలు' అన్న జాతీయం పుట్టుకువచ్చింది.** కబంధుడు రామలక్ష్మణులను భక్షించడానికి నోరుతెరచాడు. అన్నదమ్ములిద్దరూ తమ ఖడ్గాలతో అనాయాసంగా వాడి భుజాలను నరకివేశారు. కబంధుడు కుప్పకూలాడు. రామలక్ష్మణుల గురించి తెలుసుకున్నాడు. తన గురించి చెప్పుకున్నాడు. శాపకారణంగా తనకీ వికృతరూపం ప్రాప్తించిందన్నాడు. శ్రీరాముడు కబంధునితో'. 'మాకు రావణుని పేరు మాత్రమే తెలిసింది. అతని రూపం, ఉండేచోటు, శక్తిసామర్థ్యాలు తెలియవు. వాటిని చెప్పవలసింద'ని అడిగాడు. సమాధానంగా కబంధుడు 'శ్రీరామా! నాకిప్పుడు దివ్యజ్ఞానంలేదు. నా శరీరాన్ని దహిస్తే నా నిజరూపం వస్తుంది. అప్పుడు చెప్పగల'నన్నాడు. కబంధుడి శరీరానికి అగ్నిసంస్కారంచేశారు రామలక్ష్మణులు. ఆ జ్వాలల నుంచి దివ్యదేహంతో బయటికి వచ్చాడు కబంధుడు. సీతాదేవి దొరికే ఉపాయాన్ని శ్రీరాముడికి చెప్పాడు. ఇందుకు సుగ్రీవుడి మైత్రి బాగా తోడ్పడుతుందన్నాడు. వాలిసుగ్రీవుల కథను వివరించాడు. సుగ్రీవుణ్ణి చేరే దారిని చెప్పాడు. శ్రీరాముడి అనుమతిని తీసుకొని కబంధుడు స్వర్గానికి వెళ్లాడు.

కబంధుడు సూచించిన మార్గంలో ప్రయాణిస్తూ పంపాసరస్సున్న ప్రాంతానికి చేరారు రామలక్ష్మణులు. ఆ తీరంలో ఉన్న శబరి ఆశ్రమానికి వెళ్ళారు. శబరి తపస్సిద్ధురాలు, జ్ఞానవయోవృద్ధురాలు. శ్రీరామదర్శనంతో ఆమె తనువు పులకించింది. పంపాతీరంలో దొరికే పండ్లను స్వామికి సమర్పించింది. తన జన్మధన్యమైనట్లు భావించింది. శ్రీరాముడి అనుమతినిపొంది తన దేహాన్ని అగ్నికి ఆహుతి చేసి అగ్నికాంతితో ఊర్ధ్వలోకాలకు వెళ్ళింది.

అక్కడినుంచి ఋష్యమూక పర్వతానికి ప్రయాణమయ్యారు రామలక్ష్మణులు. దారిలో పంపాసరోవరాన్ని దర్శించారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

# కిష్కింధాకాండ

పంపాసరోవర ప్రాంతం పరమ రమణీయంగా ఉంది. ప్రకృతి తన అందాలను ప్రదర్శిస్తున్నట్లుగా ఉంది. కానీ శ్రీరాముడి మనసును ఏమాత్రం సంతోషపెట్టలేకపోయింది. పైగా సీత ఎడబాటు ఆవేదన అనే అగ్నికి ఆజ్యం పోసినట్లుగా శ్రీరాముడి బాధను మరింతపెంచింది. లక్ష్మణుడు ఊరడించాడు. 'అన్నా ఈ దైన్యాన్ని వదులు. ఉత్సాహం తెచ్చుకో. అదే మనకు మేలుచేస్తుంది. చేసిన ప్రయత్నం విఫలమైనప్పుడు, సంపదలను పోగొట్టుకున్నప్పుడు అధైర్యపడకుండా ప్రయత్నంచేస్తే మంచి ఫలితముంటుంది. ఉత్సాహమే బలం. ఉత్సాహమున్నవానికి అసాధ్యమనేదిలేదు. వాళ్ళు ఎటువంటి కష్టాలువచ్చినా వెనకడుగువేయరు. మన ప్రయత్నాన్ని కొనసాగిద్దాం. వదినెగారు తప్పకుండా లభిస్తారు.' అని ధైర్యం చెప్పాడు.

ఋష్యమూక పర్వతం నుంచి రామలక్ష్మణులను చూశాడు సుగ్రీవుడు. గుండెలో రాయిపడ్డట్టయింది. ఆ ఇద్దరు వీరులు తన అన్న అయిన వాలిపంపగా వచ్చారేమోనని భయంతో వణికిపోతున్నాడు. ధనుర్బాణాలు ధరించిన వాళ్ళెవరో మారువేషంలోవెళ్ళి కనుక్కోమని ఆంజనేయుణ్ణి ఆదేశించాడు.

సుగ్రీవుని ఆనతిమీద రామలక్ష్మణులున్న చోటికి ఒక్క గంతువేశాడు హనుమంతుడు. సన్న్యాసి రూపంలో వారి దగ్గరికి వెళ్ళాడు. వారి రూపాన్ని పొగిడాడు. వారి పరిచయం అడిగాడు. రామలక్ష్మణులు మౌనముద్రనుదాల్చారు. హనుమంతుడు వారితో వానరరాజు సుగ్రీవుడు ధర్మాత్ముడు, మహావీరుడు. అతణ్ణి ఆయన అన్న వాలి వంచించాడు. రక్షణకోసం జాగ్రత్తతో తిరుగుతున్నాడు. నేను సుగ్రీవుడి మంత్రిని. నన్ను 'హనుమంతు'డంటారు. నేను వాయుపుత్రుణ్ణి. ఎక్కడికైనా వెళ్ళిరాగల శక్తి గలవాణ్ణి. సుగ్రీవుడు పంపగా ఈ రూపంలో మీదగ్గరకి వచ్చాను. సుగ్రీవుడు మీతో స్నేహాన్ని కోరుతున్నాడు' అని చాకచక్యంగా మాట్లాడాడు. విషయాన్ని చెప్పేపద్ధతిలో ఎంతో నేర్పును ప్రదర్శించాడు. హనుమంతుని మాటతీరు శ్రీరాముణ్ణి ఆకట్టుకుంది. లక్ష్మణుడితో 'ఇతడు వేదాలను, వ్యాకరణాన్ని క్షుణ్ణంగా చదివాడన్నది నిశ్చయం. లేకపోతే మాటల్లో ఇంత స్పష్టత ఉండదు. తడబాటు, తొందరపాటు లేకుండా, తప్పులు పలకకుండా, సరైన స్వరంతో చెప్పదలచుకున్న విషయాన్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్పాడు. ఈయన మాట్లాడే తీరుచూస్తే చంపడానికి కత్తి ఎత్తిన శత్రువుకు కూడా చేతులు రావు' అని మెచ్చుకున్నాడు. **మాటకున్న శక్తి అటువంటిది.**

హనుమంతుడితో లక్ష్మణుడినే మాట్లాడమన్నాడు శ్రీరాముడు. హనుమంతుడి అభిప్రాయాలకు సమ్మతి తెలుపుతూ. తమ వృత్తాంతాన్ని వివరించాడు లక్ష్మణుడు. తమకు సుగ్రీవుడి సహాయం ఎంతో తగినదన్నాడు. సన్న్యాసిరూపం వదలి రామలక్ష్మణులను భుజాలపై ఎక్కించుకొని ఋష్యమూక పర్వతానికి చేరుకున్నాడు హనుమ. అంతకు ముందే భయంతో మలయగిరికి చేరిన సుగ్రీవుణ్ణి రామలక్ష్మణుల వద్దకు తీసుకువచ్చాడు ఆంజనేయుడు.

శ్రీరామ సుగ్రీవులు అగ్నిసాక్షిగా మిత్రులైనారు. సుగ్రీవుడు 'రామా! ఈనాడు నీవు నాకు ప్రాణమిత్రుడివైనావు. ఇప్పటి నుంచి సుఖదుఃఖాలలో మనం ఒక్కటిగానే ఉందాం. వాలి భయం నన్ను వదలడంలేదు. నీ అభయం కావాలి' అని ప్రార్థించాడు. శ్రీరాముడు మందహాసాన్ని చిందిస్తూ' సుగ్రీవా! ఆపదలో ఆదుకునేవాడే గదా మిత్రుడు. నీ భార్యను అపహరించిన వాలిని తప్పక వధిస్తాన'ని మాట ఇచ్చాడు. సుగ్రీవుడి మనసు కుదుటపడింది.

శ్రీరామసుగ్రీవులు స్నేహపూర్వకంగా మాట్లాడుకుంటున్న సమయంలోనే సీతాదేవికి, వాలికి, రావణాసురునికి ఎడమకన్ను ఒక్కసారిగా అదిరింది.

సుగ్రీవుడు గతంలో తాను నలుగురు మంత్రులతో కొండమీద ఉన్నప్పుడు ఒక రాక్షసుడు స్త్రీని బలవంతంగా తీసుకుపోవడం చూశామన్నాడు. ఆమె 'రామా!' 'లక్ష్మణా!' అని బిగ్గరగా అరవడం విన్నామన్నాడు. తమను చూసి ఒక నగల మూటను జారవిడచిందని చెప్పి, ఆ ఆభరణాలను తెచ్చి చూపించాడు. శ్రీరాముడు వాటిని చూసి కన్నీటి సంద్రమయ్యాడు. లక్ష్మణుడు 'అన్నా! ఈ కేయూరాలను, కుండలాలను నేను గుర్తుపట్టలేను. కాని కాలి అందెలు మాత్రం మా వదినెగారివే. ఆమెకు నిత్యం పాదాభివందనం చేయడంవల్ల నేను వీటిని గుర్తుపట్టా'నన్నాడు.

శ్రీరాముడి శోకాన్ని పోగొట్టే ప్రయత్నం చేశాడు సుగ్రీవుడు. సీతాదేవిని తీసుకురావడంలో తాను తగిన ప్రయత్నం చేస్తానన్నాడు. సపరివారంగా రావణుణ్ణి హతమార్చేందుకు తన శక్తియుక్తులన్నింటినీ వినియోగిస్తానన్నాడు. దుఃఖం అనర్థదాయకం కనుక ఎప్పుడూ దుఃఖించవద్దన్నాడు. ఎల్లప్పుడూ దుఃఖించేవారికి సుఖముండదు. తేజస్సు క్షీణిస్తుంది. ఒక్కొక్కప్పుడు ప్రాణాలు నిలవడమే కష్టంగా ఉంటుంది. కనుక దుఃఖస్థితినుంచి బయట పడమని ధైర్యవచనాలను చెప్పాడు.

'ఓ రామా! నిజమైన మిత్రుడు తన స్నేహితుడికోసం సంపదలను, సుఖాలను, చివరకు తన ప్రాణాలను కూడా విడవడానికి సిద్ధపడతాడు. ప్రాణమిత్రులమైన మనం స్నేహధర్మాన్ని చక్కగా పాటిద్దా'మన్నాడు. శ్రీరాముడు అందుకు అంగీకరిస్తూ 'ఉపకారం జరగడమే మిత్రునివల్ల ఫలం – అపకారం చేయడం శత్రువు లక్షణం. నీ భార్యనపహరించిన వాలిని ఈరోజే చంపుతా'నన్నాడు. వాలితో వైరమెందుకు వచ్చిందో తెలపమన్నాడు సుగ్రీవుణ్ణి. గతకథను శ్రీరాముడి చెవిన వేశాడు సుగ్రీవుడు.

'మా అన్న వాలి మహాబలశాలి. పెద్దవాడు కనుక మా తండ్రి తరవాత కిష్కింధకు రాజైనాడు. మాయావి అనే వాడికి మా అన్నతో వైరం. ఒకనాటి అర్ధరాత్రి మాయావి కిష్కింధకు వచ్చి వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. మేమెంతగా వారించినా వాలి వినకుండా వానితో పోరుకు సిద్ధమయ్యాడు. మమ్ములను చూడగానే మాయావి భయంతో వెనుదిరిగి పిక్కబలంచూపాడు. మేము వెంబడించాం. అతడు ఒక పెద్ద భూగృహంలోకి వెళ్ళాడు. వాలి ఆవేశంతో ఊగిపోతున్నాడు. నన్ను బిలద్వారం దగ్గరే ఉండమన్నాడు. మాయావిని చంపి వస్తానని వెళ్లాడు. సంవత్సరమైంది. అన్నజాడేలేదు. నా ఆశలు అడుగంటాయి. ఆందోళన ఎక్కువైంది. ఇంతలో నురుగుతోకూడిన రక్తం గుహలో నుంచి బయటకు వస్తున్నది. లోపల రాక్షసునివి, అన్నగారి అరుపులు వినిపిస్తున్నాయి. మాయావిచేతిలో మా అన్న చనిపోయాడనుకున్నాను. రాక్షసుడు బయటకు వస్తాడేమోనని కొండంత బండతో బిలద్వారాన్ని మూసేశాను. మౌనంగా కిష్కింధకు వచ్చాను. మంత్రులు నా ద్వారా సమాచారాన్ని తెలుసుకొన్నారు. బలవంతంగా నన్ను రాజును చేశారు. కొంతకాలానికి వాలి వచ్చాడు. నన్ను రాజును చేయడం చూసి కనులెర్రజేశాడు, నా కుమారులను చెరసాలలో బంధించాడు. ఎంత బతిమాలినా క్షమించలేదు. సరికదా నన్ను రాజ్యభ్రష్టుణ్ణి చేయడమేకాదు. నా భార్య రుమను అపహరించాడు. ప్రాణభీతితో పరుగులుతీశాను. సమస్తభూమండలం తిరిగాను. చివరకు ఈ ఋష్యమూక పర్వతాన్ని చేరుకున్నాను. మతంగమునిశాపం కారణంగా వాలి ఇక్కడకు రాలేదు. వాలి దుందుభి అనే రాక్షసుణ్ణి చంపి విసిరివేసినప్పుడు ఆ రాక్షసుడి నోటినుండి రక్తబిందువులు మతంగాశ్రమం మీద పడ్డాయి. అందుకు కోపించిన ముని ఋష్యమూక పర్వతం మీద కాలుపెడితే వాలి మరణిస్తాడని శపించాడు' అంటూ సుగ్రీవుడు తన కథనంతా చెప్పాడు.

శ్రీరాముని బలమెలాంటిదో తెలుసుకోవాలనుకున్నాడు సుగ్రీవుడు. దానికి జవాబుగా శ్రీరాముడు కాలి బొటనవేలితో అక్కడ పడివున్న దుందుభి అస్థిపంజరాన్ని పదియోజనాల దూరం పడేటట్లు చిమ్మివేశాడు. ఒకే బాణంతో ఏడు మద్దిచెట్లను చీల్చాడు. సంతోషించాడు సుగ్రీవుడు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

వాలివధకు ఇక ఏ మాత్రం ఆలస్యం వద్దని శ్రీరాముణ్ణి తొందరపెట్టాడు. అందరూ కిష్కింధకు వెళ్ళారు. సుగ్రీవుడు భయంకరంగా గర్జిస్తూ వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. మహాబలశాలి అయిన వాలి క్షణాలలో అక్కడ వాలాడు. ఇద్దరి యుద్ధం అక్కడ భయానకవాతావరణాన్ని సృష్టించింది. వాలిసుగ్రీవులు ఒకే పోలికతో ఉన్నారు. అందుకే శ్రీరాముడు వాలిని స్పష్టంగా గుర్తించలేకపోయాడు. వాలి విజృంభణకు తట్టుకోలేకపోయాడు సుగ్రీవుడు. శ్రీరాముడి కొరకు చూశాడు. కనిపించలేదు. గుండెగుభేలుమంది. ప్రాణభయంతో ఋష్యమూకానికి పరుగులుతీశాడు సుగ్రీవుడు. అక్కడకు వెళ్ళలేని వాలి సుగ్రీవుడితో 'బతికావు పో' అని మరలిపోయాడు.

లక్ష్మణ హనుమంతులతో కూడి శ్రీరాముడు సుగ్రీవుడి దగ్గరికి వచ్చాడు. సుగ్రీవుడు సిగ్గుతో తల దించుకున్నాడు. 'నీ సూచన పాటించినందుకు ఫలితమిదేనా?' అని ప్రశ్నించాడు. శ్రీరాముడు అసలు విషయం చెప్పాడు. సుగ్రీవుణ్ణి గుర్తించడానికి వీలుగా 'నాగకేసర పూలత' ను మెడలో వేయమని లక్ష్మణుడికి చెప్పాడు. అన్న ఆజ్ఞను వెంటనే అమలుచేశాడు లక్ష్మణుడు. పూలతో నిండిన ఆ లతను ధరించి సుగ్రీవుడు తిరిగి యుద్ధానికి సన్నద్ధమయ్యాడు.

కిష్కింధకు ప్రయాణమయారందరూ. సుగ్రీవుడు వాలిని మళ్ళీ యుద్ధానికి ఆహ్వానించాడు. వాలి అడుగుముందుకు వేశాడు. కాని అతని భార్య తార అడ్డుపడింది. ఒకసారి ఓడిపోయి దెబ్బలు తిన్న సుగ్రీవుడు మళ్ళీ ఆహ్వానించడం వెనక ఏదో ఆంతర్యం ఉందని అభిప్రాయపడింది. సుగ్రీవుడికి శ్రీరాముడు అండగా ఉన్నాడన్న విషయాన్ని ప్రస్తావించింది. యుద్ధానికి వెళ్ళడం క్షేమంకాదని వారించింది. తారమాటలను పెడచెవిన పెట్టాడు వాలి. యుద్ధదిశగా అడుగులు వేశాడు.

వాలిసుగ్రీవుల పోరు తీవ్రంగా సాగుతున్నది. రక్తం కారుతున్నా పట్టించుకునే స్థితిలో లేరు వాళ్ళిద్దరూ. మెల్లమెల్లగా సుగ్రీవుని శక్తి సన్నగిల్లుతున్నది. మాటిమాటికి దిక్కులు చూస్తున్నాడు. అతని ఆంతర్యం అర్థమైంది శ్రీరాముడికి. విషసర్పంతో సమానమైన బాణాన్ని అతడు వాలిమీదకు వదిలాడు. అది క్షణాలలో వాలివక్షఃస్థలంలో నాటుకున్నది. వాలి నేలమీదికి వాలిపోయాడు. స్పృహకోల్పోయాడు. రక్తపుమడుగులో పడివున్న వాలి కొంతసేపటికి తేరుకున్నాడు. రామలక్ష్మణులను చూశాడు. శ్రీరామునితో 'ఉత్తముడని పేరుపొందిన నీవు ఇంత అధర్మంగా ఎందుకు ప్రవర్తించావు? నీకు నీ దేశానికి నేనెన్నడూ అపకారం చేయతలపెట్టలేదు. అలాంటప్పుడు నన్నెందుకు చంపవలసివచ్చింది. నిన్ను ఎదిరించి యుద్ధమే చేయలేదు. వేరొకరితో పోరుతున్నప్పుడు ఎందుకు దొంగదెబ్బ తీశా'వని నిలదీశాడు. సీతాదేవి కొరకు సుగ్రీవుణ్ణి ఆశ్రయించడంకన్నా తనను కోరివుంటే బాగుండేదన్నాడు. ఒక్కరోజులో సీతాదేవిని తెచ్చి అప్పజెప్పేవాడనని పలికాడు. రావణుణ్ణి యుద్ధంలో బంధించి తెచ్చి నీ ముందుంచే వాడినని తెలిపాడు.

శ్రీరాముడు వాలి అభిప్రాయాలను తోసేశాడు. తమ్ముడి భార్యను చెరబట్టడం వంటి అధర్మాలకు ఒడిగట్టినందువల్ల నేను నీకు మరణదండన విధించానన్నాడు శ్రీరాముడు. వానరుడివి కనుక చాటుగా ఉండి చంపడంలో తప్పులేదన్నాడు.

శ్రీరాముని మాటలు విన్న వాలి తన తప్పును తెలుసుకున్నాడు. మన్నించమని దోసిలొగ్గాడు. భర్త విషయం తెలుసుకున్న తార పరుగుపరుగున వచ్చింది. మరణవేదనతో కింద పడివున్న వాలి దీనస్థితిని చూసింది. గుండె చెరువయేటట్లు ఏడ్చింది. ప్రాయోపవేశానికి సిద్ధపడిన తారను హనుమంతుడు ఓదార్చాడు. తార, అంగదుల బాధ్యతను సుగ్రీవునకు వాలి అప్పజెప్పాడు. తనమెడలోని దివ్యమైన సువర్ణమాలను సుగ్రీవునకిచ్చి వెంటనే ధరించమన్నాడు. లేకుంటే వాలి చనిపోయిన మరుక్షణమే ఆ మాలకున్న శక్తి నశిస్తుంది. కొడుకైన అంగదుడికి జీవితంలో ఎలా నడచుకోవాలో ఉపదేశించాడు. బాణం వల్ల కలుగుతున్న బాధ అంతకంతకూ అధికమై ప్రాణాలను వదిలాడు. వాలి జీవితాధ్యాయం ముగిసింది.

సుగ్రీవ హనుమదాదులు శ్రీరాముడి దగ్గరికి వచ్చారు. హనుమంతుడు శ్రీరాముడితో సుగ్రీవుని పట్టాభిషేక విషయం ప్రస్తావించాడు. దీనికోసం కిష్కింధకు రమ్మని ప్రార్థించాడు. తండ్రి ఆజ్ఞమేరకు పద్నాలుగు సంవత్సరాల వరకు ఏ గ్రామంలోగాని నగరంలోగాని తాను అడుగుపెట్టనని చెప్పి పితృవాక్యపరిపాలనను మరోమారు చాటుకున్నాడు శ్రీరాముడు. సుగ్రీవుడికి శుభం పలికాడు. తాను ప్రసవణగిరి మీద ఉంటానన్నాడు. వర్షాకాలం పోయాక సీతాన్వేషణ ప్రయత్నం ప్రారంభించమని సుగ్రీవుణ్ణి ఆదేశించాడు. సరేనన్నాడు సుగ్రీవుడు.

కిష్కింధకు రాజుగా సుగ్రీవుడు, యువరాజుగా అంగదుడు పట్టాభిషిక్తులయారు. కాలం గడుస్తూన్నది. శరత్కాలం వచ్చింది. సీతాన్వేషణకార్యభారాన్ని సుగ్రీవుడికి గుర్తుచేశాడు హనుమంతుడు. తదనుగుణంగా సేనలను సమీకరించమని సేనాపతి అయిన 'నీలుణ్ణి' ఆజ్ఞాపించాడు సుగ్రీవుడు. ఇది శ్రీరాముడికి తెలియదు. లక్ష్మణుణ్ణి పిలిచి సుగ్రీవుడి దగ్గరికి వెళ్ళమన్నాడు.

లక్ష్మణుడు కిష్కింధకు పయనమయాడు. సుగ్రీవుడు రాజభోగాలలో ఓలలాడుతున్నాడు. సీతాదేవి ఎడబాటువల్ల నిలువునా నీరవుతున్న అన్నగారు, నిర్లక్ష్యంతో సుగ్రీవుడు – లక్ష్మణునికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. బుసలు కొడుతున్నాడు. అతని ముందుకు రావడానికి ఎవరికీ కాళ్ళాడడంలేదు. వానరులూ, మంత్రులేకాదు – సుగ్రీవుడి పరిస్థితీ అంతే. మందిరద్వారం దగ్గరికి వచ్చిన లక్ష్మణుడితో మాట్లాడటానికి తార వెళ్ళింది. స్త్రీలపట్ల కోపం ప్రదర్శించగూడదని శాంతించాడు లక్ష్మణుడు. సుగ్రీవుడు సీతాన్వేషణకు ప్రయత్నాలు మొదలుపెట్టాడని తార లక్ష్మణుడికి తెలిపింది. అంతఃపురంలో ఉన్న సుగ్రీవుణ్ణి కలిశాడు లక్ష్మణుడు. శ్రీరాముడి దయవల్లనే తానీ స్థితిలో ఉన్నానని కృతజ్ఞత ప్రకటించాడు సుగ్రీవుడు. మహా పరాక్రమశాలి శ్రీరాముడికి తన సహాయం నిమిత్తమాత్రమేనన్నాడు. తనవైపునుంచి ఏదైనా తప్పు జరిగితే మన్నించమన్నాడు. లక్ష్మణుడు శాంతించాడు. తన అన్నగారి దగ్గరికి సుగ్రీవుణ్ణి రమ్మన్నాడు.

సుగ్రీవుడు వివిధ ప్రాంతాలలోగల వానర వీరులను రావలసిందిగా చెప్పమని హనుమంతుణ్ణి ఆజ్ఞాపించాడు. పదిరోజుల్లోగా రాకపోతే వాళ్ళకు మరణదండన తప్పదని హెచ్చరించాడు. హనుమంతుడు ఈ వార్తను అన్ని దిక్కులకూ వేగంగా పంపాడు. ఫలితంగా కోట్లమంది వానరయోధులు కిష్కింధకు చేరుకుంటున్నారు. సుగ్రీవుని ఆజ్ఞ అటువంటిది. దానికి తిరుగులేదు. **అందుకే 'సుగ్రీవాజ్ఞ' అనేది జాతీయంగా స్థిరపడ్డది.**

శ్రీరాముడితో సుగ్రీవుడు సమావేశమయ్యాడు. వానరుల రాకను గురించి తెలిపాడు. సీతజాడను తెలుసుకోవడం, రావణుడి నివాసాన్ని పసిగట్టడమే ప్రధానకర్తవ్యమన్నాడు శ్రీరాముడు. శ్రీరాముని సూచన మేరకు సీతాన్వేషణకోసం వానర వీరులను నలుదిక్కులకు పంపాడు తూర్పు దిక్కునకు 'వినతుని' నాయకత్వంలో సేనను పంపాడు. దక్షిణ దిక్కుకు అంగదుని నాయకత్వంలో హనుమంతుడు, జాంబవంతుడు మొదలైన ప్రముఖులతో కూడిన సేనను పంపాడు. మేనమామ అయిన సుషేణుని నాయకత్వంలో పడమరకు, శతబలి నాయకత్వంలో ఉత్తర దిశకు సేనను పంపాడు. ఒక్కొక్క దిక్కున ఏయే ప్రదేశాల గుండా వెళ్లాలో, అక్కడ ఏమేమి ఉంటాయో వివరంగా చెప్పాడు సుగ్రీవుడు. ఆ ప్రదేశాలకు సంబంధించిన అతని జ్ఞానం చూస్తే ముక్కున వేలేసుకుంటాం. నెలరోజుల్లో సమాచారం తెమ్మని సుగ్రీవాజ్ఞ. సీతాన్వేషణను సఫలం చేయగల సమర్థుడు హనుమంతుడేనని సుగ్రీవుడి నమ్మకం. హనుమంతుడూ అంతే విశ్వాసంతో ఉన్నాడు. శ్రీరాముడి భావనకూడా అదే. అందుకే తనపేరు చెక్కిఉన్న ఉంగరాన్ని హనుమంతుడికి ఇచ్చాడు శ్రీరాముడు. సీత దీన్ని చూస్తే హనుమను రామదూతగా నమ్ముతుందన్నాడు. హనుమంతుడు నమస్కరించి రామముద్రికను గ్రహించాడు. శ్రీరాముని పాదాలకు ప్రణమిల్లి ప్రయాణమయ్యాడు.

సీతాన్వేషణకు బయలుదేరి నెలరోజులు కావస్తున్నది. తూర్పు, పడమర, ఉత్తర దిక్కులకు వెళ్ళినవాళ్ళు తీవ్రంగా వెదికి



వెదికి రిక్తహస్తాలతో వెనుదిరిగారు. గడువు ముగిసేనాటికి ప్రసవణగిరిలో శ్రీరామునితో ఉన్న సుగ్రీవుడి దగ్గరికి చేరుకున్నారు. సీతజాడ కోసం చేసిన కృషి ఫలించలేదని విన్నవించుకున్నారు. హనుమంతుడు ఈ విషయంలో కృతకృత్యుడౌతాడని ధీమా వ్యక్తంచేశారు. ఎందుకంటే రావణుడు సీతను తీసుకెళ్ళింది దక్షిణంవైపే గదా.

అంగదుని నాయకత్వంలో దక్షిణం వైపుకు బయలుదేరిన హనుమంతుడు మొదలైనవాళ్ళు అణువణువునా గాలిస్తున్నారు. సుగ్రీవుడిచ్చిన గడువు పూర్తయింది. ఏం చేయాలో తోచడం లేదు. తమ వాళ్ళు నిరాశ పడకుండా జాగ్రత్తపడ్డాడు అంగదుడు. విరక్తి పొందకుండా ధైర్యోత్సాహాలతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని ప్రేరేపించాడు. అందరూ రెట్టించిన ఉత్సాహంతో ముందుకు కదిలారు.

హనుమదాదులు ఒక పెద్ద గుహదగ్గరికి చేరుకున్నారు. అది 'ఋక్షబిలము'. ఒక రాక్షసుని అధీనంలో ఉంది. బాగా అలసిపోయిన వానరులను ఆకలిదప్పులు పట్టి పీడిస్తున్నాయి. గుహలోకి వెళ్ళారు. అంతా అయోమయంగా ఉంది. చివరకు స్వయంప్రభ అనే యోగిని అనుగ్రహంతో ఆకలిదప్పులను తీర్చుకున్నారు. ఆమెను ప్రార్థించి ఆమె తపఃప్రభావం వల్ల క్షణాలలో ఒక పెద్దసముద్రపు ఒడ్డుకు చేరుకున్నారు. ఆ సముద్రం 'మహోదధి' ఉవ్వెత్తున లేచే అలల అలజడి భయాన్ని కలిగిస్తున్నది.

సముద్రతీరంలో వానరులంతా సమావేశమయారు. ఏం చెయ్యాలో తీవ్రంగా చర్చించుకుంటున్నారు. సీత జాడ కనిపెట్టకుండా సుగ్రీవుని చేరరాదనుకున్నారు.

వీళ్ళ మాటల్లో 'జటాయువు' ప్రస్తావన వచ్చింది. అది విన్నాడు 'సంపాతి'. ఇతడు పక్షిరాజు, జటాయువుకు అన్న. రెక్కలులేక పడి ఉన్నాడు. సంపాతి తన సోదరుడి మరణానికి ఎంతో విలపించాడు. లంకలో సీత ఉన్న పరిస్థితులను నిశితదృష్టితో చూసి కళ్ళకుకట్టినట్లు వివరించాడు. లంకకు ఎలా వెళ్లాలో చెప్పాడు. ఇంతలో ఆశ్చర్యకరంగా సంపాతికి రెక్కలు

మొలిచాయి. **పరోపకారపుణ్యం ఊరికేపోతుందా?** అందరూ ఆనందించారు. తన రెక్కల బలాన్ని తెలుసుకోడానికి రివ్వున ఆకాశంలోకి ఎగిరాడు సంపాతి.

వానరవీరులు బలపరాక్రమాలను ప్రదర్శించడం ద్వారానే సీతాన్వేషణ సఫలమౌతుందన్న నిశ్చయానికి వచ్చారు. కాని వంద యోజనాలు వెళ్ళి రాగలవారెవ్వరని తర్కించుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్యహాని కలగకుండా కాపాడగలవాడు హనుమంతుడొక్కడేనని నిగ్గుదేల్చాడు జాంబవంతుడు. ఆ సమయంలో హనుమంతుడు ఒకచోట ఏకాంతంగా కూర్చొని ఉన్నాడు.

జాంబవంతుడు హనుమంతుణ్ణి చేరాడు. అతని శక్తియుక్తులెంతటివో తెలుపుతూ ప్రేరేపించాడు. దీనికి వానరుల ప్రశంసలు తోడైనాయి. ఇంకేముంది? హనుమంతుడు రెట్టించిన ఉత్సాహంతో బలాన్ని పుంజుకున్నాడు. అద్భుతమైన తేజస్సుతో వెలుగుతున్నాడు. వానరులతో 'నేను మేరుపర్వతాన్ని అనాయాసంగా వేలమార్లు చుట్టగలిగాను భూమండలాన్ని సముద్రంలో ముంచగలను, గ్రహనక్షత్రాలను అధిగమించగలను, పర్వతాలను నుగ్గు నుగ్గు చేయగలను. మహాసముద్రాలను అవలీలగా దాటగలన'ని ఆత్మశక్తిని ప్రకటించాడు. **ప్రతివారిలో ఏదో ఒక శక్తి ఉంటుంది. సరైన ప్రేరణ దొరికితే అది వెలికి వస్తుంది.**

హనుమంతుడి మాటలకు జాంబవంతుడు ఆనందించాడు. 'నాయనా! నీ ధైర్యోత్సాహాలకు తగినట్లు మాట్లాడావు. నీ మాటలు వానరుల మనసులో గూడుకట్టుకున్న దుఃఖాన్ని దూరం చేశాయి. అందరం నీ శుభాన్ని కోరుతున్నాం. ఋషులు, వృద్ధవానరులు, గురువుల అనుగ్రహంతో ఈ సముద్రాన్ని లంఘించు. నీ రాకకోసం ఎదురుచూస్తుంటాం. మన వానరుల ప్రాణాలన్నీ నీపైనే ఆధారపడివున్నా'యని తెలిపాడు. తాను లంఘించే సమయంలో తన బలాన్ని భూమి భరించలేదని, మహేంద్రపర్వతశిఖరాలు అందుకు తగినవని హనుమంతుడు పలికి మహేంద్రగిరికి చేరాడు.

# సుందర కాండ

మహాబలుడైన మారుతి సూర్యునికి, మహేంద్రునికి, వాయువుకు, బ్రహ్మకు, ఇతరదేవతలకు నమస్కరించాడు. తన శరీరాన్ని పెంచాడు. ఒళ్ళువిరిచాడు. ప్రళయకాల మేఘగర్జనలా మహానాదంచేశాడు. చేతులను నడుముమీద ఉంచాడు. పాదాలను దట్టించాడు. చెవులను రిక్కించాడు. తోకను విదల్చాడు. అంగదాది మహావీరులతో, 'వాయువేగంతో సాగిపోయే రామబాణంలాగ లంకకు వెళతాను. అక్కడ సీతామాతను చూడలేకుంటే అదే వేగంతో స్వర్గానికి వెళ్ళటం. అక్కడ కూడా సీతామాత దర్శనం కాకుంటే రావణుని బంధించి తీసుకువస్తా. ఏది ఏమైనా కార్యసఫలతతో తిరిగివస్తా'నని పలికాడు. ఒక్క ఉదుటున అంతరిక్షంలోకి ఎగిరాడు. శ్రీరామకార్యానికి వెళుతున్న హనుమంతునికి సూర్యుడు తాపాన్ని కలిగించలేదు. వాయువు చల్లగా ప్రసరించాడు. దేవతలు, గంధర్వులు, మహర్షులు కీర్తించారు.

సముద్రంపై సాగిపోతున్న హనుమంతుణ్ణి చూసి సాగరుడు సహాయపడదలచాడు. తానింతవాడు కావడానికి ఇక్ష్వాకు ప్రభువైన సగరుడేకారణమని సాగరుని అభిప్రాయం. ఆ ఇక్ష్వాకు కులతిలకుడైన శ్రీరాముని కార్యంకోసం వెళుతున్న హనుమంతునికి శ్రమ కలగగూడదనుకున్నాడు. సముద్రంలో ఉన్న మైనాకుణ్ణి బయటకు రమ్మన్నాడు. అతని బంగారు గిరిశిఖరాలమీద హనుమంతుడు ఒకింతసేపు విశ్రాంతి తీసుకోగలడని భావించాడు. మైనాకుడు సరేనన్నాడు. ఒక్కసారిగా సముద్రంమధ్యనుంచి పైకి లేచాడు. అకస్మాత్తుగా పైకి లేచిన మైనాకుణ్ణి తనకు ఆటంకంగా తలచాడు మారుతి. తన ఎదతో నెట్టివేశాడు. మైనాకుడు అబ్బురపడ్డాడు. మానవరూపంలో గిరిశిఖరం మీద నిలచాడు. సముద్రుని కోరికను తెలిపాడు. హనుమంతుడు మైనాకునితో 'నీ ఆదరపూర్వకమైన మాటలకు తృప్తిపడ్డాను. ఆతిథ్యం అందుకున్నట్లే భావించు. సమయంలేదు. ఆగడానికి వీలులేదు' అని చెప్పి చేతితో అతణ్ణి తాకాడు. ఆతిథ్యం గ్రహించినట్లుగా తెలిపి ముందుకుసాగాడు.

హనుమంతుణ్ణి పరీక్షించడానికి వచ్చిన 'సురస' అనే నాగమాత అతని సూక్ష్మబుద్ధిని, సమయస్ఫూర్తిని చూసి ఆనందించి ఆశీర్వదించింది. 'సింహిక' అనే రాక్షసి హనుమంతుని మింగాలని చూసింది. కాని హనుమంతుడే తన వాడి అయిన గోళ్ళతో సింహికను చీల్చేశాడు.

త్రికూట పర్వతంమీదున్న లంకకు చేరాడు హనుమంతుడు. నూరు యోజనాలు ప్రయాణించినా అణుమాత్రమైనా అలసిపోలేదు. శత్రుదుర్భేద్యమైన లంకను చూశాడు. అందులో ప్రవేశించడానికి రాత్రి సమయమే అనుకూలమనుకున్నాడు. అంతవరకు వేచి ఉన్నాడు. రాత్రికాగానే పిల్లి ప్రమాణంలోకి తన శరీరాన్ని కుదించుకుని లంకలోకి ప్రవేశించాడు. ఇంతలో లంకాధిదేవత (లంకిణి) అతన్ని చూసింది. 'నీవెవరు? ఎందుకొచ్చావ'ని నిలదీసింది. యథార్థం చెప్పమని గద్దించింది. తనను కాదని లంకలో ప్రవేశించడం సాధ్యంకాదన్నది. తన చేతిలో చావు తప్పదని హనుమంతుణ్ణి బెదిరించింది. హనుమంతుడు 'లంకానగరం అందంగా ఉంటుందని విన్నాను. ఒకసారి చూసిపోవాలని వచ్చాను. చూశాక వచ్చిన దారినే వెళతా'నని చెప్పాడు. లంకిణి భయంకరంగా అరుస్తూ తన అరచేతితో హనుమంతుని బలంగా కొట్టింది. హనుమంతుడు మహానాదం చేస్తూ ఎడమచేతితో లంకిణిపై ఒక్కదెబ్బవేశాడు. స్త్రీ అని గట్టిగా కొట్టలేదు. కాని ఆమాత్రం దెబ్బకే కూలబడిపోయింది లంకిణి. బ్రహ్మ ఇచ్చిన వరం జ్ఞాపకం చేసుకుంది. ఒక వానరుడు వచ్చి లంకిణిని జయించినప్పుడు రాక్షసులకు కీడుమూడుతుందని బ్రహ్మ చెప్పాడు. ఆ సమయం ఆసన్నమైందని హనుమంతునితో పలికింది. లంకలోకి వెళ్ళమని చెప్పింది.

హనుమంతుడు ముఖద్వారం గుండా లంకలోకి వెళ్ళలేదు. ప్రాకారంపై నుండి దూకి వెళ్ళాడు. అది కూడా ఎడమ పాదం ముందుబెట్టి. **శత్రువుల వద్దకు వెళ్ళే సంప్రదాయం ఇది.** లంకలో ప్రవేశించిన మారుతి చిత్రవిచిత్రాలైన ఇండ్లను చూశాడు. సంగీత మాధుర్యాన్ని చవిచూశాడు. వేదఘోషను విన్నాడు. రకరకాల వాళ్ళను చూశాడు. సర్వాంగసుందరమైన

రావణుని భవనాన్ని చూశాడు. ఎక్కడా సీత జాడ కనిపించలేదు. మహాపార్శ్వ, కుంభకర్ణ, విభీషణ, మహోదర, విరూపాక్ష, విద్యుజ్జిహ్వాదుల భవనాలన్నీ వెతికాడు.

రావణాంతఃపురంలోకి వెళ్ళాడు. ఎందరో స్త్రీలు చెల్లా చెదరుగా పడుకొని నిద్రపోవడం చూశాడు. ప్రత్యేక శయ్యపై పవళించిన ఒక స్త్రీని చూశాడు. మహా సౌందర్యంతో వెలిగిపోతున్న ఆమె రావణుని భార్య మండోదరి. కాని హనుమంతుడు సీత అని భ్రమించాడు. సీతను చూశాననుకొని గంతులు వేశాడు. కొద్దిసేపటికే తన ఆలోచన తప్పని గ్రహించాడు. శ్రీరాముణ్ణి ఎడబాసి సీత ఇలా ఉండగలుగుతుందా? అని అనుకున్నాడు. ఆమె సీత కానేకాదని నిశ్చయించుకున్నాడు.

ఎక్కడా సీత జాడ తెలియకపోయేసరికి సీత మరణించిందేమోనని సందేహించాడు హనుమంతుడు. సీత జాడను కనిపెట్టలేకపోయిన తాను ఏ ముఖం పెట్టుకుని తిరిగివెళ్ళాలని బాధపడ్డాడు. అయినా నిరుత్సాహపడగూడదని నిర్ణయించుకున్నాడు. ఇంత వరకు వెతకని ప్రాంతాలకు వెళ్ళాలని తీర్మానించుకున్నాడు. ఎక్కడకు వెళ్ళినా నిరాశే కలుగుతున్నది. సీత కనబడలేదని చెబితే శ్రీరాముడు జీవించడు. అతడు లేక లక్ష్మణుడుండడు. వీరి మరణ వార్త విని భరత శత్రుఘ్నులుండరు. పుత్రుల మరణానికి తట్టుకోలేక కౌసల్యా సుమిత్రా కైకేయీ తనువులు చాలిస్తారు. ప్రియమిత్రుణ్ణి వీడి సుగ్రీవుడు బతకడు. దానితో రుమ తారాంగదులు మిగలరు. ఇది చూసి వానరజాతి ఈ లోకాన్ని వీడుతుంది. ఇందరి మరణానికి కారణం కావడంకన్నా ప్రాయోపవేశంతో ప్రాణాలు వదలడమే మంచిదనిపించింది మారుతికి. కాని తర్కించి చూస్తే ఆత్మహత్యకన్నా బతికుండడమే ఎన్నో విధాల ఉత్తమమనిపించింది. చచ్చి సాధించేదేమిటి? బతికితే సుఖాలను, శుభాలను పొందవచ్చు. బతికి ఉన్నవాళ్ళు ఎన్నడైనా కలుసుకోవచ్చు. అందుకే ప్రాణాలను నిలుపుకోవాలని నిర్ణయించుకున్నాడు.

అప్పటివరకు వెతకని అశోకవనంలోకి వెళ్ళాలనుకున్నాడు హనుమంతుడు. సీతారామలక్ష్మణులకు, రుద్ర, ఇంద్ర, యమ, వాయుదేవులకు సూర్యచంద్ర మరుద్గణాలకు నమస్కరించాడు. అశోకవనంలోకి అడుగుపెట్టాడు. ఇంద్రుని నందనవనం లాగా ఉంది అశోకవనం.

అణువణువునా వెదికాడు హనుమంతుడు. ఎత్తైన శింశుపావృక్షాన్ని ఎక్కాడు. దానికింద మలిన వస్త్రాలను కట్టుకొని ఉన్న ఒక స్త్రీని చూశాడు. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలున్నారు. ఆమె కృశించి ఉంది. దీనావస్థలో ఉంది. ఆమె సీతే అనిపించింది హనుమంతునికి. ఆమె ధరించిన ఆభరణాలను చూశాడు. రాముడు చెప్పిన వాటితో సరిపోలాయి. ఋష్యమూక పర్వతంమీద పడిన ఆభరణాలు ఆమె శరీరంపై కనిపించడంలేదు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఆమె సీతే అని ధ్రువపరుచుకున్నాడు. ఆ వృక్షంపైనే ఉండిపోయాడు.

సీతాదేవిని చూడగానే హనుమంతుని కన్నుల నుండి ఆనందాశ్రువులు జారాయి. శ్రీరాముని స్మరించుకొని నమస్కరించాడు.

వేకువజామయింది. వేదఘోషలు వినబడుతున్నాయి. నిద్రలేచిన రావణుడు అశోకవనంవైపు అడుగులు వేస్తున్నాడు. సుగంధతైలాలతో తడిసి ఉన్న కాగడాలను ధరించిన స్త్రీలు ముందు నడుస్తున్నారు. రావణుని తేజస్సు చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు హనుమంతుడు. సీత దగ్గరికి వచ్చి రావణుడు నయానా, భయానా సీత మనసుమార్చే ప్రయత్నం చేశాడు. కాని ఎలాంటి ప్రలోభాలకు తాను లొంగనని సీత తేల్చిచెప్పింది. శ్రీరాముడి నుంచి తప్పించుకోడం సాధ్యంకాదని హెచ్చరించింది. రావణునిలో ఆవేశం పెల్లుబికింది. రెండు నెలల గడువు విధించాడు. ఎలాగైనా సీతను తన దారికి తెమ్మని రాక్షస స్త్రీలను ఆదేశించి తన భవనానికి చేరుకున్నాడు.

రాక్షస స్త్రీలు ఎన్నో రకాలుగా సీతకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆమె నిరాకరించింది. చివరకు సీతను చంపుతామని భయపెట్టారు. ఈ దుఃస్థితికి సీత ఎంతో విలపించింది. శ్రీరాముడికి దూరమై బతకడంకన్నా శరీరాన్ని విడవడమే మేలన్నది.

ఈ మాటలను విని కొందరు రాక్షస స్త్రీలు రావణుడికీ ఈ విషయం చెప్పడానికి వెళ్ళారు. ఇంకొందరు తక్షణమే సీతను బంధించగలమన్నారు. అంతవరకు నిదురించిన త్రిజట అప్పుడే మేల్కొంది. త్రిజట విభీషణుని కూతురు. రాక్షస స్త్రీలను అదలించింది. తనకు వచ్చిన కలను చెప్పింది. 'వేయి హంసలతో కూడిన పల్లకిమీద లక్ష్మణుడితో శ్రీరాముడు కూర్చున్నట్లు

చూశాను. సముద్రం మధ్య ఒక తెల్లని పర్వతంమీద సీత కూర్చోడం చూశాను. నూనెపూసిన శరీరంతో రావణుడు నేలమీద పడిఉండడం చూశాను. ఒక నల్లని స్త్రీ శరీరమంతా బురద పూసుకొని ఎర్రని వస్త్రములు కట్టి, రావణుని మెడకు తాడుకట్టి దక్షిణంవైపుగా ఈడ్చుకువెళ్ళడం చూశాను. వరాహం మీద రావణుడు, మొసలిమీద ఇంద్రజిత్తూ, ఒంటెమీద కుంభకర్ణుడు దక్షిణదిశగా వెళ్ళడం చూశాను. లంక ఛిన్నాభిన్నం కావడం చూశాను' అన్నది. స్వప్నంలో విమానదర్శనం కావడాన్ని బట్టి సీత కోరిక సిద్ధిస్తుందని, రావణునికి వినాశం తప్పదని, శ్రీరాముడికి జయం కలుగుతుందనీ చెప్పింది.

ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ సీతకు శుభశకునాలు తోచాయి. చెట్టుపైన ఉన్న హనుమంతుడు సీతాదేవిని ఎలా కాపాడుకోవాలో అని మథనపడ్డాడు. రామకథాగానమే సరైన మార్గమని ఎంచుకున్నాడు. సీతాదేవికి వినపడేటట్లు రామకథను వర్ణించాడు. సీతాదేవి అన్నివైపులా చూసింది. చెట్టుమీదున్న హనుమంతుణ్ణి చూసి ఆశ్చర్యానికి లోనైంది. హనుమంతుడు చెట్టుదిగి నమస్కరించాడు. 'అమ్మా నీవెవరు? ఒకవేళ సీతాదేవివే అయితే శుభమగుగాక. దయతో విషయాలు చెప్పు'మని ప్రార్థించాడు. తనను 'సీత' అంటారని తెలిపిందా సాధ్వి – తన వృత్తాంతమంతా వివరించింది.

హనుమంతుడు తాను శ్రీరామ దూతనని చెప్పుకొన్నాడు. దగ్గరగా వస్తున్న మారుతిని చూసి రావణునిగా అనుమానించింది సీత. నిజంగా రామదూతవే అయితే రాముణ్ణి గురించి వినిపించమంది. సీతకోరికపైన హనుమంతుడు శ్రీరాముని రూపగుణాలను వివరించాడు. శ్రీరాముని ముద్రికను సమర్పించాడు. దాన్ని చూసి పరమానందభరితురాలైంది సీత. తన



దైన్యాన్ని వివరించి శ్రీరాముణ్ణి త్వరగా లంకకు తీసుకువచ్చి రాక్షసుల చెరనుండి తనను విడిపించమని చెప్పమని మారుతికి చెప్పింది. అంతదాకా ఎందుకు? తన వీపుమీద కూర్చుంటే తక్షణమే శ్రీరాముడి సన్నిధికి చేరుస్తానన్నాడు హనుమంతుడు. ఇంత చిన్నవాడివి ఎలా తీసుకెళ్ళగలవని ప్రశ్నించింది సీత. హనుమంతుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. సంతోషించింది

సీత. అయినా హనుమతో వెళ్ళడానికి నిరాకరించింది. పరపురుషుని తాకనన్నది. శ్రీరాముడు రావణుణ్ణి సంహరించి తనను తీసుకుపోవడమే ఆయన స్థాయికి తగినదన్నది.

'అమ్మా! నా వెంట రావడం నీకు అంగీకారయోగ్యం కాకుంటే శ్రీరాముడు గుర్తించగల ఏదైనా ఆనవాలు ఇ'మ్మని అడిగాడు హనుమంతుడు. తమ అనుబంధానికి గుర్తుగా కాకాసురుని కథ చెప్పింది. కొంగుముడి విప్పి అందులోని దివ్యచూడామణిని హనుమంతునికిచ్చింది.

సీతాదేవి దర్శనంతో ప్రధానకార్యం ముగిసింది హనుమంతునికి. రావణుడు, అతని సైన్యపు శక్తిసామర్థ్యాలను కూడా తెలుసుకోవాలనిపించింది. అందుకు అశోకవనాన్ని ధ్వంసం చేయడమే మార్గంగా భావించాడు. అనుకున్నంతా చేశాడు ఆ కపివీరుడు. రాక్షస స్త్రీలు పరుగుపరుగున వెళ్ళి లంకేశునికీవిషయం చెప్పారు. రావణుడు ఎనభైవేల మంది రాక్షసులను పంపాడు. హనుమంతుడు వాళ్ళను మట్టుపెట్టాడు. తనపైకి వచ్చిన జంబుమాలిని, మంత్రిపుత్రులేడుగురిని రావణుడి సేనాపతులైదుగురిని, అక్షకుమారుణ్ణి అంతమొందించాడు. చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి హనుమంతుణ్ణి బంధించాడు. బ్రహ్మవరంచేత అది హనుమంతునిమీద క్షణకాలమే పనిచేస్తుంది. అయినా తాను దానికి కట్టుబడి ఉన్నట్లు నటించాడు హనుమంతుడు. రావణుని ముందు ప్రవేశపెట్టారతన్ని. రావణుడడుగగా తాను రామదూతనని చెప్పాడు. శ్రీరాముని పరాక్రమమెలాంటిదో సభాముఖంగా చాటాడు. సహించలేని రావణుడు హనుమంతుణ్ణి చంపమని ఆజ్ఞ ఇచ్చాడు. దూతను చంపడం భావ్యం కాదన్నాడు విభీషణుడు. ఇతర పద్ధతుల్లో దూతను దండించవచ్చునన్నాడు.

హనుమంతుని తోకకు నిప్పంటించి లంకంతా కలయ దిప్పమన్నాడు రావణుడు. బట్టలతో హనుమంతుని తోకను చుట్టారు. నూనెతో తడిపారు. తోకకు నిప్పుపెట్టి ఊరంతా ఊరేగిస్తున్నారు. హనుమంతుడు ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరాడు. విభీషణుని భవనం తప్ప లంకకంతా నిప్పుపెట్టాడు. **అందుకే '(సీతను) చూసిరమ్మంటే (లంకను) కాల్చివచ్చాడని' సామెత పుట్టింది.** లంకలో హాహాకారాలు మిన్నుముట్టాయి.

లంకను కాల్చాక హనుమంతుడు సముద్రంలో తోకను చల్లార్చుకున్నాడు. తోకతోపాటు ఆయన కోపంకూడా చల్లారింది. తాను తప్పు చేశాననుకున్నాడు. కోపం ఎంతో అనర్థదాయకమనుకున్నాడు. లంకంతా కాలి సీతామాత కూడా కాలిపోయి ఉంటుందని బాధపడ్డాడు. వచ్చిన పనిని చేజేతులా పాడుచేసుకొన్నందుకు తనను తాను నిందించుకున్నాడు. కాని ఎక్కడో చిన్న ఆశ. తన తోకనే కాల్చని అగ్నిదేవుడు పరమ పూజ్యురాలైన సీతను దహిస్తాడా? అని ధైర్యం తెచ్చుకున్నాడు. ఇంతలో సీత క్షేమంగా ఉందని చారణుల మాటలద్వారా తెలుసుకొని చాలా సంతోషించాడు. సీతమ్మ దగ్గరికి చేరి పాదాభివందనం చేశాడు. ఆమె అనుమతితో తిరుగు ప్రయాణమయ్యాడు.

'అరిష్టం' అనే పర్వతాన్ని ఎక్కాడు. అక్కడి నుంచి ఆకాశంలోకి ఎగిరాడు. మధ్యలో ఆత్మీయపూర్వకంగా మైనాకుడిని తాకి వేగంగా ప్రయాణం కొనసాగించాడు. మహేంద్రగిరికి చేరుకోబోతుండగా మహానాదం చేశాడు. జాంబవంతుడు దానిని విని పొంగిపోయాడు. హనుమంతుడు విజయుడై తిరిగివస్తున్నాడని వానరులకు తెలిపాడు.

హనుమంతుడు మహేంద్రగిరి శిఖరంమీద అడుగుపెట్టాడు. వానరులంతా చుట్టూచేరారు. పెద్దలకు నమస్కరించాడు హనుమంతుడు. 'చూశాను సీతమ్మ'ను అని ప్రకటించాడు. అందరూ ఆనందించారు. లంకా ప్రయాణవిశేషాలను వారికి వివరించాడు మారుతి. అంగదుడు 'ఓ వీరులారా! సీతాదేవి జాడ తెలిసిన తరవాత కూడా ఆమె లేకుండా శ్రీరాముడి దగ్గరికి వెళ్ళడం సబబుకాదు. లంకకు వెళ్ళి రావణుని చంపి సీతను తీసుకొని శ్రీరాముని వద్దకు వెళదా'మని అన్నాడు. జాంబవంతుడు అంగదుడి మాటలను ఖండించాడు. శ్రీరామసుగ్రీవులు సీతను చూసిరమ్మన్నారేకాని తీసుకురమ్మనలేదు. పైగా రావణుణ్ణి సంహరిస్తానని శ్రీరాముడు ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. దానికి భంగం కలగనీయగూడదన్నాడు. అందరం వెళ్ళి జరిగిన విషయాలను నివేదిద్దామన్నాడు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

దారిలో అందరూ మధువనంలోకి వెళ్ళారు. తేనెలు తాగారు. మధువనాన్ని ధ్వంసంచేశారు. మధువనం సుగ్రీవుని రక్షణలో ఉన్నది. అతని మేనమామ దధిముఖుడు దాన్ని కాపాడుతున్నాడు. వానరుల ధాటికి దధిముఖుడు గాయాల పాలయ్యాడు. వెంటనే వెళ్ళి సుగ్రీవునికీ విషయం చెప్పాడు. ఇదంతా శుభసూచకంగా భావించాడు సుగ్రీవుడు.

అంగద హనుమదాదులు శ్రీరాముడు సుగ్రీవుడున్న చోటుకు చేరారు. హనుమంతుడు శ్రీరామునకు సాష్టాంగ నమస్కారం చేశాడు. 'చూశాను సీతమ్మను' అని చెప్పాడు. రామలక్ష్మణుల ఆనందానికి అంతులేదు. సీత ఇచ్చిన చూడామణిని శ్రీరాముడికి సమర్పించాడు హనుమంతుడు. శ్రీరాముడు కోరగా సీతాన్వేషణ వృత్తాంతాన్ని చెప్పాడు.

# యుద్ధ కాండ

శ్రీరాముడు హనుమంతుడి సాహసాన్ని ప్రశంసించాడు. గరుత్మంతుడికి, వాయుదేవుడికి, హనుమంతుడికి తప్ప ఈ మహాసముద్రాన్ని లంఘించడానికి ఇతరులకు సాధ్యం కాదన్నాడు. **ఇచ్చిన పనిని సాధించడమేగాక, దానికి భంగం కలగకుండా దానికనుబంధమైన ఇతర కార్యాలను సాధించేవాడు ఉత్తముడైన సేవకుడు. కేవలం ఇచ్చిన పనినే నెరవేర్చేవాడు మధ్యముడు. తనకు సామర్థ్యం ఉన్నా ఇచ్చిన పనిని పూర్తిచేయనివాడు అధముడు.** సీతాదేవి కుశలవార్త చెప్పి మహోపకారం చేసిన హనుమంతునకు ఏమియ్యగలనంటూ దగ్గరకు తీసుకొని గట్టిగా గుండెకు హత్తుకున్నాడు శ్రీరాముడు. ఇదే తానియ్యగల సర్వస్వమన్నాడు. ఆదరాభిమానాలకు మించిన ఆస్తి ఉండదు కదా!

శ్రీరాముడి మనసులో మళ్ళీ దుఃఖం పొంగిపొర్లింది. సుగ్రీవుడు ఊరడించాడు. నిరుత్సాహం ప్రయోజనాలను నాశనం చేస్తుందన్నాడు. దుఃఖం శౌర్యపరాక్రమాలను దిగజారుస్తుందన్నాడు. శత్రువు విషయంలో ఇప్పుడు దుఃఖం కాదు, క్రోధం చూపవలసిన సమయమని సూచించాడు. మహాసముద్రంమీద సేతువును కట్టకుండా లంకను జయించడం ఇంద్రాది దేవతలకు కూడా సాధ్యం కానిపని అన్నాడు. శ్రీరాముడు అడిగినమీదట హనుమంతుడు లంకానగరంలోని రక్షణ వ్యవస్థను గురించి వివరంగా చెప్పాడు.

మధ్యాహ్నమైంది. ఈ విజయ ముహూర్తమే లంకా ప్రయాణానికి తగినదని శ్రీరాముడు సుగ్రీవునితో అన్నాడు. శ్రీరాముడు వానరులతో, 'నీలుడు సైన్యానికి మార్గం చూపుతూ ముందునడవాలి. లక్షలాది వానరులు అతణ్ణి అనుసరించాలి. బాలురు వృద్ధులు, బలహీనులు కిష్కింధలోనే ఉండాలి. సుగ్రీవా! నేను హనుమంతుడి భుజంమీదా, లక్ష్మణుడు అంగదుడి భుజంమీదా కూర్చొని ముందుకు సాగుతాం. నువ్వు పల్లకినెక్కి మాతోపాటు రావాలి. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి సైన్యం వెనుకభాగంలో ఉండి రక్షణబాధ్యతను చూడాలి. వెళ్ళేమార్గంలో నగరాలు, గ్రామాలు ఉంటే వాటిలోకి వెళ్ళగూడదు. జల, ఫల సహితమైన మార్గం వెంట మనం ప్రయాణించాలి' అని రాముడు సూచించాడు. ఉత్సాహం ఉరకలు వేస్తుంటే అందరూ సముద్రతీరాన్ని చేరుకున్నారు.

లంకలో రావణుడు మంత్రులతో సమావేశమయ్యాడు. వానరులను ఎదుర్కొని లంకను కాపాడుకోడానికి ఏం చేయాలో నిర్ణయించమన్నాడు. సభలోని వారు రావణ, ఇంద్రజిత్తుల పరాక్రమాన్ని పొగిడారు. నరవానరులను లెక్కచేయాల్సిన అవసరం లేదని పెదవి విరిచారు. 'రాముణ్ణి హతమార్చగల'వని లంకేశునికి ఆత్మస్థైర్యాన్ని కలిగించారు. ప్రహస్తుడు మొదలైనవారు శత్రుసేనలను తామే తుదముట్టించగలమని డంబాలు పలికారు.

ఇవన్నీ విన్నాడు రావణుని సోదరుడు విభీషణుడు. రాక్షసులతో 'శత్రువుల శక్తిసామర్థ్యాలను తెలుసుకోకుండా వారిని చులకనగా భావించకూడదు. శ్రీరాముడు మనకేం అపకారం చేశాడు? మన రాజే సీతను అపహరించుకు వచ్చాడు. దీనివల్ల పాపం వస్తుంది. కీర్తిప్రతిష్ఠలు మంటగలుస్తాయి. ఆయుష్షు తగ్గుతుంది. సంపదలన్నీ నశిస్తాయి. కనుక సీతను శ్రీరామునికి అప్పగించడమే అన్ని విధాలా మంచిది. అనవసరంగా కలహం తెచ్చుకోడం దేనికి? పైగా శ్రీరాముని వంటి మహావీరునితో యుద్ధం తగదు' అంటూ రావణునివైపు తిరిగాడు. 'అన్నా! అనవసరంగా కోపించడం మంచిదికాదు. అది ధర్మానికి ఆటంకమౌతుంది. సుఖాలను దూరంచేస్తుంద'ని హితవు పలికాడు. విభీషణుని ఈ హితబోధ 'చెవిటివాని ముందు శంఖమూది'నట్లయింది. రావణుని భవనానికి వచ్చిన కుంభకర్ణుడు కూడా రావణుణ్ణి తప్పుపట్టాడు. సీతాపహరణ సమయంలో తనను సంప్రదించి ఉంటే బాగుండేదన్నాడు. ఇప్పుడు ఆలోచించి ప్రయోజనం లేదన్నాడు. ఇదంతా 'గతజలసేతుబంధనమే' (నీళ్ళుపోయిన తరువాత అడ్డుకట్టవేయడం)నని కుండ బద్దలుకొట్టినట్టు చెప్పాడు. 'నువ్వు శత్రువు పట్ల వ్యవహరించిన తీరు సరైనది కాదు, శ్రీరాముడు నిన్ను ఇంకా చంపకుండా ఉండడం నీ అదృష్టం' అన్నాడు. ఇవన్నీ ఎలా ఉన్నా శ్రీరాముణ్ణి తుదముట్టించే భారం తనదేనని ప్రకటించుకున్నాడు కుంభకర్ణుడు.

రావణుడు విభీషణుని మాటలకు క్రోధావేశాలకు లోనయాడు. తీవ్రస్థాయిలో నిందించాడు. అన్న తండ్రితో సమానుడని అతని నిందలను సహించాడు విభీషణుడు. కాని రావణుని అధర్మమార్గాన్ని మాత్రం సమర్థించలేదు. ధర్మం వీడిన రావణుని వీడడానికే విభీషణుడు నిర్ణయించుకున్నాడు. రెండుగడియల్లో రామలక్ష్మణులున్నచోటికి నలుగురు అనుచరులతో చేరాడు.

ఆకాశంలోనే నిలిచి శ్రీరాముణ్ణి శరణుకోరాడు విభీషణుడు. అనుగ్రహించాడు దాశరథి. విభీషణుడు శ్రీరాముడి పాదాలపై వాలాడు. రావణుని విషయాలన్నీ సంక్షిప్తంగా చెప్పాడు. శ్రీరాముడు విభీషణునితో 'నేను రావణుణ్ణి బంధుమిత్ర సమేతంగా హతమార్చి నిన్ను రాజును చేస్తా'నని తమ్ములమీద ఒట్టేసి చెప్పాడు. ఈ పనిలో తాను యథాశక్తి సహాయపడగలనని విభీషణుడు మాట ఇచ్చాడు. రాముడు విభీషణుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. లక్ష్మణుడితో వెంటనే సముద్రజలం తెచ్చి లంకారాజుగా విభీషణుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేయమన్నాడు. శ్రీరాముడి ఆజ్ఞ వెంటనే ఆచరణ రూపం దాల్చింది. అందరూ ఆనందాన్ని ప్రకటించారు.

సముద్రాన్ని దాటే ఉపాయమేమిటని సుగ్రీవుణ్ణి ప్రశ్నించాడు శ్రీరాముడు. సముద్రుణ్ణి ప్రార్థించడంవల్ల ఇది సాధ్యపడుతుందన్నాడు విభీషణుడు. శ్రీరాముడు సముద్రతీరంలో దర్భాసనంమీద కూర్చుని సముద్రుణ్ణి ఉపాసించాడు. మూడు రాత్రులు గడిచాయి. సముద్రుడు ఎదుట నిలవలేదు. శ్రీరాముడి కన్నులు ఎర్రబారాయి. సముద్రుడి అహంకారాన్ని అణగదొక్కాలనుకున్నాడు. నీటినంతా ఇంకిపోయేటట్టు చేయాలనుకున్నాడు. బ్రహ్మాస్త్రాన్ని స్మరించాడు. ప్రకృతంతా అల్లకల్లోలమౌతున్నది. సముద్రుడు భయపడి పారిపోతున్నాడు. పరుగెత్తే వానిపై బాణం ప్రయోగించరాదని ఆగాడు శ్రీరాముడు. సముద్రుడు దారికి వచ్చాడు. లంకకు వెళ్ళడానికి దారినిస్తానన్నాడు. ఎక్కుపెట్టిన బాణం వృథాకారాదు. ఎక్కడ ప్రయోగించాలో చెప్పమన్నాడు శ్రీరాముడు. పాపాత్ములు, దోపిడిదారులు ఉండే 'ద్రుమకుల్యం'పైన ప్రయోగించమన్నాడు సముద్రుడు. అది జరిగి పోయింది.



విశ్వకర్మ కుమారుడైన 'నలుడు' శిల్పకళానిపుణుడు. ఉత్సాహం, శక్తి ఉన్నవాడు. సేతువు (వంతెన) ను నిర్మించడానికి అతడే యోగ్యుడని సముద్రుడు తెలిపాడు. ఆ సేతువును తాను భరిస్తానని మాట ఇచ్చాడు. సేతువు నిర్మాణానికి వానర నాయకులకు ఆజ్ఞ ఇచ్చాడు శ్రీరాముడు. అందరూ మహారణ్యం దారి పట్టారు. పెద్దపెద్ద చెట్లను బండరాళ్ళను మోసుకువస్తున్నారు. సముద్రంలో పడేస్తున్నారు. వాటి దెబ్బకు సముద్రంలోని నీరు ఆకాశానికి ఎగిసిపడుతున్నది. నలుని సూచనల ననుసరించి కొలతల ప్రకారం సేతువు నిర్మాణం జరుగుతూంది. వందయోజనాల పొడవు, పది యోజనాల వెడల్పుగల సేతువును కట్టడం ఐదు రోజుల్లో పూర్తయింది.

శ్రీరామలక్ష్మణులు సుగ్రీవునితో కలసి ముందు నడుస్తున్నారు. సైన్యం వారిని అనుసరిస్తున్నది. సైన్యంలో కొందరు వెనక నడుస్తున్నారు. కొందరు సేతువు మధ్యభాగంలో, మరి కొందరు రెండు పక్కలా నడుస్తున్నారు. కొందరు సముద్రంలో దూకి ఈదుతూ వస్తూంటే మరికొందరు ఆకాశంలో ఎగిరి వస్తున్నారు. వారు చేసే కోలాహలానికి సముద్రమే మౌనం దాల్చింది. అందరూ అవతలి తీరం చేరారు.

శ్రీరాముడు యుద్ధనీతిని అనుసరించి సైన్యాన్ని వివిధ విభాగాలుగా విభజించాడు. ఎవరి బాధ్యతలను వాళ్ళకు అప్పగించాడు. రావణుడి మంత్రులైన శుకసారణులు శ్రీరాముని బలం తెలుసుకోవాలని వానర రూపాలుదాల్చి వానరులలో చేరారు. విభీషణుడు వాళ్ళను గుర్తించి శ్రీరాముని ఎదుట నిలిపాడు. క్షమించాడు శ్రీరాముడు. తమను గురించి ఇంకా ఏమన్నా తెలుసుకోవాలంటే అడ్డులేదని వాళ్ళకు చెప్పాడు. సీతను వెంటనే అప్పగించకపోతే తన చేతిలో చావు తప్పదని రావణుడికి చెప్పవలసిందిగా సూచిస్తూ శుకసారణులను పంపించివేశాడు. వారు వెళ్ళి ఇక్కడి విషయాలన్నీ పొల్లుబోకుండా రావణునికి తెలిపారు.

రావణుడు సీతవిషయంలో మరొక ఎత్తుగడ వేశాడు. అశోకవనం వెళ్ళి రాముడు తనచేతిలో హతుడైనాడని సీతతో పలికాడు. ఆమె నమ్మలేదు. మాయావియైన విద్యుజ్జిహ్వుణ్ణి పిలిచాడు. అతడు శ్రీరామునిదే అనిపించే మాయాశిరస్సును, ధనుర్బాణాలను తీసుకొనివచ్చి చూపించాడు సీతకు. ఇప్పటికైనా తన్నాశ్రయించమని సీతను కోరాడు రావణుడు. సీత కుమిలిపోయింది. రావణుడు తన భవనానికి వెళ్ళిపోయాడు. విభీషణుని భార్య 'సరమ' సీతను ఊరడించింది. ఇదంతా రాక్షస మాయ అని చెప్పింది. శ్రీరాముడు క్షేమమేనని తెలిపింది.

శ్రీరామచంద్రాదులు వానరసైన్యంతో సువేల పర్వతానికి చేరుకున్నారు. ఆరాత్రి అక్కడే గడిపారు. ఎత్తైన ఆ పర్వత శిఖరం నుండి లంకానగర శోభను చూశారు. లంకలో మేడపైభాగంలో ఠీవిగా కూర్చున్న రావణుణ్ణి శ్రీరాముడు చూశాడు. వానర ప్రముఖులూ చూశారు. సుగ్రీవుడు ఒక్క ఉదుటునలేచి కోపంతో ఊగిపోతున్నాడు. క్షణాలలో సువేల పర్వతంనుంచి రావణ భవనంపైన వాలాడు. తాను శ్రీరాముడి మిత్రుడనని, తన నుండి తప్పించుకోడం నీతరంకాదని లంకేశుణ్ణి హెచ్చరించాడు. రావణుడిపైకి దూకి అతని కిరీటాన్ని తీసి నేలకు కొట్టాడు. రావణుడు రెచ్చిపోయాడు. 'సుగ్రీవా! ఇంత వరకు నీవు నా కంటబడలేదు. లేకుంటే ఎప్పుడో హీనగ్రీవుడవు (తల తెగినవాడవు) అయ్యేవాడివి' అంటూ గర్జించాడు. ఇద్దరి మధ్యా బాహాబాహి యుద్ధం జరిగింది. సుగ్రీవుడు రావణుణ్ణి ముప్పతిప్పలు పెట్టి క్షణాలలో రివ్వున ఎగిరి సువేల పర్వతంమీద వాలాడు. శ్రీరాముడు సుగ్రీవుణ్ణి సున్నితంగా మందలించాడు. తొందరపడి ఇలాంటి సాహసాలు చేయవద్దని సలహా ఇచ్చాడు.

రావణుడి దగ్గరికి అంగదుణ్ణి రాయబారిగా పంపాడు శ్రీరాముడు. సీతను అప్పగించకపోతే శ్రీరాముడి చేతిలో మరణం తథ్యమని, లంకకు విభీషణుడు రాజుకాగలడని శ్రీరాముని వాక్యంగా రావణునికి వినిపించాడు అంగదుడు. సభ అట్టుడికిపోయింది. నలుగురు రాక్షసులు అంగదుడిమీద విరుచుకుపడ్డారు. అంగదుడు వారిని తన చంకలో ఇరికించుకొని ప్రాసాదంపైకి ఎగిరాడు. అక్కడి నుండి వారిని బలంగా నేలపైకి విసిరాడు. సింహనాదం చేసి ఆకాశమార్గంలో శ్రీరాముణ్ణి చేరాడు. రావణుని భావాన్ని గ్రహించాడు శ్రీరాముడు. ధనుస్సుకు పని చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని భావించాడు.

లంకమీదికి దండయాత్ర మొదలైంది. లంకను నాలుగువైపుల నుండీ సైన్యంతో ముట్టడించాడు శ్రీరాముడు. లంకేశుడు తన భవనం మీది నుంచే పరిస్థితిని గమనించాడు. దీర్ఘాలోచనలో పడ్డాడు. యుద్ధం మొదలైంది. రెండు సైన్యాలు తీవ్రంగా పోరాడుతున్నాయి. అంజనేయుని చేతిలో జంబుమాలి సుషేణుని చేతిలో విద్యున్మాలి మరణించారు. చీకటిలో ఎవరు ఎవరో (రాక్షసుడా? వానరుడా?) అడిగి తెలుసుకుని మరీ కొట్టుకుంటున్నారు.

అంగదుని చేతిలో రావణకుమారుడు ఇంద్రజిత్తు ఓడిపోయాడు. దీనికి తట్టుకోలేకపోయాడు. కపట యుద్ధానికి దిగాడు. రామలక్ష్మణులను మూర్ఛపోయేట్టుచేసి నాగాస్త్రంతో బంధించాడు. వారు మరణించారని భ్రాంతిపడి రావణుడి దగ్గరికి వెళ్ళి విషయాన్ని తెలిపాడు. రావణుడు అభినందించాడు. రావణుడి ఆదేశం మేరకు త్రిజట మొదలైనవారు సీతను పుష్పక విమానంపై యుద్ధ భూమికి తీసుకువెళ్ళారు. నేలమీద పడిఉన్న రామలక్ష్మణులను సీత చూసింది. మరణించారని భావించి కన్నీరు కాల్వలు గట్టేలా ఏడ్చింది. పక్కనే ఉన్న త్రిజట ఓదార్పుతో కూడిన ధైర్యాన్నిచ్చింది. రామలక్ష్మణులు బతికే ఉన్నారని ఆధారాలు

చూపించింది. వానరసైన్యం ప్రసన్నంగా ఉండడం ఒక కారణమని, అన్నింటికీ మించి 'భర్త మరణించిన స్త్రీని పుష్పక విమానం తీసుకొనిరాదు' అని చెప్పడంతో సీత మనసు కుదుటపడింది. గరుత్మంతుని రాకతో రామలక్ష్మణులు నాగాస్త్ర ప్రభావం నుంచి విముక్తులైనారు. వానరులు 'జయజయ' ధ్వానాలు చేశారు. అవి రావణుని గుండెలో 'అప' శబ్దాన్ని జోడించుకొని ప్రతిధ్వనిస్తున్నాయి. హనుమంతుని చేతిలో ధూమ్రాక్షుడు, అకంపనుడు, అంగదుడి బారినపడి వజ్రదంష్ట్రుడు, నీలుడికి చిక్కి ప్రహస్తుడు యమపురిబాట పట్టారు.

రావణుని బాణశక్తికి సుగ్రీవుడు మూర్ఛపోయాడు. శ్రీరాముడు విల్లందుకున్నాడు. అన్నను వారించి లక్ష్మణుడు రావణుణ్ణి ఎదిరించడానికి పూనుకున్నాడు. వానరసేనమీద శరవర్షధారకురిపిస్తున్నాడు రావణుడు. ఆంజనేయుడు రావణుడి ధాటికి అడ్డుకట్ట వేశాడు. అరచేతితో హనుమంతుణ్ణి బలంగా చరిచాడు రావణుడు. మారుతి చలించిపోయాడు. అయినా క్షణంలో తేరుకున్నాడు. అరచేతితో రావణుణ్ణి ఒక్కదెబ్బ వేశాడు. దశగ్రీవుడు కంపించిపోయాడు. తేరుకుని 'వానరా! భళా, నాకు శత్రువువే అయినా నీ శక్తిని మెచ్చుకుంటున్నా'నని యుద్ధస్ఫూర్తిని చాటాడు రావణుడు.

రావణుడు ప్రయోగించిన 'శక్తి' అనే ఆయుధం లక్ష్మణుని ఎదలో నాటుకుంది. స్పృహదప్పాడు లక్ష్మణుడు. అతన్ని ఎత్తుకొని వెళ్ళాలని శతవిధాలా ప్రయత్నించి విఫలుడైనాడు రావణుడు. అంతలో ఆంజనేయుడు రావణుడిమీద దాడిచేశాడు. వక్షఃస్థలంమీద ముష్టిఘాతంతో రావణుణ్ణి కూలబడేటట్లు చేశాడు. లక్ష్మణుణ్ణి శ్రీరాముని వద్దకు చేర్చాడు. హనుమంతుని కోరిక మేరకు అతని భుజాలపై కూర్చుని రావణునితో పోరుచేశాడు శ్రీరాముడు. శ్రీరాముని పరాక్రమం ముందు రావణుని ధనుస్సు, కిరీటం దాసోహమయ్యాయి. శ్రీరాముడు దయతలచాడు. రావణునితో' నీవు యుద్ధంలో అలసిపోయావు. సేదతీర్చుకొనిరా. అప్పుడు నా బలమేమిటో తెలుస్తుంద'ని సుతిమెత్తగా చెప్పాడు.



అంతఃపురానికి తిరిగివెళ్ళినా అవమానభారం రావణుణ్ణి ఒక చోట కూర్చోనీయడం లేదు. కుంభకర్ణుని నిద్రలేవమన్నాడు రావణుడు. అతికష్టంమీద ఆ పని సాధ్యమయింది రాక్షసులకు. కుంభకర్ణునికి ఆరు నెలలు నిద్ర ఒకరోజు భోజనం. అందుకే 'కుంభకర్ణనిద్ర' అనేది ఒక జాతీయంగా భాషలోకి వచ్చింది. కుంభకర్ణుడు రావణుణ్ణి సమీపించాడు. జరిగిందంతా చెప్పాడు రావణుడు. తెలివిగలవారు జరిగిన దానిని గూర్చి ఆలోచించరన్నాడు కుంభకర్ణుడు. తనకు సహాయపడమని కుంభకర్ణుని కోరాడు రావణుడు. 'ఆపదల పాలైనవాణ్ణి ఆదుకొనేవాడే నిజమైన

మిత్రుడు. తప్పుదారి పట్టి కష్టాల్లో పడ్డవారికి చేయూతనిచ్చి ఆదుకొనేవాడే ఆప్తు'డని రావణుడన్నాడు. కుంభకర్ణుడు యుద్ధసన్నద్ధుడయ్యాడు.

కుంభకర్ణుడు యుద్ధంలో వానరులను చావుదెబ్బ తీస్తున్నాడు. వానరులు తట్టుకోలేక తలోదారి పట్టారు. శ్రీరాముణ్ణి ఆశ్రయించారు. 'ఐంద్రాస్త్రం'తో కుంభకర్ణుని శిరస్సును ఖండించి శాశ్వతనిద్రలోకి పంపాడు శ్రీరాముడు. శ్రీరాముని బాణధాటికి కుంభకర్ణుని తల లంకలో పడిపోయింది. ఆ తల తగలడం వల్ల రాజవీథులలోని ఇంటికప్పులు, ఎత్తైన ప్రాకారాలు కూలిపోయాయి. కుంభకర్ణుడి మరణవార్త రావణుణ్ణి క్రుంగదీసింది.

రావణ కుమారుడైన అతికాయుడు లక్ష్మణుని బ్రహ్మాస్త్రానికి బలైనాడు. తమ్ముణ్ణి, కొడుకును పోగొట్టుకొని తల్లడిల్లుతున్న రావణుణ్ణి ఇంద్రజిత్తు ఓదార్చాడు. భారం తనపై వేసుకొని. యుద్ధరంగానికి వచ్చాడు. రామలక్ష్మణులమీద బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. రాముని సూచనమేరకు రామునితోపాటు లక్ష్మణుడు స్పృహకోల్పోయినట్లు పడివున్నాడు. వాళ్ళు మరణించారనుకున్నాడు ఇంద్రజిత్తు. తండ్రికీ వార్తను తెలిపాడు.

వానరసైన్య శిబిరంలో అలజడి మొదలైంది. విభీషణుడు ధైర్యం చెప్పాడు. రామలక్ష్మణులకు ఏమీకాలేదన్నాడు. బ్రహ్మమీది గౌరవంతో అస్త్రబాధను అనుభవించారని తెలిపాడు. బ్రహ్మాస్త్ర ప్రభావంతో అరవైఏడు కోట్ల మంది హతులయ్యారు. చాలామంది దెబ్బతిన్నారు. హనుమంతుడు, విభీషణుడు, జాంబవంతుడి కోసం వెతుకుతున్నారు. జాంబవంతుడు కనిపించాడు. సరిగ్గా చూడలేకపోతున్నానన్నాడు. ధ్వనిని బట్టి విభీషణుని గుర్తించానన్నాడు. 'హనుమంతుడు క్షేమమేనా' అని అడిగాడు. ఆంతర్యం అంతుచిక్కలేదు విభీషణునికి. 'హనుమంతుడు జీవిస్తే వానరసైన్యం చచ్చినా బతికినట్లే లేదా హనుమ మరణిస్తే అందరం బతికిఉన్నా చచ్చినవాళ్ళతో సమానమేనన్నాడు' జాంబవంతుడు. జాంబవంతుని ఆదేశంపై హిమాలయాలకు వెళ్ళి అక్కడ ఉన్న సర్వౌషధి మహాపర్వతాన్ని పెల్లగించి తీసుకువచ్చాడు హనుమంతుడు. ఓషధుల వాసనకే రామలక్ష్మణుల గాయాలన్నీ మటుమాయమయ్యాయి. చనిపోయిన వానరులు మళ్ళీ లేచికూర్చున్నారు. సుగ్రీవాజ్ఞతో వానరులు లంకకు నిప్పుపెట్టారు.

శత్రుపక్షాన్ని మానసికంగా దెబ్బతీయదలచాడు ఇంద్రజిత్తు. హనుమదాది వానరవీరులు చూస్తుండగా మాయాసీతను సంహరించాడు. అందరూ నిజమేననుకున్నారు. ఈ వార్త తెలిసి శ్రీరాముడు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇదంతా ఇంద్రజిత్తు మాయేనని విభీషణుడు తెలపడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

శత్రుసంహారానికి ఇంద్రజిత్తు నికుంభిలా అభిచారహోమాన్ని తలపెట్టాడు. దాన్ని భంగంచేయడానికి రామానుజ్ఞతో లక్ష్మణుడు వెళ్ళాడు. ఇంద్రజిత్తు లక్ష్మణుల మధ్య ఘోరయుద్ధం జరిగింది. 'ఐంద్రాస్త్రము'ను ప్రయోగించి ఇంద్రజిత్తు తలను నేలరాల్చాడు లక్ష్మణుడు. శ్రీరాముడు లక్ష్మణుణ్ణి మెచ్చుకున్నాడు.

రావణుడు యుద్ధభూమిలో ప్రళయకాల రుద్రుడిలా విజృంభిస్తున్నాడు. వానర వీరులు తట్టుకోలేక యుద్ధరంగం నుండి కాలికి బుద్ధి చెపుతున్నారు. మరొకవైపు సుగ్రీవుని చేతిలో విరూపాక్షుడు, మహోదరుడు మట్టిగరిచారు.

యుద్ధం చివరి అంకానికి చేరుతున్నది. రామలక్ష్మణులతో రావణునిపోరు తీవ్రతరమవుతున్నది. రావణుడు విభీషణుణ్ణి చంపడానికి బల్లెమెత్తాడు. అది మహాశక్తిమంతమైనది. విభీషణునికి ప్రాణాపాయస్థితిని గమనించిన లక్ష్మణుడు రావణునిపై బాణాలను కుమ్మరించాడు. ఎటూ తోచక విభీషణుని చంపే ప్రయత్నాన్ని విరమించుకున్న రావణుడు లక్ష్మణునిపై ఆగ్రహించి 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. అది గమనించిన శ్రీరాముడు 'శక్తి'ని వేడుకున్నాడు. 'నీలోని చంపేశక్తి నశించుగాక' అని. అంతే – అది ప్రాణశక్తిని కోల్పోయింది. లక్ష్మణుడి రొమ్ముమీద బలంగా నాటుకుంది. లక్ష్మణుడు నేలమీద పడిపోయాడు. వానరులు ఆ ఆయుధాన్ని ఎంత ప్రయత్నించినా లక్ష్మణుడి రొమ్ము నుంచి తీయలేకపోయారు. రాముడు తన రెండు చేతులతో బయటికి లాగి విరచివేశాడు. ఇక ఉపేక్షించి లాభం లేదనుకున్నాడు శ్రీరాముడు. ఈ లోకంలో ఇక రావణుడో? రాముడో? మిగిలి ఉండడం తథ్యం' అన్నాడు. శ్రీరాముడి విలువిద్యాపాండిత్యానికి ఎదురునిలువలేక రావణుడు భయంతో పరుగులు తీశాడు.

పడిపోయిన లక్ష్మణుణ్ణి చూసి విలవిలలాడిపోయాడు శ్రీరాముడు. 'ఏదేశంలోనైనా భార్య దొరకవచ్చు. బంధువులు దొరకవచ్చు. కాని లక్ష్మణుని వంటి తమ్ముడు దొరక'దని కన్నీరుకార్చాడు. సుషేణుడు లక్ష్మణుని పరీక్షించి చనిపోలేదని నిర్ధరించాడు. సుషేణుని సూచనమేరకు హనుమంతుడు ఓషధులు తేవడానికి వేగంగా వెళ్ళాడు. ఓషధీపర్వతాన్నే తెచ్చాడు. ఓషధీ ప్రభావంతో లక్ష్మణుడు లేచికూర్చున్నాడు. పట్టరాని ఆనందంతో శ్రీరాముడు 'లక్ష్మణా నీవు మరణించి ఉంటే నా విజయానికి అర్థమే లేదు. అప్పుడు సీతతోగాని నా ప్రాణాలతోకాని ఏం ప్రయోజనం' అన్నాడు.

ఇంద్రుడు పంపగా మాతలి దివ్యరథంతో సహా శ్రీరాముడి దగ్గరికి వచ్చాడు. ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరించి శ్రీరాముడు రథాన్ని అధిరోహించాడు. యుద్ధభూమికి సాగిందారథం. మిగతా దినాల కన్నా భిన్నంగా ఉందీనాటి యుద్ధం. కొంతసేపు ఎవరికెవరూ తీసిపోని విధంగా విజృంభించారు. రానురాను రాముడిదే పైచేయి అవుతున్నది. రావణుని సారథి గమనించాడు. రథాన్ని పక్కకు మళ్ళించాడు. అలా చేయడం అవమానంగా భావించిన రావణుడు సారథిపై నిప్పులు చెరిగాడు. రథం మళ్ళీ రాముడి ముందు నిలిచింది. యుద్ధం చూడడానికి అగస్త్యుడు దేవతలతో కూడి అక్కడకు వచ్చాడు. శ్రీరాముడికి 'ఆదిత్య హృదయం' ఉపదేశించాడు. శ్రీరాముడి బాణాలతాకిడికి రావణుడి తలలు నేలరాలుతున్నాయి. కాని వెంటనే చిత్రంగా మళ్ళీ మొలుస్తున్నాయి.

ఆకాశానికి ఆకాశం, సముద్రునికి సముద్రమే సమానమైనట్లు రామరావణ యుద్ధానికి రామరావణ యుద్ధమే సమాన మన్నట్లు సాగుతున్నది. బ్రహ్మాస్త్ర ప్రయోగం చేయవలసిందిగా 'మాతలి' శ్రీరాముడికి సూచించాడు. శ్రీరాముడు బ్రహ్మాస్త్ర ప్రయోగంతో రావణాసురుణ్ణి అంతమొందించాడు.

అన్నఐన రావణుని మరణానికి విభీషణుడు బాధపడ్డాడు. దహన సంస్కారాలకు అనుమతినివ్వమని శ్రీరాముని ప్రార్థించాడు. 'వ్యక్తులు జీవించివున్నంతవరకే వైరముండాలి. తరవాత దాన్ని వదలివేయాలి. మన కార్యం నెరవేరింది. కావలసిన సంస్కారాలను





చేయ'మని అన్నాడు శ్రీరాముడు. 'ఇప్పుడు రావణుడు నీకెట్లాగో నాకూ అట్లాగే గౌరవాస్పదుడు' అని తన విశాలహృదయాన్ని చాటుకున్నాడు శ్రీరాముడు. రావణుని భార్య మండోదరి భర్త మరణానికి పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయింది. విభీషణుడు రావణునికి ఉత్తరక్రియలను నిర్వర్తించాడు.

శ్రీరాముడి ఆదేశం మేరకు లక్ష్మణుడు విభీషణుణ్ణి లంకారాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. సీతతో తన విజయవార్తను తెలపమని హనుమంతుణ్ణి ఆదేశించాడు శ్రీరాముడు. హనుమంతుడు వెంటనే వెళ్ళి ఈ శుభవార్తను సీతమ్మకు చెప్పాడు. ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఇంతకాలం చుట్టూచేరి బాధించిన రాక్షస స్త్రీలను చంపడానికి అనుమతినిమ్మన్నాడు హనుమ. అది తగని పని, వద్దని వారించింది సీత.

విభీషణుడు పల్లకిలో సీతాదేవిని శ్రీరాముడి దగ్గరికి చేర్చాడు. సంతోషంతో భర్తను చేరింది సీత. ఆమెను స్వీకరించడానికి రాముడు నిరాకరించాడు. 'నా వంశప్రతిష్ఠ నిలుపు కోవడానికి దుష్ట రావణుని చెరనుండి నిన్ను విడిపించాను. ఇంతకాలం పరుని పంచన ఉన్నందువల్ల నీ ప్రవర్తన గురించి నాకు సందేహముంది. కనుక నువ్వు నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళవచ్చు'నని శ్రీరాముడు అన్నాడు. శ్రీరాముని మాటలు ములుకుల్లా గుచ్చుకున్నాయి సీతకు. స్థాయికి తగినట్లుగా మాట్లాడ లేదని రామునితో అన్నది. శ్రీరామునకు విశ్వాసం కలిగించడానికి 'అగ్ని ప్రవేశం' ఒక్కటే శరణ్యమని భావించింది. శ్రీరాముని మనసెరిగి లక్ష్మణుడు చితిని సిద్ధపరచాడు. సీతఅగ్నిలోకి ప్రవేశించింది. అక్కడివారంతా ఆందోళనచెందారు. అగ్నిదేవుడు స్వయంగా సీతాదేవిని తీసుకువచ్చి ఆమె గొప్పదనాన్ని వెల్లడించాడు. ఆమెను స్వీకరించాల్సిందిగా శ్రీరాముణ్ణి కోరాడు.

సీత గురించి తనకంతా తెలుసన్నాడు శ్రీరాముడు. ఆమె శీలం యొక్క గొప్పదనాన్ని ముల్లోకాలకు చాటడానికే అగ్నిప్రవేశం చేస్తున్నా ఊరుకున్నానన్నాడు. సీతను దగ్గరకు తీసుకున్నాడు.

పరమశివుడు శ్రీరాముణ్ణి ప్రశంసించాడు. దుష్టసంహారంచేసిన శ్రీరాముణ్ణి ప్రజానురంజకంగా పరిపాలన చేయమన్నాడు. శ్రీరాముడి కోరిక మేరకు ఇంద్రుడు మృతులైపడివున్న వానరులను మళ్లీ బతికించాడు. విభీషణుడు లంకలో కొంతకాలం ఉండవలసిందని శ్రీరాముణ్ణి అభ్యర్థించాడు. భరతుని కొరకు తాను త్వరగా ప్రయాణం కావలసిందేనన్నాడు శ్రీరాముడు. వానరులను వాళ్ళ స్వస్థానాలకు వెళ్ళమనిచెప్పి, విభీషణుడి వీడ్కోలు అందుకున్నాడు. పుష్పకవిమానంలో అయోధ్యకు బయలుదేరాడు. దారిలో ఆయా ప్రదేశాలన్నీ సీతకు చూపుతున్నాడు. భరద్వాజాశ్రమాన్ని సందర్శించారు. శ్రీరామాజ్ఞతో హనుమంతుడు శ్రీరాముడు వస్తున్న విషయాన్ని భరతునికి, గుహునికి ముందుగా వెళ్ళి తెలియజేశాడు. వాళ్ళెంతో ఆనందించారు.

పుష్పక విమానంలో నందిగ్రామం చేరుకున్న సీతారామ లక్ష్మణులకు భరతుడు, ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు. సీతారామలక్ష్మణులు కౌసల్యా సుమిత్రా కైకేయీ వశిష్ఠుల పాదాలకు ప్రణామాలు అర్పించారు. భరతుడు శ్రీరాముని చరణాలకు పాదుకలను తొడిగాడు. భరతుణ్ణి ప్రేమతో అక్కున జేర్చుకున్నాడు శ్రీరాముడు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

అంగరంగవైభవంగా శ్రీరామపట్టాభిషేకమహోత్సవం జరిగింది. యువరాజుగా ఉండాల్సిందిగా శ్రీరాముడు లక్ష్మణుణ్ణి కోరాడు కాని అతడు ఎంతమాత్రం ఒప్పుకోలేదు. అప్పుడు భరతుణ్ణి యువరాజుగా చేశారు. యజ్ఞయాగాది క్రతువులను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాడు శ్రీరాముడు. ప్రజలను కన్నబిడ్డలా చూసుకుంటున్నాడు. ఎలాంటి ఈతిబాధలూ లేవు. అందరూ ధర్మబద్ధంగా నడుచుకొంటున్నారు. ఇలా పదకొండువేల సంవత్సరాల కాలం ప్రజానురంజకంగా పరిపాలించాడు శ్రీరాముడు. అందుకే 'రామరాజ్యం' అన్న మాట నేటికీ ఆదర్శమై నిలచింది.

శ్లో॥ మంగళం కోసలేంద్రాయ - మహనీయ గుణాత్మనే।
చక్రవర్తి తనూజాయ - సార్వభౌమాయ మంగళమ్॥

## I. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. రామాయణ ప్రాశస్త్యాన్ని గురించి రాయండి.
2. సీతారామ కళ్యాణాన్ని రాయండి.
3. రామాయణం ఆధారంగా విశ్వామిత్రుడు ఉత్తమ గురువు అని నిరూపించండి?
4. శ్రీరాముడు వనవాసానికి వెళ్ళడానికి గల కారణమేమిటి?
5. సీతాపహరణం గురించి రాయండి.
6. శ్రీరామసుగ్రీవుల మైత్రి ఎలా ఏర్పడింది?
7. సీతాన్వేషణ వృత్తాంతం రాయండి.
8. లంకాదహనం వర్ణించండి.
9. సేతువు నిర్మాణం గురించి రాయండి.
10. రామరావణ యుద్ధాన్ని గురించి రాయండి.
11. రామాయణం ఆధారంగా శ్రీరాముని ఉత్తమ వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.
12. రామాయణంలోని మానవ సంబంధాల గురించి రాయండి.

## II. కింది పాత్రల స్వభావాన్ని రాయండి.

1. విశ్వామిత్రుడు   2. రాముడు   3. సీత   4. లక్ష్మణుడు   5. కైక
6. భరతుడు   7. మంథర   8. మారీచుడు   9. రావణుడు   10. సుగ్రీవుడు
11. హనుమంతుడు   12. త్రిజట   13. ఇంద్రజిత్తు   14. వాలి   15. దశరథుడు
16. విశ్వామిత్రుడు

## III. కింది వాటిని వివరించండి.

1. చెవిటివాని చెవిలో శంఖం ఊదినట్లు   2. చెవినిల్లు కట్టుకొని పోరు   3. గతజల సేతుబంధనం
4. అగస్త్య భ్రాత   5. సుగ్రీవాజ్ఞ   6. శ్రీరామరక్ష   7. కబంధహస్తాలు   8. భగీరథ ప్రయత్నం
9. బూడిదలో పోసిన పన్నీరు   10. గుండెల్లో రాయిపడటం   11. అగ్నికి ఆజ్యం పోయడం   12. పిడుగుపాటు

# రామాయణ విశ్వరూపం

మానవ జీవన మూల్యాలను దర్శింపజేసే అక్షరమణి దర్పణం రామాయణం. కనుకనే కొండలు, సముద్రాలు ఉన్నంత వరకు రామాయణ ముంటుందని బ్రహ్మ సెలవిచ్చాడు. ఇలా శాశ్వతత్త్వాన్ని సముపార్జించుకున్న రామాయణాన్ని రచించినవారు వాల్మీకి మహర్షి. వీరి తదనంతర కాలంలో దేశవిదేశాలలో వివిధ ప్రక్రియల్లో ఎన్నో రామాయణాలు వచ్చాయి. అయితే వీటన్నింటికీ మాతృక వాల్మీకి రామాయణమే. ఆయా కవులు వారి వారి ప్రతిభననుసరించి రామాయణకథను లోకానికందించారు. ఇందులో మూలాన్ని అనుసరించినవారు కొందరైతే, స్వతంత్రపోకడలు పోయినవారు మరికొందరు. ఇలా వచ్చిన రామాయణాల్లో కొన్నింటిని తెలుసుకుందాం.

సంస్కృత సాహిత్యాన్ని పరిశీలిస్తే పురాణాలలో రామకథ కనిపిస్తుంది. ఆయా సందర్భాలనుబట్టి వివిధ పురాణాల్లో ఇది పేర్కొనబడింది. 'ఆధ్యాత్మరామాయణం' తత్త్వ ప్రధానంగా సాగిన రచన. కాళిదాసు 'రఘువంశం' రామచరిత్రనేగాక అతని పూర్వుల చరిత్రనూ రమణీయంగా ఆవిష్కరించిన కావ్యం. భోజుడు చంపూరామాయణాన్ని (గద్య పద్యాలతో కూడినది) రచించాడు. భట్టి 'రావణవధ' పేరున రాశాడు. వ్యాకరణసూత్రాలకు, అలంకారాలకు లక్ష్యంగా ఇది రాయబడడం విశేషం. రామకథను 'ప్రతిమానాటకం' పేరున భాసుడు, 'ఉత్తర రామచరితం'గా భవభూతి నాటకీకరణ చేశారు. రామాయణ, భారత కథలను కలిపి 'రాఘవ పాండవీయం' అనేద్వ్యర్థి (రెండర్థాల) కావ్యాన్ని ధనంజయుడు  వెలియించాడు.

కాశ్మీరీభాషలో దివాకర ప్రకాశభట్టు 'రామావలోకచరిత', 'లవకుశ యుద్ధచరిత'ను రాశాడు. మరాఠీలో సమర్థరామదాసు రచించిన రామాయణం, మోరోపంత్ 'లవకుశాఖ్యానమ్', 'మంత్రరామాయణమ్' ప్రసిద్ధిపొందాయి. వంగభాషలో కృత్తివాస ఓఝూ రామాయణానికి మంచి పేరుంది. తమిళ మహాకవి 'కంబ' 'రామాయణం' పేరుతో సాగిన రచన 'కంబరామాయణం'గా ప్రజలచే ప్రశంసలు పొందుతున్నది. ఇందులో సర్వమానవ సౌభ్రాత్రాన్ని వర్ణించాడు. మళయాళంలో ఎళుత్తచ్చన్ 'అధ్యాత్మరామాయణం' భక్తికి పెద్దపీట వేసింది. కన్నడలో నాగచంద్రుని 'రామచంద్ర చరిత పురాణం' చంపూమార్గంలో సాగింది. ఒరియాలో సిద్ధేంద్రయోగి చేతిలో 'విచిత్ర రామాయణం' రూపుదిద్దుకుంది.

హిందీకి ఉపభాషమైన అవధీలో గోస్వామి తులసీదాస్ కలం నుండి జాలువారిన 'రామచరితమానస్' ఉత్తర భారతదేశంలో విలక్షణ ముద్రను వేసింది. పంజాబీలో రామలీల నాటకం సుప్రసిద్ధం.

తెలుగు భాషలో విభిన్న ప్రక్రియల్లో రామాయణాలు వచ్చాయి. గోనబుద్ధారెడ్డి రచించిన 'రంగనాథరామాయణం' తెలుగులో తొలి రామాయణం. ఇది ద్విపద కావ్యం. వాల్మీకంలో లేని ఎన్నో కల్పనలను చేశాడు. ఇంద్రుడు కోడై కూయడం, లక్ష్మణరేఖ, ఉడుతభక్తి వంటి ఘట్టాలు ప్రజల్లో బాగా నాటుకుపోయాయి. తాళ్ళపాక అన్నమాచార్యుల 'ద్విపద రామాయణం', కట్టా వరదరాజు రామాయణం, ఏకోజీ రామాయణం ద్విపదలో సాగాయి.

తిక్కన 'నిర్వచనోత్తర రామాయణం' తెలుగుజాతిపై తనదైనముద్రవేసింది. హుళక్కిభాస్కరుడు ప్రధానంగా, అతని కుమారుడు మల్లికార్జునభట్టు, శిష్యుడు రుద్రదేవుడు, మిత్రుడు అయ్యలార్యుల సహకారంతో 'భాస్కర రామాయణం' ప్రకాశించింది. గౌతముడు అహల్యను 'శిల' కమ్మని శపించడం, మంథర దుర్బోధకు కారణం వంటివి ఇందులో పేర్కొన్న కొన్ని కొత్త అంశాలు. రామాయణాన్ని సంక్షిప్త సుందరంగా తీర్చిదిద్దిన కవయిత్రి మొల్ల. ఈమె రచన 'మొల్లరామాయణం'గా ప్రసిద్ధిచెందింది.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

అయ్యలరాజు రామభద్రుని 'రామాభ్యుదయం' విశిష్ట ప్రబంధంగా రూపుదిద్దుకొంది. శ్రీరాముడు సీతమెడలో మంగళసూత్రం కట్టినట్లు వర్ణించాడు. ఇది ఆంధ్రదేశ ఆచార ప్రభావంతో చోటుచేసుకుంది. తంజావూరును పరిపాలించిన రఘునాథనాయకుడు 'రఘునాథ రామాయణం' వాల్మీకి ననుసరించింది. కూచిమంచి తిమ్మకవి 'అచ్చతెలుగు రామాయణాన్ని' ఆవిష్కరించాడు. గోపీనాథ వేంకటకవి 'గోపీనాథరామాయణం', కంకంటి పాపరాజు 'ఉత్తర రామాయణం' సాహితీ జిజ్ఞాసువులను అలరించాయి.

కాణాదం పెద్దన 'ఆధ్యాత్మరామాయణం' రచించాడు. గద్వాల ప్రభువులు 'యథాశ్లోక తాత్పర్యరామాయణం' పేర ఆరుగురు కవులచే వాల్మీకి రామాయణానికి తెలుగు రూపమిప్పించారు. వావికొలను సుబ్బారావు 'ఆంధ్రవాల్మీకి రామాయణం' శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి 'శ్రీకృష్ణరామాయణం' ప్రసిద్ధి పొందిన రచనలు. విశ్వనాథ సత్యనారాయణ 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం' అత్యంత ప్రశస్తి పొందింది.

పింగళి సూరన 'రాఘవ పాండవీయం' పేర ద్వ్యర్థికావ్యం రచిస్తే, ఎలకూచి బాలసరస్వతి, నెల్లూరి రాఘవకవి 'యాదవ రాఘవ పాండవీయం' పేర త్ర్యర్థి కావ్యాలను రచించారు. నంబెరుమాళ్ళ పురుషకారి కేశవయ్య 'దాశరథిచరిత్ర' పేరున నిరోష్ఠ్యంగా (పద్యాలు చదివితే పెదవికి పెదవి తాకకుండా) సంతరించారు.

త్యాగరాజస్వామివారు, అన్నమయ్య, కంచెర్ల గోపన్న (రామదాసు) శ్రీరామ సంబంధంగా ఎన్నో కీర్తనలను అందించారు. యక్షగాన రూపంలో రామాయణకథను ఎందరో అక్షరబద్ధం చేశారు. వెల్లూరి వేంకటకవి 'రామలీలా యక్షగానం', శేషాచలకవి 'ధర్మపురి రామాయణం'. ముద్దుబాలంభట్టు 'మంథెన రామాయణం', కందుకూరి రుద్రకవి 'సుగ్రీవవిజయం' మోక్షగుండం సుబ్బకవి 'సీతాకల్యాణం' వంటివి ఎన్నో ఉన్నాయి.

నాటక విభాగానికివస్తే కోలాచలం శ్రీనివాసరావు 'సంపూర్ణరామాయణం', బలిజేపల్లి లక్ష్మీకాంతకవి 'ఉత్తర రాఘవం', ధర్మవరం గోపాలాచార్యులు 'రామదాసు', పానుగంటి లక్ష్మీనరసింహారావు 'కల్యాణరాఘవం', సెట్టిలక్ష్మీనరసింహకవి 'అహల్య' (వచన నాటకం) రచించారు.

తాళ్ళూరి నారాయణకవి 'మోక్షగుండ రామాయణం' పేర హరికథగా మలిస్తే, నదీరా బుఱ్ఱకథగా సంపూర్ణ రామాయణాన్ని తీర్చిదిద్దాడు. కంచెర్ల గోపన్న 'దాశరథిశతకా'నికున్న ప్రచారం ఇంతంతనరానిది.

జానపదంలో 'కుశలవకుచ్చలచరిత్రము', రామకథా సుధార్ణవము, శారద రామాయణం, లంకాయాగం, చిరుతలరామాయణం, శ్రీరామజావిలి, సంక్షేపరామాయణం, చిట్టిరామాయణం వంటివి పేరొందిన రచనలు. శాంతగోవిందనామాలు, ఊర్మిళాదేవినిద్ర, లక్ష్మణదేవరనవ్వు వంటి స్త్రీల రామాయణపు పాటలు కోకొల్లలు.

వచన రచనా విభాగంలో గోపీనాథ కవి 'విచిత్రరామాయణం' (అనువాదం), పైడిపాటి పాపయ్య 'రంగనాథరామాయణం' వావిళ్ళరామస్వామిశాస్త్రి, శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, ఉషఃశ్రీ, దాశరథి రంగాచార్యులవంటి ప్రతిభావంతుల రచనలు పాఠకుల మనసును పరవశింపజేశాయి.

చైనా, కాంబోడియా, జావా, సుమిత్రా, లావోస్, వియత్నాం, మలేషియా వంటి దేశాలలో కూడా రామాయణ రసామృతం ప్రవహించింది. ఇంత వైవిధ్యంగా, విస్తృతంగా ప్రజల హృదయాల్లోకి ప్రసరించిన కావ్యం ప్రపంచసాహిత్యంలో మరొకటి లేదంటే అత్యుక్తి కాదు. అందుకే రామాయణం ఆదికావ్యమే కాదు, అద్వితీయకావ్యం కూడా.

## పదవిజ్ఞానం

అనుజ్ఞ = ఆజ్ఞ, అనుమతి
అపేక్ష = కాంక్ష,కోరిక
అభిరుచి = అత్యాసక్తి
అరి = శత్రువు
అరుణ = ఎరుపు
అర్హం = తగిన
ఆపన్నుడు = ఆపదలో ఉన్నవాడు
ఆయాసం = శ్రమ
ఆలింగనం = కౌగిలింత
ఆస్థ = శ్రద్ధ, ప్రయత్నం
ఇల = భూమి
ఉజ్జగించు = విడుచు, వదిలిపెట్టు
ఉజ్జ్వల = గొప్పగా వెలుగునది
ఉదస్తుడు = తొలగించబడినవాడు
ఉపసంహారం = మరలించుట,ముగింపు
ఉత్కృష్టం = శ్రేష్ఠం
ఉత్తరోత్తర = ముందుముందు
ఊడిగం = పరిచర్య, సేవ
ఋతం = సత్యమైనది
ఒరులు = ఇతరులు
కంచుకితం = కవచంతో
కందరం = గుహ, కొండ బిలము
కంపము = వణుకు
కరం = చేయి
కలను = యుద్ధం
కలిత = ప్రకాశించు
కిరాటుడు = వ్యాపారి
కృతఘ్నత = చేసిన మేలు మరచి పోవుట
క్లుప్తం = సంక్షిప్తం
క్షితి = భూమి
క్షేత్రం = పుణ్యభూమి
ఖ్యాతి = కీర్తి
గణించు = లెక్కించు
గర్హించు = నిందించు
గిరి = కొండ
ఘటం = కుండ
ఘాతం = దెబ్బ
చతుశ్శాలం = నాలుగు ఇండ్ల భవంతి
చరించు = తిరుగు, కదలు
చక్షువు = కన్ను
చిత్తం = మనసు
ఛాయ = నీడ
జడ్డు = సోమరి
జరఠం = పసుపు కలిగిన తెలుపురంగు
జామదగ్ని = పరశురాముడు
జీరాడు = వ్రేలాడు
తథ్యం = సత్యం
తనువు = శరీరం
తిలకం = బొట్టు
తేకువ = ధైర్యం
తొల్లి = మొదట
తోయం = నీరు
త్యజించు = విడుచు
దరి = తీరం, గట్టు
దృష్టి = చూపు
దుర్గతి = నరకం
దురితం = పాపం
దైన్యం = దారిద్ర్యాదుల చేత కలుగు దురవస్థ,దీనత్వం
ధర = భూమి
ధ్వంసం = నాశనం
నవయు = కృశించు
నిఖిలం = సమస్తం, అంతా
నిగ్రహం = అదుపు
నిరంకుశం = కఠిన వైఖరి
నెమ్మి = నెమలి
నెత్తం = కొండమీది విశాల సమప్రదేశం
నెత్తావి = పరిమళం, సువాసన
పంకిలం = బురద
పదింబదిగ = గట్టిగ, చక్కగ
పరదేవత = పరమేశ్వరుడు/పరమేశ్వరి
పరిణామం = మార్పు, మారు రూపు
పరితోషం = సంతోషం
పరిపంథి = శత్రువు
పల్లవం = చిగురు
పాటి = న్యాయం
పాయు = తొలగు
ప్రావీణ్యం = నేర్పు
పికం = కోయిల
పిశాచం = ప్రేతం
పుల్లె = విస్తరాకు
పుస్తె = తాళి
పుళిందులు = వేటగాళ్లు
పెను = గొప్ప
ఫలములు = ఫలాలు, పండ్లు
బుద్బుదం = నీటి బుడగ
బుధుడు = పండితుడు
భక్ష్యం = తినుబండారం
భజించుట = సేవించుట
భాస్వంతుడు = సూర్యుడు, ప్రకాశించువాడు
భిషక్కు = వైద్యుడు


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

భుజగం = పాము
భూపాలుడు = రాజు
భూషణం = అలంకరణం, నగ
భోజ్యం = తినదగినది
మంజరి = చిగురించిన లేత కొమ్మ, పూలగుత్తి
మంజుల = మనోహరమైన
మలక = మలుపు, మూకుడు
మసలుకొను = ప్రవర్తించు
మహితం = పూజనీయమైనది, గొప్పదైనది
మాలిక = తీగ, పూదండ
ముదం = సంతోషం
మూలం = ఆధారం, మొదలు
మృదంగం = మద్దెల
మృష = అసత్యము, అబద్ధము
మెలగుట = నడుచుకొనుట
రమణి = స్త్రీ
రుధిరం = రక్తం
వగచు = శోకించు
వత్సలుడు = వాత్సల్యము కలవాడు
వధించు = చంపు
వలరాజు తేజి = చిలుక
వాక్కు = మాట
వాసంతం = వసంతకాలం
విరసవర్తనం = చెడు ప్రవర్తన
వెల్లకి = గడ్డ
వేల్పులు = దేవతలు
వ్యూహం = ప్రత్యర్థులపై విజయం సాదించడానికి ప్రణాళిక
శరణ్యం = రక్షింపదగినది
శస్త్రం = ఆయుధం
శాస్త్రం = నియమబద్ధమైన గ్రంథం లేక వాక్యం
శీలం = స్వభావం, ప్రవర్తన
శునకం = కుక్క
శౌర్యం =పరాక్రమం
శ్రోతలు = వినేవారు
శ్లాఘ్యం = పొగడ దగినది
సంజీవని = మరణించిన వారిని జీవింప చేసేది
సద్గతి = ఉత్తమ గతి
సన్నిధి = చేరువ
సర్వస్వం = సమస్తం
సహకారం = తోడ్పాటు
సాఫల్యం = సఫలత
సిక్తం = తడిసిన
సౌఖ్యం = సుఖం
స్తిమితపడు = కుదుటపడు
హర్యక్షం = పచ్చని కన్నులు గల సింహం
హస్తి = ఏనుగు
హితుడు = హితవు చెప్పేవాడు
హైన్యం = హీనత్వం
క్షితి = భూమి

## పర్యాయపదాలు

అరి = శత్రువు,వైరి, విరోధి
ఆత్మీయత = ప్రేమ, ఆదరం
ఆసక్తి = ఆశ, కోరిక, కాంక్ష, వాంఛ
ఉత్తరోత్తర = ముందు ముందు, కాలక్రమమున
ఉదకం = నీరు, జలం, పయస్సు
కలను =యుద్ధము,సంగ్రామం, పోరు
కిరీటం = మకుటం, కోటీరం
కృప = దయ, కనికరం, జాలి
చక్షువు = కన్ను, నేత్రం, నయనం
చిత్తం = మనసు, హృదయం
తండ్రి = జనకుడు, నాయన, పిత,అయ్య
ధ్వజం = కేతనం, పతాకం, జెండా
దేహం = శరీరం ఒడలు,తనువు కాయము
నాట్యం = నర్తనం, తాండవం, నృత్యం, లాస్యం
నెత్తావి = పరిమళం,సువాసన,సౌరభం
పథం = త్రోవ, మార్గం, దారి
పయోదము = మేఘం, మబ్బు, జలదం
పశువు = జంతువు, మృగం
ప్రణామం = నమస్కారం, మొక్కు, ప్రణతి
బాల్యం = చిన్నతనం, పసితనం, శైశవం
బీజం = విత్తనం, విత్తు
బృందము = సంఘం, సమూహం, గుంపు
మంజులం = మనోహరం, ఒప్పిదం
రణం = యుద్ధం, సమరం, పోరు
రక్తం = రుధిరం, శోణం, నెత్తురు
లుబ్ధకుడు = బోయవాడు, వ్యాధుడు, శబరుడు
వహ్ని = అగ్ని, నిప్పు, అనలం
విజయం = గెలుపు, జయం
వీరుడు = ధీరుడు బంటు పోటరి, మేటి
శౌర్యం = విక్రమం, పరాక్రమం
సౌరభం = సువాసన, పరిమళం
హృదయం = మనసు, చిత్తం, ఉల్లం
హైన్యం = నీచత్వం, హీనత్వం, అల్పత్వం

## నానార్థాలు

అఘం = పాపం, దుఃఖం
అంబరం = ఆకాశం, వస్త్రం
అభ్యంతరం = ఆటంకం, మధ్యస్థలం, ఆలస్యం
ఆశ్రమం = మఠం, పర్ణశాల పాఠశాల, గుడిసె
అరి = శత్రువు, చక్రం, పన్ను
ఆసనం = పీట, ఏనుగు మూపురం, స్వస్తికం వంటి ఆసనం
ఆసవం = కల్లు, పూదేనె
కరం = ఏనుగు తొండం, చెయ్యి, కిరణం

కుంభం = ఏనుగు కుంభస్థలము, కుండ, ఒకరాశి
కుశలం = క్షేమం, నేర్పు, పుణ్యం
కోటి = అంచు, వింటికొన, నూరు లక్షలు
గజం = ఏనుగు, మూడడుగుల కొలత, పెద్దది
గురువు = తండ్రి, ఉపాధ్యాయుడు, బృహస్పతి
ఛాయ = నీడ, సూర్యుని భార్య, పోలిక
జీవనము = బ్రతుకు, నీరు, ప్రాణము, గాలి
తలపు = జ్ఞానము, ఆలోచన, హృదయం
దరి = తీరము, సమీపము, మేర
దార = భార్య, నీటిచాలు, క్రమం
ద్వారం = వాకిలి, ఉపాయం
దృష్టి = చూపు, కన్ను
ధర = వెల, భూమి
నయము = అందము, నీతి, మృదువు, లాభము
నికరం = సమూహం, నిధి
పశువు = జంతువు, ఒక యజ్ఞం, జీవుడు
పాలు = క్షీరము, భాగము, వంతు
ప్రాణం = ఆయువు, బలము, ఐదు
పిశాచం = ప్రేతం, పిల్లి
బాణం = అంబు, గురి, శబ్దం
ముకురం = అద్దం, మల్లెపువ్వు, పొగడ
మూలం = వేరు, ఒక నక్షత్రం, మొదలు
యుగం = కాడి, జత, బార
యుక్తి = ఉపాయం, కారణం, ఊహ
రాజ్యం = రాష్ట్రం, పరిమిత ప్రదేశం,ఏలుబడి
వక్త = ఉపన్యాసకుడు, సంచారి
వృద్ధుడు = ముసలివాడు, తెలిసినవాడు
శాసనం = ఆజ్ఞ, శాస్త్రం
శుశ్రూష = సేవ, వినయం,ఆదరం
శిఖరం = కొండ కొమ్ము, కిరీటము, సిగదండ
సాధనం =ఉపకరణం, ఉపాయం, హేతువు
సాధువు = మంచివాడు,ముని, తగినది
క్షేత్రం = వరిమడి, పుణ్యస్థానం, శరీరము,భార్య

## వ్యుత్పత్త్యర్థాలు

1) అనఘుడు = పాపం చేయనివాడు (పరిశుద్ధుడు)
2) అధ్యయనము = గురువు దగ్గర క్రమ పద్ధతులో నేర్చుట
3) అమరుడు = మరణం లేనివాడు( వేల్పు)
4) ఉదకం = ద్రవమై ఉండునది ( నీరు)
5) పతివ్రత = భర్తను సేవించడమే వ్రతముగా కలది(సాధ్వి)
6) పయోదము = నీటిని ఇచ్చునది (మబ్బు)
7) పికం = చాటున కూయునది( కోయిల)
8) భూపాలుడు = భూమిని పాలించువాడు (రాజు)
9) ముకురం = దీనిచే అలంకరింపబడుదురు (అద్దం)
10) వసుధ = బంగారము గర్భమందు కలిగినది (భూమి)
11) సమరం = మరణంతో కూడినది (యుద్ధం)
12) సుకృతం = లెస్సగా చేయబడినది (పుణ్యం, ధర్మం)
13) సనాతనుడు = పురాణ పురుషుడు (భగవంతుడు)
14) హర్మ్యం = మనసును హరించునది (ధనవంతుల ఇల్లు)
15) హర్యాక్షం = కపిల వర్ణము గల కన్నులు కలది ( సింహం)

## ప్రకృతి - వికృతి

అద్భుతము- అబ్బురం
ఆసక్తి - ఆసత్తి
ఆహారం - ఓగిరం
కన్య- కన్నె
కష్టం- కస్తి
గృహము- గీము
గుణము- గొనము
దైవం - దయ్యం
నాట్యం - నట్టువ
నిత్యము = నిత్తెము/ నిచ్చలు
పంక్తి - బంతి
పక్షి - పక్కి
పుణ్యం - పున్నెం
పయస్సు - పాలు
ప్రకృతి - పగిది
ప్రాణం- పానం
బ్రహ్మ- బొమ్మ
బిడాలము - పిల్లి
భాష- బాస
భాండ - బాన
భాండాగారం - బండారం
భిక్ష - బిచ్చం
భూమి - బువి/బూమి
భోజనము- బోనం
మృగము- మెకము/మెగము
యజ్ఞము - జన్నము
యుక్తి - జుత్తు
యోధుడు - జోదు
రాట్ - ఱేడు
రాక్షసుడు-రక్కసుడు
వంశం - వంగడం
విజ్ఞానము - విన్నాణం
వృద్ధి - వడ్డి
శబ్దము - సద్దు
సత్యము - సత్తు
సముద్రము - సంద్రము/సందరము
సహజము - సాజము
సందేహం - సందియం
స్వచ్ఛము - చొక్కము
హంస - అంచ


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ